అనుదినం... జనస్వరం

www.navatelangana.com

# నవతెలంగాణ

ఆదివారం 09-03-2025 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 11 | సంచిక : 67 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు + వెబ్‌లో (సోపతి) | వెల : 8.00




## పోరాడుతాం... గెలుస్తాం

- పెట్టుబడిదారీ, మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా సీపీఐ(ఎం) మహిళా మార్చ్
- మహిళా నాయకుల నినాదాల హోరు
- పాల్గొన్న సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బృందా కరత్, సుభాషిణి అలీ, కేంద్ర కమిటీ సభ్యులు

**నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో**

పెట్టుబడిదారీ, మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా సీపీఐ(ఎం) మహిళా నాయకులు గళమెత్తారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా మార్చ్‌ను నిర్వహించారు. "మేము పోరాడుతాం, గెలుస్తాం" అనే నినాదాల హోరెత్తించారు. ఈ మార్చ్ మహిళా హక్కులు, న్యాయం కోసం కొనసాగుతున్న పోరాటానికి చిహ్నంగా మారింది. ఈ మార్చ్‌కు సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బృందా కరత్, సుభాషిణి అలీ, కేంద్ర కమిటీ సభ్యులు పికె శ్రీమతి టీచర్, కెకె శైలజ, సీఎస్ సుజాత, రాష్ట్ర కమిటీ సభ్యురాలు జె.మెర్సికుట్టి అమ్మ సుసాన్ కోడిలు నాయకత్వం వహించారు. ఈ మార్చ్ సీపీఐ(ఎం) కేరళ రాష్ట్ర 24వ మహాసభ జరిగిన కొడియేరి బాలకృష్ణన్ నగర్ వద్ద ప్రారంభమైంది. న్యాయం, సమానత్వం కోరుతూ మహిళలు నినాదాలు వినిపించారు. అనంతరం ఈ మార్చ్.. వి పార్క్ వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా నేతలు లింగ, వర్గ అణచివేత నిర్మూలన, మహిళల విముక్తి, విప్లవాత్మక పరివర్తన దార్శనికతను వివరించారు. పితృస్వామ్యం, పెట్టుబడిదారీ విధానం రెండూ విచ్ఛిన్నమైన రోజు న్యాయం, సమసమాజం కోసం విస్తృత పోరాటం నుంచి మహిళల విముక్తి జరుగుతోందని స్పష్టం చేశారు.

'బేటీ బచావో బేటీ పడావో' వంటి కార్యక్రమాలను ప్రోత్సహిస్తూనే, మహిళలు ఎదుర్కొంటున్న హింస, వివక్షను పరిష్కరించడంలో విఫలమైన ఆర్ఎస్ఎస్ అనుబంధ బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. మహిళలపై జరుగుతున్న దారుణాలను పదేపదే చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్న ప్రభుత్వ కపటత్వాన్ని సీపీఐ(ఎం) నేతలు ఎత్తి చూపారు. లైంగికహింస నుంచి వరకట్న మరణాలు, లింగ పక్షపాతం వరకు మహిళలపై నేరాలు పెరగడానికి దారితీస్తోన్నాయని అన్నారు. ముఖ్యంగా 'బేటీ బచావో బేటీ పడావో' కేవలం ప్రచార సాధనంగా ఉందని చెప్పారు. ఇది దేశంలోని మహిళలు, పిల్లల నిజమైన అవసరాలను తీర్చడానికి ఏమీ చేయలేదని అన్నారు. మహిళల భద్రత, విద్య, గౌరవంపై దృష్టి పెట్టడానికి బదులుగా, ...5లో



## ఇసుకను సామాన్యులకు అందుబాటులోకి తేండి

- వ్యవసాయ మార్కెట్ల ద్వారా విక్రయాలు : డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశం

7లో..

బిజినెస్

## అనుమతుల్లేని ఓలా ఎలక్ట్రిక్ షోరూమ్‌లు

- 95శాతం ట్రేడ్ సర్టిఫికెట్లు లేనివే..!
- ఆర్‌టీఏ అధికారుల చర్యలు




**బెంగళూరు :** ప్రముఖ ద్విచక్ర విద్యుత్ వాహనాల కంపెనీ ఓలా ఎలక్ట్రిక్ ట్రేడ్ అనుమతులు లేకుండానే షోరూంలను నిర్వహిస్తోంది. 95 శాతం షోరూంలు ఈ తరహాలోనే ఉన్నాయని బ్లూమ్‌బర్గ్ ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. ఆ వివరాలు.. దేశ వ్యాప్తంగా ఓలా ఎలక్ట్రిక్‌కు మొత్తంగా 4,000 రిటైల్ అవుట్‌లెట్‌లు ఉన్నాయి.. అందులో 3,400 షోరూంలకు సంబంధించిన సమాచారం అందుబాటులో ఉంది. వాటిలో కేవలం 100 షోరూంలకు మాత్రమే భారత మోటారు వాహనాల చట్టం ప్రకారం ట్రేడ్ సర్టిఫికెట్లు ఉన్నాయి. దీంతో ఆ సంస్థ 95 శాతం సెంటర్లను నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తోన్నట్టు స్పష్టం అవుతోంది. వీటిల్లో ద్విచక్ర వాహనాలను ప్రదర్శించడానికి, విక్రయించడానికి, టెస్ట్ రైడ్లను అందించడానికి లేదా రవాణా చేయడానికి అవసరమైన అనుమతులు లేవు.

2022లో తొలుత డిజిటల్ అమ్మకాలను మాత్రమే ప్రారంభించగా.. ఆ తర్వాత వినియోగదారులకు భౌతిక అనుభవాన్ని అందించడానికి, సర్వీసింగ్ సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో షోరూంలను ఏర్పాటు చేయడం ప్రారంభించింది. గతేడాది కొత్తగా దాదాపు 3200 స్టోర్లను ఏర్పాటు చేయడం ద్వారా మొత్తం నెట్‌వర్క్‌ను 4,000 సెంటర్లకు విస్తరించింది. ఇందులో ద్వితీయ, తృతీయ శ్రేణీ నగరాలు ఉన్నాయి. ఈ విస్తరణ లక్ష్యంలో ప్రాథమిక అనుమతులు అయినటువంటి ట్రేడ్ సర్టిఫికెట్‌ను తీసుకోకపోవడం గమనార్హం.

**పలు షోరూంలు సీజ్..**

అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన పలు షోరూంలను వివిధ రాష్ట్రాల్లోని రవాణా అధికారులు మూసివేస్తున్నట్టు బ్లూమ్‌బర్గ్ రిపోర్ట్ చేసింది. సంబంధిత రాష్ట్రాల్లోని కంపెనీ షోరూంల్లో దాడులు నిర్వహించి, వాటిని మూసివేసి, వాహనాలను సీజ్ చేసినట్లు సమాచారం. మరోవైపు రాష్ట్ర స్థాయి రవాణా అధికారుల నుంచి ఓలా ఎలక్ట్రిక్ షోకాజ్ నోటీసులను అందుకుంటుంది. కాగా.. ఈ వార్తలను ఓలా ఎలక్ట్రిక్ ఖండించింది. కంపెనీ డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, గోదాములు మోటారు వాహనాల చట్టం మార్గదర్శకాలకు అనుగుణంగానే ఉన్నాయని పేర్కొంది. అయితే ఆయా షోరూంలు ట్రేడ్ సర్టిఫికెట్లు కలిగి ఉన్నాయని మాత్రం స్పష్టం చేయకపోవడం గమనార్హం.

ఓలా ఎలక్ట్రిక్‌పై ముఖ్యంగా అమ్మకాల తర్వాత సర్వీసింగ్‌కు సంబంధించిన కార్యకలాపాలు, సేవలపై వాహనదారుల నుంచి ఇటీవల భారీగా ఫిర్యాదులు నమోదయ్యాయి. వినియోగదారుల హక్కుల ఉల్లంఘన, తప్పుదోవ పట్టించే ప్రకటనలు, అన్యాయమైన వాణిజ్య పద్ధతులపై జాతీయ వినియోగదారుల హెల్ప్‌లైన్‌కు 10,000 పైనే ఫిర్యాదులు రావడంతో సెంట్రల్ కన్జ్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ (సీసీపీఏ) విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో విస్తరణ, కొత్త సర్వీసు సెంటర్లపై దృష్టి పెట్టింది. ఇదే క్రమంలో వ్యయాలు పెరగడంతో ఇటీవల 1,000 మంది సిబ్బందికి ఉద్వాసన పలుకనుందని రిపోర్టులు వచ్చాయి. ఇందులో శాశ్వత, కాంట్రాక్టు ఉద్యోగులు ఉన్నారు. ప్రొక్యూర్‌మెంట్, కస్టమర్ రిలేషన్స్, ఛార్జింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సహా పలు విభాగాల్లో ఉద్వాసనలు ఉన్నట్టు తెలుస్తోంది. గతేడాది నవంబర్‌లోనూ 500 మందిని రోడ్డున పడేసింది. ఇటీవల ఆ సంస్థకు నష్టాలు పెరగడంతో ఈ చర్యలకు దిగుతోందని తెలుస్తోంది.

## హీరో ఫిన్‌కార్ప్‌తో మారుతి సుజుకీ ఒప్పందం




**న్యూఢిల్లీ :** దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకీ ఇండియా (ఎంఎస్ఐఎల్) తన కొత్త, పాత కార్ల కొనుగోలుదారులకు రుణ సౌకర్యాన్ని అందించడానికి హీరో ఫిన్‌కార్ప్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు శనివారం మారుతి సుజుకీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ, హీరో ఫిన్‌కార్ప్ ఎండీ, సీఈఓ అభిమన్యు ముంజల్ ఒప్పందాలపై సంతకాలు చేశారు. దీంతో మారుతి సుజుకీ 40 కంటే ఎక్కువ రిటైల్ ఫైనాన్స్ భాగస్వాములకు విస్తరించినట్టయ్యింది. హీరో ఫిన్‌తో జట్టు కట్టడం ద్వారా వినియోగదారుల విభిన్న అవసరాలకు అనుగుణంగా వారికి విస్తృత శ్రేణి ఫైనాన్స్ ఎంపికలు లభిస్తాయని ఎంఎస్ఐఎల్ పేర్కొంది.

## పసిడి రుణ నిబంధనలు కఠినతరం..!

**న్యూఢిల్లీ :** పసిడి తాకట్టు రుణాలు తీసుకునే వారి సంఖ్య భారీగా పెరగడంతో రిజర్వ్ బ్యాంక్ ఆందోళన వ్యక్తం చేస్తోంది. రుణదాతలు ఇబ్బడిముబ్బడిగా ఇస్తోన్న రుణాలకు తోడు ఇష్టారీతిన తాకట్టుదారులను ఇబ్బందులకు గురి చేస్తోన్న ఘటనలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కఠిన నిబంధనలను అమలులోకి తేవాలని రిజర్వ్ బ్యాంక్ యోచిస్తోందని సమాచారం. బ్యాంకులు, బ్యాంకింగేతర విత్త సంస్థలు జారీ చేస్తున్న పసిడి రుణాలపై నిఘా పెట్టాలని భావిస్తోంది. తాకట్టు పెడుతోన్న అసలు బంగారం వారిదేనన్న దానిపై పూర్తి వివరాలు సేకరించాలని బ్యాంకులకు ఇప్పటికే సూచించింది. ఇటీవల కాలంలో తమవద్ద ఉన్న బంగారాన్ని వేరేవారి నుంచి తీసుకొని ఇతర పెట్టుబడులకు, తనఖాకు వాడుతున్నారని ఆర్‌బిఐ అనుమానిస్తోంది. గడిచిన ఆరు నెలల్లో దేశవ్యాప్తంగా బంగారం తాకట్టుపై రుణాలు 50 శాతానికి పైగా పెరగడంపై దృష్టి సారించింది.

## ఐటీఆర్ దాఖలుకు సమీపిస్తున్న గడువు




**న్యూఢిల్లీ :** ఆదాయపు పన్ను రిటర్న్ (ఐటీఆర్) దాఖలుకు సంబంధించి గడువు సమీపిస్తోంది. ఆర్థిక సంవత్సరాలు 2021-22, 2022-23లకు సంబంధించి పన్ను చెల్లింపు దారులు 2025 మార్చి31లోపు ఐటీఆర్‌ను దాఖలు చేయాల్సి ఉంది. సంబంధిత అసెస్‌మెంట్ సంవత్సరం ముగిసిన రెండు సంవత్సరాలలోపు మాత్రమే ఇది చేయాల్సి ఉంటుంది. అదే విధంగా పన్ను చెల్లింపుదారులు తమ రిటర్న్‌లలో ఉన్న లోపాలను సరిదిద్దుకుని అప్‌డేట్‌చేసిన రిటర్న్‌లను దాఖలు చేసేందుకు అవకాశం ఉంది.

## మహిళలకు ఎస్‌బీఐ చౌక రుణాలు

**ముంబయి :** ఔత్సాహిక మహిళ వ్యాపారవేత్తలకు చౌక రుణాలు అందించనున్నట్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తెలిపింది.




తక్కువ వడ్డీరేటుకే పూచీకత్తు లేకుండా అప్పులివ్వనున్నట్లు ఆ బ్యాంక్ చైర్మెన్ సీఎస్ శెట్టి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'అస్మిత' పేరుతో ప్రత్యేక రుణాలను జారీ చేయనున్నామన్నారు. మహిళల ఆధ్వర్యంలోని ఎంఎస్ఎంఇలకు వేగంగా, సులభంగా రుణాలను అందిస్తామన్నారు.

## హైదరాబాద్‌కు ఓక్‌ట్రీ విస్తరణ

**హైదరాబాద్ :** గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థల్లో ఒక్కటైన ఓక్‌ట్రీ క్యాపిటల్ మేనేజ్‌మెంట్ హైదరాబాద్‌లో తన నూతన కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. వ్యాపార వాతావరణం, ఆవిష్కరణ, నైపుణ్యంకలిగిన శ్రామిక శక్తికి ప్రసిద్ధి చెందిన హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలను ప్రారంభించటం సంతోషంగా ఉందని ఓక్‌ట్రీ కో చైర్మెన్ హావార్డ్ మార్క్స్ తెలిపారు. ఇది భారతదేశం అందించే అపారమైన అవకాశాలపై తమ నమ్మకాన్ని సూచిస్తుందన్నారు. భారత్‌లో ఓక్‌ట్రీకి ఇది రెండవది. ఆసియా పసిఫిక్‌లోని తొమ్మిది నగరాలతో సహా ప్రపంచవ్యాప్తంగా 24 నగరాల్లో ఓక్‌ట్రీకి కార్యాలయాలు ఉన్నాయి.

# కాఫీ కొనుగోలులో దోపిడీ

కాస్త ధర పెంచి తూకంలో
తరుగు పేరుతో భారీ మోసం
జీసీసీ నామమాత్రపు పాత్ర
గిరి రైతులకు ప్రభుత్వ
ప్రోత్సాహం కరువు



**అమరావతి :** అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఏజెన్సీలో కాఫీ పంట కొనుగోలులో ప్రయివేటు వ్యాపారులదే హవా. ప్రభుత్వ ప్రోత్సాహం కరువవడంతో గిరిజన రైతులను దోపిడీ చేస్తున్నారు. గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ప్రకటించిన ధర కంటే దళారులు కాస్త ధర పెంచినా తూకంలోనూ, తరుగు పేరుతోనూ భారీగా మోసానికి పాల్పడుతున్నారు. దీంతో, గిరిజన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గిరిజన గ్రామాల్లో ఎవరు ఏ ధరకు కాఫీ కొంటున్నారో చెప్పే మనుషులను స్థానికంగా దళారులు ఏర్పాటు చేసుకున్నారు. ఆ ధరకు కొంత పెంచి కాఫీ గింజలను కొనుగోలు చేస్తున్న వీరు ఎలక్ట్రానిక్ కాటాలో రైతులు పసిగట్టలేని మోసాలకు పాల్పడుతున్నారు. కిలో పార్చ్‌మెంట్ కాఫీకి జీసీసీ రూ.400 చెల్లిస్తుండగా, వ్యాపారులు రూ.20, రూ.30 పెంచి ఇస్తున్నారు. అదే సమయంలో ఎలక్ట్రానిక్ కాటాలో కాఫీ పరిమాణాన్ని బట్టి కనీసం ఐదు కేజీలు తక్కువ చూపేలా రిమోట్ ద్వారా ఆపరేట్ చేస్తున్నారు. ఒక తూకంలో ఐదు కేజీలకు రెండు వేల రూపాయలకుపైగా గిరిజనులు నష్టపోతున్నారు. తరుగు పేరిట మరో విధమైన దోపిడీ కొనసాగుతోంది. 70 నుంచి 80 కిలోల కాఫీ గింజల బస్తాపై తరుగు కింద 2 నుంచి 3 కిలోలను ప్రయివేటు వ్యాపారులు తీసేస్తున్నారు. ఆ రకంగా పది బస్తాలు పండించే రైతుకు సగటున 30 కిలోల తరుగుపోతోంది. ఆ లెక్కన రూ.12 వేలు నష్టతున్నారు.

**ఈ ఏడాది ఏం జరుగుతోంది?**

అంతర్జాతీయ మార్కెట్ డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకొని 2023-24 కంటే 2024-25లో కాఫీ కొనుగోలు ధరను జీసిసి పెంచి చెల్లిస్తోంది. జీసిసి ధర ప్రకటించకముందే దళారులు రంగంలోకి దిగి తక్కువ ధరకు రైతుల నుంచి కాఫీ కొన్నారు. జీసిసి ధర గతం కంటే పెంచడంతో దళారులు కూడా కొంత పెంచి కొనుగోలు చేయడం ప్రారంభించారు. అయితే, పెంచిన ధర కంటే తూకంలో మోసం ద్వారా ఎక్కువ లాభం పొందుతున్నారు. అల్లూరి జిల్లా పాడేరు డివిజన్‌లోని 11 ఏజెన్సీ మండలాల్లో 2,46,139 మంది రైతులు 2,58,021 ఎకరాల్లో కాఫీ పండిస్తున్నారు. ఏడాదికి 16 వేల మెట్రిక్ టన్నులకుపైగా దిగుబడి వస్తున్నప్పటికీ జీసిసి కొనుగోలు వెయ్యి మెట్రిక్ టన్నులు దాటడం లేదు. పార్చ్‌మెంట్ రకానికి పది శాతం, చెర్రీ రకానికి 10.5 శాతం తేమ మించకూడదని కొర్రీలు పెడుతుండడమూ ప్రయివేటు వైపు రైతులు వెళ్లేందుకు ఆస్కారమిస్తోంది.

### ఏజెన్సీ కాఫీకి గిరాకీ ఉన్నప్పటికీ..

ప్రకృతి ప్రతికూలతలతో వియత్నాం, బ్రెజిల్‌లో కాఫీ దిగుబడి తగ్గడంతో మన ఏజెన్సీ కాఫీకి మంచి గిరాకీ ఏర్పడింది. అంతర్జాతీయ మార్కెట్ డిమాండ్ ఆధారంగా 2024-25 (ఈ ఏడాది) కిలో అరాబికా పార్చ్‌మెంట్ కాఫీకి రూ.400, అరాబికా చెర్రీ రకపు కాఫీకి రూ.250, రొబస్తా చెర్రీకి రూ.160 చొప్పున జీసిసి ధర నిర్ణయించింది. 2023-24 (గతేడాది)లో కిలో పార్చ్‌మెంట్ కాఫీకి రూ.280, చెర్రీకి రూ.145, రొబస్తాకు రూ.70 చొప్పున చెల్లించింది. గతేడాది 565.90 మెట్రిక్ టన్నుల కాఫీని జీసిసి కొనుగోలు చేసింది. ఈ ఏడాది వెయ్యి మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయవచ్చని జీసిసి అంచనా వేసింది. ఈ క్రమంలో 2024 డిసెంబరు చివరి వారం నుంచి కొనుగోలు ప్రారంభించి ఈ ఏడాది మార్చి ఐదు నాటికి 542.754 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేసింది. 2022-23లో 996 మెట్రిక్ టన్నుల కాఫీని కొనుగోలు చేసింది. ప్రైవేట్ వ్యాపారుల దోపిడీ నుంచి గిరిజన కాఫీ రైతులను ఆదుకోవడం, జీసిసి కొనుగోళ్లు పెంచడం, అంతర్జాతీయ మార్కెట్ ధరలను బట్టి వాటిని పెంచడమూ అవసరం.

## 200వ రోజుకు శ్రీవారిమెట్టు చిరు వ్యాపారుల దీక్షలు

**తిరుపతి:** తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి శ్రీవారి మెట్టు చిరువ్యాపారులు చేపట్టిన నిరసన దీక్షలు శనివారం నాటికి 200 రోజులకు చేరాయి. ఈ సందర్భంగా శ్రీవారి పటాన్ని ఏర్పాటు చేసి వినూత్నంగా యాగం నిర్వహించారు. '200 రోజులుగా దీక్షలు చేస్తున్నా మమ్మల్ని కరుణించవా స్వామి' అంటూ బ్యానర్‌ను ప్రదర్శించారు. గోవిందనామ సంకీర్తనలు చేస్తూ కార్యక్రమాన్ని కొనసాగించారు. శ్రీవారి మెట్టు చిరు వ్యాపారులు, కుటుంబ సభ్యులు, మహిళలు, పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ శ్రీవారి మెట్టు చిరు వ్యాపారులు తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి 200 రోజులుగా టిటిడి పరిపాలనా భవనం ఎదుట దీక్షలు చేస్తున్నా, టిడిపి కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. చిరు వ్యాపారులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని తెలిపారు.

ఏడు నెలలుగా ఉపాధి లేక, ఆదాయం రాక వీరి కుటుంబాలు అల్లాడుతున్నాయన్నారు. టిటిడి ఇఒ శ్యామలరావు, అడిషనల్ ఇఒ వెంకయ్యచౌదరి, చైర్మన్ బిఆర్ నాయుడు జోక్యం చేసుకొని సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్ జయచంద్ర, శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిట్టిబాబు, మధు, యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ ప్రవేశం కోసం 130 దళిత కుటుంబాల ఆందోళన

సాంఘిక బహిష్కరణతో ఇబ్బందులు

**కొల్‌కతా :** పశ్చిమ బెంగాల్‌లోని పుర్బా బర్ధమాన్ జిల్లాలో 130 దళిత కుటుంబాలు నేటికీ కులవివక్షను ఎదుర్కొంటున్నాయి. కులం ప్రాతిపదికగా ఆలయ ప్రవేశానికి పెత్తందారులు అడ్డుచెబుతుండటంతో వారు ఆందోళనబాటపట్టారు. గిద్‌గ్రామ్ గ్రామంలోని దాస్‌పరా ప్రాంతంలో గిదేశ్వర్ శివాలయం ఉంది. ఆ ప్రాంతంలో అదొక్కటే ఆలయం. చర్మపు వస్తువుల తయారీ, నేత పని చేస్తున్న 'దాస్' ఇంటి పేరున్న వారిని తక్కువ కులంగా చూస్తూ, ఆ ఆలయంలోకి అనుమతించడం లేదు. సుమారు 300 సంవత్సరాల క్రితం ఈ ఆలయం స్థాపించినప్పటి నుంచీ కులవివక్ష కొనసాగుతోందని గ్రామస్థులు తెలిపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 25కు విరుద్ధంగా ఉన్న ఈ వివక్షకు చరమగీతం పాడాలని, ఆలయంలో ప్రవేశించే హక్కును కల్పించాలని దళితులు డిమాండ్ చేస్తున్నారు.

**పోలీసుల మధ్యవర్తిత్వం విఫలం**

దాస్ కుటుంబాలు ఆలయంలో ప్రార్థన చేయడానికి వీలుగా పోలీసులు, ప్రభుత్వాధికారులు ఫిబ్రవరి 28న మధ్యవర్తిత్వం వహించి, సమావేశం నిర్వహించారు. కట్వా, మంగల్‌కోట్ ఎమ్మెల్యేలు, ప్రభుత్వ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. దాస్ కుటుంబాలకు ఆలయంలో ప్రార్థన చేయడానికి అనుమతించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయం కాగితాలకే పరిమితమైంది.



సాంఘిక బహిష్కరణ

దాస్ కుటుంబాలు ఆలయంలో ప్రార్థన చేయడానికి ప్రయత్నించిన తర్వాత వారిని సాంఘిక బహిష్కరణ చేశారు. ఎవరూ ఆర్థిక లావాదేవీలు నిర్వహించకుండా కట్టడి చేశారు. గ్రామంలోని పాడి కేంద్రాల్లో వారి పాలు కొనుగోలు చేయడం నిలిపివేయడంతో 30 నుంచి 40 కుటుంబాలు జీవనోపాధిని కోల్పోయాయి.

**సంప్రదాయాలు**

**ఉల్లంఘిస్తే అశాంతి :** ఆలయ కమిటీ సభ్యుడు

ఆలయ కమిటీ సభ్యుడు దినబంధు మోండల్ మాట్లాడుతూ "ఈ గ్రామంలో ఎవరూ ఈ పురాతన సంప్రదాయాన్ని ఉల్లంఘించాలనుకోవడం లేదు. వారు ఆలయంలోకి ప్రవేశించడానికి ప్రయత్నిస్తే, గ్రామంలో అశాంతి సృష్టించబడుతుంది. ప్రభుత్వం జాగ్రత్తగా వ్యవహరించాలి," అని అన్నారు.

**నాటి నిర్ణయాలను**

**త్వరలో అమలు చేస్తాం : కట్వా ఎస్‌డిఒ**

"ఫిబ్రవరి 28న జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను త్వరలో అమలు చేస్తామని, పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామని కట్వా ఎస్‌డిఒ అనిషా జైన్ తెలిపారు.

**దాస్ కుటుంబాల నిర్ణయం**

"ఈ పోరాటాన్ని చివరి వరకు కొనసాగిస్తాం. కొల్‌కతా, ఢిల్లీలోని అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. సమస్య పరిష్కారం కాకపోతే మా పూర్వీకుల కట్టుబాట్లను వదిలి వెళ్తాం" అని దాస్ కుటుంబాల ప్రతినిధి ఎక్కోరి దాస్ తెలిపారు. "మేము శివునికి పూజలు చేయడానికి సిద్ధంగా ఉన్నాం. మా భద్రత కోసం భయపడి ఆలయంలోకి వెళ్లలేదు. ప్రభుత్వం ఈ విషయంలో చర్యలు తీసుకోవాలి," అని దాస్‌పరా నివాసి లిపి దాస్ తెలిపారు. ఈ వివక్షతను అంతం చేయడానికి ప్రభుత్వం, పోలీసులు ఎప్పుడు చర్యలు తీసుకుంటారనేది ప్రశ్నార్థకంగా మిగిలిపోయింది.

# 'స్విమ్స్'లో మతవివక్ష

వైద్యుల పోస్టులకు హిందువులే అర్హులట!
14న 38 పోస్టులకు వాక్‌ఇన్ ఇంటర్వ్యూ

**తిరుపతి :** శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) యూనివర్సిటీలోని 20 విభాగాలకు సీనియర్ రెసిడెంట్ వైద్యులను అడహాక్ పద్ధతిన ఈ నెల 14న వాక్‌ఇన్ ఇంటర్వ్యూ నిర్వహణకు రిజిస్ట్రార్ శనివారం నోటిఫికేషన్ జారీ చేశారు. అనాటమి విభాగంలో నాలుగు, బయో కెమిస్ట్రీ రెండు, కార్డియాక్ సర్జరీ ఒకటి, కార్డియాలజీ ఒకటి, కమ్యూనిటీ మెడిసిన్ రెండు, ఫోరెన్సిక్ మెడిసిన్ నాలుగు, మెడికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఒకటి, మెడికల్ అంకాలజీ ఒకటి, మైక్రో బయాలజీ రెండు, నెఫ్రాలజీ ఒకటి, న్యూరో సర్జరీ ఒకటి, ఒబిజి మూడు, ఆర్థినోలర్జి ఒకటి, పిడియాట్రిక్స్ మూడు, ఫార్మాకాలజీ మూడు, ఫిజియాలజీ నాలుగు, రుమటాలజీ ఒకటి, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఒకటి, సర్జికల్ ఆంకాలజీ ఒకటి, యురాలజీ విభాగంలో ఒక పోస్టు చొప్పున మొత్తం 38 పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఈ నోటిఫికేషన్‌లో పైపోస్టులకు 'హిందూ మతానికి చెందిన వారు మాత్రమే వాక్ ఇన్ ఇంటర్వ్యూకు రావాలి' అని ప్రత్యేకించి సూచించడం గమనార్హం. ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకురావాలని పేర్కొన్నారు. నెల రోజుల క్రితం రేడియాలజీ విభాగంలె ఇదే విధంగా మతప్రాతిపదికన ఆరు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా విమర్శలు రావడంతో ఆ నోటిఫికేషన్‌ను రద్దు చేశారు. తాజాగా ఆ ఆరు పోస్టులనూ కలిపి 38 పోస్టులకు మళ్లీ మతం ప్రాతిపదికనే నోటిఫికేషన్ ఇవ్వడం గమనార్హం. రెండేళ్ల క్రితం స్విమ్స్ యూనివర్సిటీకి ముఖ్యమంత్రి చైర్మన్‌గా ఉండేవారు. మతప్రాతిపదికన కాకుండా అర్హులకు పోస్టుల భర్తీలో అవకాశం కల్పించేవారు. ఇటీవల స్విమ్స్‌ను టిటిడిలో విలీనం చేయడంతో ప్రస్తుత టిటిడి చైర్మన్ యూనివర్సిటీకి



చైర్మన్‌గా, ఇఒ కమిటీ మెంబర్‌గా వ్యవహరిస్తారు.

**మత వివక్ష తగదు : సిపిఎం**

స్విమ్స్ యూనివర్సిటీలో సీనియర్ రెసిడెంట్ వైద్యుల పోస్టుల భర్తీలో మత వివక్ష పాటించడం రాజ్యాంగ వ్యతిరేకమని సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మతాన్ని బట్టి వివక్షత చూపడం చట్ట విరుద్ధమని, అప్రజాస్వామికమని తెలిపారు. టిటిడి ఆధ్వర్యంలో నడిచే విద్య, వైద్య సంస్థలు ప్రభుత్వ నియమనిబంధనలకు, రాజ్యాంగ వ్యవస్థకు లోబడి పని చేయాలని, అవి కూడా లౌకిక సంస్థలేనని పేర్కొన్నారు. ఇప్పటివరకు లేని నిబంధనలను ఉన్నట్లుండి ఒక్కసారిగా ముందుకు తేవడంలో రాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న బిజెపి, దాని మాతృ సంస్థ ఆర్ఎస్ఎస్ పాత్ర కనిపిస్తోందని విమర్శించారు. ఈ నిబంధనను ఉపసంహరించుకొని మతానికి అతీతంగా నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని మతం పేరుతో సాగుతున్న ఈ వివక్షతాపూరితమైన నిబంధనను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.



## బీహార్‌లో మహిళల కష్టాలకు ఎవరిని బాధ్యుల్ని చేస్తారు?

సీఎం నితీష్‌కుమార్‌పై ఆర్జేడీ నేత తేజస్వియాదవ్ ఫైర్

**పాట్నా :** బీహార్ రాష్ట్రంలో మహిళలు ఎదుర్కొంటున్న అనేక కష్టాలకు ఎవరిని బాధ్యుల్ని చేస్తారు? అని ఆర్‌జేడీ నేత తేజస్వియాదవ్ బీహార్ సీఎం నితీష్‌కుమార్‌పై ఫైర్ అయ్యారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా సంక్షేమం పట్ల ముఖ్యమంత్రి నిబద్ధత ఏమిటని ఆయన ప్రశ్నించారు. 'బీహార్‌లో 63 శాతం గర్భిణులు పోషకాహార లోపంతో, రక్తహీనతతో బాధపడుతున్నారు. దేశంలో ప్రసూతి మరణాల రాష్ట్రాల్లో బీహార్ 118వ స్థానంలో నిలిచింది. రాష్ట్రంలో రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ కేసులు విపరీతంగా పెరుగుతున్నాయి. ఇప్పటికీ రాష్ట్రంలో 59 శాతం మహిళలు మాత్రమే రుతుక్రమ ఉత్పత్తులు (శానిటరీ ప్యాడ్స్)ను ఉపయోగిస్తున్నారని ఆరోగ్య మంత్రిత్వశాఖ గణాంకాలే చెబుతున్నాయి. బీహార్ శాసనసభలో ఏ పార్టీ మహిళలను నిజంగా గౌరవిస్తుందో, ఏ పార్టీ అగౌరవ పరుస్తుందో తెలుస్తుంది' అని తేజస్వియాదవ్ ఎక్స్ వేదికగా నితీష్‌కుమార్ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు.



## మహిళా సిబ్బందితో వందేభారత్ రైలు

ముంబయిలోని సీఎస్ఎంటీ రైల్వే స్టేషన్ నుంచి షిర్డీకి ప్రయాణం
అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రారంభం

**ముంబయి:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం వందేభారత్ రైలును మహిళా డ్రైవర్లు నడిపారు. ఈ రైలు ఉదయం 6.20 నిమిషాలకు బయలుదేరింది. మహిళా సిబ్బందితో కూడిన ఈ వందేభారత్ రైలు ముంబయిలోని సీఎస్ఎంటీ రైల్వే స్టేషన్ నుంచి షిర్డికి ప్రయాణించింది. ఆసియా తొలి మహిళా లోకో పైలెట్ సురేఖా యాదవ్, అసిస్టెంట్ లోకో పైలెట్ సంగీత కుమారి ఆ రైలుకు డ్రైవర్లుగా విధులు నిర్వర్తించారు. ఈ సందర్భంగా కీలకమైన రైల్వేశాఖలో కూడా మహిళల పాత్ర పెరుగుతుందని దీన్ని బట్టే తెలుస్తోంది. ఈ వందేభారత్ రైలులో.. టీటీఈలు అందరూ కూడా మహిళలే ఉన్నారు. హెడ్ టికెట్ ఎగ్జామినర్ అనుష్కా కేపీ, ఎంజే రాజ్‌పుత్, సీనియర్ టికెట్ ఎగ్జామినర్ సారికా ఓజా, సువర్ణా పాస్తే, కవితా మారల్, మనిషా రామ్ ఈ రైలులో విధులు నిర్వహించారు.

అనుదినం... జనస్వరం
www.navatelangana.com

# నవతెలంగాణ

ఆదివారం 09-03-2025
సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 11 సంచిక : 67 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు + వెబ్‌లో (సోపతి) వెల : 8.00



# దక్షిణాదిపై కేంద్రం కక్ష

## ఇక మోడీ సర్కార్‌పై యుద్ధమే

అన్ని పార్టీలను కలుపుకుని పోరాడుదాం

పెండింగ్ సమస్యలపై పార్లమెంటులో వాయిదా తీర్మానమిద్దాం

అఖిల పక్ష ఎంపీల సమావేశంలో నిర్ణయం

వివరాలు వెల్లడించిన డిప్యూటీ సీఎం భట్టి

కాంగ్రెస్, ఎంఐఎం ఎంపీలు హాజరు

బీజేపీ, బీఆర్ఎస్ డుమ్మా

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

"తెలంగాణపై కేంద్రంలోని బీజేపీ సర్కార్ వివక్ష చూపిస్తోంది. అభివృద్ధి ప్రాజెక్టుల అనుమతులు మొదలుకుని నిధుల కేటాయింపుల వరకు అడుగడుగునా మనకు అన్యాయం జరుగుతోంది. రాష్ట్ర విభజన హామీలను సైతం కేంద్రం తుంగలో తొక్కింది. ఆస్తుల పంపకం, నీటి కేటాయింపుల విషయంలో పక్షపాతం చూపిస్తోంది. రాష్ట్రంపై మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ తీరుకు నిరసనగా పార్లమెంట్‌లో గళం విప్పాలి" అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో శనివారం జరిగిన ఎంపీల సమావేశంలో తీర్మానించారు. ఈ సమావేశానికి రాష్ట్రంలోని అన్ని పార్టీల ఎంపీలను ఆహ్వానించగా... కాంగ్రెస్, ఎంఐఎం ఎంపీలు మాత్రమే హాజరయ్యారు. బీజేపీ, బీఆర్ఎస్ ఎంపీలు డుమ్మా కొట్టారు. అనంతరం సమావేశ నిర్ణయాలను భట్టి మీడియాకు వివరించారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, హామీలపై చర్చించి 28 అంశాలపై ప్రతిపాదనలు రూపొందించామని తెలిపారు. పార్లమెంట్‌లో ఏయే అంశాలను లేవనెత్తాలనే విషయాలపై చర్చించి విపులంగా బుక్‌లెట్ తయారు చేసినట్టు వివరించారు. సమావేశంలో పాల్గొన్న ఎంపీలకు అంశాల వారీగా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించినట్టు తెలిపారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల విషయంలో పదేండ్లుగా బీఆర్ఎస్ నిర్లక్ష్యంగా వ్యవహరించిందనీ, ఏడాదిగా తాము తీవ్రంగా ప్రయత్నిస్తున్నామని చెప్పారు. అయినా మెట్రో విస్తరణ, మూసీ ప్రక్షాళన సహా అనేక ప్రాజెక్టులకు కేంద్రం సహకారం అందించడం లేదని వాపోయారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం పార్లమెంట్ సమావేశాల్లో వాయిదా తీర్మానం ఇచ్చే అవకాశాలను ఎంపీలకు వివరించామని పేర్కొన్నారు. సమావేశానికి రాని ఎంపీలకు కూడా బుక్‌లెట్ అందిస్తామని తెలిపారు. వివిధ కారణాల వల్ల సమావేశానికి రాలేకపోయామని బీజేపీ ఎంపీలు చెప్పారనీ, అవసరమైతే మరోసారి భేటీ నిర్వహించేందుకైనా తాము సిద్ధమేనని స్పష్టం చేశారు. రాష్ట్ర హక్కుల కోసం ...15లో

### సమావేశానికి కమలం, గులాబీ దూరం

ఈ సమావేశానికి బీజేపీ, బీఆర్ఎస్ ఎంపీలు డుమ్మా కొట్టారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లతో పాటు రాష్ట్రానికి సంబంధించిన ఎంపీలందరికీ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శుక్రవారం స్వయంగా ఫోన్ చేసి సమావేశానికి ఆహ్వానించారు. తమకు ఆహ్వానం ఆలస్యంగా అందిందనీ, పార్టీ కార్యక్రమాల కారణంగా ఎంపీల సమావేశానికి హాజరుకాలేమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి భట్టికి లేఖ రాశారు. భవిష్యత్‌లో ఇలాంటి సమావేశాలు నిర్వహిస్తే.. ముందుగానే తెలియజేయాలని లేఖలో కోరారు. బీఆర్ఎస్ నుంచి మాత్రం ఇప్పటి వరకు అధికారికంగా ఎవరూ స్పందించలేదు.

ట్రంప్ క్యాబినెట్ మీటింగ్‌లో

# రభస



మస్క్, రూబియోల మధ్య గొడవ

వార్తా సంస్థల కథనాలు వెల్లడి

**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సమక్షంలో నిర్వహించిన క్యాబినెట్ మీటింగ్‌లో రసాభాసా చోటు చేసుకున్నట్టు తెలుస్తున్నది. ఆ దేశ విదేశాంగ మంత్రి మార్కో రూబియో, ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడైన ఎలాన్ మస్క్‌లు గొడవ పడినట్టుగా సమాచారం. ఈ మేరకు పలు వార్తా సంస్థలు కథనాలు వెల్లడిస్తున్నాయి. ఈ కథనాల ప్రకారం.. అమెరికాలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియన్సీ(డోజ్) శాఖను ట్రంప్ ఏర్పాటుచేసిన సంగతి తెలిసిందే. ఈ శాఖ వృథా ఖర్చులను తగ్గించేందుకు, ప్రభుత్వ వ్యవస్థలో సమూల మార్పులే లక్ష్యంగా భారీగా ఉద్యోగులను తొలగిస్తుంది. దీనిపై సర్వత్రా పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్న విషయం విదితమే. ఈ విమర్శలపై చర్చించేందుకు ట్రంప్ అధ్యక్షతన క్యాబినెట్ సమావేశం జరిగింది. అందులో ...15లో

# కోతల సీఎం

## మహిళలకు చేసింది ఎడతెగని వంచనే : మాజీ మంత్రి హరీశ్‌రావు

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**



మహిళలను కోటీశ్వరులను చేస్తామని చెప్పి కోతలు కోసిన రేవంత్ రెడ్డి ఏడాదిన్నర పాలనలో మహిళలకు చేసింది ఎడతెగని వంచనే అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు మిగిలింది ఎడతెగని వేదనే అనీ, మహిళలను కనీసం లక్షాధికారులుగా చేయని చేతగాని సర్కారు కాంగ్రెస్ సర్కార్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దాదాపు ...15లో

## మహిళా సంఘాలకు మండల కేంద్రాల్లో

# రైస్ మిల్లులు, గోడౌన్లు

### కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం

- 15 ఏండ్లకే సంఘాల్లో సభ్యత్వం
- 65 ఏండ్ల వరకు పొడిగింపు
- ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారుస్తాం
- నా నమ్మకం, విశ్వాసం మహిళలే
- ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి



**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

'నా నమ్మకం, విశ్వాసం మహిళలే. వారికి అండగా ఉంటాం. వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతాం. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసి ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయటమే తమ ప్రభుత్వ లక్ష్యం. ఆ నమ్మకంతోనే రాష్ట్రాన్ని ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారుస్తానని చెబుతున్నా' అని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చెప్పారు. ఐకేపీ కేంద్రాల నుంచి సేకరించిన ధాన్యాన్ని కొందరు రైస్‌మిల్లర్లు పందికొక్కుల్లా మెక్కుతున్నారనీ, రాష్ట్ర ప్రభుత్వానికి సకాలంలో ఇవ్వడం లేదని విమర్శించారు. ఆ బాధ నుంచి విముక్తి పొందేందుకు ప్రతి మండల కేంద్రంలోనూ ఓ రైస్‌మిల్లును, గోడౌన్‌లను మహిళా సంఘాలతో కట్టించి నిర్వహణ బాధ్యతను అప్పగిస్తామని ప్రకటించారు. మహిళా సంఘాలు మిల్లింగ్ చేసి ఆ బియ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు సరఫరా చేయాల్సి ఉంటుందన్నారు. పాఠశాలలు, కాలేజీలు, హాస్టళ్లకు చేసే ఆహార సరఫరాను కూడా మహిళా సంఘాలకే అప్పగించనున్నట్టు ప్రకటించారు. అందుకోసం విధి, విధానాలు రూపొందించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో ఇందిరా మహిళాశక్తి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలకు చెందిన 150 ఆర్టీసీ అద్దె బస్సులకు మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్కతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి పూజ చేశారు. అనంతరం బస్సులను జెండా ఊపి ప్రారంభించారు.

అనంతరం సభా ప్రాంగణంలో మహిళా సంఘాలు ఏర్పాటు చేసిన సోలార్, ఫుడ్, కుట్టుమిషన్ స్టాళ్లను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, జూపల్లి, తదితరులతో కలిసి సీఎం పరిశీలించారు. సభ్యులను ఆయా స్టాళ్ల గురించి అడిగి వివరాలు తెలుసుకున్నారు. మహిళా సంఘాలకు కేటాయించిన సోలార్ ప్లాంట్లను వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. అనంతరం సభలో స్వయం సహాయక సంఘాలకు రూ.22,794.22 కోట్ల ఇందిరా శక్తి చెక్కును ఆవిష్కరించారు. బీమా, ప్రమాద బీమాకు సంబంధించి రూ.44.80 కోట్ల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో పదేండ్ల పాటు మహిళలకు పట్టిన చంద్రగహణం వీడిందన్నారు. డ్వాక్రా గురించి గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్కసారి కూడా ఆలోచించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 15 నెలల్లో తమ ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రజాపాలన తెచ్చిన మార్పు స్పష్టంగా కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. ఇందిరమ్మ రాజ్యంలో మహిళలు స్వేచ్ఛ, ఆత్మగౌరవాన్ని అనుభవిస్తున్నారనీ, తమ గళం వినిపిస్తున్నారని చెప్పారు. గతంలో వివక్షను ఎదుర్కొన్న మహిళ నేడు తలెత్తుకుని రాజధానిలో నిలబడిందన్నారు.

ఇందిరమ్మ రాజ్యం వచ్చాక మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామన్నారు. వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్వహణ, రెసిడెన్షియల్ స్కూళ్ల విద్యార్థుల యూనిఫాంలు కుట్టే పని వారికి అప్పగించినట్టు తెలిపారు. ఇప్పటి వరకు 1.30 కోట్ల యూనిఫాంలను మహిళా సంఘాలు అందించాయని తెలిపారు. గతంలో రూ.25గా ఉన్న కుట్టుకూలిని రూ.75కు పెంచిన విషయాన్ని ...15లో

### అంతర్జాతీయ యూనివర్సిటీలతో పోటీపడాలి 15లో.

చదువులో రాణించాలి

వచ్చే ఎన్నికల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్లు అమలు

నాయకులుగానూ ఎదగాలి

విద్యార్థినులకు సీఎం రేవంత్‌రెడ్డి మార్గనిర్దేశం

వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం నూతన భవన నిర్మాణాలకు శంకుస్థాపన

# కార్పొరేట్ సేవకుడు మోడీ

లేబర్ కోడ్‌లను తిప్పికొట్టాలి

వైద్య పరికరాలపై జీఎస్టీని ఎత్తేయాలి

కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి

మే మొదటివారంలో దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య పిలుపు

టీఎంఎస్ఆర్‌యూ జనరల్ కౌన్సిల్ సమావేశాలు ప్రారంభం




**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

ప్రధాని నరేంద్ర మోడీ కార్పొరేట్ సేవకుడని సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య విమర్శించారు. అంబానీ, అదానీ ప్రయోజనాల కోసమే పనిచేస్తున్నారని అన్నారు. కార్పొరేట్ సంస్థలకు రూ.లక్షల కోట్లు రాయితీలు కల్పిస్తున్నారని చెప్పారు. ఇంకోవైపు కార్పొరేట్ పన్ను 30 శాతం నుంచి 22 శాతానికి తగ్గించారని వివరించారు. అన్ని విధాలుగా కార్పొరేట్ సంస్థలకు మోడీ అండగా నిలుస్తున్నారని అన్నారు. రెండురోజులపాటు జరగనున్న తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ (టీఎంఎస్ఆర్‌యూ) రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రారంభమయ్యాయి. ప్రారంభ సూచికగా టీఎంఎస్ఆర్‌యూ పతాకాన్ని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చికోటి శ్రీధర్ ఆవిష్కరించారు. అనంతరం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎస్ వీరయ్య మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నదని విమర్శించారు. దేశంలో నిరుద్యోగం పెరిగిందన్నారు. ఉపాధి అవకాశాలు లేకపోవడంతో ప్రజల్లో కొనుగోలు శక్తి పడిపోయిందని చెప్పారు. దీంతో సరుకుల అమ్మకాలు తగ్గిపోయాయని వివరించారు. కార్మికులు, ఉద్యోగుల నిజవేతనాలు పడిపోయాయని అన్నారు. ద్రవ్యోల్బణం పెరిగిందనీ, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాలను విపక్ష పార్టీల నాయకులు చెప్పలేదనీ, ఎకనామిక్ సర్వే ప్రకటించిందని ...5లో

# సొరంగంలో ముగ్గురు కార్మికుల ఆనవాళ్లు

## గుర్తించిన క్యాడవర్ డాగ్స్

నేటి నుంచి రోబోలను దింపనున్న ప్రభుత్వం

నీటి ఊట పెరగడంతో పూర్తి స్థాయిలో పసిగట్టని డాగ్స్

ఇది ఒక జాతీయ విపత్తు

సమీక్షలో నీటిపారుదల శాఖామంత్రి ఉత్తమ్



**నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి**

ఎస్ఎల్‌బీసీ సొరంగంలో మూడు చోట్ల క్యాడవర్ డాగ్స్ కార్మికుల ఆనవాళ్లను గుర్తించాయి. ఆ ప్రాంతాల్లో తవ్వేందుకు రెస్క్యూ బృందాలు లోపలికి వెళ్లాయి. ఈ ప్రమాదం ఒక జాతీయ విపత్తు అని, కార్మికులను వెలికితీయడానికి, సహాయక చర్యల్లో ప్రపంచంలోని అత్యుత్తమ సాంకేతికతను వినియోగిస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. అయితే, జీపీఆర్ స్కాన్, కేరళ డాగ్స్‌ను రంగంలోకి దింపినా ఉబికి వస్తున్న నీటి ఊట వల్ల సహాయక చర్యలు ముందుకు సాగడం లేదు. చివరి 50 మీటర్ల నిడిది పూర్తి ప్రమాదకరంగా మారింది. టన్నెల్ పై భాగం నెర్రెలు బారి కూలడానికి సిద్ధంగా ఉంది. అందుకే టన్నెల్‌లో పని చేయాలంటే ప్రమాదం కొని తెచ్చుకున్నట్టేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కార్మికులను గుర్తించడానికి ఆదివారం నుంచి రోబోలను దించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. సొరంగంలో కేరళ క్యాడవర్ డాగ్స్ ముగ్గురు కార్మికుల ఆనవాళ్లు గుర్తించినట్టు అధికారులు చెప్పారు. పూర్తి స్థాయిలో సమీక్ష నిర్వహించడానికి ఈనెల 11న సీఎంతో సమీక్ష నిర్వహిస్తామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం ఉదయం అచ్చంపేట ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణతో కలిసి మంత్రి ఉత్తమ్ ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను సందర్శించారు. వివిధ రంగాల నుంచి పనిచేస్తున్న రెస్క్యూ బృందాల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సొరంగంలో సహాయక చర్యల పురోభివృద్ధిపై రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కార్యదర్శి అరవింద్ కుమార్, ఆర్మీ కమాండెంట్ పరిక్షిత్ మెహ్రా మంత్రికి వివరించారు. ఎన్.జి.ఆర్.ఐ జియోగ్రాఫికల్ సర్వే ఆఫ్ ఇండియా, క్యాడవర్ డాగ్ బృందం, ర్యాట్ మైనర్స్, రోబోటిక్ రంగాల నిపుణులతో చర్చించి సహాయక చర్యలపై సలహాలు సూచనలు ...15లో



## మహిళా దినోత్సవ ఉద్దేశం సమానత్వమే

### మహిళల భద్రతలో పోలీసుల పాత్ర కీలకం

ఆడబిడ్డలను పుట్టనిద్దాం..

చదవనిద్దాం..ఎదగనిద్దాం..గౌరవిద్దాం

మాదకద్రవ్యాల నుంచి సమాజాన్ని చైతన్యపరుద్దాం

రన్ ఫర్ యాక్షన్ 2025 ప్రారంభంలో మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

మహిళా దినోత్సవం ఉద్దేశం సమానత్వమేననీ, ప్రతి కుటుంబంలోనూ మహిళకు సమాన అవకాశాలు కల్పించాలని మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) పిలుపునిచ్చారు. ఆడబిడ్డలను పుట్టనిద్దాం.. చదవనిద్దాం..ఎదగనిద్దాం..గౌరవిద్దాం..అనే మాటల్ని ప్రతి కుటుంబంలోనూ తూచా తప్పకుండా ...5లో

# ఆర్‌జీఎంకు నిధుల కొరత

- గత రెండేండ్లుగా ఇదే పరిస్థితి
- 2021లో కేంద్ర పథకం ప్రారంభం

- కేటాయించిన రూ.2400 కోట్లు మూడేండ్లలోనే ఖర్చు
- ఈసారి బడ్జెట్‌లో రిక్తహస్తం
- 'ప్రపంచంలోనే మూడోవంతు పాల ఉత్పత్తి కేంద్రం'గా మారాలన్న భారత టార్గెట్‌కు ఎఫెక్ట్

దేశంలో పాల ఉత్పత్తిపై మోడీ సర్కారు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నది. దానిపై ఆధారపడిన పాడి రైతులను కష్టాలపాలు చేస్తున్నది. కేంద్ర ప్రభుత్వ పథకం రాష్ట్రీయ గోకుల్ మిషన్ (ఆర్‌జీఎం) నిధుల కొరతను ఎదుర్కోవటమే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. గత రెండేండ్లుగా ఇదే పరిస్థితి నెలకొన్నది. దేశీయ పశువుల పాల ఉత్పాదకతను పెంచటం ఈ కేంద్ర ప్రభుత్వ పథకం ఉద్దేశం. ప్రపంచంలోనే మూడోవంతు పాల ఉత్పత్తి కేంద్రంగా అవతరించాలని భారత్ కలలు కంటున్నది. అయితే, ఈ పథకానికి నిధుల కొరత ఉండటంతో అది పథకం అమలు తీరుపై ప్రతికూల ప్రభావాన్ని చూపనున్నది. అలాగే, పాల ఉత్పత్తిలో భారత్ కన్న కలల పైనా ఎఫెక్ట్ పడుతుందని కొందరు ఉన్నతాధికారులు, విశ్లేషకులు అంటున్నారు.

**రాష్ట్రీయ గోకుల్ మిషన్**

- కేటాయించిన రూ.2400కోట్లు తొలి మూడేండ్లలో పూర్తి
- కృత్రిమ గర్భధారణకు మొత్తం 10 కోట్ల పశువులు టార్గెట్.. 8.52 కోట్లతో 80 శాతం టార్గెట్ పూర్తి
- పథకంతో ప్రయోజనం పొందిన ఐదు కోట్ల మందికి పైగా చిన్న, సన్నకారు రైతులు.. పెరిగిన పాల ఉత్పత్తి, ఆదాయాలు

2021లో ప్రారంభం.. దేశీయ జాతుల ఉత్పాదకత, కృత్రిమ గర్భదారణ ద్వారా పాల ఉత్పత్తిని పెంచటం

జీడీపీలో పాల ఉత్పత్తి వాటా ఐదు శాతం.. 8 కోట్ల మంది రైతులు, ప్రత్యేకించి సన్నకారు రైతులకు ఉపాధి

ప్రపంచంలోనే 52 శాతం వాటాతో అతిపెద్ద పాల ఉత్పత్తిదారుగా భారత్



అదనంగా రూ.1000 కోట్లు కావాలి

**న్యూఢిల్లీ :** రాష్ట్రీయ గోకుల్ మిషన్ (ఆర్‌జీఎం)ను 2021లో ప్రారంభించారు. దేశీయ జాతుల ఉత్పాదకతను పెంచటం, కృత్రిమ గర్భధారణ(ఏఐ) ద్వారా పాల ఉత్పత్తిని పెంచటానికి ఐదుఏండ్ల కోసం ఈ పథకం అమలైంది. అయితే పథకానికి కేటాయించిన రూ.2400 కోట్లు తొలి మూడేండ్లలోనే ఖర్చయ్యాయి. వంద శాతం నిధుల వినియోగమనేది మా శాఖలో అరుదుగా జరుగుతుందని అధికారి ఒకరు తెలిపారు. అయితే, పాల ఉత్పత్తిపై ఆధారపడిన ఉపాంత పశువుల పెంపకందారుల నుంచి డిమాండ్లు పెరుగుతున్నందున ఈ పథకం కింద టాస్కుపూర్తి చేయటానికి తమకు అదనంగా రూ.1000 కోట్లు అవసరమని వివరించారు. పాడి రైతులకు ప్రయోజనాన్ని చేకూర్చే ఈ పథకంపై మోడీ సర్కారు చిన్నచూపు చూస్తున్నది. 2025-26 బడ్జెట్‌లో ఆర్‌జీఎం పథకం కింద ఎలాంటి ...5లో

# ఎస్సారెస్పీ కాలువలో పడ్డ కారు

## మూడేండ్ల బాలుడు మృతి



గల్లంతైన తండ్రి, కుమార్తె మృతదేహాలు లభ్యం..

పర్వతగిరిలో విషాదం

**నవతెలంగాణ-పర్వతగిరి**


కారు అదుపు తప్పి ఎస్సారెస్పీ కాలువలోకి దూసుకెళ్లిన ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కొంకపాక శివారులోని ఎస్సారెస్పీ కెనాల్ కాలువ వద్ద శనివారం జరిగింది. ఈ ప్రమాదంలో మూడేండ్ల కుమారుడు మృతిచెందగా.. తండ్రి, కుమార్తె గల్లంతయ్యారు. కాలువలో కొట్టుకుపోతున్న తల్లిని స్థానికులు కాపాడారు. ఈక్రమంలో పోలీసులు.. గాలింపు చర్యలు చేపట్టగా తండ్రి, కూతురు మృతదేహాలు లభ్యమయ్యాయి. వివరాల్లోకి వెళితే.. వరంగల్ జిల్లా నెల్లికుదురు మండలం మేచరాజుపల్లికి చెందిన సోమారపు ప్రవీణ్ కుమార్(34) తన భార్య కృష్ణవేణి, కుమార్తె చైత్ర సాయి(5), కుమారుడు ఆర్య వర్ధన్ సాయి(3)తో కలిసి శనివారం హనుమకొండ నుంచి స్వగ్రామానికి కారులో బయలుదేరారు. ఈ క్రమంలో మార్గమధ్యలో డ్రైవింగ్ చేస్తున్న ప్రవీణ్‌కు గుండె నొప్పి వచ్చింది. దాంతో చికిత్స కోసం తిరిగి వరంగల్ వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా గుండె నొప్పి ఎక్కువై కారు అదుపు తప్పి ఎస్సారెస్పీ కాలువలో ...15లో

ఒకసారి పరిశీలిస్తే... గాంధీని చంపినవాడు హిందువే అయిన బ్రాహ్మణుడు. ఛత్రపతిపై కత్తివేటు వేసిన భాస్కర్ కులకర్ణి బ్రాహ్మణుడే. శివాజీ స్వరాజ్యాన్ని కబలించిన బాలాజీ విశ్వనాథ్ బ్రాహ్మణుడే. జ్యోతిరావ్ పూలే గారిని చంపటానికి వ్యక్తులను పంపిన కేశవభట్ బ్రాహ్మణుడే. శంభాజీని ఔరంగజేబుకు పట్టిచ్చిన రంగనాథ స్వామి బ్రాహ్మ ణుడు. దీన్ని ఆసరా చేసుకుని మతతత్వాన్ని రెచ్చగొట్టే ప్రయత్నం ఎప్పడయినా జరిగిందా! ఎప్పుడో కొన్ని వందల ఏండ్ల క్రితం జరిగి పోయిన చరిత్ర ఘటనలపై ద్వేషాన్ని నూరిపోయటం ఏ రకమైన సాంస్కృతిక హీనత్వం! చరిత్రలో హిందూమతంలోనే వైష్ణవ, శైవ యుద్ధాలు జరిగాయి కదా! వాటినీ ఇపుడు తిరగోడ్తారా! వైరాన్ని ఎగదోస్తారా!

# చరిత్రపై వక్రకళ

చరిత్రపై దుమ్మెత్తి పోయటానికి ఇపుడు కళారంగాన్ని సాధనంగా వాడటం మొదలయింది. వాస్తవాలను కనుమరుగుచేసి, వక్రీకరణలతో కళారస గుళికల తయారీలో తలమునకలవుతున్న పాలకుల ఫీట్లు చూస్తే ఆశ్చర్యమేస్తుంది. ఆ వక్రీకరణలన్నీ ద్వేషంతో నింపడాన్ని, ఉన్మాదాన్ని పెంచడానికి ఉపయోగించడం అత్యంత దారుణమైన విషయం. మీరు గమనించినట్లయితే గత పదేండ్లలో మన బాలీవుడ్, టాలీవుడ్, ఇతర భాషా సినీ రంగంలో చారిత్రక సంఘటనలను మాతృకగా తీసుకుని వాటికి మతపరమైన ద్వేషాగ్నులు నింపే కథనాలను జోడించి వండి వారుస్తున్న సినిమాలు విపరీతంగా వస్తున్నాయి. 'పద్మావతి', 'బాహుబలి', 'ఆది పురుష్', 'రజాకార్', 'కేరళ ఫైల్స్', 'కాశ్మీరీ ఫైల్స్'... ఇలా అనేక సినిమాలు ఆరెస్సెస్, బీజేపీ అనుకూల హిందుత్వ, జాతీయవాదానికి అనుకూలంగా నిర్మించడం, వాటిని ఎన్నికల సందర్భంలో విరివిగా ప్రదర్శించి, రాజకీయ ప్రయోజనాన్ని పొందాలనే ప్రయత్నం చేయడం గమనించవచ్చు. మనువాద అణచివేతకు, దురహంకారానికి వారసులుగా ఉన్న వీరు, వీరుల, నాయకుల వారసత్వాన్ని పొందేందుకు చరిత్రనే వక్రీకరిస్తూ, అందరి కళ్లల్లో ద్వేషం పోస్తున్నారు. అందుకు సినిమా మాధ్యమాన్నీ పదునైన ఆయుధంగా ఎక్కుపెడుతున్నారు.

ఛావా సినిమా అందుకు ఓ చక్కని ఉదాహరణ. ఛత్రపతి శివాజీ కుమారుడు శంభాజీ మహరాజ్ జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన సినిమా అని చెపుతున్న దీనిలో అన్నీ అతిశయోక్తులు, వక్రీకరణలు నింపి మన ముందుకు తెచ్చారు. ఛత్రపతి శివాజీ గురించిన చరిత్ర ప్రసిద్ధ మయినది. తల్లి జిజియాభాయి గురించి కూడా మనం చదువుకున్నాము. గతంలో ఎప్పుడో తెలుపు నలుపులో శివాజీపై మరాఠీ సినిమా కూడా వచ్చింది. అందులో శివాజీ మరాఠా రాజ్యాధికారం స్వీకరించే సమయంలో గుడిలో పూజచేసి, వీర తిలకం దిద్దాల్సిన పూజారులు, శూద్రులకు వీర తిలకం దిద్దలేమని నిరాకరిస్తారు. అపుడు వేరే ప్రాంత బ్రాహ్మణులు వచ్చి, వారి ఎడమకాలు బొటనవేలుతో శివాజీ తలపై తిలకాన్ని దిద్దినారని చరిత్ర ఆధారంగా విన్నాము. ఇంతటి వివక్షను మనువాదుల నుండి ఎదుర్కొన్న రాజు ఛత్రపతి శివాజీ




ఇప్పుడు ఛత్రపతి శివాజీ హిందువుకు ప్రతినిధిగా వీరంగం వేస్తున్నారు ఈ సంఘ పరివారపు సనాతనులు. ఇది కదా విచిత్రమంటే! ఇపుడు అతని కుమారుడు శంభాజీని హీరోను చేసి, ఔరంగజేబును క్రూరునిగా చూపి, హిందూ మత ద్వేషిగా చిత్రీకరించే వంటకు 'ఛావా'ను వండారు. వాస్తవంగా శంభాజీని ఔరంగజేబుకు పట్టించిన వారు హిందువులే. శంభాజీని నిర్మూలించాక మరాఠాను ఏలింది కూడా హిందువులే. అసలు శంభాజీ అంత గొప్ప వీరుడు అని తెలిపే చారిత్రక ఆధారాలు ఏమీ లేవు. ఔరంగజేబు ఆరవ మొగలు చక్రవర్తి. దాదాపు యాభై ఏండ్లు పాలించాడు. ఇతను లక్షలాది హిందువులను ఊచకోత కోసాడని, వేలాది ఆలయాలు ధ్వంసం చేశాడని ప్రచారం చేస్తారు. వీటికి సరైన ఆధారలేవీ లేవు. సోదరులను, సంతానాన్ని హత్యలు చేయించాడని, జిజియా పన్ను విధిం చాడని చెబుతారు. అయితే రాజ్యాధికారం కోసం, అధికారం స్థిరపరచుకొనేందుకు, దాయాదులను తొలగించడం రాచరిక వ్యవస్థలో సహజం. డా॥ బి.ఎస్.పాండే పరిశోధక రచన ప్రకారం, రాజకీయ కారణాలవల్ల పన్నెండు ఆల యాలను, కొన్ని మసీదులను ధ్వంసం చేశాడని, వందకు పైగా హిందూ ఆలయాల నిర్మాణానికి, పోషణకు సహాయం చేశాడని, మతపరమైన తటస్థతను పాటించాడని తెలిపారు. సంస్కృతం నేర్చుకుని, ఉపనిషత్తులను, కావ్యాలను అనువాదమూ చేయించాడు. చక్రవర్తుల విలాస జీవితాన్ని తిరస్కరించాడు కూడా. అలాంటి ఒక చక్రవర్తిని, తమ మత విద్వేషానికి వాడటం దుర్మార్గం. అలసు దుర్మార్గాలు, హత్యలు చేసిన వారందరూ హిందూ వ్యతిరేకులేననే అసత్య ప్రచారం నిరంతరాయంగా చేస్తూనే ఉన్నారు.

ఒకసారి పరిశీలిస్తే... గాంధీని చంపినవాడు హిందువే అయిన బ్రాహ్మణుడు. ఛత్రపతిపై కత్తివేటు వేసిన భాస్కర్ కులకర్ణి బ్రాహ్మణుడే. శివాజీ స్వరాజ్యాన్ని కబలించిన బాలాజీ విశ్వనాథ్ బ్రాహ్మణుడే. జ్యోతిరావ్ పూలే గారిని చంపటానికి వ్యక్తులను పంపిన కేశవభట్ బ్రాహ్మణుడే. శంభాజీని ఔరంగజేబుకు పట్టిచ్చిన రంగనాథ స్వామి బ్రాహ్మ ణుడు. దీన్ని ఆసరా చేసుకుని మతతత్వాన్ని రెచ్చగొట్టే ప్రయత్నం ఎప్పుడయినా జరిగిందా! ఎప్పుడో కొన్ని వందల ఏండ్ల క్రితం జరిగిపోయిన చరిత్ర ఘటనలపై ద్వేషాన్ని నూరిపోయటం ఏ రకమైన సాంస్కృతిక హీనత్వం! చరిత్రలో హిందూమతంలోనే వైష్ణవ, శైవ యుద్ధాలు జరిగాయి కదా! వాటినీ ఇపుడు తిరగోడ్తారా! వైరాన్ని ఎగదోస్తారా!

భారతదేశం అనాదిగా మత వైవిధ్యానికి, భిన్నసంస్కృతుల మేళవింపుకు ప్రసిద్ధి. హిందూ ముస్లిం, క్రిస్టియన్ల మధ్య సాంస్కృతిక సామరస్యాన్ని సూచించే దర్గాలు, సూఫీ సంతులు, పండుగలు, పీర్ల ఉత్సవాలు, రొట్టెలు పండుగలు, ప్రజలందరూ దీన్ని దెబ్బకొట్టి ప్రజల్లో విభజన సృష్టించేందుకు, శత్రుత్వాన్ని పెంచేందుకు వీళ్లు పూను కోవడాన్ని ప్రజలు ఆలోచించి తిప్పికొట్టాలి. సినిమాలు తీస్తున్నవారూ చరిత్రకు వక్రభాష్యం చెప్పటమూ మాను కోవాలి.ఇప్పటికే కోర్టు కేసు ఎదుర్కొంటున్న 'ఛావా' దర్శకుడు వక్రీకరణలపై క్షమాపణలు కోరటాన్ని గమనించవచ్చు!

సంపాదకీయం

జస్టిస్ ఓకా మరో అడుగు ముందుకేసి కవిత్వాన్ని అర్థం చేసుకోలేకపోవడం పట్ల ఆవేదన ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇదే సమస్య. ఎవరికీ సృజనాత్మకత పట్ల గౌరవం లేదు.మీరు అన్యాయానికి గురైనా ప్రేమతో తట్టుకోండని ఆ పాట చెబుతుంది. రక్తదాహం తీరని వారు మా మాట వినాలని అంటున్నది. మేము న్యాయం కోసం చేసే పోరాటంపై మీరు అన్యాయంగా దాడి చేసినా మేము ప్రేమతోనే ఎదర్కొంటామని ప్రకటిస్తున్నది" అని ఆయన వివరించారు. హైకోర్టు ఈ అంశాలను గమనంలోకి తీసుకోకపోవడం బట్టి చూస్తే దేశం ఎటుపోతుందో తెలియడం లేదని కపిల్‌సిబాల్ వ్యాఖ్యానించారు. దీనిపై కోపగించుకున్న సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మనం హైకోర్టు మీద వ్యాఖ్యలు చేయొద్దని అడ్డుతగిలారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు హైకోర్టుపై స్పందించకుండానే పోలీసులకు మాత్రం చురకలు వేశారు.

ఇటీవల డోనాల్డ్ ట్రంప్ మళ్లీ అధ్యక్షపదవి చేపట్టాక ప్రధానమంత్రి మోడీ ఆదరాబాదరాగా వెళ్లి కలసి రావడం అనేక వ్యాఖ్యలకు దారితీసిన సంగతి తెలిసిందే. ట్రంప్ విపరీత పోకడలనూ భారతీయ నిపుణుల, వ్యాపార వర్గాల ప్రయోజనాలపై వేటు వేసి తమ దేశానికి లాభం చేకూరేవిధంగా ఆయన అనేక హుకుందారీ చర్యలకు పాల్పడ్డారు. అయితే మోడీ వాటిలో దేన్నీ ప్రశ్నించలేకపోయారు. పైగా అవేవో మనకు మేలు చేసేవన్నట్టుగా విదేశాంగ మంత్రి జైశంకర్ సమర్థిస్తున్నారు. అదలా ఉంచితే ఆయన పర్యటన నేపథ్యంలో ఆనంద వికటన్ ఫిబ్రవరి 15న ఒక కేరికేచర్ ప్రచురించింది.ట్రంప్ ముందు మోడీ సంకెళ్లతో బందీగా ఉన్నట్టు అంటే స్వేచ్ఛ లేనట్టు అందులో చిత్రించింది. ఈ కార్టూన్ అమెరికాతో సంబంధాలకు హానికరమంటూ ఆనందవికటన్ వెబ్‌సైట్‌ను అమాంతం నిలిపేసింది కేంద్రం.

# మీడియా సృజన స్వేచ్ఛ, సభ్యతా విలువలు



తెలకపల్లి రవి

ఏపీ,తెలంగాణ రాష్ట్రాల్లో సోషల్ మీడియా ద్వారా వారి వారి ప్రతినిధులు, నాయకులు చేసిన వ్యాఖ్యానాలు, ప్రయోగించిన బూతుపురాణాలపై ఎడతెగని వివాదాలు నడుస్తున్నాయి. కేసులూ, అరెస్టులూ ఎలా ఉన్నా ఆ ధోరణులు మాత్రం మారడం లేదు. సినీ,మీడియా రంగాల్లో ఎప్పుడూ ముందుండే వాళ్లు సోషల్ మీడియాను కూడా వ్యాపార మార్గంలో మళ్లించడంతో అనేక అవాంఛనీయ ధోరణులు తలెత్తుతున్నాయి. ఈ క్రమంలో అసలు మీడియా, సోషల్ మీడియా, ప్రయోజనాలు, ప్రజాకోణం మరుగున పడిపోతున్నాయి. జాతీయ స్థాయిలో మీడియా స్వేచ్ఛ గురించిన పోరాటంతో సంబంధం లేని రాజకీయ తగాదాగా ఇది మారిపోయినట్టు కనిపిస్తుంది గానీ నిజానికి అదే కీలకమైన కోణం. ఈ వారం సుప్రీంకోర్టు, మద్రాసు హైకోర్టు, రాజస్థాన్ హైకోర్టుతో సహా దీనికి సంబంధించి చేసిన వ్యాఖ్యానాలు, ఇచ్చిన ఆదేశాలు చూస్తే ఈ వాస్తవం గోచరిస్తుంది. '75 ఏండ్ల స్వాతంత్య్రం తర్వాత కూడా మీకు ప్రాథమిక హక్కులంటే ఏమిటో తలకెక్కలేదని' సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఓకా ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసిందంటే ఇదెంత తీవ్రమైన పోరాటంగా ఉందో అర్థమవుతుంది. తమిళనాడులో ఆనంద వికటన్ వెబ్‌సైట్ వ్యవహారం కూడా ఇందుకు సంబంధించి కీలక సంకేతాలు అందిస్తున్నది. స్థానిక వివాదాల్లో మునిగితేలుతున్న తెలుగు మీడియా, ప్రాంతీయ నేతలూ వీటిని పరిశీలిస్తారా?

## సుప్రీం ఆగ్రహమెందుకు?

భావ ప్రకటనా స్వేచ్ఛపైన అసహనం, మూఢనమ్మకాలను, మత ఛాందసాలను ప్రశ్నిస్తే దాడి ఇప్పుడు సర్వసాధారణంగా తయారైనాయి. అంతర్జాతీ య అధ్యయనాలు, నివేదికలు కూడా భారతదేశంలో పరిస్థితిపై ఆందోళన వెలిబుచ్చుతున్నాయి. ఈ నేపథ్యంలో ఒకప్పటి కవులూ, రచయితల వ్యాఖ్యానాలు వీరు సహించి ఉండేవారా? అని మాలాంటి వాళ్లం తరచూ అడుగుతుంటాం. ఉదాహరణకు వేమన పద్యాలు ఉటంకిస్తే, త్రిపురనేని రామస్వామి, జాషువా వంటివారి చరణాలు గుర్తుచేస్తే భరించగలరా? అని సందేహాలు వింటుంటాము. ఈ ఇద్దరు నాయకుల్లో ఎవరు మెరుగని ఎవరైనా అడిగితే ఎవరైతేనేం, ఒక్కొక్కరు మహాహంతకులు అని మహా ప్రస్థానంలో శ్రీశ్రీని ఉటంకించాననుకోండి. నాయకులను హంతకు డన్నారని వాదించొచ్చు. బుద్ధిలేనివాడు దేవుడెట్లాయరా అని వేమన రాసింది చెప్పామనుకోండి, అది దైవదూషణగా చిత్రించవచ్చు. సరిగ్గా ఇప్పుడు అలాటి సమస్యే గుజరాత్‌లో వచ్చింది. ఇమ్రాన్ ప్రతాప్‌గర్హి రాజ్యసభ సభ్యుడు. కాంగ్రెస్ తరపున ఎన్నికైన ఈయన ఉర్దూ భాషాకవి, అవార్డు గ్రహీత కూడా. కాంగ్రెస్‌లో చేరిన కొద్ది కాలంలోనే ఆయన్ను ప్రమోట్ చేసి ఎంపీగానూ, మైనార్టీ సెల్ చైర్మన్‌గానూ నియమించారు. కవి సమ్మేళనాల్లో ఆయన కవితలు బాగా ఆకర్షి స్తుంటాయట. ఇటీవల ఆయన జామ్‌నగర్‌లో సామూహిక వివాహాలకు హాజరైన సందర్భంలో చదివిన కవిత వీడియో పోస్ట్ చేశాడు. 'ఏ కూన్‌కే ప్యాసే బాత్ సునో..(రక్త పిపాసులారా ఈ మాట వినండి)' అంటూ.. పైన పూలు కురుస్తుండగా ప్రతాప్‌గర్హి నడుస్తునట్టు ఉన్న ఈ 46 సెకండ్ల పోస్టుకు బాగా స్పందన రావడమే గాక, కింద ఇది మత రాజకీయాలకు వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్య అన్నట్టు స్పందనలు కనిపించాయి. వెంటనే జామ్ నగర్ పోలీసులు ఇది భిన్నమతాల మధ్య విద్వేషాలు పెంచేవిధంగా ఉందంటూ కిషన్ నందా అనే వ్యక్తి నుంచి ఫిర్యాదు వచ్చిందని ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ప్రతాప్‌గర్హి ఇది నిజానికి ప్రేమను పెంచేందుకు ఉద్దేశించిందని వివరిస్తూ తనపై కేసు కొట్టేయాలని అహ్మదాబాద్ హైకోర్టును ఆశ్రయించినా ఫలితం లేకపోయింది. ఈ కవిత మీరే రాశారా లేక మరెవరిదైనా ఉటంకించా చెబుతూ అఫిడవిట్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. ఇది తాను రాయలేదనీ మూలమేమిటో కచ్చితంగా తెలియదు గాని అందుబాటులో ఉన్న సమాచారం మేరకు ప్రఖ్యాత కవి ఫైజ్ అహ్మద్ ఫైజ్‌దో లేక హమీబ్ జలీద్‌తో కావచ్చని చాట్ జిపిటితో సహా చెబుతున్నాయని సమా ధానంలో తెలియజేశారు.(వాస్తవానికి ఇది ఫైజ్ పాటగా సినిమాల్లో కూడా వాడారు) ఈపాట ద్వారా తాను ప్రేమ, అహింస సందేశం ఇవ్వడానికి ప్రయత్నించానని కూడా పేర్కొన్నారు.తాను ఏదో నేరం చేసినట్టు ఎఫ్ఐఆర్ కూడా చెప్పడం లేదని ఆయన వాదించారు. అయితే ఈపాటలో పదాలు వింటే రాజ్యాన్ని ఎదుర్కొమ్మని చెప్పడం స్పష్టంగా అర్థమవుతుందని ప్రాసిక్యూషన్ వాదించింది. విచారణకు నిందితుడు సహకరించడం లేదని రాష్ట్ర ప్రభుత్వం కూడా అందుకు వంతపలికింది. మొత్తానికి అహ్మదాబాద్ హైకోర్టు ఎఫ్ఐఆర్ కొట్టివేయడానికి తిరస్కరించింది. సోషల్‌మీడియా పోస్టుల ప్రభావం ఎంతటిదో తెలుసు గనక ఒక ఎంపీగా ప్రతాప్‌ఘర్హి బాధ్యతగా వ్యవహరిం చాలని ఆయనకే సలహాలిచ్చింది.

ఈ దశలో తనపై పోలీసులు చర్య తీసుకోకుండా ఆపాలంటూ ప్రతాప్‌గర్హి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కపిల్‌సిబాల్ ఆయన తరపున వాదించగా జస్టిస్ అభయ్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భయాన్ ధర్మాసనం ఆయనపై కేసులో ఎలాంటి చర్యలు తీసుకోవద్దని గుజరాత్ పోలీసులను ఆదేశించింది. అంతకంటే కీలకంగా జస్టిస్ ఓకా చేసిన పైవ్యాఖ్యలు సంచలనం కలిగించాయి. ఈ పాట మతానికి గానీ, జాతికి గానీ వ్యతిరేకం కాదని ఆయన స్పష్టం చేశారు. నిజానికి ఇది అహింసను బోధిస్తున్నది. మతంతో ఏ సంబంధం లేదు. ఏ విధంగానూ జాతి వ్యతిరేక చర్య కానేకాదని పేర్కొంది. జస్టిస్ ఓకా మరో అడుగు ముందుకేసి కవిత్వాన్ని అర్థం చేసుకోలేకపోవడం పట్ల ఆవేదన ఆగ్రహం వ్యక్తం చేశారు." ఇదే సమస్య. ఎవరికీ సృజనాత్మకత పట్ల గౌరవం లేదు.మీరు అన్యాయానికి గురైనా ప్రేమతో తట్టుకోండని ఆ పాట చెబుతుంది. రక్తదాహం తీరని వారు మా మాట వినాలని అంటున్నది. మేము న్యాయం కోసం చేసే పోరాటంపై మీరు అన్యాయంగా దాడి చేసినా మేము ప్రేమతోనే ఎదర్కొంటామని ప్రకటిస్తున్నది" అని ఆయన వివరించారు. హైకోర్టు ఈ అంశాలను గమనంలోకి తీసుకోకపోవడం బట్టి చూస్తే దేశం ఎటుపోతుందో తెలియడం లేదని కపిల్‌సిబాల్ వ్యాఖ్యానించారు. దీనిపై కోపగించుకున్న సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మనం హైకోర్టు మీద వ్యాఖ్యలు చేయొద్దని అడ్డుతగిలారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు హైకోర్టుపై స్పందించ కుండానే పోలీసులకు మాత్రం చురకలు వేశారు."పోలీసులు కూడా కొంతైనా సున్నితత్వం చూపించాలి, చదివి అర్థం చేసుకోవాలి.రాజ్యాంగం ఆమోదించిన 75 ఏళ్ల తర్వాత కూడా మీ పోలీసులకు భావప్రకటనా రీతులు, వ్యక్తీకరణలు తెలుసుకోవాలని" హితం చెప్పారు. ఇది కూడా తుషార్‌మెహతాకు నచ్చలేదు. పోలీసులు కవిత్వం ఆస్వాదించాలనడం మరీ అతిశయంగా ఉంటుందని వ్యాఖ్యానించారు. ఇది ఫైజ్‌ది కాదు రోడ్డు పక్క చెట్టుకింద కవితలాంటిదేనని దెప్పి పొడిచారు. అంతకుముందు న్యాయమూర్తి మాటల్లో మహాత్మాగాంధీ కూడా అన్యాయాన్ని ప్రేమతో ఎదుర్కొవాలన్నారని చెప్పినప్పుడు ఈ కవితను మరీ మహాత్ముడితో పోల్చవద్దని అభ్యంతరం చెప్పారు. ఈ మొత్తం వ్యవహారంపై సుప్రీంకోర్టు తీర్పు వాయిదా వేసింది గానీ పోలీసులు పెట్టిన కేసు, హైకోర్టు సమర్థన, తుషార్‌మెహతా అదే వాదించడం పరిస్థితికి అద్దం పడుతుంది.

## సెన్సార్ కాదు, క్రమబద్ధీకరణ

సరిగ్గా ఈ కేసు విచారణ రోజునే సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ సూర్యకాంత్ యే ట్యూబర్ రణవీర్ అల్లాబాదియా దాఖలు చేసిన పిటిషన్‌పై కీలక సూచనలు చేశారు. ఇవి నాణేనికి మరోవైపును కూడా చూపించాయి. అనేక సామాజిక అంశాలు చర్చకు పెట్టే అల్లాబాదియా ఇటీవల చేసిన కొన్ని వ్యాఖ్యలు దుమారం రేపాయి. మీ తల్లి దండ్రుల శృంగారం పిల్లలు చూడటం, దానిపై వారి భావనల గురించి రణవీర్ ఇటీవల ఒక షోలో అనుచిత వ్యాఖ్యలు చేశారు. దానిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమైన తర్వాత ఆయన కార్యక్రమాలను నిలిపేస్తూ ఫిబ్రవరి 18న




ఇమ్రాన్ ప్రతాప్‌గర్హి రాజ్యసభ సభ్యుడు. కాంగ్రెస్ తరపున ఎన్నికైన ఈయన ఉర్దూ భాషాకవి, అవార్డు గ్రహీత కూడా. కాంగ్రెస్‌లో చేరిన కొద్ది కాలంలోనే ఆయన్ను ప్రమోట్ చేసి ఎంపీగానూ, మైనార్టీ సెల్ చైర్మన్‌గానూ నియమించారు. కవి సమ్మేళనాల్లో ఆయన కవితలు బాగా ఆకర్షి స్తుంటాయట. ఇటీవల ఆయన జామ్‌నగర్‌లో సామూహిక వివాహాలకు హాజరైన సందర్భంలో చదివిన కవిత వీడియో పోస్ట్ చేశాడు. 'ఏ కూన్‌కే ప్యాసే బాత్ సునో..(రక్త పిపాసులారా ఈ మాట వినండి)' అంటూ.. పైన పూలు కురుస్తుండగా ప్రతాప్‌గర్హి నడుస్తునట్టు ఉన్న ఈ 46 సెకండ్ల పోస్టుకు బాగా స్పందన రావడమే గాక, కింద ఇది మత రాజకీయాలకు వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్య అన్నట్టు స్పందనలు కనిపించాయి. వెంటనే జామ్ నగర్ పోలీసులు ఇది భిన్నమతాల మధ్య విద్వేషాలు పెంచేవిధంగా ఉందంటూ కిషన్ నందా అనే వ్యక్తి నుంచి ఫిర్యాదు వచ్చిందని ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

సుప్రీంకోర్టు ఉత్తర్వులిచ్చింది. దానిపై రణవీర్ అరెస్టు చేయొద్దంటూనే ఆయన కార్యక్రమాలను నిలిపేసింది. ఈ నిలిపివేతను తొలగించాలంటూ ఆయన తరపున న్యాయవాది అభినవ్ చంద్రచూడ్ పిటిషన్ వేశారు. తన క్లయింట్ పైన 280 మంది ఆధారపడి ఉన్నారనీ, అతనేదో అపహాస్యం కోసం, కావాలని అలా మాట్లాడలేదని సంజాయిషీ ఇచ్చారు. దానిపై జస్టిస్ సూర్యకాంత్ నిలిపివేత ఉత్తర్వులను సవరిస్తూ రణవీర్ షో కొనసాగించడానికి అనుమతించారు. అదే సమయంలో నైతికత హుందాతనం పాటించాలనీ, భారతీయ సమాజంలో సువ్యవస్థితమైన నైతిక ప్రమాణాలకు అనుగుణంగా నడుచుకోవలని హితవు పలికారు. దారి తప్పి వ్యవహరించి ప్రాథమిక వాక్ స్వాతంత్య్రంపై సెన్సార్‌షిప్‌ను కొనితెచ్చుకోవద్దని హెచ్చరించారు. ఇంటిల్లిపాదినీ నవ్వించగలిగేదే మంచి హాస్యమని, దుర్భాషలతో ఎవరికీ ఎబ్బెట్టు అనిపించకూడదనీ ఆదేశించిన జస్టిస్ సూర్యకాంత్ బాలివుడ్‌లో మనకు గొప్ప హాస్యనటులున్నారని ప్రశంసించారు. హాస్యం,అసభ్యత,వికృతానందం వీటి మధ్య తేడా పాటిం చాలన్నారు. ఇలాంటివాటిని క్రమబద్ధం చేసేందుకు ఏదైనా యంత్రాంగాన్ని సూచించాలని తుషార్ మెహతాను కోరారు.

## ఆనంద వికటన్‌కూ అనుమతి

ఇక నూరేళ్లుగా నడుస్తున్న ప్రసిద్ధ తమిళ వార పత్రిక ఆనందవికటన్‌కూ ఈ ఆంక్షల సెగ తప్పలేదు. అది రాజకీయ కోణంతో కూడినది కావడం మరింత విశేషం. ఇటీవల డోనాల్డ్ ట్రంప్ మళ్లీ అధ్యక్షపదవి చేపట్టాక ప్రధానమంత్రి మోడీ ఆదరాబాదరాగా వెళ్లి కలసి రావడం అనేక వ్యాఖ్యలకు దారితీసిన సంగతి తెలిసిందే. ట్రంప్ విపరీత పోకడలనూ భారతీయ నిపుణుల, వ్యాపార వర్గాల ప్రయోజనాలపై వేటు వేసి తమ దేశానికి లాభం చేకూరేవిధంగా ఆయన అనేక హుకుందారీ చర్యలకు పాల్పడ్డారు. అయితే మోడీ వాటిలో దేన్నీ ప్రశ్నించలేకపోయారు. పైగా అవేవో మనకు మేలు చేసేవన్నట్టుగా విదేశాంగ మంత్రి జైశంకర్ సమర్థిస్తున్నారు. అదలా ఉంచితే ఆయన పర్యటన నేపథ్యంలో ఆనంద వికటన్ ఫిబ్రవరి 15న ఒక కేరికేచర్ ప్రచురించింది.ట్రంప్ ముందు మోడీ సంకెళ్లతో బందీగా ఉన్నట్టు అంటే స్వేచ్ఛ లేనట్టు అందులో చిత్రించింది. ఈ కార్టూన్ అమెరికాతో సంబంధాలకు హానికరమంటూ ఆనందవికటన్ వెబ్‌సైట్‌ను అమాంతం నిలిపేసింది కేంద్రం. ఎందుకంటే మెటా వంటి ప్లాట్‌ఫాంల నిర్వాహకులు కేంద్రం అదేశాలు చాలావరకూ అమలు చేస్తుంటారు. దీనిపై ఆ పత్రిక న్యాయపోరాటం చేసింది. ఆ కార్టూన్ తప్పనుకుంటే అది తొలగించమని ఆదేశాలివ్వాలి గానీ ఇంత చరిత్ర గల తమ సంస్థ సైట్‌నే మూసేయడం ఏంటని ప్రశ్నించింది.దానిపై చివరకు మద్రాసు హైకోర్టు మోడీ కేరికేచర్ లేకుండా దాన్ని పున: ప్రారంభించు కోవచ్చని అనుమతినిచ్చింది.

## ఆర్నాబ్ కేసే వేరు!

మొత్తంగా తమకు నచ్చని మీడియా సోషల్ మీడియాలపై కేంద్రం రాష్ట్రాల పాలకులు వివిధ రకాలుగా సాగించే వేధింపులూ, ఆంక్షలపై అనేక ఉదాహరణలున్నాయి. అసలు యూట్యూబ్ కంటెంటును మొత్తంగా తమ గుప్పిట్లో పెట్టుకోవడానికి కొన్ని చట్టాలు కూడా తీసుకొచ్చారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం 69ఎ ఇందుకు సాధనంగా వుంది. దానిపై అభ్యంతరాలొచ్చాయి కూడా. అదే సమయంలో తమకు నచ్చినవారి పట్ల మాత్రం కేంద్రం ద్వంద్వ నీతిని పాటించడం పరిపాటి. ఆ జాబితాలో అగ్రగణ్యుడు అర్నాబ్ గోస్వామి. ఇంతకూ కేసేమిటంటే 2022లో రాజస్థాన్‌లోని అల్వాల్‌లో ఒక దేవాలయ విధ్వంసం జరిగిందంటూ రిపబ్లిక్ టీవీ హిందీ ఛానల్ కథనం ప్రసారం చేసింది. అప్పుడు అక్కడ కాంగ్రెస్ సర్కారుంది.

ఈ కథనం ప్రసారం చేయడంతో ఆగక దానికి 'జహంగీర్‌పూర్‌కు ప్రతీకారమా?'అని ట్యాగ్ తగిలించింది రిపబ్లిక్ టీవీ. దానిపై కాంగ్రెస్ ప్రతినిధి పవన్ ఖేరా ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ దాఖలైంది. ఈలోగా అక్కడ బీజేపీ అధికారంలోకి వచ్చింది. ఢిల్లీలో జరిగిన ఘటనపై ఆరోపణల నేపథ్యంలో తాము ఈ ట్యాగ్ తగిలించామే గానీ వేరే దురుద్దేశం లేదనీ, తమ కథనం వల్ల ఎలాంటి గొడవలు జరగలేదని ఆర్నాబ్ సమర్థించుకున్నారు.రాజస్థాన్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఫర్జానంద్ అలీ ఈ వాదనలతో ఏకీభవిస్తూ పూర్తి కేసు తేలేవరకూ ఆర్నాబ్‌పై ఎలాంటి చర్య తీసుకోవద్దని తాజాగా ఆదేశించారు. ఇన్నిరోజుల్లో పోలీసులు ఏ సాక్ష్యాలు సేకరించారని ప్రశ్నించారు. కరోనా రోజుల్లోనే అనేక అవాస్తవాలు ప్రసారం చేసిన ఆయన్ను ఆదుకున్న తీరు చూశాం. హత్రాస్ ఘటన తర్వాత అక్కడకు వెళ్లిన కేరళ జర్నలిస్టు సిద్దిక్ కప్పన్‌ను మూడేళ్లపాటు జైలులో పెట్టిన కేంద్రం అప్పటి మహారాష్ట్ర ప్రభుత్వం అర్నాబ్‌ను అరెస్టుచేస్తే స్వయంగా హోంమంత్రిని రంగంలోకి దింపి విడుదలయ్యేందుకు కృషి చేసింది. ఈ కేసు మరోసారి ఆ సన్నివేశాన్ని కళ్లముందు నిలబెట్టడం లేదా? ఏమైనా మీడియా కథనాలు, స్వేచ్ఛ, సభ్యత, బూతులు, అసత్యాలు, విద్వేష ప్రచారాలు, పార్టీలను, వ్యక్తులను బట్టి, కుల మతాలను బట్టి గాక ప్రజాస్వామిక విలువలు, ప్రజాజీవిత ప్రమాణాలను బట్టి నడవాలని కోరుకోవాలి. ■

# ప్రజల గుండెనిండా..'కాసాని' ఎర్రజెండా...



లిక్కి బాలరాజు
9701406173

కామ్రేడ్ కాసాని ఐలయ్య. బహుశా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఈ పేరు తెలియని వ్యక్తి ఉండకపోవచ్చు. ప్రత్యేకించి కొత్తగూడెం ప్రాంతంలో మాస్ కమ్యూనిస్టు లీడర్ అంటే గుర్తొచ్చే పేరు కూడా కాసాని. ఉమ్మడి రాష్ట్రం నుండి సీపీఐ(ఎం)రాష్ట్ర కమిటీ సభ్యునిగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏర్పడ్డాక మొదటి కార్యదర్శిగా పనిచేశారు. యువకుడిగా ఎర్రజెండా చేతబట్టి తుదిశ్వాస విడిచే వరకు ప్రజలతో, ప్రజా పోరాటాలతో పెనవేసుకున్నది కాసాని జీవితం. తాను నమ్మిన శ్రామిక వర్గ సిద్ధాంతం కోసం ఎత్తిన ఎర్రజెండాను దించకుండా, నిబద్ధతగల కమ్యూనిస్టుగా పనిచేసిన కాసాని జనవరి 25న తుదిశ్వాస విడిచారు. అర్థ శతాబ్దానికి పైగా కమ్యూనిస్టు ఉద్యమంలో పనిచేసి ఎన్నో ఆట ంకాలు, నిర్బం ధాలు, శత్రువుల దాడులను ఎదుర్కొని తన జీవితాన్ని త్యాగం చేసిన నిబద్ధతగల కమ్యూనిస్టు యోధుడు.

కాసాని ఐలయ్య 1951 జులై 8న ఉమ్మడి వరంగల్ జిల్లా గంగదేవిపల్లికి గ్రామంలో జన్మించాడు. పదోతరగతి వరకు చదువుకున్న ఆయన 1968లో టెలిఫోన్ డిపార్ట్మెంట్‌లో లైన్‌మేన్‌గా చేరాడు. ఉద్యోగం పర్మినెంట్ అవు తుందని ఇంటర్వ్యూకి వెళ్లగా, మంచి మార్కులు వచ్చినప్పటికీ లంచం ఇవ్వలేదనే కారణంతో అతన్ని పర్మినెంట్ చేయలేదు. దీంతో అధికారులపై కాసానికి కోపమొచ్చి అక్కడే తన సర్టిఫికె ట్లు చించి, వారి ముఖాన కొట్టి చిన్న వయసులోనే అవినీతిపై ధిక్కారస్వరాన్ని వినిపించాడు. గంగదేవిపల్లిలో వందెకరాల ప్రభుత్వ పంచరాయి భూమిని పటేళ్లు, పట్వారీలు ఆక్రమించు కుని అమ్ముకుంటుండగా తన స్నేహితుడు రాజమౌళితో కలిసి కామ్రేడ్ నాగయ్య నేతృత్వంలో జరిగిన పోరాటంలో భాగ స్వామి అయ్యాడు. ఆ పోరాటం విజయవంత మయ్యాక కమ్యూనిస్టు ఉద్యమం పట్ల బలమైన నమ్మకంతో సీపీఐ(ఎం)లో చేరాడు.

'పేదలు ఒక్కటైతే సమస్యలు సాధించవచ్చు - గడ్డి పోచలను తాడుగా పేనితే ఏనుగునైన బంధించవచ్చు' అని కామ్రేడ్ నాగయ్య గారు చెప్పిన మాటలు మరింత ఉత్తేజాన్ని చ్చాయి. ఆయనిచ్చిన వియత్నాం పోరాటం, చైనాపై అరుణతార పుస్తకాలు కాసాని కమ్యూనిస్టు ఉద్యమంలోకి రావడానికి ప్రేరణ కలిగించాయి. ఆ చైతన్యంతోనే నూటయాభై కుటుంబాలున్న గ్రామంలో తొంభైఐదు శాతం సీపీఐ(ఎం)లో చేరే విధంగా కృషిచేశాడు. అలాగే చుట్టుపక్కల గ్రామాల్లోనూ పార్టీని నిర్మించాడు.

## ఒకరిలో ఒకర్రై, పోరాటాల్లో మమేకమై...

1974లో ప్రస్తుత సుజాతనగర్ మండలం సీతంపేట పంచాయతీ పరిధిలోని రెడ్డిపాలెం గ్రామానికి కుటుంబంతో సహా వల సొచ్చి వ్యవసాయం చేసుకుంటుండగా, పార్టీలో పనిచేస్తానని తన తండ్రితో చెప్పగా ఆయన ఒప్పుకోకపో వడంతో భార్య లక్ష్మిని తీసుకుని కట్టు బట్టలతో బయటకొచ్చాడు. గ్రామంలోనే పూటకొక ఇంట్లో అన్నం తినుకుంటూ పార్టీ నిర్మాణానికి అంకితమయ్యాడు. సీతంపేట, రాంజీతండా గ్రామాల్లో మలేరియా జ్వరాలు వచ్చి సరైన వైద్యమందక ప్రజల ప్రాణాలు కోల్పోతుంటే చలించిపోయాడు. సుందరయ్యగారి స్ఫూర్తితో ఇల్లందు వెళ్లి ఒక డాక్టర్ దగ్గర ఇంజక్షన్ వేయడం, టాబ్లెట్లు ఇవ్వడం నేర్చుకొని తానే స్వయంగా ప్రజలకు వైద్యసేవలందించాడు. కాసాని దంపతులిద్దరూ కూలీరేట్ల పోరాటం, సారా వ్యతిరేక ఉద్యమాలు నిర్వహించి సుజాతనగర్, జూలూరుపాడు, ఏన్కూరు, చంద్రుగొండ, కొత్తగూడెం, పాల్వంచ ప్రాంతాల్లో మార్క్సిస్టు పార్టీ విస్తరణకు, నిర్మాణానికి విశేషమైన కృషి చేశారు.

ప్రారంభంలో దంపతులిద్దరూ వారి కుమారుడు లెనిన్‌తో కలిసి సైకిల్ మీద గ్రామాలు తిరుగుతూ, పాటలు పాడుతూ, డప్పు కొడుతూ ప్రజలను చైతన్యం చేశారు. ప్రధానంగా వ్యవసాయ కూలీలను సంఘటితపరిచి కూలీ రేట్ల పోరాటంలో పాల్గొనేలా చేసి రేట్లు పెంచి విజయం సాధించారు. ఇది భూస్వాములకు కంటగింపుగా మారి సుజాతనగర్‌లో ఇల్లు కూడా కిరాయికి దొరక్కుండా, కిరాయికి వెళ్లిన ప్రతి ఇంటి నుండి బయటికి పంపించే విధంగా భూస్వాములు కుట్రలు చేశారు. అయినా మొక్కవోని ధైర్యంతో కూలీరెట్ల పెంపు కోసం, భూస్వాములు,పెత్తందారుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తూ బక్క జీవులకు వెన్నుగా నిలిచాడు. ఈ పోరాట క్రమంలోనే భూస్వాములు, పెత్తందారులు,సోదర కమ్యూనిస్టు పార్టీ నాయకులు ఏడు సార్లు కాసానిపై హత్యాయత్నం చేశారు. ఈ దాడుల నుండి ప్రజలే కామ్రేడ్ కాసానిని కంటికి రెప్పలా కాపాడుకున్నారు. రాత్రిపూట కాసాని ఇంటిమీద ఏ క్షణంలోనైనా



తాను చనిపోవడానికి వారం రోజుల ముందు సుజాతనగర్‌లోని ఏడు గ్రామ పంచాయ తీలను కొత్తగూడెం కార్పొరేషన్‌లో కలపొద్దని పెద్ద ఉద్యమానికి శ్రీకారం చుట్టాడు. కలెక్టరేట్ ధర్నాకి ప్రజల్ని కదిలించడానికి తానే స్వయంగా ఇరవై గ్రామాలు తిరిగి అర్బన్ స్వభావం రాని పల్లె ప్రాంతాలను కార్పొరేషన్ లో కలపడం వలన జరిగే నష్టమేమిటో వివరించి ప్రజల్ని చైతన్యం చేశాడు. డయాలసిస్ పేషెంట్ అయినప్పటికీ ఏమాత్రం ఆలోచించకుండా ఈ పోరాటంలో కీలక పాత్ర పోషించి ప్రజల్ని కదిలించాడు. అందుకే కాసానితో ప్రయాణం చేసిన ప్రతి ఒక్కరికి అనిపిస్తుంది, ఓపిక ఉన్నంతవరకు కాదు ఊపిరి ఉన్నంతవరకు ఎర్రజెండా మోయాలని.నడుస్తున్న కాలానికి ఉదయించే సూర్యునిలా చైతన్య జ్వాలలు రగిలించిన కామ్రేడ్ కాసానికి విప్లవ జోహార్లు.

దాడి జరుగుతుందని గ్రహించిన కార్యకర్తలు ప్రతిరోజు తన ఇంటి వద్ద రాత్రిపూట రక్షణగా నిలబడ్డారు. 1993 తిమ్మరావు పేటలో మీటింగ్ జరుగుతుండగా కాంగ్రెస్ గుండాలు కాసానిపై దాడి చేయడానికి ప్రయత్నించగా అతన్ని రక్షించబోయి ఎస్ఐ అహ్మద్ వారి చేతిలో హత్యకు గురయ్యాడు.

## ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్న నాయకుడు

కూలిరేట్ల పోరాటం, సారా వ్యతిరేక ఉద్యమం, ఇండ్ల స్థలాల పోరాటం, సింగరేణి సిడిఎస్ సమ్మె ఆర్టీసీ సమ్మె భూస్వాములు, పెత్తం దారులకు వ్యతిరేకంగా జరిపిన పోరాటాలు కాసానిని ప్రజానాయకుడిగా ముద్రవేశాయి. 1997 నుండి 2014 వరకు సాగిన ఇళ్ల స్థలాల పోరాటంలో పాత కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలో సుమారు పదిహేను వేల మందికి ఇళ్ల స్థలాలు ఇప్పించడంలో కామ్రేడ్ కాసాని పోరాటం స్ఫూర్తిదాయకమైనది.ఈ పోరాటంలో భాగంగా ఆమరణ నిరాహార దీక్ష చేసి చావు నోట్లో తలపెట్టి పేదలకు ఇళ్ల స్థలాలు దక్కేలా కృషి చేశాడు. జైలుకు సైతం వెళ్లాడు. జైలు నుంచి విడుదలయ్యాక ప్రజలు పెద్ద ఎత్తున బ్రహ్మరథం పట్టారు. పేదల కోసం సాగించిన గుడిసెలు పోరాటం గుడిసెల ఐలయ్యగా పేరు తెచ్చింది. 2007లో చేసిన ఆమరణ నిరాహార దీక్ష ప్రభుత్వ మెడలు వంచి నేరుగా రైతులు వద్ద నలభై ఎకరాల భూమి కొనుగోలు చేసి పేదలకు పంపిణీ చేసే విధంగా కాసాని నేతృత్వంలో పోరాటం కొనసాగింది. ఆనాడు సీపీఐ(ఎం)కు ఉమ్మడి రాష్ట్రంలోనే ఇది గొప్ప విజయం.

## సర్పంచ్‌గా తనదైనశైలిలో...

సుజాతనగర్ సర్పంచిగా ఇరవై ఏళ్ల పాటు తను పనిచేయడంతో పాటు మరో పదిహేనేళ్లు కున్సోత్ ధర్మ, గండమాల భాస్కర్,కాసాని లక్ష్మీ పనిచేయడానికి ఆయన కృషి విశేషమైనది. మొత్తమ్మీద ముప్పైఐదు సంవత్సరాల పాటు సుజాతనగర్ మేజర్ గ్రామపంచాయతీకి సీపీఐ(ఎం) నాయకత్వాన సుపరిపాలన, నీతివంతమైన ప్రజాపాలన అందించి ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దిన నాయకుడిగా ఆయన సేవలందించాడు.రూపాయికే ఇరవై లీటర్ల మినరల్ వాటర్ అందించి పంచాయతీ నిధులను ప్రజల కోసం ఎలా ఖర్చు చేయాలో చూపించిన పరిపాలనదక్షుడు కాసాని.ప్రస్తుతం నడుస్తున్న ఎన్నికల ప్రక్రియను మనం గమనిస్తూనే ఉన్నాము. ఎన్నికల్లో రాజకీయ నాయకులు ప్రజలకు డబ్బులిచ్చి ఓట్లు అభ్యర్థిస్తారు, కానీ కాసాని దీనికి భిన్నంగా తన ఎన్నికల ఖర్చుకు ప్రజలే డబ్బులు ఇవ్వాలని నోటివ్వండి - ఓటేయ్యండి నినాదంతో సుజాతనగర్ పంచాయతీ ఎన్నికల్లో ప్రచారం నిర్వహించగా, ప్రజలు రెండు లక్షల రూపాయలు ఆర్థిక సాయం చేయడంతో పాటు నాలుగు వందల ఓట్ల మెజారిటీతో సర్పంచ్‌గా గెలిపించారు. వామపక్ష ఐక్యత కోసం మాటలతోనే సరిపెట్టకుండా ఆచరణలో విశేషమైన కృషి చేశాడు. సోదర సీపీఐ నుండి ఎవరైనా పార్టీని వీడుతుంటే వ్యక్తిగతంగా వారి వద్దకు వెళ్లి 'మీరు పార్టీ మారొద్దని కమ్యూనిస్టు పార్టీలోనే ఉండాలని 'వారికి విజ్ఞప్తి చేసి నిలబెట్టేవారు.2023 అసెంబ్లీ ఎన్నికల్లో కొత్తగూడెం సీపీఐ అభ్యర్థిగా కామ్రేడ్ కూనంనేని సాంబశివరావు పోటీ చేసినప్పుడు పార్టీ పిలుపు మేరకు తనకు తీవ్రమైన జ్వరం వచ్చినప్పటికీ చేతికి క్యాన్‌లా తన కారుకి గ్లూకోస్ బాటిల్ పెట్టుకుని మరీ ప్రచారం నిర్వహించి సాంబశివరావు గెలుపునకు కృషి చేశాడు.

## చివరిశ్వాస వరకు ప్రజల కోసమే...

మార్క్సిస్టు పార్టీ నాయకుడిగా ప్రజలతో మమేకమవుతూ అతి సాధారణమైన జీవితాన్ని గడిపాడు. రాజకీయంగా భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, ఇతర రాజకీయ పార్టీల నాయకులు సైతం వ్యక్తిగతంగా అభిమానించేవారు, ఇష్టపడేవారు, గౌరవించేవారు. కామ్రేడ్ కాసాని మర ణించిన రోజు పార్టీ శ్రేణులతో పాటు ఇతర రాజకీయ పార్టీల నాయకత్వం కొత్తగూడెం నుండి సుజాతనగర్ వరకు పది కిలోమీటర్లు కాసాని అంతిమయాత్రలో కాలినడకన పాల్గొని తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు.నైతిక విలువలు పాటిస్తూ, ఆదర్శంగా, నిరాడంబరంగా జీవించడం కార్యకర్తలు అలవర్చుకోవాలని, ప్రజల చేత ప్రేమించబడాలని నిత్యం కార్యకర్తలకు కాసాని బోధించేవాడు. ఏదో ఒక ప్రజా సమస్యను తీసుకుని నిరంతరం ప్రజల్ని కదిలించి పోరాటాలతో ఉద్రూతలూగిస్తూ, మాస్ పోరాటాలు నిర్మించాలని పరితపించేవాడు. అందుకే తనకు ఎన్ని అనారోగ్య సమస్యలు వచ్చినా లెక్కచేయకుండా పట్టుదలతో గుండె ధైర్యంతో కడవరకు పోరాటాల్లో ఉన్నారు. తాను చనిపోవడానికి వారం రోజుల ముందు సుజాతనగర్‌లోని ఏడు గ్రామ పంచాయతీలను కొత్తగూడెం కార్పొరేషన్‌లో కలపొద్దని పెద్ద ఉద్యమానికి శ్రీకారం చుట్టాడు.కలెక్టరేట్ ధర్నాకి ప్రజల్ని కదిలించడానికి తానే స్వయంగా ఇరవై గ్రామాలు తిరిగి అర్బన్ స్వభావం రాని పల్లె ప్రాంతాలను కార్పొరేషన్ లో కలపడం వలన జరిగే నష్టమేమిటో వివరించి ప్రజల్ని చైతన్యం చేశాడు. డయాలసిస్ పేషెంట్ అయినప్పటికీ ఏమాత్రం ఆలోచించ కుండా ఈ పోరాటంలో కీలక పాత్ర పోషించి ప్రజల్ని కదిలించాడు. అందుకే కాసానితో ప్రయాణం చేసిన ప్రతి ఒక్కరికి అనిపిస్తుంది, ఓపిక ఉన్నంతవరకు కాదు ఊపిరి ఉన్నంతవరకు ఎర్రజెండా మోయాలని.నడుస్తున్న కాలానికి ఉదయించే సూర్యునిలా చైతన్య జ్వాలలు రగిలించిన కామ్రేడ్ కాసానికి విప్లవ జోహార్లు.

(నేడు సుజాతనగర్‌లో కామ్రేడ్ కాసాని సంస్మరణసభ) ■

# 'ఆమె'కు మద్దతుగా ఉందాం



**నారీశక్తికి వందనం** | **స్త్రీలు సమాజానికి వెన్నెముక**

## భారత రాష్ట్రపతి, ప్రధాని, ప్రతిపక్ష నేతల నుంచి శుభాకాంక్షల వెల్లువ

**అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రముఖుల అభినందనలు**

**న్యూఢిల్లీ :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రధాని మోడీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సహా పలువురు కేంద్ర మంత్రులు, ప్రముఖులు దేశంలోని మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు సాధించిన విజయాలు, ఘనతలు, సమాజంలో వారి భాగస్వామ్యాన్ని వివరించారు.

**లింగ సమానత్వ ప్రపంచాన్ని తయారు చేద్దాం : ద్రౌపది ముర్ము**

లింగ సమానత్వం, సాధికారత కోసం సమిష్టి ప్రయత్నాలకు రాష్ట్రపతి పిలుపునిచ్చారు. "అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు. మహిళలు సాధించిన విజయాలను మనం సెలబ్రేట్ చేసుకుంటాం. మహిళా హక్కులు, సమానత్వం, సాధికారత లక్ష్యాన్ని బలోపేతం చేయటానికి సమిష్టి ప్రయత్నాలు చేయాలని కూడా మనం నిర్ణయించుకుందాం. మన సోదరీమణులు, కుమార్తెలు సరిహద్దులను చెరిపేసి సవాళ్లను ఎదుర్కొంటూ ముందుకెళ్తు ఉన్నత స్థానాలను అధిగమిస్తున్నారు. ఈ ప్రయాణంలో వారికి మద్దతిద్దామని మనం ప్రమాణం చేద్దాం. మహిళలు, బాలికలు భయం లేకుండా తమ కళలను కొనసాగించే లింగ-సమానత్వ ప్రపంచాన్ని మనం తయారు చేద్దాం" అని ఎక్స్‌లో ద్రౌపది ముర్ము రాసుకొచ్చారు.

**మహిళా సాధికారత కోసమే మా ప్రభుత్వం : మోడీ**

ప్రధాని మోడీ నారీశక్తికి వందనం అంటూ మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. వారి శక్తిని, తోడ్పాటును గుర్తిస్తూ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాలకు చెందిన మహిళలు తన సోషల్ మీడియా ఖాతాలను నిర్వహిస్తారని వివరించారు. "మహిళా దినోత్సవం సందర్భంగా నారీ శక్తికి వందనం. మహిళల సాధికారత కోసమే మా ప్రభుత్వం ఎల్లప్పుడూ పని చేస్తోంది. ఇది మా పథకాలు, కార్యక్రమాల్లో ప్రతిబింబిస్తుంది" అని వివరించారు. అలాగే, గుజరాత్‌లోని నవసారిలో లఖ్‌పతి దీదీలతో ఆయన సంభాషించారు. భారత అభివృద్ధిలో మహిళల చారిత్రక పాత్రను కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా గుర్తు చేశారు. మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రగతి, విజయం కోసం శతాబ్దాలుగా నారీశక్తి నాగరికతకు సాధికారతను కల్పించిందని వివరించారు.

**మీతో.. మీ తరఫున నిలబడతా : రాహుల్**

మహిళలు సమాజానికి వెన్నెముక అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తన సందేశంలో తెలిపారు. వారి అభివృద్ధికి అడ్డంకులు తొలగించే విషయంలో తన నిబద్ధతను రాహుల్ పునరుద్ఘాటించారు. "మహిళలు మన సమాజానికి బ్యాక్‌బోన్. వారి బలం, గొంతు మన దేశ భవిష్యత్తును రూపొందిస్తాయి. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నేను మీతో, మీ తరఫున నిలబడతాను" అని రాహుల్ ఎక్స్‌లో రాసుకొచ్చారు.



## స్త్రీ సమానత్వం కోసం పోరాటం చేద్దాం

**గౌరవంగా జీవించటం మా హక్కు అని నినదిద్దాం : అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో మల్లు లక్ష్మి**

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

స్త్రీ సమానత్వం కోసం పోరాటం చేద్దామని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. ఆ సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో ఐద్వా అధ్యక్షురాలు ఆర్ అరుణజ్యోతి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 'గౌరవంగా జీవించటం మా హక్కు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు.కార్యక్రమంలో హైదరాబాద్‌సిటీ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్ పల్లె పద్మ, ఐద్వా ఉపాధ్యక్షులు టి జ్యోతి, హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి శశికళ, మేడ్చెల్ జిల్లా కార్యదర్శి వినోద, సెంట్రల్ సిటీ నాయకురాలు పద్మ మాట్లాడారు. మల్లు లక్ష్మి ప్రసంగిస్తూ పాలకుల విధానాల ఫలితంగా దేశవ్యాప్తంగా మహిళలపట్ల తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. హక్కుల కోసం జరిగే పోరాటాలను అణిచివేస్తున్నారని చెప్పారు. సమాజంలో మహిళలు, బాలికలపై అనేక రకాల దౌర్జన్యాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు మహిళలను ఓట్లు వేసే యంత్రాలుగా ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. మహిళలకు అనుకూలంగా మాట్లాడి, చేతల్లో మొండి చేయి చూపటమేంటని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఇందుకు ఉదాహరణ అని గుర్తు చేశారు. విద్య, వైద్యం అందని ద్రాక్షగా మారిందన్నారు. సరైన పౌష్టికాహారం లేక లక్షలాది మంది మహిళలు రక్త హీనతతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్‌స్పెక్టర్ పద్మ మాట్లాడుతూ మహిళా సమస్యలను పరిష్కరించేందుకు పోలీసు శాఖ నిరంతర కృషి చేస్తోందని చెప్పారు. అయితే.. మహిళలు కొన్ని విషయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. ఇంటి నుంచే పిల్లలకు సమాజం, విలువలు, ఒకరినొకరు గౌరవించుకునే లక్షణాన్ని పెంపొందించాలని చెప్పారు. టి జ్యోతి మాట్లాడుతూ మహిళల సాధికారత సాధనలో సమానత్వం పునాది అనే విషయాన్ని ఈ దినోత్సవం మరోసారి గుర్తుచేస్తోందన్నారు. అయితే ఇప్పటికీ స్త్రీ సమాజంలో రెండో తరగతి పౌరురాలుగానే పరిగణించబడుతోందని చెప్పారు. పనిలోనూ, వేతనాల్లోనూ వివక్ష కొనసాగుతోందని వాపోయారు. పనికి తగ్గ గౌరవం, కూలి దొరకటం లేదన్నారు.మరో పక్క పని ప్రదేశాల్లో దాడులు, దౌర్జన్యాలు జరిగినా వ్యవస్థలు బాధితుల పక్షాన ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకుల విధానాల ఫలితంగా సమాజంలో అవిద్య నిరుద్యోగం, దరిద్రం పెరిగిందనీ, దీంతో హింస రేటు పెరుగుతోందని చెప్పారు.

## మౌలిక వసతులు కల్పించాల్సింది ప్రభుత్వమే

**ప్రజా సమస్యలపై సర్వే : వనపర్తి పర్యటనలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ**




**నవతెలంగాణ -వనపర్తి రూరల్**

ప్రజలకు మౌలిక వసతులను కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది, అధికారులదేనని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని హరిజనవాడ, గాంధీనగర్‌లో శనివారం ప్రజాసమస్యలపై సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీఐటీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో జాన్‌వెస్లీ మాట్లా డుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ప్రజా సమస్యలపై ఆందోళనలు, సర్వే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రజల సమస్యలను గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తా మన్నారు. అందరికీ గ్యాస్ సబ్సిడీ రావడం లేదని, వెంటనే చర్యలు తీసుకోవాలని, మహిళలకు నెలకు రూ.2500 ఇవ్వాలని, వృద్ధులకు రూ.4000 పింఛన్ ఇవ్వాలని అన్నారు.

రేషన్ కార్డులు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పర్యటనలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎండి జబ్బర్, ఏ.లక్ష్మి, మండ్ల రాజు, పట్టణ కార్యదర్శి పరమేశ్వర చారి, నాయకులు గంధం మదన్, జి.బాలస్వామి, గంధం గట్టయ్య, నందిమల్ల రాములు, శ్రీను, జి.బాలరాజు, రాబర్ట్, మన్యం, సాయి లీల, కవిత, రేణుక, ఉమా, మద్దిలేటి పాల్గొన్నారు.

## భావజాలరంగంలో వాస్తవాలను ప్రజలకు వివరించాలి

**- కార్పొరేట్ దోపిడీ అర్థం కాకుండా భావోద్వేగాలను రెచ్చగొడుతున్న బీజేపీ : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ**

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

భావజాల రంగంలో వాస్తవాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. భావజాల రంగంలో ముంచుకొస్తున్న ప్రమాదాన్ని ప్రజలకు వివరించేందుకు పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆ పార్టీ సీనియర్ నాయకులు జి రాములు అధ్యక్షతన హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ కట్టబెట్టేందుకు పూనుకుంటున్నదని విమర్శించారు. కార్పొరేట్ దోపిడీ ప్రజలకు అర్థం కాకుండా ఉండేందుకు భావోద్వేగాలను రెచ్చగొట్టి ప్రజల మధ్య చీలికలు తీసుకొచ్చేందుకు బీజేపీ పూనుకుంటున్నదని అన్నారు. ఈ వాస్తవాలతోపాటు కార్పొరేట్ దోపిడీ ప్రజలకర్థమయ్యే విధంగా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. మైనార్టీలకు వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొట్టి వారు పబ్బం గడుపుకుంటున్నారని అన్నారు.

సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు ఎంవీఎస్ శర్మ మాట్లాడుతూ మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా ప్రజానీకంలో పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టి లౌకిక శక్తులను విశాల ప్రాతిపదికన సమీకరించాలని చెప్పారు. రాష్ట్ర స్థాయిలోనే కాకుండా జిల్లా, మండల స్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. రాజ్యాంగ హక్కులను పరిరక్షించుకునేందుకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజల జీవనోపాధిని కుంగదీస్తున్న ఆర్థిక సమస్యల మీద పోరాటం చేస్తూనే ప్రజల్లో చీలికలు తీసుకొచ్చే విభజన, విద్వేష విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని కోరారు. దళితులు, మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ఉద్యమించాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. లౌకిక, అభ్యుదయ తాత్విక భావాలను సంస్కరణ ఉద్యమ నేతల జీవితాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి సాగర్, ఎండి అబ్బాస్, ఎండి జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలపై హింసను అరికట్టాలి

- అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పోరాట స్ఫూర్తి దినంగా నిర్వహించాలి
- శ్రామిక మహిళలకు భద్రత కల్పించాలి : సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్



**నవతెలంగాణ-చంపాపేట్**

మహిళలు, చిన్నారులపై జరుగుతున్న హింసను అరికట్టాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పోరాటానికి స్ఫూర్తిగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. మహిళా దినోత్సవం సందర్భంగా సీఐటీయూ హైదరాబాద్ సౌత్ జిల్లా ఆధ్వర్యంలో సైదాబాద్ మండలం ఐఎస్ సదన్ డివిజన్ సంతోష్ నగర్ చౌరస్తా వద్ద భారీ ప్రదర్శన, సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా కార్మికుల పోరాటాల ఫలితంగానే అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం వచ్చిందన్నారు. ఆనాడు శ్రమ దోపిడీకి, సామ్రాజ్యవాద యుద్ధాలకు వ్యతిరేకంగా, ఓటు హక్కు, 8గంటల పని, శ్రమకు తగ్గ వేతనం వంటి డిమాండ్లతో పెద్దఎత్తున పోరాటం చేసి సాధించుకున్నారన్నారు. తిరిగి నేడు అలాంటి పోరాటాలు చేసే పరిస్థితులు రావడానికి పాలకవర్గాల నిర్లక్ష్యమే కారణమన్నారు. ఇప్పటికైనా చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో మహిళలకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.

సీఐటీయూ శ్రామిక మహిళా రాష్ట్ర కన్వీనర్ ఎస్వీ రమ మాట్లాడుతూ.. మహిళలం దరికీ సామాజిక భద్రత కల్పించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అందరికీ గ్రాట్యుటీ అమలు చేయాలని అన్నారు. ప్రసూతి, నెలసరి సెలవులు అమలు చేయాలని కోరారు. స్కీం వర్కర్లను కార్మికులుగా, ఉద్యోగులుగా గుర్తించా లని, కార్మిక చట్టాలను వర్తింపజేసి రెగ్యులర్ చేయాలన్నారు. సీఐటీయూ రాష్ట్ర మాజీ కోశాధికారి ఎండి.అబ్బాస్ మాట్లాడుతూ.. రాత్రి వేళల్లో పనిచేస్తున్న శ్రామిక మహిళలకు భద్రత కల్పించాలని, మహిళలపై దాడులకు పాల్పడు తున్న వారిపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టి ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. జస్టిస్ వర్మ కమిటీ సిఫారసు లను అమలు చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రావణ్ కుమార్, జిల్లా అధ్యక్షులు మీనా, కిషన్, కోటయ్య, జంగయ్య, ఐద్వా జిల్లా కార్యదర్శి శశికళ, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి బాలు నాయక్, అవాజ్ జిల్లా కార్యదర్శి అబ్దుల్ సత్తార్, రాజ్ కుమార్, ప్రసాద్, రామ్‌కుమార్ ప్రమీల, కవిత తదితరులు పాల్గొన్నారు.

## పోరాడుతాం...గెలుస్తాం

(మొదటిపేజీ తరువాయి)

బీజేపీ ప్రభుత్వం మహిళా సాధికారత పునాదులను దెబ్బతీసే కార్పొరేట్ అనుకూల, మతపరమైన ఎజెండాను ముందుకు తీసుకెళ్లడానికి ప్రాధాన్యతనిచ్చిందని విమర్శించారు. ఈ ఎజెండా ప్రధానంగా ఉన్నత వర్గాలకు, కార్పొరేట్ ప్రయోజనాలకు ప్రయోజనం చేకూరుస్తుందని సీపీఐ(ఎం) నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. అణగారినవర్గాల మహిళలు, ముఖ్యంగా పేదలు, గ్రామీణ, మైనారిటీ మహిళలు ప్రభుత్వ నిర్లక్ష్యంతో బాధపడుతున్నారని అన్నారు. హింస, అసమానతను శాశ్వతం చేసే పితృస్వామ్య, పెట్టుబడిదారీ నిర్మాణాలను కూల్చివేసేందుకు న్యాయం, సమానత్వం కోసం పోరాటానికి, మహిళలకు విముక్తి కేంద్రంగా ఉన్న సమాజం కోసం పోరాడటానికి తమ నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలో తీర్మానం ప్రవేశపెట్టారు. దీనిని మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. బీజేపీ ప్రభుత్వం మహిళా సాధికారత పునాదులను దెబ్బతీసే కార్పొరేట్ అనుకూల, మతపరమైన ఎజెండాను ముందుకు తీసుకెళ్లడానికి ప్రాధాన్యతనిచ్చిందని విమర్శించారు. ఈ ఎజెండా ప్రధానంగా ఉన్నత వర్గాలకు, కార్పొరేట్ ప్రయోజనాలకు ప్రయోజనం చేకూరుస్తుందని సీపీఐ(ఎం) నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. అణగారినవర్గాల మహిళలు, ముఖ్యంగా పేదలు, గ్రామీణ, మైనారిటీ మహిళలు ప్రభుత్వ నిర్లక్ష్యంతో బాధపడుతున్నారని అన్నారు. హింస, అసమానతను శాశ్వతం చేసే పితృస్వామ్య, పెట్టుబడిదారీ నిర్మాణాలను కూల్చివేసేందుకు న్యాయం, సమానత్వం కోసం పోరాటానికి, మహిళలకు విముక్తి కేంద్రంగా ఉన్న సమాజం కోసం పోరాడటానికి తమ నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలో తీర్మానం ప్రవేశపెట్టారు. దీనిని మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

## మహిళా దినోత్సవ ఉద్దేశం సమానత్వమే

(మొదటిపేజీ తరువాయి)

ఆచరించాలని విజ్ఞప్తి చేశారు. మహిళల భద్రతలో తెలంగాణ పోలీసుల పాత్ర కీలకమని కొనియాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పీపుల్స్ ప్లాజా వద్ద రన్ ఫర్ యాక్షన్-2025ను జెండా ఊపి ప్రారంభించారు. 5కే, 2కే రన్నింగ్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు మంత్రి సీతక్క బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..సమాన పనికి సమాన వేతనం కోసమే మహిళల సమీకరణ జరిగిందనీ, అందులో నుంచే మహిళా దినోత్సవం పుట్టుకొచ్చిందని చెప్పారు. ఉపాధి, చదువు, వైద్యం, ఇతర అవసరాల రీత్యా దేశవిదేశాల నుంచి తెలంగాణకు పెద్ద ఎత్తున వస్తున్నారనీ, వారికి రక్షణ కల్పించడంలో పోలీసుల పాత్ర కీలకమని చెప్పారు. మాదక ద్రవ్యాల నుంచి ఈ సమాజాన్ని చైతన్యపర్చాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ..సీతక్క ఉమెన్ ఆఫ్ స్ట్రగుల్ అని చెప్పారు. లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసు స్టేషన్లలో మహిళా ఎస్‌హెచ్‌ఓలను నియమించామన్నారు. కమిషనరేట్ పరిధిలో 30 శాతం సిబ్బంది మహిళలే ఉన్నారని తెలిపారు. తమ కమిషనరేట్ పరిధిలో 20 మంది డీసీపీల్లో 8 మంది మహిళా డీసీపీలు ఉన్నారన్నారు. ఇవన్నీ మహిళా ప్రోగ్రెస్‌కు నిదర్శనమని తెలిపారు.



## జీవన పరిస్థితులపై ప్రతికూల ప్రభావం

**కనీస వేతనం రూ.26 వేలివ్వాలి**

- స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలి
- అధికారుల వేధింపులు అరికట్టాలి : శ్రామిక మహిళా రాష్ట్ర కన్వీనర్ ఎస్వీ రమ

**నవతెలంగాణ-సిటీబ్యూరో**

ప్రభుత్వాలు ఆహారం, ఆరోగ్యం, విద్య మొదలైన ముఖ్యమైన బాధ్యతల నుంచి తప్పుకోవడం వల్ల జీవన పరిస్థితులపై ప్రతికూల ప్రభావం పడుతోందని శ్రామిక మహిళా రాష్ట్ర కన్వీనర్ ఎస్వీ రమ అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమలానగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో 'కేంద్ర ప్రభుత్వ విధానం-మహిళలపై ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆమె మాట్లాడారు. దేశంలో మహిళలు చాలా దారుణమైన పరిస్థితుల మధ్య మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నారని తెలిపారు. ముఖ్యంగా శ్రామిక మహిళ హక్కులపై వివక్ష, దాడులు విపరీతంగా పెరిగాయని చెప్పారు. నిత్యావసర వస్తువుల ధరల భారంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆహార పదార్థాలపైనా జీఎస్టీ విధించడం, అవసరమైన మందులపై, పెట్రోలియం ఉత్పత్తుల ధరలపై నియంత్రణ ఎత్తివేయడం వల్ల సామాన్యుల రోజువారీ ఖర్చులు భారీగా పెరిగాయని వివరించారు.

పురుషులతో సమానంగా పని చేస్తున్న మహిళలు వేతనంలో మాత్రం 40 శాతమే పొందుతు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని రంగాల్లో మహిళలకు సమాన మైన పనికి సమాన వేతనం అమలు చేయాలని, స్కీం వర్కర్లని కార్మికులుగా, ఉద్యోగులుగా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో రోజుకు రూ.600 చొప్పున వేతనంతో 200 రోజులు పని దినాలు కల్పించాలని కోరారు. మహిళల ఉపాధికి గ్యారెంటీ ఇవ్వాలని, హింసను నివారించడానికి కఠినమైన చర్యలు తీసుకోవాలని, జస్టిస్ వర్మ కమిటీ సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమాజంలో సగ భాగంగా ఉన్న మహిళలకు పార్లమెంట్, అసెంబ్లీలో వెంటనే 33శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి జె.చంద్రశేఖర్ మాట్లా డుతూ.. అంగన్‌వాడీ భవనాల కిరాయిలు, ఆరు నెలల కూరగా యల బిల్లు ఏడాదికి ఇస్తున్నారని చెప్పారు. మధ్యాహ్న భోజన కార్మికులకు వారు ఖర్చుపెట్టాక బిల్లు ఇవ్వడానికి ఆరు నెలలు పడుతోందని, ఇచ్చే రూ.వెయ్యి వేతనం ఎప్పుడు వస్తుందోనని ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఈ సెమినార్‌లో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.సునీత, బి.శోభారాణి, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎం.వినోద, ధరణి న్యూస్ ఎడిటర్ రోజారాణి, సీఐటీయూ నాయకులు ఎస్.శ్రీనివాస్, కె.ఉన్నికృష్ణన్, మధ్యాహ్న భోజనం యూనియన్ నాయకులు ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌జీఎంకు నిధుల కొరత

(మొదటి పేజీ తరువాయి)

నిధులూ కేటాయించకపోవటం గమనార్హం. గతేదాదిలో, బడ్జెట్ కేటాయింపు రూ.268 కోట్లుగా ఉన్నదని సవరించిన అంచనాలు చెప్తున్నాయి. ఈ పథకానికి కేటాయించిన రూ.2400 కోట్లు మూడేండ్లలోనే ఖర్చుకాగా.. 80 శాతం టార్గెట్ మాత్రమే పూర్తయ్యింది. ఈ కార్యక్రమం కింద కృత్రిమ గర్భధారణ మొత్తం టార్గెట్ 10 కోట్ల పశువులు. ఇప్పటి వరకు, 8.52 కోట్ల కృత్రిమ గర్భధారణలు విజయవంతంగా పూర్తయ్యాయి.

**ఇతర రాష్ట్రాల కంటే యూపీకే ఎక్కువ ప్రయోజనం**

నిర్దేశిత గడువు ప్రకారం ఈ పథకం 2026 మార్చి నాటికి ముగియనున్నది. ఈ పథకం ఐదు కోట్ల మందికి పైగా చిన్న, సన్నకారు రైతులకు వారి పాల ఉత్పత్తి, ఆదాయాన్ని పెంచటం ద్వారా ప్రయోజనాన్ని చేకూర్చింది. ముఖ్యంగా, ఇతర రాష్ట్రాల్లోని పాడి రైతుల కంటే.. యూపీలోని అన్నదాతలే ఎక్కువ ప్రయోజనాన్ని పొందారు. కృత్రిమ గర్భధారణ అనేది సన్న, చిన్నకారు రైతులకు పాల ఉత్పత్తి పెరగటంలో దోహదం చేసిందని పథకం అంతర్గత అంచనా తెలియజేస్తున్నది.

**25 శాతం భారత్ నుంచే**

భారత జీడీపీలో పాల ఉత్పత్తి వాటా దాదాపు ఐదు శాతం. ఇది 8 కోట్ల మందికి పైగా రైతులకు ఉపాధిని కల్పిస్తుంది. ప్రత్యేకించి, చిన్న, సన్నకారు, మహిళా రైతులు ఇందులో ఉన్నారు. ప్రస్తుతం, భారత్.. ప్రపంచంలోనే పాల ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉన్నది. 25 శాతం వాటాను కలిగి ఉన్నది. అయితే, దీనిని మూడోవంతుకు పెంచుకోవాలనే యోచనతో భారత్ ఉన్నది. 2030 నాటికి మూడోవంతు ప్రపంచ పాల ఉత్పత్తిని సాధించాలన్న భారత లక్ష్యాన్ని నిధుల కొరత దెబ్బతీసే ప్రమాదమున్నదని పశుసంవర్థక, పాడి పరిశ్రమ శాఖ అధికారి ఒకరు అన్నారు.

## కార్పొరేట్ సేవకుడు మోడీ

(మొదటి పేజీ తరువాయి)

గుర్తు చేశారు. ప్రజల ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధి అవకాశాలు పెంచాలనీ, కొనుగోలు శక్తి పెరగాలనీ, తద్వారా సరుకులు అమ్ముడయ్యేలా చూడాలని కోరారు. దాంతో ప్రభుత్వానికి పన్ను రూపంలో ఆదాయం వస్తుందన్నారు. పరిశ్రమలు విస్తరిస్తాయని చెప్పారు. అప్పుడు ఆర్థిక వ్యవస్థ బాగుపడుతుందని అన్నారు. కానీ మోడీ పాలనలో ఆర్థిక అసమానతలు పెరిగిపోయాయని విమర్శించారు. కార్పొరేట్ల ఆస్తులు విపరీతంగా పెరిగిపోతున్నాయనీ, కార్మికుల వేతనాలు పెరగడం లేదని చెప్పారు. శ్రమ దోపిడీ పెరిగిందనీ, సంపద పోగవుతున్నదని వివరించారు. శత కోటీశ్వరుల సంఖ్య 109 మంది నుంచి 200కు పెరిగిందని అన్నారు. ఇంకోవైపు కనీస వేతనం రోజుకు రూ.178 ఉంటే సరిపోతుందంటూ మోడీ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. అంటే నెలకు రూ.4,628తో కార్మికులు ఎలా బతకాలని ప్రశ్నించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు నెలకు రూ.4,628తో ఎలా బతకాలో చూపించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలని కోరారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యావైద్యం, గ్రామీణాభివృద్ధికి నిధులు తగ్గాయనీ, ఎరువుల సబ్సిడీ, ఉపాధి హామీ నిధుల్లో కోత విధించిందని విమర్శించారు. కానీ బడాబాబులకు మాత్రం రూ.ఏడు లక్షల కోట్ల రాయితీలను ప్రకటించిందని గుర్తు చేశారు. ఈ డబ్బుతో ఐదెకరాల్లోపు తొమ్మిది కోట్ల మంది రైతులకు రుణమాఫీ చేయొచ్చని సూచించారు. పేదలకిస్తే సబ్సిడీలు, ఉచితాలంటున్నారనీ, పెద్దలకిస్తే రాయితీలంటున్నారని చెప్పారు. దేశంలో ఆదాయపు పన్ను కట్టే వారు మూడు కోట్ల మంది ఉన్నారని వివరించారు. ఆదాయపు పన్ను కంటే జీఎస్టీ ద్వారా వసూలైన ఆదాయమే ఎక్కువని అన్నారు. రూ.12 కోట్లు అంతకంటే ఎక్కువ ఆదాయం ఉన్న వారికి సంపద పన్ను విధించాలని కోరారు. వారసత్వపు పన్ను వేయాలని సూచించారు. కార్పొరేట్ పన్నును పెంచాలని చెప్పారు. అనేక దేశాలు ఎర్రజెండా వైపు చూస్తున్నాయని అన్నారు. పెట్టుబడిదారీ విధానం సంక్షోభంలో ఉందన్నారు. సోషలిజమే ప్రత్యామ్నాయమని చెప్పారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. లేబర్ కోడ్‌లను తిప్పికొట్టాలని కోరారు. సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్‌కు కనీస వేతనం నిర్ణయించి తుది నోటిఫికేషన్ జారీ చేయాలని సూచించారు. ఈనెల 18న ఢిల్లీలో జరిగే సదస్సులో కార్మిక సంఘాలు కార్యాచరణను నిర్ణయిస్తాయనీ, మే మొదటి వారంలో చేపట్టే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. మందుల ధరలను తగ్గించాలనీ, మందులు, వైద్య పరికరాలపై జీఎస్టీని ఎత్తేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వరంగ ఫార్మా సంస్థలను పునర్‌నిర్మించాలని చెప్పారు. ఆన్‌లైన్‌లో మందుల అమ్మకాలను నిలిపేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, కార్యదర్శి జె వెంకటేశ్, బెఫీ రాష్ట్ర కార్యదర్శి పి వెంకట్రామయ్య, ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షులు కె పార్థసారథి, ఏఐఐఈఏ నేత రవీంద్రనాథ్, టీఎంఎస్‌ఆర్‌యూ జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎ నాగేశ్వరరావు, టిఎంఎస్‌ఆర్‌యూ ప్రధాన కార్యదర్శి సిహెచ్ భానుకిరణ్ తదితరులు ప్రసంగించారు.



## రాష్ట్రం పరువు తీస్తున్న సీఎం రేవంత్

- బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్ రెడ్డి

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అవగాహనా రాహిత్యంతో రాష్ట్రం పరువు తీస్తున్నారని బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం మాటలకు, చేతలకు పొంతన లేకుండా ఉందని ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేదని అంటూనే ఒలంపిక్స్ నిర్వహిస్తామని అనడాన్ని తప్పు పట్టారు. ఈ ఈవెంట్‌ను నిర్వహించాలంటే రూ.లక్షన్నర కోట్లు ఖర్చవుతుందని తెలిపారు. అభివృద్ధి చెందిన దేశాలే ఒలంపిక్స్‌ను నిర్వహించలేక పారిపోతుంటే రేవంత్ ఎలా నిర్వహిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. సంచలనాలకోసం ఆయన ఆరాట పడుతున్నారని ఎద్దేవా చేశారు. రూ.250 కోట్లతో మిస్ వరల్డ్ పోటీలు నిర్వహి స్తున్నామంటున్న రేవంత్ రెడ్డి ఫార్ములా ఈ రేసును ఎందుకు తప్పు పట్టారని ప్రశ్నించారు. ఫార్ములా ఈ కి రూ.45 కోట్లు ఖర్చయితే రూ.750 కోట్ల ఆదాయం వచ్చిందని గుర్తు చేశారు.

## ఏప్రిల్‌లో లిటరరీ ఫెస్ట్

- 'క్లిక్' వ్యవస్థాపక చైర్మెన్ బుర్రా వెంకటేశం వెల్లడి

**నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో**

దేశంలోని భాషా సంస్కృతులను అనుసంధానం చేస్తూ ఏప్రిల్ మొదటివారంలో హైదరాబాద్‌లో లిటరరీ ఫెస్ట్ (సాహిత్య వేడుకలు) నిర్వహిస్తున్నట్టు క్లిక్ సంస్థ వ్యవస్థాపక చైర్మెన్ బుర్రా వెంకటేశం తెలిపారు. తెలంగాణ సాహిత్య అకాడెమీ, రాజ్‌భవన్, క్లిక్ సంస్థల సంయుక్తాధ్వర్యంలో లిటరరీ ఫెస్ట్ నిర్వహిస్తున్నామని వివరించారు. వివిధ భాషల సాహిత్యాల ప్రదర్శన, చర్చాగోష్టులు, నూతన పుస్తకాల ఆవిష్కరణలు వంటి అనేక కార్య క్రమాలు దీనిలో ఉంటాయని తెలిపారు. దేశంలోని ప్రముఖ సాహితీ వేత్తలు ఈ కార్యక్రమాల్లో పాల్గొంటారని చెప్పారు. సమావేశంలో సాహిత్య అకాడమి కార్యదర్శి డాక్టర్ నామోజు బాలాచారి, క్లిక్ సంస్థ ప్రతినిధులు బెంజిమిన్, విఠల్ జోషి, హేమంత్ సింగ్, పరమానంద శర్మ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- కేంద్రమంత్రి జీ కిషన్‌రెడ్డి



**నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో**

రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జీ కిషన్‌రెడ్డి అన్నారు. శనివారంనాడిక్కడి బీజేపీ నగర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో జాతీయ రహదారుల నిర్మాణాల కోసం ఇప్పటికే రూ.6,280 కోట్లు ఖర్చు చేశామనీ, ఉత్తర ప్రాంత రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి రూ.18,772 కోట్లతో అంచనాలు సిద్ధం చేశామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం భూములు అందజేస్తే మిగిలిన నిర్మాణాలు కూడా త్వరగా పూర్తవుతాయని చెప్పారు. భూముల అప్పగింతపై రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేయడం వల్లే పనుల్లో జాప్యం జరుగుతున్నదనీ, దీనిపై ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డికి లేఖ రాస్తానని తెలిపారు. రాష్ట్రంలో పది జాతీయ రహదారులు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయనీ, త్వరలోనే కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఇక్కడికి వచ్చి వాటిని ప్రారంభిస్తారని చెప్పారు. జాతీయ రహదారులు 44, 167, 202, 565, 65, 365ను ఇతర రాష్ట్రాలతో కనెక్టివిటీ కోసం రూ.61 వేల కోట్లతో పనులు చేపట్టామన్నారు. రూ.300 కోట్లతో ఆరాంఘర్ నుంచి శంషాబాద్ వరకు ఆరు లైన్ల విస్తరణ పూర్తయ్యిందని చెప్పారు. అంబర్‌పేట ఫ్లయ్ ఓవర్ బ్రిడ్జి కూడా పూర్తయ్యిందన్నారు. నియోజకవర్గాల పునర్విభజన వల్ల రాష్ట్రంలో ఒక్క ఎంపీ సీటు కూడా తగ్గదని స్పష్టం చేశారు. దీనిపై తమిళనాడు సీఎం స్టాలిన్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిల మాటలన్నీ బోగస్ అని కొట్టిపారేశారు. హిందీ నేర్చుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఎవర్నీ బలవంతపెట్టట్లేదన్నారు. త్రిభాష సిద్ధాంతం కాంగ్రెస్ హయాం నుంచే ఉందనీ, దీనిపై అనవసర రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్వహించిన ఎంపీల సమావేశంపై మాట్లాడుతూ...ముందురోజు రాత్రికి సమాచారం ఇచ్చి, పొద్దున్నే రమ్మంటే ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఎంపీలంతా వారి నియోజకవర్గాల్లో పలు కార్యక్రమాలు ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. ఇదే విషయాన్ని తాను లేఖ రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేశానని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రిజినల్ రింగ్ రోడ్డుకు కేవలం రూ. 100 కోట్లు మాత్రమే డిపాజిట్ చేసిందనీ, ఎంఎంటీఎస్‌కు రాష్ట్ర ప్రభుత్వ వాటాను ఇవ్వలేదని వివరించారు.

## బీజేపీతో కుమ్మక్కై పనిచేసే వారిపై వేటు తప్పదు

- రాహుల్ సంచలన వ్యాఖ్యలు

**అహ్మదాబాద్ :** కాంగ్రెస్ పార్టీలో ఉంటూనే బీజేపీతో కుమ్మక్కై కలిసి పనిచేసే వారిపై వేటు తప్పదని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ హెచ్చరించారు. గుజరాత్ పర్యటనలో ఉన్న ఆయన శనివారం అహ్మదాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాహుల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 'గుజరాత్‌లో సగం మంది కాంగ్రెస్ నేతలు బీజేపీతో చేతులు కలిపారు. బీజేపీకి అనుకూలంగా పని చేస్తున్నారు. బీజేపీకి అనుకూలంగా ఉన్న ఎవ్వరినీ వదిలిపెట్టేది లేదు. కాంగ్రెస్ పార్టీలో నేతలకు కొదవలేదు. తెలంగాణాలో అసాధ్యం అనుకున్న చోటే గెలిచి చూపించాం. అక్కడ 22 శాతం ఓట్లు పెరిగాయి. ఇక్కడ గుజరాత్‌లో కాంగ్రెస్‌కు 40 శాతం ఓటు బ్యాంక్ ఉంది. అయినప్పటికీ పార్టీ విధానాలకు వ్యతిరేకంగా పనిచేస్తూ.. పార్టీ ప్రతిష్టను రోజురోజుకూ దిగజార్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇది సరైన పద్ధతి కాదు. అందరూ పార్టీ లైన్‌లో ఉండి పని చేయాల్సిందే. గీత దాటిన వారిపై వేటు వేయడానికి ఎంతో సమయం పట్టదు.

ఇప్పటికైనా మించిపోయింది లేదు. వైఖరిని మార్చుకుని పార్టీ కోసం పనిచేయాలి. పీసీసీ నుంచి కిందిస్థాయి కార్యకర్త వరకు అందరూ పనిచేయాలి' అని రాహుల్‌గాంధీ సూచించారు. అలాగే గత 30 ఏండ్లుగా గుజరాత్‌లో కాంగ్రెస్ అధికారంలో లేదు. నేను ఇక్కడికి వచ్చిన ప్రతిసారీ 2007, 2012, 2017, 2022, 2027 అసెంబ్లీ ఎన్నికల గురించి చర్చలు జరుగుతాయి. అయితే మన బాధ్యతలను నెరవేర్చే వరకు గుజరాత్ ప్రజలు మనల్ని ఎన్నికల్లో గెలిపించరు. ఎప్పుడైతే మనం ప్రజల పట్ల బాధ్యతతో ఉంటామో అప్పుడే వారు మనకు అధికారాన్ని ఇస్తారు అని రాహుల్ కీలక వ్యాఖ్యలు చేశారు.

## మణిపూర్‌లో అంతర్ జిల్లాల బస్సు సర్వీసుల పునరుద్ధరణ

- కుకీ వర్గాల ఘర్షణల్లో ఒకరు మృతి

**ఇంఫాల్ :** మణిపూర్‌లో అంతర్ జిల్లాల బస్సు సర్వీసులను పునరుద్ధరించిన నేపథ్యంలో భద్రతా బలగాలతో కుకీ జో వర్గానికి చెందిన వారు ఘర్షణ పడ్డారు. కంగ్పోకి జిల్లాలో జరిగిన ఈ ఘర్షణల్లో ఒక వ్యక్తి మరణించాడు. జిల్లాలోని పలు సబ్ డివిజన్‌ల్లో ప్రజల, వాహనాల కదలికలపై ఆంక్షలు విధించారు. ముఖ్యంగా రెండవ నెంబరు జాతీయ రహదారిపై ఈ ఆంక్షలు వెంటనే అమల్లోకి వచ్చాయి. జిల్లా మేజిస్ట్రేట్ మహేష్ చౌదరి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఇంఫాల్ నుండి సేనాపతి జిల్లాకు వెళుతున్న ప్రభుత్వ రవాణా సంస్థకు చెందిన బస్సును ఆపడానికి ప్రయత్నించి, ప్రయివేటు వాహనాలకు ఆందోళనకారులు నిప్పంటించడంతో పరిస్థితి అధ్వానంగా మారింది. అంతకుముందు మరో బస్సుపై దాడి కూడా జరిగింది. దాడికి పాల్పడిన వారిపై భద్రతా బలగాలు బాష్పవాయు గోళాలను ప్రయోగించారు. లాఠీచార్జి చేశారు. దీంతో కొంతమంది ఆందోళనకారులకు గాయాలయ్యాయని అధికారులు తెలిపారు. దాదాపు రెండేండ్ల క్రితం మణిపూర్‌లో జాతుల మధ్య ఘర్షణలతో నిలిచిపోయిన అంతర్ జిల్లా బస్సుల రాకపోకలను శనివారం ఉదయం పునరుద్ధరించారు. ప్రయాణికులెవరూ లేకుండానే ఈ బస్సులు ప్రయాణించాయి. భారీగా కేంద్ర బలగాల కాన్వాయ్‌లతో ఈ బస్సులు వెళ్ళాయని అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని మార్గాల్లో ప్రజలు స్వేచ్ఛగా రాకపోకలకు వీలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర హోం మంత్రి భద్రతా బలగాలను ఆదేశించడంతో ఈ బస్సు సర్వీసులను పునరుద్ధరించారు.

# చి'వరి' వరకు సాగునీరు

## తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

నిరంతరం విద్యుత్ సరఫరా
అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలి : వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**నవ తెలంగాణ- నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి**

వేసవిలో తాగునీరు, వరి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేందుకు, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు రాకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సమన్వయంతో పని చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి, నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. శనివారం నల్లగొండ కలెక్టర్ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా తాగునీరు, ఇరిగేషన్, విద్యుత్ అంశాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ వేసవిలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా, పంటలు ఎండిపోకుండా విద్యుత్ సరఫరా నిరంతరం కొనసాగే విధంగా సంబంధిత శాఖల సీనియర్ అధికారులు మొదలుకొని కిందిస్థాయి అధికారుల వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. మిషన్ భగీరథ అధికారులు ప్రజలకు తాగునీటి ఇబ్బంది ఏర్పడకుండా దృష్టి సారించాలని చెప్పారు. తక్షణం తాగునీటి సమస్యలను తీర్చేందుకు అవసరమైతే జిల్లా కలెక్టర్ల వద్ద నిధులు ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రితో మాట్లాడి వెసులుబాటు కల్పిస్తామన్నారు. సీఎంతో చర్చించి శాసనసభ్యులకు ఎస్‌డిఎఫ్ కింద నిధులు ఇచ్చేలా చూస్తామని చెప్పారు. ఆయకట్టు చివరి వరకు సాగునీరు అందించి పంటలను కాపాడాలన్నారు. ఇంజినీరింగ్, వ్యవసాయ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో నీటి సరఫరాపై పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. విద్యుత్ అధికారులు విద్యుత్ సమస్యలు రాకుండా ఎల్లప్పుడూ క్షేత్రస్థాయిలోనే తిరిగి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఉమ్మడి జిల్లా అభివృద్ధి కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

**రూ.15 కోట్ల నిధులు ఉంచాలని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తా.. శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి**

తక్షణం తాగునీటి అవసరాలకు జిల్లా కలెక్టర్ల వద్ద ప్రతి జిల్లాకూ కనీసం రూ.5 కోట్లు, నల్లగొండ జిల్లా విస్తీర్ణం పెద్దగా ఉన్నందున రూ.15 కోట్ల నిధులు ఉంచాలని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లనున్నట్టు శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. అధికారులు ఎక్కడ తాగునీటి సమస్య ఉంటే అక్కడికి వెళ్లి వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఏఎంఆర్ ప్రాజెక్టు కింద కెనాల్ విస్తరణ, లైనింగ్ చేపడితే సమృద్ధిగా నీరు అందించొచ్చని, ఉదయ సముద్రం మేజర్ కెనాల్ పూర్తి చేసి చెరువులకు నీరు అందిస్తే సాగునీటి సమస్య రాదని చెప్పారు. ఈ సమావేశంలో రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నల్లగొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాల కలెక్టర్లు ఇలా త్రిపాఠి, హనుమంతరావు, తేజస్ నందలాల్ పవార్, మిషన్ భగీరథ ఈఎన్‌సి కృపాకర్ రెడ్డి, ఇరిగేషన్ ఈఎన్‌సి హరిలాల్, ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ అజయ్ కుమార్, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, అడిషనల్ కలెక్టర్ జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, జయవీర్‌రెడ్డి, బాలునాయక్, బత్తుల లక్ష్మారెడ్డి, ఉత్తమ్ పద్మావతి, వేముల వీరేశం, మందుల సామేల్ తదితరులు పాల్గొన్నారు.

### కాజీపేట డివిజన్‌తోపాటు

# కొత్త లైన్లనూ ఏర్పాటు చేయండి



రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు మంత్రి కోమటిరెడ్డి విజ్ఞప్తి

**నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్**

కాజీపేట డివిజన్‌తోపాటు రాష్ట్రానికి కొత్తరైల్వే లైన్లనూ ఏర్పాటు చేయాలని రాష్ట్ర మంత్రులు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్‌వైష్ణవ్‌కు విజ్ఞపి చేశారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితోపాటు మంత్రులు కొండా సురేఖ, సీతక్క, ఎంపీలు చామల కిరణ్ కుమార్‌రెడ్డి, కడియం కావ్య కేంద్ర మంత్రిని కలిశారు. పెండింగ్ రైల్వే లైన్లను పూర్తి చేయడంతో పాటు పూర్తి రైల్వే నిధులతో కొత్త లైన్లు మంజూరు చేయాలని కోరారు. ఆరోవోబీ, ఆర్‌యూబీలను నిర్మించి రైల్వే క్రాసింగ్‌ల వద్ద ప్రమాదాలకు చెక్ పెట్టాలని విజ్ఞప్తి చేశారు. మామూనూర్ ఎయిర్‌పోర్టు మంజూరు కాంగ్రెస్ ప్రభుత్వ విజయమని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర అభివద్ధి కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను మా మంత్రులు, ఎంపీల బందం కలిసినట్టు వివరించారు. రాష్ట్రంలో కొత్త రైల్వే లైన్లను మంజూరు చేయడంతో పాటు, వాటిని పూర్తిగా రైల్వే నిధులతో నిర్మించేలా సహకరించాలని కోరారు. కాజీపేటలో కొత్త రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలనీ, ప్రస్తుతం కాజీపేటలో కొనసాగుతున్న రైల్వే తయారీ యూనిట్ పనులను వేగవంతం చేసి ప్రారంభించేలా చూడాలని కోరినట్లు తెలిపారు. రాష్ట్రంలో ముఖ్యమైన కాజీపేట రైల్వే డివిజన్ తెలంగాణలో రెండో అతిపెద్ద నగరం వరంగల్ అభివద్ధిలో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. అత్యధిక ప్రయాణికుల ట్రాఫిక్‌తోపాటు, సరుకు రవాణా చేస్తున్న కాజీపేటను డివిజన్‌గా చేస్తే గుంటూరు, హైదరాబాద్ డివిజన్‌ల కంటే ఎక్కువ ఆదాయం ఆర్జిస్తుందని లేఖలో వివరించినట్టు తెలిపారు. అంతేగాక వరంగల్ చుట్టూ నిర్మిస్తున్న రింగ్ రోడ్డు నిర్మాణం చుట్టూ రింగ్ రైల్ ను నిర్మిస్తామని స్వయంగా వారే సానుకూలత వ్యక్తం చేయడం పట్ల మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అలాగే వికారాబాద్-కష్ణ లైన్.. దక్షిణ తెలంగాణలో వెనకబడిన పరిగి, కొడంగల్, టేకల్ కోడే, నారాయణ్‌పేట, మక్తల్ వంటి పట్టణాలను కలుపుతుంద న్నారు. తాండూరు పట్టణం చుట్టూ ఉన్న సిమెంట్ పరిశ్రమలతో పాటు భవిష్యత్తులో రాబోయే పరిశ్రమలకు కూడా అత్యంత ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఆర్థికంగా ఇబ్బంది లేని ఈ రైల్వే లైన్‌ను నిర్మిస్తే సరుకు రవాణా మార్గంగా ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు.

# ధీరవనితల స్ఫూర్తిని కొనసాగిస్తాం

హక్కులు ఎవరి దయతో రావు.. శక్తిని చాటాలి : తెలంగాణ మహిళా కో ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ బండ్రు శోభారాణి



**నవతెలంగాణ-ముషీరాబాద్**

మహిళా శక్తిని చాటి.. ధీరవనితల స్ఫూర్తిని కొనసాగిస్తామని తెలంగాణ మహిళా కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ బండ్రు శోభారాణి అన్నారు. అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో శనివారం ధీరవనితోత్సవాన్ని హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాజంలో హీరోలే కాదు షీరోస్ కూడా ఉన్నారని తెలిపారు. షీరోస్ కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలని, ఆడ పిల్లల్లో ఆత్మస్థైర్యం పెంచుతుందని అన్నారు. మహారాజులు కాదు మహారాణులున్నారని, సామాజిక, సనాతన సంప్రదాయ కట్టుబాట్ల సంకెళ్ల బద్దలు కొట్టండని ధైర్యాన్నందించారు. రాష్ట్రంలో జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. డాక్టర్ నళిని మాట్లాడుతూ.. మహిళా బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి 28 సంవత్సరాలు పూర్తయినా ఎందుకు అమలు చేయట్లేదని ప్రశ్నించారు. ఏకాభిప్రాయం పేరుతో బిల్లును ఆపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హక్కులు ఎవరి దయతో రావని.. మహిళా శక్తి చాటితేనే వస్తాయని తెలిపారు.తెలంగాణ బాలోత్సవ అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పురుషుడే కత్తి పట్టాలి, కలం పట్టాలి, రాజ్యమేలాలి, రాజవ్వాలన్న దురాగతాలను ఎదిరించిన బెలవాడి మల్లమ్మ, రాణి రుద్రమదేవి, రాణి శంకరమ్మ వంటివారి సాహసాలను మహిళలు పునికి పుచ్చుకోవాలని సూచించారు. సావిత్రిబాయి పూలే, మల్లు స్వరాజ్యం, చిందు ఎల్లమ్మ లాంటి ధీర వనితలు, స్ఫూర్తికాంతుల స్ఫూర్తితో సాగాలని అన్నారు. బాలోత్సవం ఉపాధ్యక్షులు కె.సుజావతి మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాన్ని అన్ని జిల్లాల్లో నిర్వహిస్తామని తెలిపారు. బాలోత్సవం కమిటీ సభ్యులు అంకమ్మ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారికి ప్రవాస భారతీయులు శివరామకృష్ణ జాస్తి పంపిన షీరోస్ పుస్తకాలు, సర్టిఫికెట్‌లు అందజేశారు. బాలోత్సవం కార్యదర్శి ఎస్.సోమయ్య, జి.బుచ్చిరెడ్డి ఇ.మమత, నృత్య గురువులు మాధభూషిణి రమణి సిద్ధి, ఇందిరా పరాశరం, రాజేశ్వరి మాధవి శర్మ చూడామణి తదితరులు పాల్గొన్నారు.

# గాజాలో అరబ్ ప్రణాళిక అమలు చేయాలి




సమర్థించిన ఓఐసీ
రంజాన్ మాసంలో మసీదులపై దాడికి దిగిన ఇజ్రాయిల్

**గాజా :** గాజాలోకి మానవతాసాయం ప్రవేశించనివ్వకుండా గత వారం రోజులుగా ఇజ్రాయిల్ అమలు చేస్తున్న ఆంక్షలను తక్షణమే విరమించాలని పలు దేశాలు చేస్తున్న విజ్ఞప్తులను ఇజ్రాయిల్ పెడచెవిన పెడుతోంది. గాజాపై మరిన్ని దాడులకు దిగుతోంది. తాజాగా ఈ దాడుల్లో రాఫాలో ఇద్దరు పాలస్తీనియన్లు మరణించారు. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లోని ఉత్తర ప్రాంతంలోని నబ్లస్ నగరంలో గల పలు మసీదులపై శుక్రవారం ఇజ్రాయిల్ దాడులకు దిగింది. పురాతనమైన అల్ నాసర్ మసీదులోకి చొరబడిన సైనికులు ఇమామ్ గదికి నిప్పంటించారు. అగ్నిమాపక దళాన్ని కూడా లోపలకు ప్రవేశించనీయలేదని సంబంధిత వర్గాలు ఆందోళన వ్యక్తం చేశాయి. మరోవైపు ఆహారం, నిత్యావసరాలు, శిబిరాలు, మొబైల్ ఇండ్లు వంటి సాయంపై విధించిన నిషేధాన్ని ఎత్తివేయడానికి నాలుగు రోజుల గడువు ఇస్తున్నామని, లేనిపక్షంలో ఇజ్రాయిల్‌పై నావికాదళ దాడులు మొదలవుతాయని హౌతి రెబెల్స్ హెచ్చరించారు.

**గాజా దాడుల్లో 12.298 మంది మహిళలు మృతి**

గాజాపై ఇజ్రాయిల్ 519రోజులుగా సాగించిన దాడుల్లో 12,298మందికి పైగా మహిళలు మరణించారని పాలస్తీనా అథారిటీ (పీఏ) తెలిపింది. వేలాదిమంది మహిళలు ఇండ్లూ వాకిళ్ళ వదిలేసి, పిల్లా పాపలతో నిర్వాసితులయ్యారని వెల్లడించింది. మనుగడ కోసం పోరాటం సాగించే వారిలో పాలస్తీనా మహి ళలు అగ్ర భాగాన వుంటారని పీఏ వ్యాఖ్యానిం చింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ మేరకు ఒక ప్రకటన జారీ చేసింది. హింస, వేధింపులు భరిస్తూ 21మంది మహిళలు ఇజ్రాయిల్ జైళ్లలో మగ్గిపోతున్నారని తెలిపింది. గాజాలో రెండో దశ కాల్పుల విరమణ చర్చలపై సానుకూల సంకేతాలు కనిపిస్తున్నాయని హమాస్ వ్యాఖ్యానించింది. హమాస్ ప్రతినిధి బృందం కైరోలోని మధ్యవర్తులను కలిసిన నేపథ్యంలో ఈ ప్రకటన విడుదలైంది.

## ట్రంప్ ప్రణాళికను వ్యతిరేకిస్తున్నాం : ఓఐసి

గాజాను మొత్తంగా స్వాధీనం చేసుకుని పునర్నిర్మాణం చేస్తామని ట్రంప్ చేసిన ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఈజిప్ట్ నేతృత్వంలోని అరబ్ దేశాలు చేసిన గాజా పునర్నిర్మాణ ప్రణాళికను ఇస్లామిక్ సహకార సమాఖ్య (ఓఐసీ) సమర్థించింది. గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న యుద్ధం ముగిసిన తర్వాత స్వతంత్ర పాలనాపరమైన కమిటీని ఏర్పాటు చేయాలని ఈజిప్ట్ ప్రతిపాదించింది. వృత్తిపరమైన నిపుణులతో కూడిన ఈ కమిటీకి గాజా పాలనా బాధ్యతలు అప్పగించాలని సూచించింది.

మొదటి దశ ఆరు మాసాల పాటు వుంటుందని, తర్వాత రెండు దశలు కలిసి నాలుగు నుండి ఐదేండ్లు వుంటాయని తెలిపింది. రహదారులపై శిథిలాలను తొలగించిన తర్వాత, 2లక్షల తాత్కాలిక ఇండ్లను నిర్మించి, ప్రజలకు అప్పగించాలి. దెబ్బతిన్న 60వేల భవనాలను పునరుద్ధరించాలన్నది ఆ ప్రణాళికలో భాగంగా వుంది. నెమ్మదిగా నీరు, వ్యర్థాల వ్యవస్థలను ఏర్పాటు చేయడం, టెలికమ్యూనికేషన్, విద్యుత్ సేవలను పునరుద్ధరించాలని సూచిస్తోంది.

## జనార్థన్ మృతికి చెరుపల్లి, డీజీ సంతాపం

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

నవతెలంగాణ ఎడిటర్ ఆర్.సుధాభాస్కర్ తండ్రి జనార్ధన్ మరణం పట్ల సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు తీవ్ర సంతాపాన్ని వెలిబుచ్చారు. ఆయన మృతి బాధాకరమని పేర్కొన్నారు. తన కుటుంబ సభ్యులను వామపక్ష ఉద్యమాల వైపు తీసుకురావడంలో జనార్ధన్ ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ఈ సందర్భంగా తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. జనార్ధన్ మరణం పట్ల సీపీఐ(ఎం) కంట్రోల్ కమిషన్ చైర్మెన్ డీజీ.నర్సింహారావు తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు. ఎల్ఐసీ రంగంలో ఆయన ఎనలేని సేవలందించారని గుర్తుచేసుకున్నారు. ఆ సంఘానికి ఎంతో మంది కొత్త సభ్యులను పరిచయం చేశారని తెలిపారు. జనార్ధన్ కుటుంబంతో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. జనార్ధన్ కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ మేరకు వారు వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు.

## ఇద్దరు మహిళలపై సామూహిక లైంగికదాడి

కర్నాటక కొప్పాల్‌లోని తుంగభద్ర కెనాల్ వద్ద ఘటన

**బెంగుళూరు :** ఇద్దరు మహిళలపై సామూహిక లైంగికదాడి జరిగిన ఘటన కర్ణాటకలోని కొప్పాల్‌లో ఉన్న తుంగభద్ర కెనాల్ వద్ద జరిగింది. ఈ ఘటకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి డిన్నర్ చేసి తుంగభద్ర లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ వద్ద విహారానికి వెళ్లిన పర్యాటక బృందంపై బైక్‌పై వచ్చిన వ్యక్తులు దాడి చేశారు. అనంతరం మహిళలపై లైంగిక దాడికి పాల్పడినట్టు హోమ్‌స్టే ఓనర్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ సమయంలో మహిళలతో కలిసి ఉన్న మరో ముగ్గురిని దాడికి పాల్పడినవారు కాలువలోకి తోసివేశారు. వీరిలో అమెరికాకు చెందిన డేనియల్, మహారాష్ట్ర పర్యాటకుడు పంకజ్‌లు కాలువ నుంచి ప్రాణాలతో బయటకు వచ్చారు. ఒడిశాకు చెందిన బిబాష్ అనే వ్యక్తి ఆచూకీ మాత్రం తెలియలేదు. తన కోసం పోలీసులు గాలిస్తున్నారు. సామూహిక లైంగికదాడికి గురైన ఇద్దరు మహిళల్లో ఒకరు ఇజ్రాయిలీ మహిళని కొప్పాల్ ఎస్పీ రామ్ అరసిద్ధి తెలిపారు.

## వాటర్ ట్యాంకర్ ఢీకొని బీటెక్ విద్యార్థి మృతి

మరో ఇద్దరికి స్వల్ప గాయాలు



(ఫైల్)

**నవతెలంగాణ-నిజాంపేట్**

స్కూటీని వాటర్ ట్యాంకర్ బలంగా ఢీకొట్టడంతో బీటెక్ విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరు బీటెక్ విద్యార్థులు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాచుపల్లిలో జరిగింది. బాచుపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా నసురాబాద్ మండలం బొప్పాసుపల్లి గ్రామానికి చెందిన కేతావత్ నాను(21), అతని స్నేహితులు విశ్వనాథ్, కార్తీక్ బాచుపల్లిలోని వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి కళాశాలలో ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్నారు. శనివారం ఉదయం 7 గంటల సమయంలో ముగ్గురు కలిసి నగరంలోని బిర్లా మందిర్‌కు వెళ్లడానికి ప్రగతినగర్ సిగ్నల్ వద్ద హాస్టల్ నుంచి స్కూటీపై బయలుదేరారు. ప్రగతినగర్ కమాన్ సిగ్నల్‌కు సుమారు 100 మీటర్లకు ముందే వీరు వెళ్తున్న స్కూటీని వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన వాటర్ ట్యాంకర్ బలంగా ఢీకొట్టింది. దాంతో స్కూటీ చివరి భాగంలో కూర్చున్న నాను కుడివైపునకు పడిపోయాడు. అతని స్నేహితులు ఎడమవైపు పడిపోయారు. అయితే, నానుపై నుంచి ట్యాంకర్ వెనుక చక్రం వెళ్లడంతో తల భాగం చితికిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. అతని మిత్రులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పరారీలో ఉన్న వాటర్ ట్యాంకర్ డ్రైవర్ కోసం గాలిస్తున్నారు.



## కూలీల వాహనం బోల్తా

నలుగురి పరిస్థితి విషమం
గాయపడ్డవారిలో మైనర్లు
ఒకరి పొట్ట పగిలి బయటికొచ్చిన పేగులు

**నవతెలంగాణ-ఏటూరునాగారం ఐటీడీఏ**

మిర్చికోత పనులకు వెళ్లి వస్తున్న కూలీల వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 16 మంది కూలీలకు గాయాలు కాగా అందులో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని రాంనగర్ గ్రామ సమీపంలో శనివారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. రాంనగర్ గ్రామానికి చెందిన ఓ రైతుకు మిర్చి కోత పనులకు గాను కమలాపురం గ్రామంలో ఉంటున్న 16మంది గొత్తికోయ కూలీలు శనివారం రామన్నగూడెంలో మిర్చికోత పనులకు వెళ్లారు. సాయంత్రం వేళ కూలీలను ఇంటికి తీసుకెళ్లేందుకు స్వయంగా రైతు టాటా ఏస్ వాహనంలో ఎక్కించుకొని తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో రాంనగర్-కమలాపురం మధ్య ప్రాంతంలో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. వాహనంలో ఉన్న 16మంది గొత్తికోయల్లో ఐదుగురికి తీవ్ర గాయాలు కాగా మిగతా నలుగురు పరిస్థితి విషమంగా ఉంది. మిగతా వారికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడ్డ కూలీలను హుటాహుటిన 108లో సామాజిక ఆస్పత్రికి తరలించారు. తీవ్ర గాయాలైన వారిలో పోడియం మున్న, మూచకి గగ్గు, మూచకి లక్కు, కోవ్వాసి శాంతి, పాయం లక్ష్మీ ఉన్నారు. మూచకి బాల్‌సింగ్, మూచకి ఐతు, మూచకరి పారు పరిస్థితి విషమంగా ఉంది. మాడవెసుకుమానుకు పొట్ట తెగి అందులో నుంచి పేగులు బయటికి వచ్చాయి. వీరిని మెరుగైన వైద్యం కోసం వరంగల్‌కు తరలించారు. వాహనం నడుపుతున్న రైతుకు కూడా తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. గాయపడ్డ వారిలో మైనర్ కూలీలు కూడా ఉన్నట్టు తెలిసింది. మైనర్లను పనుల్లోకి తీసుకోవద్దని ఒకవైపు లేబర్ కమిషన్ చట్టాలు హెచ్చరిస్తున్నప్పటికీ రైతులు మాత్రం వినడం లేదు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు ఆస్పత్రికి వెళ్లి విచారణ చేపడుతున్నారు.




# ఇసుకను సామాన్యులకు అందుబాటులోకి తేండి

- వ్యవసాయ మార్కెట్ల ద్వారా విక్రయాలు : డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశం

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాష్ట్రంలోని సామాన్యులకు ఇసుకను అందుబాటులోకి తీసుకురావాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో రెవెన్యూ రిసోర్స్ మొబలైజేషన్ సబ్‌కమిటీ సమావేశంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావుతో కలిసి డిప్యూటీ సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వ్యవసాయ మార్కెట్లలోనూ ఇసుకను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఇసుకకు సంబంధించి ఐటీడీఏలతో త్వరగా ఒప్పందం చేసుకోవా లని ఆదేశించారు. ఆదాయం ఆర్జించే శాఖల్లో అవినీతిని అరికట్టి నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించాలని దిశానిర్దేశం చేశారు. గతంలో తీసుకున్న నిర్ణయం మేరకు హైదరాబాద్ నగరంలోని కాలుష్య కారకమైన పరిశ్రమలను అవుటర్ రింగ్ రోడ్డు దాటించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. క్యాబినెట్ సబ్ కమిటీలో తీసుకున్న నిర్ణయాలపై ఆయా శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు ప్రతినెలా సమీక్షించాలని సూచించారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామనీ, ఈ నేపథ్యంలో ఆదాయాన్ని పెంచే మార్గాలను విస్తృతంగా అన్వేషించాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి రామకృష్ణారావు, గనుల శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీధర్, ఎక్సైజ్ శాఖ ముఖ్యకార్యదర్శి రిజ్వీ తదితరులు పాల్గొన్నారు.




## జనగణనతో ముడిపెట్టకుండా మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయాలి

- అమలు చేయకపోవడంతో రాజకీయంగా నష్టపోతున్న మహిళలు
- మహిళలకు నెలకు రూ.2500 హామీ అమలు చేయాలి : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- తెలంగాణ భవన్‌లో మహిళా దినోత్సవ వేడుకలు

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

జనగణనతో ముడిపెట్టకుండా మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. 2023లో పార్లమెంటు ఆమోదించి నప్పటికీ ఈ చట్టాన్ని జనగణనతో ముడిపెట్టి కేంద్రం ఇప్పటికీ అమలు చేయడం లేదనీ, దీంతో దేశవ్యాప్తంగా మహిళలు రాజకీయంగా తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు అమల్లో లేనందువల్ల ఇటీవల ఎన్నికలు జరిగిన మహారాష్ట్ర, ఢిల్లీ, హర్యాన వంటి రాష్ట్రాల్లో చాలా మంది మహిళలు ఎమ్మెల్యేలుగా కాలేకపోయారనీ, త్వరగా జనగణన చేస్తే రాబోయే బిహార్, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో మరింత మంది మహిళలు ఎమ్మెల్యేలవుతారని అభిప్రాయపడ్డారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ భవన్‌లో జరిగిన వేడుకలకు ఆ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హాజరయ్యారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మహిళా నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి ఉత్సవాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా ప్రతి మహిళకు రూ.2,500 ఇస్తామన్న హామీని అమలు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వెంటాడుతామని హెచ్చరించారు. మహిళలను కోటీశ్వరులను చేస్తామన్న సీఎం ప్రకటనలను స్వాగతిస్తున్నామనీ, అయితే మహిళలను ఎలా కోటీశ్వరులను చేస్తారో నిర్దిష్టమైన ప్రణాళికను ప్రజల ముందు పెట్టాలని డిమాండ్ చేశారు. మహిళా సంఘాల ద్వారా అద్దెకు తీసుకుంటున్న బస్సులకు ఆర్టీసీ సకాలంలో కిరాయి చెల్లిస్తుందా లేదా స్పష్టత ఇవ్వాలనీ, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లకు జీతాలు పెంచకపోవడం సరికాదనీ, తక్షణమే వారికి జీతాలను పెంచాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు.

బీఆర్ఎస్ పార్టీ హయాంలో కేసీఆర్ మహిళా కేంద్రీకృత పాలన చేశారనీ, మహిళల కోసం కేసీఆర్ అనేక పథకాలు, కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేశారు. కేసీఆర్ పెట్టిన పథకాలను తీసేసే కర్కోటక ప్రభుత్వం రాష్ట్రంలో ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేరళ ప్రభుత్వ పాఠ్య పుస్తకాల్లో మహిళా, పురుషుల సమానత్వపు బొమ్మలు ప్రచురిస్తున్నారనీ, అలాంటి చర్యలు తెలంగాణలో కూడా రావాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. చిట్యాల ఐలమ్మ, రాణి రుద్రమాదేవి వంటి వీరవనితలు తెలంగాణ గడ్డపై పుట్టడం గర్వకారణమన్నారు. మహిళలు ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలని తెలిపారు. అమెరికాలో 40 శాతం మహిళలు ఉద్యోగాలు చేస్తుంటే భారత్‌లో మాత్రం అది 17 శాతంగానే ఉందనీ, దేశంలో 50 శాతం మంది మహిళలు ఉద్యోగాలు చేస్తే దేశ జీడీపీకి రూ.5 లక్షల కోట్ల ఆదాయం ఇవ్వగలుగుతారని వివరించారు.

# సంచార వెటర్నరీ క్లినిక్‌లు మంజూరు చేయండి

- కేంద్రానికి ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ విజ్ఞప్తి

**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

రాష్ట్రానికి వంద సంచార వెటర్నరీ క్లినిక్‌లు మంజూరు చేయాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్, ఫిషరీస్ డైరెక్టర్, విజయ డైరీ ఎమ్‌డీ తదితరులు కేంద్రాన్ని కోరారు. శనివారం హైదరాబాద్‌లో వివిధ శాఖలపై కేంద్ర పశుసంవర్ధక, మత్స్య, డైరీ డెవలప్‌మెంట్, పంచాయితీ రాజ్ శాఖల మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ సమీక్షించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను సబ్యసాచి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర రైతుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని కోరారు. చేపల చెరువుల్లో ఉత్పాదకతను పెంపొందించేందుకు అభివృద్ధి చేసిన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంభించాలని కోరారు. డైరీ, ఫిషరీస్ రంగంలోని కార్మికులను సంఘటిత రంగంలోకి తీసుకురావాల్సిన అవసరాన్ని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రానికి రెండు జాతీయ అవార్డులు రావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

# విద్యతోనే మహిళాభివృద్ధి

## జేవీవీ గోడపత్రిక ఆవిష్కరించిన మంత్రి సీతక్క

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**



విద్యతోనే మహిళాభివృద్ధి సాధ్యమని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జన విజ్ఞాన వేదిక రూపొందించిన గోడ పత్రికను ఆమె శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆవిష్కరించారు. హిందీ రచయిత్రి కమలా భాసిన్ రాసిన కవితను "నేను ఆడపిల్లను - అందుకే తప్పక చదవాలి" పేరుతో జేవీవీ తెలుగులోకి అనువదించింది, దాన్ని ముద్రించింది. ఆ గోడ పత్రికను ఆవిష్కరించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ ఆడ పిల్లలు చదువుకుంటేనే అన్ని రంగాల్లో ముందుకెళ్తారని చెప్పారు. అప్పుడే సమాజంలో మహిళలపట్ల నెలకొన్న అసమానతలను రూపుమాపగలుగుతారని తెలిపారు. అనంతరం జన విజ్ఞాన వేదిక, సమతా విభాగం సభ్యులు మంత్రి సీతక్కకు వాల్ హ్యాంగర్‌ను బహూకరించారు. వివిధ పాఠశాలలు, కళాశాలల్లో దీన్ని కరపత్రాలుగా పంపిణీ చేయనున్నట్టు వారు మంత్రికి తెలిపారు. ఆడపిల్లల్లో చదువు పట్ల అవగాహన పెంచేందుకు జన విజ్ఞాన వేదిక చేస్తున్న కృషిని ఈ సందర్భంగా సీతక్క కొనియాడారు. ఈ విషయంలో తన మద్దతు ఎప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. సమతా విభాగం నాయకురాలు ప్రొఫెసర్ విజయలక్ష్మి మాట్లాడుతూ... సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొని అధిగమిస్తేనే మహిళా సాధికారిత సాధ్యమవుతుందని చెప్పారు. మహిళల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు, ఆర్థికంగా బలోపేతం చేసేందుకు సంఘాలు కృషి చేయాలన్నారు. వరకట్నం, వేధింపులు, సైబర్‌క్రైమ్, పోక్సో చట్టాలపై మహిళలకు, వ్యార్థినుల్లో అవగాహన పెంపొందిస్తున్నామని చెప్పారు. భారత రాజ్యాంగం స్త్రీ, పురుషులకు రాజకీయ, ఆర్థిక, సామాజికంగా సమాన అవకాశాలిచ్చినా.. మహిళల విషయంలో అది అమలు కావటం లేదన్నారు. సమాజంలో ఇంకా మహిళలపై చిన్నచూపు, చులకనభావం ఉందన్నారు. తమకు రాజ్యాంగం కల్పించిన హక్కుల గురించి వారు తెలుసుకుని చైతన్యవంతులు కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజా మాట్లాడుతూ.... ఏ సమాజమైతే స్త్రీకి సమున్నత స్థానం కల్పిస్తుందో... ఆ సమాజమే అభివృద్ధిపథంలో దూసుకుపోతోందని చెప్పారు. పిల్లలకు పాఠశాల స్థాయి నుండే స్త్రీల పట్ల చైతన్యవంతమైన దృక్పథం అలవడేలా పాఠ్యాంశాలను రూపొందించాలని సూచించారు. అప్పుడే లైంగిక వేధింపులకు అడ్డుకట్టపడుతుందని అభిప్రాయపడ్డారు. జేవీవీ సమతా విభాగ రాష్ట్ర కో కన్వీనర్ డాక్టర్ పి. రజనీ, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరితో పాటు జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు ప్రొఫెసర్ బి.ఎస్.రెడ్డి, , విద్యాసాగర్, శాంతి ఇశాన్, తదితర సభ్యులు, ఆంధ్ర మహిళా సభ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ అభ్యర్థులెవరో?

- కాంగ్రెస్‌లో జోరుగా చర్చలు
- ఎంఐఎం, సీపీఐకి ఇస్తారా? లేదా?
- ఈ అంశంపై చర్చించేందుకే సీఎం ఢిల్లీకి వెళ్లారంటూ గుసగుసలు

**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**



ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీలస్థానాలభర్తీ, వాటి నామినేషన్లకు సమయం సమీపిస్తుండటంతో కాంగ్రెస్ అభ్యర్థులెవరనే చర్చ ఊపందుకుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం ఢిల్లీకి వెళ్లి రావడంతో ఈ చర్చ పతాక స్థాయికి చేరుకుంది. అభ్యర్థులెవరు? సామాజిక సమీకరణాలేంటి? ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీ వర్గాల్లో ఇప్పటివరకు పదవులు రాని నేతలెవరు?. బీసీ కులగణన, కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ హామీలు, ఎస్సీ వర్గీకరణ నేపథ్యంలో రకరకాల విశ్లేషణల్లో నాయకులు తలమునకలయ్యారు. ఎమ్మెల్సీ అభ్యర్థుల్లో ముఖ్యమంత్రికి కావాల్సిన వారెవరు? ఎమ్మెల్సీ ఎంపిక చేయడంలో మంత్రుల జోక్యమెంటి? మంత్రులు ఏవరెవరికి సిఫారసు చేస్తున్నారు? ఇత్యాది అంశాలపై చర్చలు జోరుగా సాగుతున్నాయి. ఎమ్మెల్యే కోటాలో మొత్తం ఐదుగురు ఎమ్మెల్సీలకు ఛాన్స్ ఉంది. అందులో ఒక స్థానం బీఆర్ఎస్‌కు వచ్చే అవకాశం ఉన్నది. మిగతా నాలుగింటిలో ఎవర్ని బరిలోకి దించాలనేదానిపై కాంగ్రెస్ వేట పూర్తి చేసినట్టు తెలిసింది. ఈ క్రమంలో ఒక ఎమ్మెల్సీ స్థానాన్ని తమకు కేటాయించాలంటూ సీపీఐ కోరింది. కానీ మారిన సమీకరణాల నేపథ్యంలో ఈసారికి వీలుకాదని హస్తం పార్టీ చెప్పినట్టు తెలిసింది. ఎంఐఎం కూడా ఒక స్థానాన్ని అడిగినట్టు సమాచారం. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇస్తామన్న హామీతో ఆ పార్టీ వెనక్కి తగ్గినట్టు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ఈ క్రమంలో నాలుగింటిలో కాంగ్రెస్ అభ్యర్థులను సర్దుబాటు చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నది. ఒకవైపు పార్టీ అంతర్గతంగా చర్చలు...మరోవైపు ఏఐసీసీ అగ్రనేతలతో సంప్రదింపులు...ఇలా ముఖ్యమంత్రి, టీపీసీసీ అధ్యక్షులు బిజీబిజీగా గడుపుతున్నారు. అభ్యర్థుల ఎంపిక నేపథ్యంలో ఆశావాహుల్లో పోటీ తీవ్రంగా ఉన్నది. ముఖ్యంగా పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన నేపథ్యంలో ఆయా వర్గాల నుంచి దరఖాస్తులు వెల్లువల వచ్చాయి. ఎస్సీ వర్గీకరణ నేపథ్యంలో మాదిగ,మాల సామాజిక వర్గాల నాయకుల్లో పోటీ పోటాపోటీగా ఉన్నది. ఎవరి వైపు మొగ్గు చూపాలనేది పార్టీకి కత్తిమీద సాములా మారింది. మైనార్టీలు, ఎస్టీలు కూడా పోటీకి సిద్ధమవుతున్నారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ యువతకు ప్రాధాన్యతను ఇవ్వాలనే సూచనమేరకు యువత, విద్యార్థి నేతలు కూడా తమకు తెలిసిన నేతలతో సంప్రదింపులు చేస్తున్నారు. తాజాగా ఉత్తర తెలంగాణలో పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘోరంగా ఓటమిని చవిచూసింది. బీజేపీ, బీఆర్ఎస్ లోపాయికారీ ఒప్పందంమేరకు కమలం వికసించిందంటూ హస్తం పార్టీ నేతలు పైకి చెబుతున్నా...పార్టీ బలహీనంగా ఉందనేది మరోసారి చర్చనీయాంశమవుతున్నది. ఈ ప్రాంతంలో మున్నూరుకాపు (ఓబీసీ) సామాజిక తరగతి ప్రాబల్యం ఎక్కువగా ఉన్నది. ఆ సామాజికతరగతిని కాంగ్రెస్ పార్టీ విస్మరించిందనే అపవాదు కూడా నెలకొంది. ఈ నేపథ్యంలో ఓబీసీలకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని భావిస్తున్నది. అయితే గత ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులకు, చైర్మెన్ పదవుల్లో ఉన్న వారిని ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ఎంపిక చేయొద్దు అని పార్టీ నిర్ణయించింది. 'ఒక నాయకుడికి ఒక పదవి' సూత్రాన్ని పాటించాలని అధికార పార్టీ భావిస్తున్నది. దీని ప్రకారం చైర్మెన్లకు, పోటీ చేసి ఓడిపోయిన వారికి, ఇతర ప్రభుత్వ పదవుల్లో ఉన్న వారికి ఎమ్మెల్సీ అభ్యర్థిత్వం దక్కకపోవచ్చు. ముఖ్యంగా మున్నూరుకాపు సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎంపీ వి. హనుమంతరావు ఎమ్మెల్సీ పదవిపై పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఆయన జాతీయ స్థాయిలో ఓబీసీ చైర్మెన్ పదవిని ఆశిస్తున్నారు. ఈ క్రమంలో వీహెచ్ తన బయోడేటాను కూడా అధిష్టానానికి పంపినట్టు తెలిసింది. సీనియర్ నేత విజయశాంతి సేవలను రాష్ట్రస్థాయిలో వినియోగించుకోవాలని పార్టీ భావిస్తున్నది. సరిత తిరుపతయ్య గద్వాల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ ఓడిపోయారు. ఆమెకు రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్ష పదవి ఇచ్చేందుకు పార్టీ సుముఖత వ్యక్తం చేసినట్టు తెలిసింది. మున్నూరుకాపు సామాజిక తరగతికి చెందిన యువతనేత, మాజీ ఏఐసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ కొనగాల మహేష్ పేరు ఎమ్మెల్సీ రేసులో బలంగా వినిపిస్తున్నది.

ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ పేరు దాదాపు ఖరారు అయినట్టు తెలిసింది. పార్టీ సూచనమేరకు ఆయన అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండటం కలిసొచ్చినట్టు గాంధీభవన్‌వర్గాలు అంటున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సన్నిహితులు, మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్‌రెడ్డి కూడా పార్టీ ఆదేశంమేరకు ప్రత్యక్ష ఎన్నికలకు దూరంగా ఉన్నారు. ఆయనకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి మంత్రి పదవిని కట్టబెట్టే పరిస్థితులు కనిపిస్తున్నాయి. మైనార్టీ, ఎస్టీ సామాజికతరగతి చెందిన షబ్బీర్ అలీ, ఫహీం ఖురేషీ, శంకర్‌నాయక్, విజయబాయి పేర్లు కూడా ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వారిలో అధిష్టానం ఎవర్ని ఎంపిక చేస్తుందో వేచిచూడాల్సిందే.

## అఖిలపక్షానికి రావటానికి భయమెందుకు?

- బీజేపీ, బీఆర్ఎస్‌లకు అద్దంకి దయాకర్ సూటి ప్రశ్న

**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

ప్రభుత్వం నిర్వహించిన అఖిలపక్ష ఎంపీల సమావేశానికి రావటానికి భయమేందుకని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ కేంద్ర మంత్రులు, బీజేపీ, బీఆర్ఎస్ ఎంపీలను ప్రశ్నించారు. శనివారం ఈమేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ రెండు పార్టీల సూచనమేరకే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలపై అఖిలపక్ష ఎంపీల సమావేశాన్ని ఏర్పాటు చేసిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని ఏ విధంగా కోరాలో అభిప్రాయాలు తెలుసుకునేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈభేటీకి డుమ్మ కొట్టిన ప్రజా సమస్యల పట్ల కమలం, గులాబీ పార్టీలకు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. మోడీ డైరెక్షన్‌లో నడిచే స్థాయికి బీఆర్ఎస్ దిగజారిపోయిందని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ప్రతిపక్ష పాత్రను వదిలేసి ఆ పదవిని అల్లుడు, కుమారుడికి ఔట్‌సోర్సింగ్‌లో ఇచ్చారని విమర్శించారు. గత ప్రభుత్వంలోని రావాల్సిన బిల్లుల కోసం కాంట్రాక్టర్లతో ధర్నాలు చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం వద్దకు పోయేందుకు సానుకూల దృక్పథంతో సీఎం చేస్తున్న ప్రయత్నాన్ని ఆ రెండు పార్టీలు నీరుగారుస్తున్నాయని విమర్శించారు.

**ఎస్ఎస్‌బీసీ ప్రమాదాన్ని చూసే తీరిక లేదా? చనగాని దయాకర్ ప్రశ్న**

ఎస్ఎల్‌బీసీలో ప్రమాదం జరిగి 15 రోజులైనా కేంద్ర మంత్రుల హోదాలో కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్‌లకు అక్కడికి వెళ్లే తీరిక లేదా? అని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ అని ప్రశ్నించారు. రాష్ట్రాభివృద్ధిలో కేంద్ర సాయం శూన్యమని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీల సమావేశానికి వెళ్లకపోవడం ఆ పార్టీలు నైతికతకు నిదర్శనమని పేర్కొన్నారు. కేంద్ర మంత్రులు ప్రతి విషయాన్ని రాజకీయ కోణంలో ఆలోచిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో బీజేపీకి అధికారం అనేది కల అని ఎద్దేవా చేశారు. పట్టభద్రుల ఎన్నికల్లో బీజేపీ,బీఆర్ఎస్ మిత్ర కూటమి అని తేలిపోయిందని పేర్కొన్నారు. రాష్ట్రానికి నిధులు, సాగునీటి ప్రాజెక్టులకు జాతీయ హోదాను తీసుకరావడంతో విఫలం చెందారని విమర్శించారు. రాష్ట్రానికి రావాల్సిన వాటా కోసం కేంద్ర ప్రభుత్వంపై యుద్ధం చేస్తామని హెచ్చరించారు.



## టొరంటో పబ్‌లో కాల్పులు

- 12 మందికిపైగా గాయాలు

**కెనడా :** కెనడాలో కాల్పుల ఘటన కలకలం సష్టించింది. టొరంటో నగరంలోని ఓ పబ్‌లో ఓ దుండగుడు విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డాడు. ఈ ఘటనలో 12 మందికిపైగా గాయపడ్డారు. స్థానిక మీడియా కథనాల ప్రకారం.. శుక్రవారం రాత్రి 10:39 గంటల సమయంలో నగరంలోని స్కార్‌బరో టౌన్ సెంటర్ సమీపంలోని పబ్‌లో ఓ దుండగుడు కాల్పులకు తెగబడ్డాడు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న టొరంటో నగర పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడి కోసం గాలిస్తున్నారు. కాల్పుల ఘటనపై టొరంటో మేయర్ ఒలివియా చౌ విచారం వ్యక్తం చేశారు. నిందితుడిని తొందర్లోనే పట్టుకోనున్నట్టు ఆయన వెల్లడించారు.

# ఎస్సీ వర్గీకరణ జరిగే వరకు ఉద్యోగ పరీక్షా ఫలితాలు నిలిపేయాలి

## సీఎంకు మంద కృష్ణ మాదిగ బహిరంగ లేఖ

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**



ఎస్సీ వర్గీకరణ జరిగే వరకు ఉద్యోగ పరీక్షా ఫలితాలు నిలిపేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం ఆయన బహిరంగ లేఖ రాశారు. ఎస్సీ వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలకే ఉందనీ, ఆగస్టు ఒకటిన సుప్రీంకోర్టు విస్తృత రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును అదే రోజు నిండు శాసనసభలో తమరు స్వాగతించటం ఆహ్వానించదగిందేనని పేర్కొన్నారు. దేశంలోనే అన్ని రాష్ట్రాల కంటే ముందుగా తెలంగాణలో ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తామని ప్రకటన చేయడంతో పాటుగా, గతంలో ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్లలో కూడా వర్గీకరణను వర్తింపజేసి ఉద్యోగ నియామకాలు చేస్తామని స్పష్టమైన ప్రకటన అసెంబ్లీలో చేశారని గుర్తు చేశారు. ఈ నెల 12 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ కోసం చట్టం చేస్తామని చెప్పి, మరో వైపు గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 పరీక్ష ఫలితాలు వెల్లడిస్తామని టీజీపీఎస్సీ నుంచి పత్రికల్లో ప్రకటనలు చేయించటంతో మా జాతి ప్రజలు మరోసారి మోసానికి గురవుతున్నారని భావిస్తున్నట్టు తెలిపారు.

ఒకవేళ అదే జరిగితే, మేము మరింత నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంతకు ముందు 11 వేల డీఎస్సీ పోస్టులు భర్తీ చేయటం వల్ల ఎన్ని పోస్టులు నష్టపోయామో తెలిసిందేనని గుర్తు చేశారు. ఎస్సీ వర్గీకరణ పోరాటానికి ఫలితం రాబోతుందనుకునే సమయంలో, వర్గీకరణ లేకుండా ఉద్యోగ పోటీ పరీక్ష ఫలితాల ప్రకటనలు జరిగితే, మాదిగలే కాదు, ఇతర కులాలు కూడా సహించవని తెలిపారు. వర్గీకరణ అయ్యేంత వరకు అన్ని పోటీ పరీక్ష ఫలితాలు నిలిపేయాలని విజ్ఞప్తి చేశారు.

# భారతీయ సంస్కృతిలో మహిళల పాత్ర కీలకమైనది

- కళాకారులకు హోప్ అడ్వర్టైజింగ్ ప్రయివేట్ లిమిటెడ్ డైరెక్టర్ సునీత సత్కారం


**నవతెలంగాణ-హైదరాబాద్**



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం హోప్ అడ్వర్టైజింగ్ ప్రయివేట్ లిమిటెడ్, సుజనరంజని సంయుక్తంగా శ్రీవిద్య జానకిరామన్ గాత్ర సంగీత కచేరీని ఏర్పాటు చేశాయి. ఈ కచేరీలో శ్రీవిద్య త్యాగరాజ స్వామి, ముత్తుస్వామి దీక్షితార్, శ్యామ శాస్త్రి, ముత్తయ్య భాగవతార్ అమ్మవారిపై రచించిన కీర్తనలను అద్భుతంగా ఆలపించి అక్కడికి వచ్చిన శ్రోతలను ఆనంద డోలికల్లో ఓలలాడించారు.

శ్రీ భట్టి పవన్ సింగ్ వయొలిన్‌పై, శ్రీ చిలుముల రామకష్ణ మదంగంపై, శ్రీ బాలసుబ్రహ్మణ్యం ఘటం పై చక్కటి సహకారం అందించి గాత్ర సంగీత కచేరిని రక్తి కట్టించారు. ఈ సందర్భంగా మన భారతీయ సంస్కృతిలో నిత్య జీవితంలో మహిళల పాత్ర, వారికి ఇవ్వాల్సిన గౌరవంపై మహీధర సీతారాం వివరించారు. హోప్ అడ్వర్టైజింగ్ ప్రయివేట్ లిమిటెడ్ డైరెక్టర్ సునీత కళాకారులను అభినందించి సత్కరించారు.

## వనువాటు పౌరసత్వం తీసుకున్న లలిత్ మోడీ



**న్యూఢిల్లీ:** పసిఫిక్ ద్వీప దేశం వనువాటుపై గూగుల్ సర్చ్ పదింతలు పెరిగింది. సుమారు 80 ద్వీపాల సమూహమైన ఆ దేశ ప్రత్యేకతలపై నెటిజన్లు ఆరా తీస్తున్నారు. వీరు ఇంతగా ఆసక్తి చూపడానికి ఐపీఎల్ వ్యవస్థాకుడు, మాజీ ఛైర్మెన్ లలిత్ మోడీ ఆ దేశ పౌరసత్వం తీసుకోవడమే ఇందుకు కారణం. ఐపీఎల్‌కు బాస్‌గా ఆయన కోట్లాది రూపాయలు దుర్వినియోగం చేశారనే ఆరోపణలు ఉన్న సంగతి విధితమే. ఈ నేపథ్యంలో తన పాస్‌పోర్టును లండన్‌లోని భారత హై కమిషన్ కార్యాలయంలో అప్పగిస్తానని ఇటీవల లలిత్ దరఖాస్తు చేసుకున్నారు. దానికి ముందు సంపన్నులు తీసుకునే వనువాటు 'గోల్డెన్ పాస్‌పోర్ట్' కార్యక్రమం కింద పౌరసత్వం కూడా పొందారు. స్వదేశంలో దర్యాప్తును తప్పించు కునేందుకే దానిని తీసుకున్నారని తెలుస్తోంది. ఆస్ట్రియన్ ఇమిగ్రెంట్ ఇన్వెస్ట్ కార్యాలయ అధిపతి జ్లాటా ఎర్లాచ్.. ఈ పౌరసత్వ ప్రయోజనాలను వెల్లడించారు.

"స్థానికంగా, అంతర్జాతీయంగా వచ్చే ఆదాయంతో సంబంధం లేకుండా దేనిపైనా అక్కడ ఆదాయపన్ను ఉండదు. దీర్ఘకాలిక లాభాలపై పన్ను కూడా ఉండదు. ముఖ్యంగా స్టాక్స్, రియల్ ఎస్టేట్ వంటి వ్యాపారాలు చేసేవారికి ఇది ఉపయోగకరం. ఆ దేశంలో వారసత్వ లేక కార్పొరేట్ పన్ను లేదు. వనువాటులో వ్యాపార సంస్థను రిజిస్టర్ చేసుకొని.. దేశం బయటి నుంచి ఆదాయాన్ని పొందినా, ఎలాంటి ఇబ్బందీ ఉండదు. అలాగే గిఫ్ట్ , ఎస్టేట్ ట్యాక్స్‌లు లేవు. అంతేగాకుండా ఆ దేశం క్రిప్టో హబ్‌గా వద్ధి చెందుతోంది. ఇంకా చెప్పాలంటే 2024లో విడుదలైన హ్యాపీ ప్లానెట్ ఇండెక్స్‌లో వనువాటు తొలి స్థానంలో నిలిచింది" అని తెలిపారు.

# 'ఎక్సైజ్' వసూళ్లపై సర్కార్ నజర్..!

## సీఐల మామూళ్ల దందాపై సీరియస్

సంబంధిత మంత్రికి ఫిర్యాదుల వెల్లువ

కొరవడిన డీసీ, సూపరింటెండెంట్ల పర్యవేక్షణ

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎక్సైజ్ శాఖలో వసూళ్ల పర్వంపై ఆరోపణలు గుప్పుమంటున్నాయి. కొందరు ఎక్సైజ్ సీఐలపై ప్రభుత్వానికి భారీగా ఫిర్యాదులు అందుతున్నాయి. బార్లు, పబ్స్, వైన్ షాపుల నుంచి ముక్కుపిండి మరీ మామూళ్లు వసూల్ చేస్తున్నట్టు సంబంధిత శాఖ మంత్రికి, ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందినట్టు సమాచారం. ముఖ్యంగా హెచ్ఎండీఏ పరిధిలోని కొందరు సీఐలు విధి నిర్వహణ కన్నా మామూళ్లకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని ఈ ఫిర్యాదులో పేర్కొన్నారు. రంగారెడ్డి డీసీ పరిధిలో పనిచేసే కొందరు సీఐలపై ఎక్కువగా ఈ ఫిర్యాదులు రావడం విశేషం. డీసీ, సూపరింటెండెంట్ల పర్యవేక్షణ కొరవడంతోనే ఈ దందా సాగుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయంపై సర్కార్ సీరియస్‌గా ఉన్నట్టు సమాచారం.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని మేడ్చల్ సూపరింటెండెంట్ పరిధిలో 94 బార్లు, 114 వైన్ షాపులు, మల్కాజిగిరి సూపరింటెండెంట్ పరిధిలో 115 బార్లు, 88 వైన్ షాపులు ఉన్నాయి. జిల్లాలో సూపరింటెండెంట్ల పర్యవేక్షణ కొరవడటం, రంగారెడ్డి డీసీకి పని ఒత్తిడి కావడంతో జిల్లాలోని కొందరు సీఐల పని తీరును వారు సరిగ్గా పర్యవేక్షించకపోవడంతో ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో అవినీతికి అంతేలేకుండా పోయిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా హెచ్ఎండీఏ పరిధిలో పని చేసే సీఐలలో చాలా మందికి వసూళ్లపై ఉన్న శ్రద్ధ విధి నిర్వహణలో ఉండటం లేదని, వైన్స్‌లు, బార్లు, పబ్బుల నుంచి వసూళ్లతోపాటు వాటి పంపకాల్లోనూ కింది స్థాయి నుంచి పైస్థాయి అధికారులకు తేడాలు వస్తున్నాయని, దీంతో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకుంటున్నట్టు ఉన్నతాధికారులకు, మంత్రికి ఫిర్యాదులు అందడం గమనార్హం. దీంతోపాటు సీఎంకు కూడా ఫిర్యాదులు అందడంతో ప్రభుత్వం వారి అవినీతిపై దృష్టి సారించినట్టు తెలుస్తోంది.




### ఎక్కువ ఫిర్యాదులు ఇలా..

కుత్బుల్లాపూర్, బాలానగర్, ఉప్పల్, ఘట్‌కేసర్‌తోపాటు మరికొన్ని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లపై ఎక్కువగా అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు ఎక్సైజ్ సీఐల పరిధిలో 24 గంటలపాటు మద్యం దొరుకుతుందని, స్థానికంగా కొన్ని ప్రాంతాల్లో అడ్డాలను ఏర్పాటు చేసి ఈ అమ్మకాలు కొనసాగిస్తూ ఆయా పీఎస్‌ల పరిధిలోని ఎక్సైజ్ పోలీసులు అందినకాడికి దండుకుంటున్నారని ఫిర్యాదులు వస్తున్నాయి. బార్ల ట్రాన్స్‌ఫర్ల విషయంలోనూ భారీగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, దీనివల్ల తాము ఇబ్బందులు పడుతున్నామని కొందరు వైన్ షాపులు, బార్ల యజమానులు ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడం గమనార్హం. పలు పీఎస్‌ల పరిధిలో గుడుంబా, గంజాయి, కల్తీ కల్లు, తదితర వాటిని అరికట్టడంలో ఆయా సీఐలు విఫలమవుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### గతంలోనూ పలు ఆరోపణలు..

మద్యం షాపుల టెండర్లు ముగిసిన వెంటనే మామూళ్ల పర్వం మొదలు పెట్టినట్టు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. కొత్త వైన్ షాపుల నిర్వహణ ప్రారంభం కాకముందే దుకాణానికి రూ.2 లక్షల చొప్పున వసూలు చేసి అధికారులు వాటాలేసుకున్నట్టు అప్పట్లో పెద్దఎత్తున ఆరోపణలు వచ్చాయి. 2023-25కి జిల్లాలో లక్కీ డ్రా తీశారు. ఎంపికైన వారికి ప్రొవిజినల్ లైసెన్సులు జారీ చేశారు. మొదటి వాయిదా ఫీజును చెల్లించి, ప్రొవిజినల్ లైసెన్సులు తీసుకుంటున్న కొత్త వైన్ షాపుల యజమానుల నుంచి అధికారులు రూ.2 లక్షల చొప్పున వసూలు చేశారని, ఎక్సైజ్ స్టేషన్ల ఖర్చు పేరిట ఈ డబ్బులు వసూలు చేశారని అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. 'రెండేండ్లపాటు మీకు, మాకు అనుబంధం ఉంటుంది. రూ.కోట్లు పెట్టి వైన్ షాపులు నిర్వహించబోతున్న మీకు రూ.2 లక్షలు పెద్ద ముచ్చటే కాదు' అంటూ వసూలు చేసినట్టు సమాచారం. ఇందులో పై స్థాయి నుంచి కింది స్థాయి వరకు సంబంధిత శాఖ అధికారులు వాటాలేసుకుని మరీ పంచుకోవడం పట్ల అప్పట్లో చర్చ జరిగింది. అడిగిన డబ్బులు ఇవ్వకపోతే భవిష్యత్‌లో నిబంధనల పేరుతో వేధిస్తారని భయపడి యజమానులు చెల్లించినట్టు సమాచారం.

### వేలం పాటకు ఖర్చుల పేరుతో వసూళ్లు..!

2023-25 సంవత్సరాలకుగాను ప్రభుత్వం రెండు నెలల ముందుగానే వైన్ షాపుల వేలం పాట నిర్వహించిన విషయం తెలిసిందే. ఊహించని విధంగా ఎక్కువగా దరఖాస్తులు వచ్చాయి. వైన్ షాపులు కేటాయించటానికి అధికారులు నాగోల్‌లోని ఫంక్షన్ హాళ్లలో డ్రా నిర్వహించారు. లాటరీలు తీయటానికి ఖర్చులయ్యాయి.. షాపుల కేటాయింపు పూర్తయిన తర్వాత ఒక్కో వైన్ షాపు యజమాని రూ.2 వేలు చెల్లించాలంటూ హుకూం జారీ చేశారు. అదేమంటే లాటరీలు నిర్వహించటానికి ఫంక్షన్ హాళ్ల అద్దెకు తీసుకున్నామని, ఇతరత్రా ఖర్చులయ్యాయని వసూలు చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇలా అప్పట్లో టార్గెట్‌కు మించి దరఖాస్తులు వచ్చేలా చూసిన ఎక్సైజ్ అధికారులు సొంత జేబులు నింపుకున్నట్టు ఆరోపణలు కూడా ఉన్నాయి.

## 31 వరకు అందరికీ రైతు భరోసా

- ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



నవ తెలంగాణ - వీపనగండ్ల

మార్చి 31 వరకు అందరికీ రైతు భరోసా డబ్బులు వారి ఖాతాల్లో జమ చేస్తామని, ఎవరూ ఆందోళన చెందొద్దని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. వనపర్తి జిల్లా వీపనగండ్ల మండల పరిధిలోని సంగినేనిపల్లి గ్రామంలో సీసీ రోడ్లు, పాఠశాల కాంపౌండ్ నిర్మాణానికి, గోపాల్‌దిన్నేలో 33బై11 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణానికి శనివారం మంత్రి శంకుస్థాపన చేశారు. నూతన గ్రామపంచాయతీ భవనం ప్రారంభం, గోవర్ధనగిరిలో సీసీ రోడ్లు, బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గోపాల్‌దిన్నే రైతు వేదికలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల లోపు రుణమాఫీ చేసినట్టు చెప్పారు. కొన్ని సింగిల్ విండో కార్యాలయాల్లో తప్పిదాల వల్ల కొందరు రైతులకు రుణమాఫీ కాలేదని, రుణమాఫీ కానీ రైతుల వివరాలను సేకరించి అందరికీ మాఫీ చేస్తామని చెప్పారు. మూడెకరాల్లోపు రైతులకు రైతు భరోసా నిధులు జమ చేశామని, 31 వరకు మిగతావారికి ఖాతాల్లో జమ చేస్తామని అన్నారు. గత ప్రభుత్వం అప్పుల పాలు చేసి రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టిందన్నారు. కార్యక్రమంలో నాయకులు వల్లభాపురం నారాయణరెడ్డి, బాల్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు డాక్టర్ గోదల బీరయ్య యాదవ్, ఎంపీటీసీల పోరం సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు డాక్టర్ ఇంద్రకంటి వెంకటేష్, సీనియర్ నాయకులు బొల్లారం సుదర్శన్ రెడ్డి, బస్వరాజ్ గౌడ్, ఎస్.రవీందర్ రెడ్డి, వెంకట్రాజయ్య, చక్ర వెంకటేష్, రమేష్‌గౌడ్ అఖిల్, బిచ్చన్న సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## నాగరాజును చిత్రహింసలు పెట్టిన ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి

- దళిత సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రాంబాబు




నవతెలంగాణ-అశ్వారావుపేట

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలో కోడి పుంజు చోరీ విచారణలో ఒక దళితుడిని చిత్రహింసలకు గురి చేసిన ఎస్ఐ రామ్మూర్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దళిత సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి తగరం రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధితుడు నాగరాజుకు న్యాయం చేయాలని ఉన్నతాధికారులను కోరారు. బాధిత కుటుంబ సభ్యులతో కలిసి శనివారం సీఐ కరుణాకర్‌ను కలిసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్ఐ అనుచిత ప్రవర్తనకు దళితుడు బలైపోయాడని, తీవ్రవాది కంటే హీనంగా నాగరాజు పట్ల ఎస్ఐ ప్రవర్తించిన తీరు అత్యంత హేయమైన చర్యగా పేర్కొన్నారు. సంఘటనపై సమగ్ర విచారణ జరపాలని, గతంలో అవినీతి ఆరోపణలు ఉన్న ఎస్ఐ రామ్మూర్తిని విధుల నుంచి తొలగించాలని సూచించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట ఆధార్ పార్టీ జిల్లా అధ్యక్షులు కంటే కేశవ్ తదితరులు ఉన్నారు.

## పిల్లల వార్డులో ఎలుకలు

మధ్యప్రదేశ్‌లోని ఓ ఆస్పత్రిలో ఘటన

- సోషల్ మీడియాలో వీడియో వైరల్
- నెటిజన్ల ఆగ్రహం



**భోపాల్ :** ఆస్పత్రులు అంటేనే పరిశుభ్రమైన వాతావరణాన్ని కలిగి ఉండాలి. కానీ బీజేపీ పాలిత రాష్ట్రం మధ్యప్రదేశ్‌లో ఆస్పత్రుల పరిస్థితులు మాత్రం ఇందుకు విరుద్ధంగా ఉన్నాయి. ఒక ఆస్పత్రిలోని పిల్లల వార్డులో రోగి బెడ్ వద్ద అనేక సంఖ్యలో ఎలుకలు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. దీనికి సంబంధించి ఒక వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. దీంతో రాష్ట్రంలోని ఆస్పత్రుల పరిస్థితులపై ప్రజలు, నెటిజన్లు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనతో ఆస్పత్రి యాజమాన్యం, అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనబడుతున్నదని ఆరోపిస్తున్నారు. సదరు ఆస్పత్రిలో పరిశుభ్రత, నిర్వహణపై వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ వీడియో విస్తృతంగా వైరల్ కావటంతో ఆస్పత్రి యాజమాన్యం తమ తప్పును ఒప్పుకున్నది. ఈ సమస్యను పరిష్కరించటం కోసం కఠినమైన ప్రయత్నాలను అమలు చేస్తామని వివరించింది. "మేము క్రమం తప్పకుండా పెస్ట్ కంట్రోల్‌ను నిర్వహిస్తాం. సమస్య మాత్రం అలాగే ఉంటే.. కఠిన చర్యలు తీసుకుంటాం" అని ఆస్పత్రి రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్ ఉయ్కే అన్నారు. ఈ ఘటనపై స్పందించిన సీనియర్ జిల్లా అధికారి.. పిల్లల వార్డును సందర్శించారు. సదుపాయాలను మరింతగా పెంచుకోవాలని ఆస్పత్రి యాజమాన్యాన్ని ఆదేశించారు. స్థానిక ఎమ్మెల్యే, మధ్యప్రదేశ్ ప్రజారోగ్య ఇంజినీరింగ్ మంత్రి సంపతీయ ఉయ్కే స్పందించారు. ఆస్పత్రిని సందర్శించారు. ఘటనను నిర్లక్ష్యపు చర్యగా అభివర్ణించారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీనియర్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్‌ను ఆదేశించారు.




## పోరాటస్ఫూర్తితో ఉద్యమిద్దాం

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ
- ఆశా వర్కర్‌పై లైంగికదాడి నిందితున్ని కఠినంగా శిక్షించాలి : సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

అంతర్జాతీయ మహిళా దినోత్సవ పోరాట స్ఫూర్తితో శ్రామిక మహిళా హక్కుల కోసం ఉద్యమిద్దామని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సీఐటీయూ జిల్లా ఆధ్వర్యంలో నిజామాబాద్ నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి సీఐటీయూ కార్యాలయం వరకు శ్రామిక మహిళలతో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సదస్సులో పద్మశ్రీ మాట్లాడుతూ.. మహిళలపై జరుగుతున్న దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా పని గంటల తగ్గింపునకు, పని పరిస్థితుల మెరుగుకై, వేతనాల పెంపుకై, ఓటు హక్కుకై సుదీర్ఘ పోరాటల ఫలితంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఏర్పడిందన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి 115 ఏండ్ల చరిత్ర ఉందని, అంతకన్నా ఎక్కువ చరిత్ర ప్రపంచ వ్యాప్తంగా మహిళల పోరాటాలకు ఉందని తెలిపారు. తరతరాల నుంచి మన సమాజంలో ఆర్థిక అసమానతలు తీవ్రస్థాయిలో వేళ్లూనుకొని ఉండటం మూలాన మహిళలు అవమానాలకు, హింసకు, దాడులకు గురౌతూనే ఉన్నారన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎంతో పురోగతిని సాధించి అభివృద్ధి వైపునకు దూసుకుపోతున్నామని మన పాలకులు చెప్పుకుంటున్నప్పటికీ ఆడ పిల్లలపై, మహిళలపై లైంగికదాడులు, హింసాత్మక దాడులు, ప్రేమోన్మాద హత్యలు పెరుగుతున్నాయని చెప్పారు. వీటికి వ్యతిరేకంగా మహిళలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. జగిత్యాలలో ఆశా వర్కర్‌పై లైంగికదాడి చేసిన నిందితున్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లాలో దళిత ఆశా కార్యకర్తపై ఫిబ్రవరి 27న శివరాత్రి రోజు డ్యూటీ చేసి ఇంటికి తిరిగి వెళుతున్న సందర్భంలో దాడి జరిగిందని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. నిందితున్ని వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కఠినంగా శిక్షించాలని, బాధిత ఆశా వర్కర్‌ను, ఆమె కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్, జిల్లా కోశాధికారి స్వర్ణ, జిల్లా ఉపాధ్యక్షులు విజయ, ఆశా యూనియన్ జిల్లా నాయకులు రేణుక, సుకన్య, రేణుక, స్వప్న, అంగన్వాడీ యూనియన్ నాయకులు సునీత, సందీప్, సుమలత, గిరిజ, ఇంద్ర, భూలక్ష్మి, శోభ, సీహెచ్ నర్స్, దివ్య తదితరులు పాల్గొన్నారు.

## సాగర్ నీటిని వెంటనే విడుదల చేయాలి

- రోడ్డెక్కిన బోనకల్ మండలం పెద్ద బీరవల్లి గ్రామ రైతులు
- డీఈ హామీతో ఆందోళన విరమణ



నవతెలంగాణ-బోనకల్

ఎండిపోతున్న మొక్కజొన్న పంటకు సాగర్ నీటిని వెంటనే విడుదల చేయాలని ఖమ్మం జిల్లా బోనకల్ మండలం పెద్ద బీరవల్లి గ్రామానికి చెందిన అన్నదాతలు డిమాండ్ చేశారు. శనివారం రావినూతల, జానకిపురం గ్రామాల మధ్య కలకోట మేజర్ బ్రిడ్జిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా రైతులు పెద్దపోలు కోటేశ్వరరావు, పెద్దపోలు రామారావు మాట్లాడుతూ.. కలకోట మేజర్ చివరి ఆయకట్టు గ్రామాలైన పెద్దబీరవల్లి, జానకీపురం, నారాయణపురం గ్రామాల్లో మొక్కజొన్న పంట ఎండిపోతుందని.. నీటిపారుదల శాఖ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవైపు వ్యవసాయ శాఖ అధికారులు, మరోవైపు నీటిపారుదల శాఖ అధికారులు పొంతనలేని సమాధానాలు చెబుతూ తమను మోసం చేస్తున్నారని తెలిపారు. వారబందీ విధానం వల్లే తమ పంటలు ఎండిపోతున్నాయని, ఎప్పుడు బంద్ చేస్తారో.. ఎప్పుడు సాగర్ నీరు ఇస్తారో.. తెలియని అయోమయ పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. వారబందీ విధానాన్ని ఎత్తివేసి నిరంతరాయంగా సాగర్ నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు దొండపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. బోనకల్ మండల వ్యాప్తంగా సాగుచేసిన మొక్కజొన్న పంటకు సాగర్ నీరందక ఎండిపోతుందన్నారు. ప్రధానంగా సాగర్ చివరి భూములకు నీరు అందటం లేదని తెలిపారు. రైతుల ఆందోళన విషయాన్ని బోనకల్ డీఈ తమ్మారపు వెంకటేశ్వర్లు, జిల్లా డీఈ ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. దాంతో శనివారం సాయంత్రం కల్లా బోనకల్ బ్రాంచ్ కెనాల్‌కు సాగర్ నీటిని విడుదల చేస్తామని, ఆదివారం సాయంత్రం కల్లా బోనకల్ మండలానికి నీరు వస్తాయని హామీ ఇచ్చినట్టు తెలిపారు. దాంతో రైతులు తమ ఆందోళన విరమించారు.

## గురుకులాల్లో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ కార్యదర్శి అలగు వర్షిణి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ కార్యదర్శి డాక్టర్ అలుగు వర్షిణి శనివారం జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ మీటింగ్‌లో బాలికలకు మరింత ధైర్యాన్ని ,మనో నిబ్బరాన్ని కలిగించేందుకు చదువులో ఒత్తిడిని ఎలా జయించాలనే విషయాలపై పలువురు ప్రముఖులతో సందేశాలను ఇప్పించారు. సమాజంలో ఒక మహిళగా ఎలా ఎదగాలి? ఎలా స్థిర పడాలి? వారి స్థానమేమిటి? సమాజం కోసం చేయాల్సిన విధుల వంటి పలు అంశాలపై వివరణలు ఇచ్చారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ చాయ్‌రతన్, యూపీఎస్‌సీ చైర్మెన్ ప్రీతి సుదాన్, స్విమ్స్ తిరుపతి ఎమ్‌డీ డాక్టర్ శిరీష, చైల్డ్ అండ్ అడోలెసెంట్ సైకాలజిస్ట్ ఫౌండర్ గీతా చల్లా తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

## 11న సర్క్యులర్ రద్దు కోసం ధర్నా

- వెలుగు వీఓఏ ఉద్యోగుల సంఘం

**అమరావతి :** వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన వీఓఏ కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 11న రాష్ట్రవ్యాప్త ధర్నా చేపట్టనున్నట్టు ఏపీ వెలుగు వీఓఏ(యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం(సీఐటీయూ) వెల్లడించింది. సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిహెచ్ రూపాదేవి, కె ధనలక్ష్మీ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వెలుగు వీఓఏలకు మూడేండ్ల కాలపరిమితి విధిస్తూ ఉద్యోగ భద్రత లేకుండా గత వైసీపీ ప్రభుత్వం సర్క్యులర్ తీసుకొచ్చిందని తెలిపారు. దీనిని రద్దు చేయాలని వీఓఏలు రాష్ట్రవ్యాప్తంగా పోరాడుతూనే ఉన్నారనీ, 2024 జనవరి 30, 31 తేదీల్లో విజయవాడలో వేలాది మందితో 36 గంటల ధర్నా నిర్వహించామని తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేస్తామని నాడు ప్రతిపక్ష టీడీపీ ఈ సభకు హాజరై హామీ ఇచ్చిందని వివరించారు. అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా ఆ సర్క్యులర్‌ను రద్దు చేయలేదని, ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 4,500 మంది వీఓఏలను అక్రమంగా తొలగించిందని, వీరిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగభద్రత, మూడు నెలల బకాయి వేతనాలు, ఇన్సూరెన్స్, అక్రమ తొలగింపులు, రాజకీయ వేధింపులు ఆపాలని, కోర్టు ఉత్తర్వులు అమలు చేయాలని, ఆన్‌లైన్‌లో పొదుపు మహిళలతో బలవంతపు సరుకుల కొనుగోళ్లు ఆపాలని, స్వావలంబన పేరుతో వసూలు చేసిన రూ.1000ల నగదు తిరిగి పొదుపు మహిళలకు చెల్లించాలనే డిమాండ్‌తో ఈ ధర్నా నిర్వహించనున్నట్టు వెల్లడించారు.

## దక్షిణ కొరియా నేత సుక్ యోల్ విడుదల

**సియోల్ :** దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ శనివారం జైలు నుంచి విడుదలయ్యారు. భౌతికంగా ఆయనను నిర్బంధించకుండా విచారణకు అనుమతించాలని పేర్కొంటూ ఆయన అరెస్టును రద్దు చేస్తూ సియోల్ జిల్లా కోర్టు ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ఈ విడుదల చోటు చేసుకుంది. జైలు బయట వేచి వున్న తన మద్దతుదారులకు అభివాదంచేస్తూ యోల్ బయటకు రావడాన్ని టీవీలు ప్రసారం చేశాయి. జనవరి 3న కొద్ది గంటల పాటు దేశంలో సైనిక పాలన విధించిన దేశంలో రాజకీయ సంక్షోభానికి కారణమయ్యారంటూ యోల్‌ను అరెస్టు చేశారు. ఆయనను అభిశంసిస్తూ ప్రతిపక్షం నేతృత్వంలోని నేషనల్ అసెంబ్లీ ఓటు వేయడంతో ఆయనను అధికారం నుంచి సస్పెండ్ చేశారు.

# ఉద్యాన పంటలకు కేంద్రం ప్రోత్సాహమేది?

- పెరుగుతున్న పండ్లు, పూలు, కూరగాయ తోటల సాగు
- పంటల సాగులో పెరుగుతున్న యంత్ర పరికరాలు
- పెరిగిన పెట్టుబడితో రైతులపై భారాలు
- వెజిటబుల్ హబ్‌గా ఉమ్మడి మెదక్
- పాలీ హౌస్, పామాయిల్ సాగుకు అందని రాయితీ
- తెలంగాణకు కేంద్రం కేటాయించింది రూ.145 కోట్లు మాత్రమే..
- జాతీయ ఉద్యాన మండలి రాయితీలూ అరకొరే



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఉద్యాన పంటల సాగు లాభసాటిగా ఉంటుందని, రైతులు వరి, పత్తికి ప్రత్యామ్నాయంగా పండ్లు, పూలు, కూరగాయాల తోటల సాగు వైపు మళ్లాలని ప్రభుత్వాలు పదే పదే చెబుతున్నాయి. తక్కువ నీటి వనరులతో ఎక్కువ పంటల సాగుకు అవకాశమున్న ఉద్యాన పంటలను ప్రోత్సహించాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన నిధుల్ని కేటాయించడంలేదు. ఉద్యానవన పంటల సాగులో యాంత్రీకరణ పెరుగుతోంది. దాంతో పంటల సాగుకు పెట్టుబడులూ భారమవుతున్నాయి. కేంద్రం నుంచి అవసరమైన నిధుల్ని కేటాయించకపోవడంతో ఉద్యానవన పంటల సాగు ఆశించిన మేరకు పెరగట్లేదని వ్యవసాయ నిపుణులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా పండ్లు, కూరగాయలు, పూల తోటలు, ఇతర వాణిజ్య పంటల సాగును ప్రోత్సహించేందుకు వ్యవసాయ యాంత్రీకరణ, విత్తన రాయితీలివ్వాలని రైతులు కోరుతున్నారు.

రాష్ట్రంలో ఉద్యానవన పంటల సాగు చాలా తక్కువనే చెప్పాలి. వివిధ పంటల సాగు విస్తీర్ణంలో ఉద్యానవన పంటల సాగు విస్తీర్ణం కేవలం 5.27 శాతం మాత్రమే ఉంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో వరి, పత్తి, ఇతర పంటలు కలిపి 15.25 లక్షల ఎకరాల్లో సాగవుతున్నాయి. ఇందులో పండ్ల తోటలైన మామిడి, జామ, బొప్పాయి, డ్రాగన్‌ఫ్రూట్స్, సపోటా వంటి పంటలు 42 వేల ఎకరాల్లో ఉంది. ఉమ్మడి మెదక్ జిల్లా 'వెజిటేబుల్ హబ్' గా పేరుగాంచింది. కూరగాయలైన టమాటా, వంకాయ, పచ్చిమిర్చి, సొరకాయ, ఉల్లి, దొండ, బెంగ, క్యాబేజీ, కాలీఫ్లవర్ వంటి పంటల సాగూ బాగానే ఉంది. ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజల అవసరాల కంటే అధికంగా కూరగాయాల్ని పండిస్తున్నారు. నిత్యం హైదరాబాద్‌తో పాటు కలకత్తా, ఢిల్లీ, చంద్లాపూర్ వంటి ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నాయి. గతంలో పాలీ హౌస్ సాగు చేసినా అది తగ్గిపోయింది. గత ప్రభుత్వంలో పామాయిల్ సాగు కూడా గణనీయంగానే జరిగింది. పూల తోటలు, పసుపు, ఆలుగడ్డతో పాటు సుగంధ ద్రవ్యాల సాగు కూడా పెరుగుతోంది. ఉద్యాన వన పంటల సాగుకు అయ్యే ఖర్చులు పెరగడంతో రైతులు అనుకున్నంత మేరకు పంటల్ని సాగు చేయలేకపోతున్నారు.

### ఉద్యాన పంటల సాగుకు అందని ప్రోత్సాహం

ఉద్యానవన పంటలు సాగు చేసే రైతులకు అవసరమైన ప్రోత్సాహం అందట్లేదు. గతంలో పాలీ హౌస్ సాగుకు 75 శాతం అనగా ఒక యూనిట్‌కు రూ.39 లక్షల సబ్సిడీ ఇచ్చేది. మూడేండ్ల తర్వాత సబ్సిడీ సాయం ఆగిపోవడంతో రాష్ట్రంలో పాలీ హౌస్ సాగు మొత్తం కుప్పకూలిపోయింది. గత ప్రభుత్వంలోనూ పామాయిల్ సాగును ప్రోత్సహించారు. మూడేండ్ల పాటు సాగుకయ్యే ఖర్చుల్లో రాయితీ ఇవ్వాల్సి ఉన్నా నిధులు సరిపడా విడుదల చేయకపోవడంతో పామాయిల్ సాగు పెరగట్లేదు. సిద్దిపేట జిల్లాలో లక్ష ఎకరాల వరకు పామాయిల్ సాగు లక్ష్యంతో ముందుకు సాగినా రాయితీలు అందని ద్రాక్ష అయ్యాయి. ఇటీవల మూడు జిల్లాల్లోనూ డ్రాగన్ ఫ్రూట్స్ సాగు పెరుగుతుంది. అయితే రైతులకు సరిపడా ప్రోత్సాహం అందట్లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పందిరి సాగు పంటలకు ఇవ్వాల్సిన సాయం కూడా విడుదల కావట్లేదు. గత ప్రభుత్వంలోనే ఉద్యానవన శాఖను నిర్వీర్యం చేయడంతో కనీసం పర్యవేక్షణ కూడా లేకుండా పోయింది. పండ్ల తోటల సాగుకు ముందుకొచ్చే రైతులకు మూడేండ్ల పాటు సాగుకయ్యే ఖర్చులన్నీ సబ్సిడీ రూపంలో అందజేయాల్సి ఉన్నా ఎక్కడా అమలు కావట్లేదు.

### పెరిగిన యాంత్రీకరణ.. అందని నిధులు

ఉద్యానవన పంటల సాగులో యాంత్రీకరణ పెరిగింది. సూక్ష్మ సేద్య పరికరాలు, పాలీ హౌస్, నెట్‌హౌస్‌ల నిర్మాణం, యంత్ర పరికరాలు, పంటల కోత తర్వాత శుద్ధి యూనిట్లు, నీటి కుంటల తవ్వకం, పైప్‌లైన్ల విస్తరణ వంటి సాగు పెట్టుబడులు విపరీతంగా పెరిగాయి. యంత్ర పరికరాల వినియోగం పెరగడంతో రైతులు అధిక పెట్టుబడుల్ని పెట్టడానికి ముందుకు రావట్లేదు. జాతీయ ఉద్యాన మండలి(ఎన్‌హెచ్‌బీ) రాయితీ పథకం ద్వారా ఇవన్నీ సమకూర్చాల్సి ఉంది. కూరగాయలు, పండ్ల తోటలు, పూల తోటల సాగులో బిందు సేద్య పరికరాలను రాయితీపై అందజేయాలి. తుంపర్ల సేద్యం వల్ల సాగునీటి పొదుపుతో పాటు విద్యుత్ వినియోగం కూడా తగ్గుతుంది. దీని వల్ల రెండు రకాల ప్రయోజనాలున్నాయి. కూరగాయల సాగుకు మొలకలు, ప్లాస్టిక్ సంచుల్ని అందజేయాలి. కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉద్యాన మండలి నుంచి ఇటీవల తెలంగాణకు కేవలం రూ.145 కోట్ల నిధుల్ని మాత్రమే కేటాయించింది. రాష్ట్రంలోని 32 జిల్లాల్లో ఉద్యానవన పంటల సాగు కోసం కేవలం రూ.145 కోట్లు మాత్రమే కేటాయించడంతో కనీసం జిల్లాకు రెండు మూడు కోట్ల నిధులు కూడా రాని పరిస్థితి ఉంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో కూరగాయాలు, పండ్ల తోటలు, పూలు, ఇతర ఉద్యాన పంటల సాగు పెరుగుతున్నప్పటికీ తగిన ప్రోత్సాహం అందకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో పాలీహౌస్, పామాయిల్, డ్రాగన్ ఫ్రూట్స్, పందిరి సాగు పంటలేసిన రైతులకు ఇప్పటి వరకు రాయితీలు అందలేదు. ఇటీవల కేటాయించిన బడ్జెట్ కూడా కొద్దిపాటి యూనిట్లకు తప్ప రైతులందరినీ ప్రోత్సహించేలా లేవని రైతులు పేర్కొంటున్నారు.

**ప్రోత్సాహకాలు పెంచాలి: జయరాజు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు**

ఉద్యాన పంటల సాగుకు ముందుకొచ్చే రైతులకు తగిన ప్రోత్సాహం అందించాలి. అందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉద్యాన మండలి నుంచి అధిక నిధులు కేటాయించాలి. కేటాయించే నిధుల్ని కూడా సకాలంలోనే విడుదల చేసి రైతులకు అందేలా చూడాలి. పండ్లు, కూరగాయలు, పూలు ఇతర ఉద్యాన పంటల వైపు రైతుల్ని మళ్లించేందుకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలను ప్రచారం చేయాలి. చిన్న, సన్న కారు రైతులకు తొలి ప్రాధాన్యత ఇచ్చి ప్రోత్సహించాలి.

## గుండెపోటుతో వ్యక్తి మృతి

### ఆర్థిక సహాయం అందజేసిన ఏఐటీయూసీ నాయకులు





**నవతెలంగాణ-తుర్కయంజాల్**

తుర్కయంజాల్ భవన నిర్మాణ కార్మికుల అడ్డా వద్ద నిర్మాణ కూలీ వెంకటయ్య(50) మిర్యాలగూడ వాసి గుండె పోటుతో శనివారం ఉదయం 9 గంటలకు మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. తర్వాత మరణించిన వెంకటయ్య కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేస్తూ...తన వంతు ఆర్థిక సహాయం అందజేశారు. దీనితో పాటు కార్మికుల ద్వారా, చిరు వ్యాపారుల ద్వారా విరాళాలు సేకరించి... వాహనం మాట్లాడి మృతుడిని అతని స్వస్థలం మిర్యాలగూడకు పంపించారు.

## ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య



**నవతెలంగాణ- హయత్‌నగర్**

ప్రస్తుతం జరుగుతున్న ఇంటర్ పరీక్షల్లో తాను ఫెయిల్ అవుతాననే భయంతో ఓ ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ లింగా రెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం.. హయత్‌నగర్‌లోని లెక్చరర్స్ కాలనీలో కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్న కర్నా వెంకట సాయి ప్రీతి(17). ఈమె స్వస్థలం పల్నాడు జిల్లా, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నది. ప్రస్తుతం జరుగుతున్న ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ అవుతానని భయానికి గురై ఇంట్లో ఎవరు లేని సమయంలో సాయంత్రం వేళలో మహిళా దినోత్సవ నాడే ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

## వెల్ఫేర్ సొసైటీ మహిళా భవనం ప్రారంభం



**నవతెలంగాణ-హయత్‌నగర్**

వెల్ఫేర్ సొసైటీ మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని బాలాజీ నగర్‌లో మహిళా భవనం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డిలు హాజరయ్యారు. తర్వాత పలువురు పలు పలు సమస్యలను ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. డ్రైనేజీ వ్యవస్థ అసంపూర్తిగా ఉందన్నారు. నూతన డ్రైనేజీ పనులు మంజూరు చేయాలని, కొంతమేర అలాగే రోడ్డు వెడల్పు చేయాలని, ట్రంక్ లైన్ వ్యవస్థ మధ్యలోనే ఆగిపోవడం జరిగిందని వివరించారు. అనంతరం సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ సమస్యలను తప్పకుండా దశల వారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ముందుగా డ్రైన్స్ నిర్మాణం చేపట్టి.. అనంతరం రోడ్ల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అలాగే ట్రంక్ లైన్స్ పనులు కూడా ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గ పరిధిలో ప్రధాన సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం అవుతున్నాయని పేర్కొన్నారు. అలాగే మీ కాలనీ నందు ఉన్న పార్క్ కూడా అతి త్వరలో అందుబాటులోకి తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మన్సూరాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి, టంగుటూరి నాగరాజు, జక్కిడి రఘువీర్ రెడ్డి, చంద్రారెడ్డి, నాగార్జున రెడ్డి, కాలనీవాసులు కొండారెడ్డి, మోహన్ రెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ గౌడ్, పరశురాం, శంకర్ రెడ్డి కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## కేశవరెడ్డి హైస్కూల్‌లో సైన్స్ ఫెయిర్

- స్కూల్ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి



**నవతెలంగాణ-సిటీబ్యూరో**

తట్టి అన్నారంలోని కేశవరెడ్డి హైస్కూల్లో సైన్స్ ఫెయిర్‌ను ఘనంగా నిర్వహించినట్టు స్కూల్ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి కాలానికి అనుగుణంగా వస్తున్న సాంకేతిక అంశాలతో నైపుణ్యాన్ని పెంపొందించడానికి ఉన్న అవకాశాలను ఉపయోగించుకోవాలని అన్నారు. ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పిల్లలకి ఏ అంశాలలో ఆసక్తి ఉన్నదో తెలుసుకొని ఆ రంగాల్లో ప్రోత్సహించడం వలన వారు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని తెలిపారు. నేటి సమాజంలో సైన్స్ ద్వారా విద్యార్థులు కొత్త ప్రయోగాలు చేస్తూ చదువులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. విద్యార్థులు వారి మేధో సంపత్తితో చేసినటువంటి పరికరాలను ప్రదర్శించి.. తమ యొక్క అభిరుచిని చాటుకున్నారని చెప్పారు. ఈ సైన్స్ ఫెయిర్‌లో మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభను వెలికితీసేందుకే విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు

- నాగోల్ పోలీస్ స్టేషన్ సీఐ సూర్య నాయక్





**నవతెలంగాణ-నాగోల్**

విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు ఎంతో ఉపయోగపడతాయని నాగోల్ పోలీస్ స్టేషన్ సీఐ ఏ. సూర్య నాయక్ అన్నారు. శనివారం నాగోలు డివిజన్ జైపురికాలనీలోని సెయింట్ జాన్స్ హైస్కూల్లో విజ్ఞాన్ మేళా-2025 విద్యా విజ్ఞానిక ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సూర్యనాయక్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో అన్ని రకాల పరిజ్ఞానాన్ని పెంపొందించాలని సూచించారు. 10వ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రాంరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ మమత, ఇంచార్జి పాషా తదితరులు పాల్గొన్నారు.

## ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా : యాదగిరి



**నవతెలంగాణ- బడంగ్‌పేట్**

పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని, రోడ్ల కు ఇరువైపులా, కాలనీలోని ఖాళీ ప్రదేశాల్లో ఎవరూ చెత్త వేసి నా జరిమానా విధించడంతో పాటు కఠిన చర్యలు తీసుకుం టామని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొ రేషన్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి అన్నారు. శని వారం మహేశ్వరం నియోజక వర్గం బడంగ్‌పేట్ మున్సి పల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న 21వ డివిజన్‌లో నాలాలను శుభ్రం చేయటంతో పాటు 30వ డివిజన్లో వివిధ కాలనీలో, 32వ డివి జన్లలో ప్రధాన రహ దారులలో ఉన్న డ్రైనేజీలను గల్పర్ మిషన్ సహాయంతో మాన్యువల్స్ శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిషనర్ సరస్వతి ఆదేశం మేరకు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మున్సిపల్ సిబ్బంది పరి సరాల పరిశుభ్రత పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసు కున్నట్టు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ చెత్తను స్వచ్ఛ ఆటో ల్లోనే వేయాలని సూచించారు. బడంగ్‌పేట్ నగరాన్ని పరి శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రజలందరీపై ఉంద న్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండడం వలన ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

### ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్

## ఇండియాలో ఘనంగా మహిళా దినోత్సవం



**నవతెలంగాణ-సిటీబ్యూరో**

ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో ఘనంగా మహిళా దినోత్సవాన్ని జరిపారు. శనివారం గచ్చిబౌలీలోని ఇఎస్‌సీఐ క్యాంపస్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆకర్షణీయమైన ప్రసంగాలు, ఉత్సాహభరితమైన ప్రసంగాలు చేశారు. లింగ సమానత్వం మరియు సాధికారతపై అర్థవంతమైన చర్చలు జరిగాయి. ఇఎస్‌సీఐ డైరెక్టర్ డాక్టర్ జీ. రామేశ్వర్ రావు సాదర స్వాగతంతో వేడుక ప్రారంభమైంది. నీటి వనరుల పునరుద్ధరణకు ఆమె చేసిన విశేషమైన కృషికి 'లేక్ లేడీ'గా ప్రసిద్ధి చెందిన మధులికా శర్మ చౌదరి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మహిళలు అన్ని రంగాలలో రాణించేలా సమ్మిళిత వాతావరణాన్ని పెంపొందించవలసిన అవసరం ఉందన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం, ప్రతి సంవత్సరం మార్చి 8న జరుపుకుంటారని, మహిళల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక మరియు రాజకీయ విజయాలను గౌరవిస్తుందని గుర్తుచేశారు. ఇది లింగ సమానత్వాన్ని పెంపొందించడానికి మరియు ప్రపంచవ్యాప్తంగా మహిళలకు అవకాశాలను సృష్టించడానికి చర్యకు పిలుపుగా కూడా పనిచేస్తోందన్నారు. డా. రామేశ్వర్ రావు మాట్లాడుతూ "అంతర్జాతీయ మహిళా దినోత్సవం అనేది మహిళల విజయాలను జరుపు కోవడానికి మరియు లింగ సమానత్వం పట్ల మా నిబద్ధతను పునరుద్ధరించడానికి ఒక అవకాశం" అని, మహిళలకు సురక్షితమైన, సమగ్రమైన మరియు వృద్ధి-ఆధారిత వాతావరణాన్ని పెంపొందించడంలో ఇఎస్‌సీఐ ఎంతో కృషి చేస్తోందన్నారు. ముఖ్యంగా పునరుద్ధరణ, నాయకత్వం మరియు మహిళల వృత్తిపరమైన వృద్ధికి సహాయక పర్యావరణ వ్యవస్థల సృష్టి యొక్క థీమ్‌లను హైలైట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇసీఐ అధ్యాపకులు, హెచ్‌ఓడీ, సిబ్బంది వారి మహిళా దినోత్సవం, సమాజంలో వారు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడారు. మహిళాదినోత్సవాన్ని పురష్కరించుకుని మహిళలకు బ్యాడ్మింటన్, మ్యూజికల్ చైర్స్ వంటి ఆటలపోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందించారు.

# ఈ సృష్టికే కారణజన్మురాలు మహిళ



**నవతెలంగాణ-ఎల్బీనగర్**

ఎన్టీఆర్ నగర్‌లోని మహాత్మా గాంధీ న్యాయ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తర్వాత కళాశాలలో మహిళా ఉపాధ్యాయులు, లా కళాశాలలో చదువుతున్న మహిళా విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీని వాస్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహాత్మా గాంధీ లా కళాశాల సెక్రటరీ గంగుల గోవర్ధన్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ పి.సత్యం, డాక్టర్ శ్రీలక్ష్మి, సువర్చలాదేవి, స్వాతి, ఐశ్వర్య, శ్రీకాంత్, రమ్యకృష్ణ, ఇంద్ర పాల్గొన్నారు.

**నవతెలంగాణ-చంపాపేట్**



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సంతోష్ నగర్ పోలీస్ స్టేషన్లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ ఈరోజు మహిళల శక్తిని, త్యాగాన్ని, సాధనలను గుర్తు చేసుకునే ప్రత్యేకమైన రోజు అని అన్నారు.

**నవతెలంగాణ - చంపాపేట్**



చంపాపేట్ శ్రీ త్రివేణి పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐఎసదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్ రెడ్డి హాజరయ్యారు. తర్వాత కార్పొరేటర్‌ను శాలువాతో ఘనంగా సత్కరిస్తూ మెమెంటో అందజేస్తూ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ త్రివేణి చైర్మెన్ సురేందర్ రెడ్డి, పాఠశాల హెడ్మాస్టర్ గోవర్ధన్ రెడ్డి, ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**నవతెలంగాణ- చంపాపేట్**



చంపాపేట్ డివిజన్‌లోని మాధవనగర్ కాలనీలో అమలా ముదిరాజ్ వారి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రంగారెడ్డి జిల్లా కబడ్డీ చైర్మెన్ మద్ది కర్ణాకర్ రెడ్డి, చంపాపేట్ డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు గోపాల్ ముదిరాజ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఊరుకొండ రమాదేవి, భూషణ్, ఉష, సుజాత, సిల్వర్ యాదమ్మ సిల్వర్ మాధవి, గోకుల్ సరోజ, పద్మ ముదిరాజ్, లలిత ముదిరాజ్, ప్రసన్న ముదిరాజ్, కవిత, స్రవంతి పాల్గొన్నారు.

**నవతెలంగాణ-హస్తినాపురం**



సమాజంలో మహిళల పాత్ర ఎంతో ఉన్నతమైనదని, వారి సేవలు వెలకట్టలేనివని వేద పాఠశాల ప్రిన్సిపాల్ దీప అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పాఠశాలలో మహిళల ఔన్నత్యాన్ని తెలిపే విధంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ప్రియాంక, స్వప్న, అధ్యాపక, సిబ్బంది బృందం పాల్గొన్నారు.

**నవతెలంగాణ-హస్తినాపురం**



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని హస్తినాపురం సత్యదేవ్ ఎంక్లేవ్ పార్కులో మహిళా పారిశుధ్య కార్మికులను లయన్స్ క్లబ్ (సవిత నగర్) వారి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సవిత నగర్ క్లబ్ ప్రెసిడెంట్ చిల్లం శెట్టి గణేష్ , సిబిడి అధికారి శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్ గంగిడి అలివేలు, ఆర్కేఆర్ కాలనీ ప్రెసిడెంట్ ప్రతాపరెడ్డి, పలువురు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

**నవతెలంగాణ-హస్తినాపురం**

సమాజంలో మహిళల కృషి లేకపోతే కుటుంబమే కాదు, సమాజం కూడా అభివృద్ధి సాధించలేదని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సుజాత నాయక్ ఆధ్వర్యంలో హస్తినాపురం డివిజన్ వార్డు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హస్తినాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు



దెంది శశిధర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్, బుడ్డ సత్యనారాయణ, ఎంటమాలజీ ఏఈ, మహిళా నాయకురాళు మమత, రేణుక, భాను, మణిశ్రీ, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, దాము మహేందర్ యాదవ్, గుర్రం చంద్రశేఖర్, అంతటి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**నవతెలంగాణ-కొత్తపేట**



మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విజేందర్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

**నవతెలంగాణ - కొత్తపేట**



కొత్తపేట కార్పొరేటర్ కార్యాలయంలో కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ ఆధ్వర్యంలో డివిజన్ బీజేపీ అధ్యక్షులు మంచి రాజేష్ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తర్వాత మహిళలను శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పవన్, డివిజన్ అధ్యక్షుడు చందు, మహిళలు పాల్గొన్నారు.

**నవతెలంగాణ-సిటీబ్యూరో**

మహిళా దినోత్సవం సందర్భంగా ఓజోన్ హాస్పిటల్‌లో



ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హాస్పిటల్ సీవోవో శ్రీనివాసరావు, డైరెక్టర్ ఇంద్రసేనారెడ్డి, డైరెక్టర్ మధుసూదన్ రెడ్డిలు మాట్లాడారు. ఒకప్పుడు మహిళలు ఇంటికే పరిమితం అయ్యారు.. కానీ ఇప్పుడు వారు అన్ని రంగాలలో రాణిస్తున్నారని



కొనియాడారు. ఇంట్లో పనులు చేసుకుంటూ, బయట ఉద్యోగాలు చేసుకుంటూ, పిల్లలను చూసుకుంటూ మహిళలు బలహీనులు కాదు బలవంతులు అని నిరూపించుకుంటున్నారు. ఓజోన్ హాస్పిటల్‌లో పనిచేసే ప్రతి మహిళ ఉద్యోగులకూ ఓజోన్ హాస్పిటల్ అండగా ఉంటుదని హామీ ఇచ్చారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఓజోన్ హాస్పిటల్‌లో సర్వేకల్ క్యాన్సర్ 50% డిస్కౌంట్ ఒక వారం ఇస్తున్నామని, ట్రిబుల్ నైన్ ప్యాకేజీతో కొన్ని రకాల పరీక్షలు చేస్తున్నామని వెల్లడించారు. ఉమెన్స్‌కి జనరల్ ఫిజీషియన్ గైనిక్ పరీక్షలు ఈ వారం ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. డెలివరీ కేసుల్లో మార్చి 31 వరకు 25% రాయితీ ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**నవతెలంగాణ-ఎల్బీనగర్**



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చేన్నగారి లక్ష్మారెడ్డి.. మహేశ్వరం నియోజకవర్గం మహిళలందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలులి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెలవు లేకుండా నిరంతరం శ్రమించే ఆదిపరాశక్తి, నిత్యం కుటుంబం కోసం ఆలోచించే ఆదర్శమూర్తి, బిడ్డల కడుపు ఆకలి కోసం నిరంతరం పరితపించే మాతృమూర్తి, ఈ సృష్టికే కారణజన్మురాలైన దేవతా మూర్తి, మన జన్మకు కారణమైన స్త్రీ మూర్తిని గౌరవిద్దాం అన్నారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాలలో మహిళలు సాధించిన విజయాలను గౌరవించడానికి ప్రతి ఏడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మార్చి 8న నిర్వహించుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మహిళా నాయకురాలు అమృత నాయుడు, రాజు నాయక్, శివగాళ్ళ యాదయ్య, సేవియ్య నాయక్, పజిల్ ఖాద్రి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**నవతెలంగాణ-హయత్‌నగర్**



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పలు చోట్ల మహిళలను, ఆయా శాఖల్లో పనిచేసే అధికారులను ఘనంగా సన్మానించి, శాలువాలతో సత్కరించారు. అదేవిధంగా హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళా సిబ్బందిని హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో సన్మానించారు.



భారత జాతీయ మహిళా సమాఖ్య రంగారెడ్డి జిల్లాలోని హయత్ నగర్ మండలంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా హయత్‌నగర్ మండల భారత జాతీయ, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సుజాత అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, రంగారెడ్డి



జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండిలు జెండా ఆవిష్కరించారు.

డిపో సహాయ మేనేజర్ విజయ కుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్, సుచరిత, తెలంగాణ ఉద్యమ రచయిత్రి దాసోజు.లలిత, ప్రముఖ దంత వైద్య నిపుణులు డాక్టర్ అర్పిత, డిపో మేనేజర్ విజయ్ పాల్గొన్నారు.

**నవతెలంగాణ- బడంగ్‌పేట్**



మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 31వ డివిజన్ పరిధిలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నరసింహారెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాము గౌడ్, గిరి ముదిరాజ్, అమృత నాయుడు, పద్మశ్రీ, సుగుణ, సునీత గౌడ్, కవిత, పద్మవతి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

**నవతెలంగాణ- బడంగ్‌పేట్**



మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాలాపూర్ మండలం సీపీఐ(ఎం) పార్టీ, ఐద్వా కమిటీల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బడంగ్‌పేట్‌లోని సుబ్రమణ్యం కాలనీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం)పార్టీ నాయకులు వి.శేఖర్ యాదవ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేఖ విధానాలను అవలంబిస్తూ.. ప్రజా సమస్యలను పరిష్కారం చేయడంలో పూర్తిగా విఫలమైనట్లు తెలిపారు. అనంతరం బాలాపూర్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. మహిళా సంఘం నూతన అధ్యక్షులుగా అనురాధ, కార్యదర్శిగా ఎం.శశిరేఖ, ఉపాధ్యక్షులుగా అమృత సులోచన, సహాయ కార్యదర్శిగా వర్ష సరిత తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

**నవతెలంగాణ-బడంగ్‌పేట్**

మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బడంగ్‌పేట్‌లోని హెర్బల్ లైఫ్ సెంటర్‌లో శనివారం జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నరసింహారెడ్డి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## నేర నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

● ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-కాప్రా

నేర నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. విస్టా హెూమ్స్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని తెలిపారు. కీలకమైన కేసుల ఛేదనలో సీసీ కెమెరాల పాత్ర గణనీయంగా ఉందన్నారు. ఇటీవల కాలంలో సీసీ కెమెరాల వినియోగం భారీగాపెరిగిందన్నారు. కాలనీల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని కోరారు. అనంతరం మహిళ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో విస్టా హెూమ్స్ కార్యవర్గం, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ పోలీస్ స్టేషన్‌లో మహిళా దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ పోలీస్ స్టేషన్‌లో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సత్యనారాయణ మహిళా ఎస్సైలు అనిత, ఏఎస్ఐలు, కానిస్టేబుళ్ళకు శాలువా కప్పి సన్మానించారు. కేక్ కట్ చేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సైలు మన్మద్, అశోక్, కిషన్‌లు పాల్గొన్నారు.

## అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 5కే రన్



నవతెలంగాణ-కాప్రా

మహిళ దినోత్సవం సందర్భంగా అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏఎంఆర్ ప్లానెట్ నుంచి నిర్వహించిన 5కేరన్ కార్యక్రమాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట హౌసింగ్ బోర్డు కాలనీ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్, బీఆర్ఎస్ నాయకులు మహేష్ గౌడ్, అభయ ఫౌండేషన్ చైర్మెన్ ఉషా తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం




నవతెలంగాణ-కాప్రా

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం ఏఎస్‌రావు నగర్ డివిజన్‌లో కాప్రా ఆర్యవైశ్య సంఘం, కాప్రా ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో వాసవీ భవన్‌లో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవితో కలిసి పాల్గొన్న ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ రజితా పరమేశ్వర్ రెడ్డి, ఏఎస్‌రావు నగర్ కార్పొరేటర్ శిరీష రెడ్డి, మౌలాలి కార్పొరేటర్ సునీత యాదవ్, ఆర్యవైశ్య సంఘం మహిళా అధ్యక్షురాలు జి.నాగలక్ష్మి, జనరల్ సెక్రెటరీ కె. ఉమా, కృష్ణవేణి ట్రెజరర్ ఎం. కృష్ణకుమారి, భవానీ, శ్రవంతి, సంధ్య, కవిత, సంగీత, కాప్రా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు నాగేశ్వరరావు, సెక్రెటరీ శ్రీనివాస్, ఈశ్వరరావు, నారాయణ గుప్తా ,పెద్ది నాగరాజు,పెద్ది శ్రీనివాస్, రవి ప్రకాష్, శ్రీనివాసరావులి, కాంగ్రెస్ నాయకులు మేడ్చల్ మల్కాజిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ విట్టల్ నాయక్ , అంజి రెడ్డి, పెద్ది నాగరాజు, శ్రీకాంత్ రెడ్డి, అనిల్, శ్రీనివాస్, బాషా తదితర నాయకులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ సంతోష్ కుమార్ కుటుంబానికి రూ.32,116 ఆర్థిక సాయం



నవతెలంగాణ-కాప్రా

జర్నలిస్టు S1tv రిపోర్టర్ కమల్ సంతోష్ కుమార్ అకాల మృతి పట్ల కాప్రా ప్రెస్ క్లబ్ సభ్యులు శనివారం మృతుడి ఇంటికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 32,116 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కాప్రా ప్రెస్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ సంతోష్ మృతి బాధాకరమన్నారు. ఆయన కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు పటేల్ నరసింహ యాదవ్, డి.కిరణ్ కుమార్, కోశాధికారి యాట రాజు, కాప్రా ప్రెస్ క్లబ్ సభ్యులు బెలిదే అశోక్, ఎం పల్లి పద్మా రెడ్డి, గుమ్మడి హరిప్రసాద్, కె వెంకటేష్ , కీర్తి శ్రీనివాస్, జి. శ్రీనివాసరావు, జి. రోజా రాణి, వీ. రామచంద్ర మూర్తి, వి. రవి. గంగి కృష్ణ, పి. దిలీప్ కుమార్, డి. శ్రీనివాసరావు, ఆంజనేయులు, ఎన్. నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## అనురాగ్ యూనివర్సిటీలో రక్తదాన శిబిరం



నవతెలంగాణ - పోచారం

పోచారం మున్సిపల్ పరిధిలోని వెంకటాపురం అనురాగ్ యూనివర్సి టీలో శనివారం ఎన్ఎస్ఎస్ యూనిట్-3 ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అనురాగ్ యూని వర్సిటీ ప్రొఫెసర్ విజయకుమార్ మాట్లాడుతూ.. రక్తదానం చేయడం ద్వారా ఒక జీవితాన్ని ఇవ్వగలుగుతామన్నారు. ప్రతి ఒక్కరూ ఏ అపోహ లేకుండా రక్తదానం చేయడం బాధ్యతగా భావించాలని చెప్పారు. అనురాగ్ యూనివర్సిటీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ మల్లేశం మాట్లాడుతూ..అన్ని దానాల కంటే రక్తదానం గొప్పదన్నారు. ఆపదలో ఉన్న వ్యక్తికి రక్తదానం చేయడం బాధ్యతగా భావించాలన్నారు. కాగా 247 యూనిట్స్ రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్-3 ప్రోగ్రామ్ ఆఫీసర్ పురుషోత్తం, డిపార్ట్మెంట్ కోఆర్డినేటర్ బాలకృష్ణ, కోటేశ్వరరావు, నవీన్, విద్యాసాగర్, డాక్టర్ రాజేష్ పాల్గొన్నారు.

## శాంతి సాయిజెన్ శేఖర్‌కు శుభాకాంక్షలు..



నవతెలంగాణ - చర్లపల్లి

ప్రపంచ మహిళా దినోత్సవం పురస్కరించుకొని నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్‌ను బీఆర్ఎస్ పార్టీ నాయకులు శనివారం వారి నివాసంలో కలిసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేకల ముత్యంరెడ్డి, విఠల్ యాదవ్, దాసరి కర్ణ, కట్ట బుచ్చన్న గౌడ్, చంద్రశేఖర్, విష్ణు, కెప్టెన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో ఉమెన్స్ డే

● పలువురు మహిళలకు సన్మానం



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో కమలా నగర్ ఆఫీస్‌లో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..అంతర్జాతీయ మహిళా దినోత్సవం శ్రామిక మహిళల పోరాట స్ఫూర్తి అని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుక కాదు, పోరాట దిక్సూచి అని అన్నారు. గతంలో మహిళలు పోరాడి సాధించిన హక్కులు నిలుపుకుంటూ భవిష్యత్తులో మరిన్ని పోరాటాలతో హక్కులు సాధించాలని కోరారు. పురుషాధిక్య సమాజంలో గొప్ప గొప్ప కార్యాలు చేసిన వారిని హీరోలుగా ప్రచారం చేస్తున్నారని, మహిళలను కూడా మహిళా హీరోలుగానూ, చాలా సందర్భాల్లో హీరోయిన్లు గాను చిత్రీకరిస్తున్నారని చెప్పారు. ఇది సరైన దృక్పథం కాదన్నారు. ప్రత్యామ్నాయ సంస్కృతిలో భాగంగా తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం మహిళల్లో స్ఫూర్తిదాయకమైన పోరాట యోధురాళ్లను "షీరోష్"గా గౌరవింస్తుందన్నారు. తమ హక్కుల కోసం పోరాడుతున్న ఆశా వర్కర్లు, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులు సేవారంగంలో కృషి చేస్తున్నారని తెలిపారు. వారికి ప్రాతినిధ్యం వహిస్తున్న మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆశా వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ఎం. రేవతిని, ఐద్వా జిల్లా నాయకురాలు చల్లా లీలావతి, అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షులు సునీతను, స్ఫూర్తి గ్రూపు నాయకులు సౌమ్య, కార్యదర్శి బి. శోభారాణిని స్ఫూర్తి గ్రూప్ నాయకులు నర్సింగ్ రావు , మధ్యాహ్న భోజనం యూనియన్ ప్రధాన కార్యదర్శి ప్రేమలతను, స్ఫూర్తి గ్రూపు నాయకురాలు అల్లూరి శారద, రాష్ట్ర వర్కింగ్ ఉమెన్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రమను, సీహెచ్ లీలావతిలను చేనేత కండువాలతో, మేము సైతం పుస్తకాలను అందించి సన్మానించారు. జిల్లా ఉద్యమాన్ని సమన్వయ పరుస్తున్న జె.చంద్రశేఖర్‌ను రామి శెట్టి రోశయ్య రచించిన "లోకం పోకడ", స్ఫూర్తి గ్రూప్ ప్రచురించిన మేము సైతం.. పుస్తకాలతో అభినందించారు. ఈ సందర్భంగా గౌరవించబడిన నాయకులు మరింత పట్టుదలతో పోరాడుతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమాన్ని సీఐటీయూ నాయకులు కేకే ఉన్నికృష్ణ, శ్రీనివాస్ సమన్వయపరిచారు. ఈ కార్యక్రమంలో కృష్ణమాచారి, శివరామకృష్ణ, చల్లా లీలావతి, నర్సింగరావు, ధరణి పత్రిక ఎడిటర్ రోజా రాణి, గుమ్మడి వారి ప్రసాద్, వెంకటేశ్వరరావు, శారద, సౌమ్య, యాదగిరి రావు, మరియు ట్రేడింగ్ నాయకులు, మహిళా కార్మికులు హాజరయ్యారు. సౌమ్య వందల సమర్పణతో కార్యక్రమం ముగిసింది.



## కోనాయిపల్లిలో అసైన్డ్ భూముల్లో అక్రమ తవ్వకాలు



నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ మండలం కోనాయిపల్లి గ్రామంలోని అసైన్డ్ భూముల్లో మట్టి అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ఈ మట్టిని మండలంలోని గోదాములు, ఇతర వాణిజ్య అవసరాలకు టిప్పర్లలో తరలిస్తూ డబ్బులు దండుకుంటున్నారు. బహిరంగ మార్కెట్‌లో ఒక టిప్పర్ మట్టికి రూ.4వేల నుండి రూ.5వేల వరకు ధర పలుకుతుంది. దీనిని ఆసరాగా చేసుకున్న మట్టి మాఫియా వారాంతపు సెలవు రోజుల్లో రాత్రి సమయాల్లో యథేచ్ఛగా మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మండల తహశీల్దార్ శైలజ ఇటీవల క్రమశిక్షణ చర్యల కింద నాగర్‌కర్నూల్ జిల్లాకు బదిలీ అయ్యారు. అప్పటి నుండి పూర్తి స్థాయిలో తహశీల్దార్ లేకపోవడంతో మట్టి మాఫియా రెచ్చిపోయిమట్టి తవ్వకాలు కొనసాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు మట్టి తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



నవతెలంగాణ-ఉప్పల్

మహిళలు అన్ని రంగాల్లో రాణించి, స్వయం శక్తి ముందుకెళ్లాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మహిళ దినోత్సవం సందర్భంగా ఉప్పల్ భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ మేకల మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో, మంజుల, స్వప్న, స్వర్ణలత, రవళి నిర్వహణలో భగాయత్ హెచ్ఎండీఏ అవుట్ 8 ఎకరాల పార్క్ స్థలంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాగిడి లక్ష్మారెడ్డి, బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి, ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి, రామంతపూర్ కార్పొరే టర్ శ్రీవాణి వెంకట్రావు, రామం తపూర్ మాజీ కార్పొరేటర్ గంధం జోత్స్న, బీఆర్ ఎస్ నాయకురాలు కల్పన పాల్గొన్నారు.

## స్వేచ్ఛ, సమానత్వం మహిళల హక్కు

● సీఐటీయూ ఘట్కేసర్‌మండల కార్యదర్శి ఎన్.సబిత



నవతెలంగాణ - పోచారం

స్వేచ్ఛ, సమానత్వం అనేది మహిళల హక్కు అని సీఐటీయూ ఘట్కేసర్ మండల కార్యదర్శి ఎన్. సబిత అన్నారు. శనివారం పోచారం మున్సిపల్ పరిధిలో అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం చౌదరిగుడలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు చింతల యాదయ్య, ఎన్. సబితలు మాట్లాడుతూ.. అంతర్జాతీయ శ్రామిక మహిళా అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. దోపిడి పీడనలపై పోరాటమే మహిళా దినోత్సవం అన్నారు. 1857 మార్చి 8న అమెరికాలోని వస్త్రా పరిశ్రమలో పని చేస్తున్న వర్కింగ్ ఉమెన్ లిమిటెండ్ పోరాటం చేసి ఫ్యాక్టరీలో అమలులో ఉన్న 16 పని గంటలను 10 పని గంటలకు కుదించారని తెలిపారు. రష్యాలో 1917 మార్చి 8న విప్లవాత్మక రష్యన్ మహిళలు శాంతి కావాలంటూ డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారని గుర్తు చేశారు. మహిళలు విముక్తి, సోషలిస్టు వ్యవస్థను స్థాపించడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రామిక మహిళలు ఎల్లమ్మ, యాదమ్మ, సత్తమ్మ, రేణుక, రజిత, సుశీల, లక్ష్మి, సుజాత, సుమిత్ర, భారతమ్మ, అంజమ్మ, లక్ష్మణ్, సుధాకర్, నరేష్, తదితరులున్నారు.

## చర్లపల్లిలో పారిశ్రామిక ఎగ్జిబిషన్‌కు విశేష స్పందన



నవతెలంగాణ - చర్లపల్లి

చర్లపల్లి డివిజన్ పరిధిలోని పారిశ్రామిక వాడలో చర్లపల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఐదో ఎగ్జిబిషన్‌కు విశేష స్పందన లభించింది. శనివారం ముగింపు కావడంతో కీసర మండలం చీర్యాల గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాల విద్యా ర్థులు పెద్ద ఎత్తున ఎగ్జిబిషన్‌ను సంద ర్శించారు. ఈ ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన పారిశ్రామిక ఉత్పత్తులు సందర్శ కులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పలు పారిశ్రామిక వ్యవసాయ ఎలక్ట్రానిక్ పనిముట్ల గురించి సందర్శకులు నిర్వా హకులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి ఇండస్ట్రియల్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ కె.గోవింద్ రెడ్డి, మియ్యాపురం రమేష్, చంద్రశేఖర్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, గోపాల్ రావు, పిఎస్ మోహన్, మూర్తి, రమేష్ కృష్ణ, కామేశ్వరరావు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



## సుఖ ప్రసవం చేసిన కీసర 108 సిబ్బంది



తల్లీ బిడ్డా క్షేమం

నవతెలంగాణ-కీసర

మేడ్చల్ జిల్లా కీసర మండల పరిధిలోని బోగారం గ్రామ పరిధిలోనో బీహార్ రాష్ట్రానికి చెందిన నజిమ కాతునా అనే యువతికి పురిటి నొప్పులు రావడంతో కుటుంబీకులు 108కు సమాచారం అందించారు. వెంటనే కీసర 108 సిబ్బంది చిత్రం రవి, పైలట్ రాంబాబు వచ్చి పురిటి నొప్పులతో బాధపడుతున్న యువతిని పరీక్షించారు. ఈఆర్‌సీపీ డాక్టర్ సలహాతో ఈఎం టీ చిత్రం రవి ఆమెకు నార్మల్ డెలివరీ చేశారు. తల్లీ బిడ్డా ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు. అనంతరం తల్లీ బిడ్డాను కీసర ప్రభుత్వ హాస్పిటల్ తీసుకొచ్చి ఇంజక్షన్ ఇప్పించారు. కీసర 108 సిబ్బందికి నజిమ కాతునా కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## ట్రాఫిక్ మహిళా కానిస్టేబుల్‌కు వాసవీ క్లబ్ సభ్యుల సన్మానం




నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ మండల వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేడ్చల్ వాసవీ క్లబ్ అధ్యక్షులు తొడుపునూరి సిద్ధిరాములు గుప్తా, ప్రధాన కార్యదర్శి ఉపేందర్, కోశాధికారి సంతోష్‌లు మున్సిపాలిటీ పరిధిలోని మహిళా పారిశుధ్య కార్మికులు, మహిళా కానిస్టేబుళ్లకు శాలువాలు కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అంబేద్కర్ విగ్రహం సమీపంలో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ మహిళా కానిస్టేబుల్ యాదమ్మను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాసవీ సంఘం మాజీ అధ్యక్షులు మందుముల కృష్ణమూర్తి గుప్తా, తాళ్లపల్లి రమేష్ గుప్తా,క్లబ్ సభ్యులు నగేష్ పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి : నాగరాణి గుప్తా



నవతెలంగాణ - జవహర్ నగర్

మహిళలు అన్ని రంగాలలో రాణించాలని జవహర్ నగర్ మాజీ డిప్యూటీ మేయర్ సతీమణి రెడ్డి శెట్టి నాగరాణి గుప్తా అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జవహర్ నగర్ నగరపాలక సంస్థ పరిధిలోని మోహన్ రావు కాలనీలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ పాల్గొని స్థానిక మహిళలతో కలిసి కేక్ కట్ చేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 8వ డివిజన్ మహిళలు, రాధిక, రజిత, భారతి, వసంత, మౌనిక, హారిక, బాలమణి, రాణి, పద్మ, ఆశ వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో విష్ట హెూమ్స్ కుటుంబాల ఐక్యత అభినందనీయం

● ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ - చర్లపల్లి

కాలనీ అంతా ఒక మాట ఒక బాటగా కలిసి అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్న మోడీ విస్టా హెూమ్స్ కుటుంబాల ఐక్యత అభినందనీయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని శనివారం మోడీ విస్టా ఓమ్స్‌లో జరిగిన మహిళా దినోత్సవ వేడుక, సీసీటీవీ కెమెరాల ప్రారంభం, స్వచ్ఛ కార్యక్రమంలో చర్లపల్లి కాలనీల సమాఖ్య సీసీఎస్ ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. విస్టా ఓమ్స్ అధ్యక్షులు రాళ్ల బండి శ్రీనివాస్ అధ్యక్షత నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విష్ట హెూమ్స్‌లో మంచినీటి బిల్లు సమస్యపై జలమండలి ఎండీ అశోక్ రెడ్డికి తక్షణమే చర్యలు చేపట్టాలని ఆదేశాలు ఇచ్చానని తెలిపారు. విస్టా ఓమ్స్ కాలనీ గేట్ నుంచి మెయిన్ రోడ్డు సమస్య విషయమై చర్యలు తీసుకుంటానన్నారు. విస్టా హెూమ్స్ కుటుంబాలకు ఏ చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి కాలనీల సమాఖ్య సీసీఎస్ అధ్యక్షులు ఎంపల్లి పద్మారెడ్డి, చర్లపల్లి డివిజన్ కన్టెస్టెడ్ కార్పొరేటర్ నేమూరి మహేష్ గౌడ్, పాండాల శివకుమార్ గౌడ్, గంప కృష్ణ, శ్రీకాంత్ రెడ్డి, జైపాల్ రెడ్డి, వీరబ్రహ్మం, కళ్యాణ్ బోన్ల, జై కృష్ణ, వెంకటేష్, మల్లేష్ పాల్గొన్నారు.

## సమాజంలో మహిళల పాత్ర ప్రత్యేకమైనది



● మాజీ కార్పొరేటర్ సంగారెడ్డి శారదా మనోధర్ రెడ్డి

నవతెలంగాణ - జవహర్ నగర్

సమాజంలో మహిళల పాత్ర ప్రత్యేకమైనదని జవహర్ నగర్ మాజీ కార్పొరేటర్ సంగారెడ్డి శారదా మనోధర్ రెడ్డి అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బాలాజీ నగర్‌లోని 9వ డివిజన్ సంతోష్ నగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని మహిళను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. సమాజ మనుగడలో స్త్రీ పాత్ర చాలా గొప్పదని తల్లిగా, చెల్లిగా, ఇల్లాలుగా, శ్రామికురాలుగా అనేక బాధ్యతలు నిర్వహిస్తూ సహనంతో కుటుంబాన్ని ముందుకు నడిపించడంలో వారి పాత్ర మరవలేనిదన్నారు. కుటుంబ బాధ్యతలు చూస్తూనే వివిధ వృత్తులలో రాణిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో 9వ డివిజన్ మహిళలు వినోద, జ్యోతి, హసీనా, బాలమణి, నాగేశ్వరి, ధనలక్ష్మి, లక్ష్మి, రజిత, మమత, సుజాత, స్రవంతి, రజిని, సరిత, పుష్పమ్మ పద్మ, జ్యోతి, స్వప్న, మంజుల, వాణి, సునీత, స్వర్ణలత, పాల్గొన్నారు.

## మెగా హెల్త్ క్యాంప్ ఏర్పాటు అభినందనీయం

● ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ - చర్లపల్లి

కార్మికులు, ప్రజల కోసం తెల్లపల్లి ఇండస్ట్రియల్ అసోసియేషన్ వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం చర్లపల్లి ఇండస్ట్రియల్ అసోసియేషన్ ఫేజ్-3 ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా హెల్త్ క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ.. ఆర్ ఆర్ హాస్పిటల్ వారి సౌజన్యంతో మెగా హెల్త్ క్యాంపును ఏర్పాటు చేసిన ఫేజ్-3 ఇండస్ట్రియల్ వాళ్లకు కృతజ్ఞతలు తెలిపారు. చర్లపల్లి ఇండస్ట్రియల్ అసోసియేషన్ ఫేజ్-3 ప్రెసిడెంట్ రమేష్ మాట్లాడుతూ.. అసోసియేషన్ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపులు తరచుగా నిర్వహిస్తామని, వీటి ద్వారా పారిశ్రామిక వాడలోని కార్మికులు, ఉద్యోగులే కాకుండా పరిసర ప్రాంతాల్లోని ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పారిశ్రామికవేత్తల సంఘం ప్రెసిడెంట్ సుధీర్ రెడ్డి, ఐలా చైర్మెన్ రోషిరెడ్డి, మిరుపాల గోపాల్ రావు, గోవింద్ రెడ్డి, సునీల్, సురేష్ కుమార్, బాబర్ ఆలీ, సతీష్ బాబు, శేషా రెడ్డి, ఆర్ ఆర్ హస్పటల్ డాక్టర్లు మహమ్మద్ రఫీ షేక్, రియాజ్ షేక్, సల్మా సుల్తానా, రజియా సుల్తానా, బిఆర్ఎస్ పార్టీ నాయకులు మహేష్ గౌడ్, పాండాల శివకుమార్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



## నేషనల్ నవ క్రాంతి పార్టీ జాతీయ కార్యదర్శిగా మంతూరి ఆంజనేయులు



నవతెలంగాణ - జవహర్‌నగర్

నేషనల్ నవ క్రాంతి పార్టీ జాతీయ కార్యదర్శిగా మంతూరి ఆంజనేయులు ను నియామిస్తూ ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు కనకం శ్రీనివాసరావు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా సిరిసినగండ్ల గ్రామానికి చెందిన ఆంజనేయులు తెలంగాణ ఉద్యమకారుడిగా, అంబేద్కర్ పూలే మహాజన సంఘం వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులుగా చేసిన సేవలను గుర్తించి ఈ బాధ్యతలను అప్పగించినట్లు తెలిపారు. అనంతరం ఆంజనేయులు మాట్లాడుతూ నాపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన పెద్దలకు ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ ఆశయాలను సిద్ధాంతాలను, జాతీయ స్థాయి నుండి, గ్రామ స్థాయి వరకు విస్తరించి నేషనల్ నవ క్రాంతి పార్టీ అభివృద్ధికి తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు.



కాప్రా సర్కిల్‌లో మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం నాచారం పారిశుధ్య సిబ్బందికి సానిటరీ సూపర్వైజర్ సుదర్శన్ పాదపూజ చేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏ భూలక్ష్మి, రాజేష్, యాకస్వామి తదితరులు పాల్గొన్నారు. - నవతెలంగాణ, కాప్రా




వెంకటేశ్వర నగర్ సత్ జ్ఞాన్ హైస్కూల్‌లో శనివారం ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ లయన్ చింతల మల్లేశం ఉపాధ్యాయురాలతో కలిసి కేక్ కట్ చేసి , అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పాఠశాలలో బోధిస్తున్న ఉపాధ్యాయురాలను, పనిచేస్తున్న మహిళా సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సృష్టిలో తమకంటూ ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించిన మహిళా మూర్తులందరినీ ఆదర్శంగా తీసుకో వాలని, సమాజంలో మహిళలకు గౌరవమిచ్చినప్పుడే ఈ సమాజం గౌరవింపబడుతుందన్నారు.

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం 129 డివిజన్ సూరారం పరిధిలోని కార్పొరేటర్ మంత్రి సత్యనారయణ కార్యాలయం వద్ద మహిళా దినోత్సవ కార్యక్రమాలను మహిళ అధ్యక్షురాలు హేమలత రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. విచ్చేసిన మహిళలందరికీ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, చెక్క సురేష్ బషీరుద్దీన్ శివ గుప్తా, షానజ్, రాణి, లావణ్య, అర్శ, ధనలక్ష్మి, సుభద్ర మహిళ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

## గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో జగద్గిరిగుట్ట పైన వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో గల మంచినీటి ట్యాంక్ పైకి ఎక్కి కింద పడి ఓ వ్యక్తి చనిపోయాడని సమాచారం తెలుసుకొని ఎస్సై శంకర్ సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి వెళ్లారు. మృతి చెందిన వ్యక్తికి సుమారు 40 నుంచి 45 సంవత్సరాల వయసు ఉంటుందని అతని ఒంటిపై గోధుమ రంగు షర్టు, చాక్లెట్ కలర్ పాయింట్ ధరించి ఉన్నాడని తెలిపారు. జంధ్యం వేసుకున్నాడని అతని షర్ట్ మీద ఏదో కంపెనీలో పనిచేస్తున్న లోగో ఉన్నదని తెలిపారు. మృతి చెందిన వ్యక్తిని గుర్తు పడితే జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని తెలిపారు. ఎస్ఐ.శంకర్ ఫోన్ నెంబర్ 871256 8311 కు సమాచారం అందించాలని కోరారు.

## బీసీలు రాజ్యాధికారం వైపు పోరాడాలి



- ఓబీసీ జాతీయ అధ్యక్షులు, ఐ.ఎన్.టి.యు.సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్ పిలుపు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

బీసీలందరూ రాజ్యాధికారం వైపు పోరాడాలని ఓబీసీ జాతీయ అధ్యక్షులు, ఐ.ఎన్. టి.యు.సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్ పిలుపునిచ్చారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం తెలుగుతల్లి నగర్ కాలనీలోఏర్పాటు చేయబోయే సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణకు రావాలని.. కౌండిన్య గౌడ సంఘం సూరారం అధ్యక్షులు బి.శ్రీనివాస్ గౌడ్.ఎం.శ్రీనివాస్ తదితరులు శనివారం జగద్గిరిగుట్టలోని మగ్దూం నగర్ లో గల ఆయన నివాసంలో కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వాయి పాపన్న బడుగు, బలహీన వర్గాలను ఐక్యపరిచి గోల్కొండ కోట ను పరిపాలించాడన్నారు. బీసీలు సర్వాయి పాపన్న స్ఫూర్తి గా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ జాతీయ ఉపాధ్యక్షులు ఎం.జనార్ధన్, రవిశంకర్, యాదగిరి పాల్గొన్నారు.

## మహిళకు కుట్టు మిషన్ అందజేత



నవతెలంగాణ-సిటీబ్యూరో

పేదలకు సెవెన్ రేస్ ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ సారా సహకారం అందిస్తున్నారు. అడ్డగుట్టలో నివాసం ఉండే భారతికి శనివారం ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా కుట్టు మిషన్‌ను అందజేసి ఉదారత ను చాటుకున్నారు. పేద విద్యార్థులు, మహిళలు, వికలాంగులకు సహాయ సహకారాలు అందిస్తూనే ఉంటాను అని డాక్టర్ సారా ఈ సందర్భంగా తెలిపారు.


## సేవలందించిన మహిళలకు అవార్డులు ప్రదానం



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇంటర్నేషనల్ ఉమెన్స్ డే సందర్భంగా శనివారం బంజారాహిల్స్ తాజ్ డెక్కన్ హెూటల్‌లో సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమాజంలో వివిధ స్థాయిలో వారు చేస్తున్న సేవలను గుర్తించి మహిళా మణులకు అవార్డులను బహుకరించారు. మన్నేబోయిన దుర్గా మాధవి యాదవ్‌కు మహిళా పురస్కార్ -2025 అవార్డును, ఎంబీ దుర్గా మాధవి యాదవ్, ఎం.రేణుక యాదవ్, డాక్టర్ జి.ప్రణీత, ప్రిన్స్ రన్ ఆఫ్ యార్ ఖాన్ నిజాం వారసులు అవార్డులను సినీ నటుడు సుమన్, పూనం సినిమా హీరోయిన్, పవన్ కుమార్, లక్ష్మి శ్యామల కృష్ణమరాజు. తదితరులు అందజేశారు. మహిళలు ప్రపంచంలోనే గొప్ప మేధస్సు కలిగిన వారని కొనియాడారు.

## మహిళలను గౌరవిద్దాం.. ప్రగతికి బాటలు వేద్దాం..



- ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్

నవతెలంగాణ-బాలానగర్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఫతేనగర్ డివిజన్ పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి స్థానిక కార్పోరేటర్ పండాల సతీష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి మహిళలకు మహిళాదినోత్సవ శుభాకాంక్షలను తెలిపారు. ఈ మేరకు వారికి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కార్పోరేటర్ మాట్లాడుతూ మహిళలకు ఉన్న శక్తి అపారమైనదని వారిని గౌరవిస్తూ ప్రగతికి బాటలు వేద్దాం అని అన్నారు. సాధారణంగా మహిళలు దయగల వారు, వారికి బలం మరియు అపరిమిత సామర్థ్యం ఉన్నాయి. సమస్యను అర్థం చేసుకుని వాటికి తగిన పరిష్కారాన్ని అందజేయగల సామర్థ్యం గలవారన్నారు. అంతే కాకుండా పురుషులతో సమానంగా బరువు బాధ్యతలను నిర్వర్తిస్తూ, బాధ్యతలను మోస్తూ, ఒక తల్లిగా, చెల్లిగా, భార్యగా, ఉద్యోగస్తురాలిగా, దేశ నాయకురాలిగా, పారిశ్రామిక వేత్తలుగా, ఉపాధ్యాయురాలిగా ఎన్నో బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్న మహిళలకు వందనాలని వారికి తగిన గౌరవాన్ని ఇస్తూ ప్రోత్సహిస్తూ ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

## శ్రమ, దోపిడీకి వ్యతిరేకంగా తిరుగుబాటే..




- శ్రామిక మహిళ అంతర్జాతీయ దినోత్సవం
- సీఐటీయూ జిల్లా నాయకులు చంద్రశేఖర్

నవతెలంగాణ-దుండిగల్

అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం పురస్కరించుకుని నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బాచుపల్లి మున్సిపల్ వార్డు ఆఫీసు వద్ద సీఐటీయూ ఆధ్వర్యం లో శ్రామిక మహిళ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. గత 20 సంవత్సరాలుగా పారిశుధ్య కార్మికురాలుగా పనిచేస్తున్న నీరుడి రత్నమ్మ సేవలు శ్రమకు గౌరవంగా పూలమాలతో శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.చంద్రశేఖర్, మున్సిపల్ యూనియన్ కార్యదర్శి ఎస్.ఎల్లమ్మ మాట్లాడుతూ గత ఎంతో కాలంగా పాలకవర్గాలు అంతర్జాతీయ మహిళ దినోత్సవం ఒక ఉత్సవంగా నిర్వహిస్తున్నారన్నారు. వాస్తవానికి 1908 సంవత్సరం లో అమెరికా నగరంలో న్యూయార్క్ సిటీలో మహిళా కార్మికులు 16 గంటల పని దినానికి పీడనకు వ్యతిరేకంగా, సమానమైన పనికి సమాన వేతనం కావాలన్నారు. స్త్రీలకు ఓటు వేసే హక్కు కల్పించాలని, తెలిపారు. విద్యను ప్రతి ఒక్కరూ పొందే విధంగా కుటుంబం సమాజం, ప్రభుత్వాలు బాధ్యత వహించాలన్నారు. మహిళల యొక్క హక్కుల కోసం, వరకట్న పీడనకు సమాజంలో ఉన్న దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన బాధ్యత మనందరి పైన ఉందని తెలియజేశారు. సన్మాన కార్యక్రమంలో నిజాం పేట మున్సిపల్ కార్పొరేషన్ ఎస్సీ సెల్ కన్వీనర్ భూపాల్ పాల్గొని మాట్లాడా రు. ఈ కార్యక్రమంలో కె.లక్ష్మి వెంకటయ్య, టి.శ్రీనివాస్, జి.నాగరాజు, ఎన్.దుర్గయ్య, యాదయ్య, మౌనిక, జి.సింహాచలం, ఆర్. సువర్ణ జి.మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

### జగిత్యాల జిల్లాలో ఆశ వర్కర్ పై లైంగికదాడి ఘటనకు నిరసన..

బాచుపల్లి మండల సీఐటీయూ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లాలో ఆశ వర్కర్ పై అత్యాచార ఘటనను నిరసిస్తూ బాచుపల్లి ఎమ్మార్వో ఆఫీస్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూజిల్లా నాయకులు ఏం.చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఈ ఘటనకు బాధ్యులైన నిందితులను వెంటనే అరెస్టు చేసి చట్టపరంగా శిక్షించాలన్నారు. దళిత మహిళా ఆశ వర్కర్‌పై అత్యాచారం చేసిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార చట్టం క్రింద కేసు నమోదు చేసి ఆశ వర్కర్ కుటుంబానికి అట్రాసిటీ అత్యాచార చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలన్నారు. మహిళలపై దాడులు అత్యాచారాలను వ్యతిరేకించాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన పోలీసు అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని కోరారు. అత్యాచారానికి గురైన ఆశ వర్కర్ కు తగిన న్యాయం జరిగే విధంగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళల పట్ల రక్షణ వ్యవస్థకు ప్రత్యేకమైన రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు.

## బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు



- సూరారం ఎస్‌హెచ్‌ఓఎస్ భరత్ కుమార్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించి, ప్రజాశాంతికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సూరారం ఎస్‌హెచ్ ఓఎస్. భరత్ కుమార్ మందుబాబులను హెచ్చరించారు. కమిషనర్ ఆఫ్ పోలీస్ ఆదేశాలు మేరకు బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించిన వారిపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్టు ప్రకటించారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించి, న్యూసెన్స్ చేస్తూ.. ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని భరత్ కుమార్ తెలిపారు. సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో బహిరంగ ప్రదేశాలలోను, ఒంటరి, శివారు ప్రాంతాలలోను మద్యం సేవించిన వారిపై పోలీసు అధికారులు, సిబ్బంది దాడులు నిర్వహించి.. ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తున్న మందు బాబులను పట్టుకొని, కేసులు నమోదు చేశారు. ఆదేవిధంగా పోలీస్ స్టేషన్ పరిధిలోని ముఖ్య కూడళ్ళ వద్ద వాహన తనిఖీలు చేపట్టి, వాహనదారులకు రహదారి భద్రత , హెల్మెట్ దారణ పట్ల అవగాహన కల్పించారు.

## ఎమ్మెల్యే నివాసంలో మహిళా దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో, మహిళా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని మహిళా కార్పొరేటర్లు, మహిళ నాయకులతొ కలిసి కేక్ కట్ చేసి శాలువాతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు ప్రభుత్వం సముచిత స్థానం కల్పించాలన్నారు. ఆదేవిధంగా మహిళలకు రావలసిన హక్కులను కాపాడాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల హామీలలో, మహిళలకు స్కూటీ వాహనం, తులం బంగారంతో పాటుగా, రెండువేల ఐదువందల రూపాయల పెన్షన్లు ఇస్తామని, అబద్ధపు హామీలు ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి సర్కార్ మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, వారి హక్కులను కాపాడాలని అన్నారు. నేడు అన్ని రంగాల్లో కూడా మహిళలు రాణిస్తూ ముందుకు వెళుతున్నారని. ఈ సందర్భంగా వారు అనుకున్న లక్ష్యాన్ని చేరాలని కోరారు.

### పార్టీ బలోపేతానికి కృషి చేయాలి : ఎమ్మెల్యే మాధవరం

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంప్ కార్యాలయంలో, నియోజకవర్గ కార్పొరేటర్లు డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ కార్యకర్తలు ఎంతో చిత్తశుద్ధితో పని చేస్తున్నారని.. వారిని కాపాడుకుంటూ ప్రజల్లో బీఆర్ఎస్ పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. పార్టీ బలో పేతానికి కృషి చేయాలని తెలిపారు. అలాగే కార్యకర్తలకు అండగా ఉండాలని సూచించారు. నాడు అభివృద్ధికి ఎక్కడా ఇబ్బంది లేకుండా, కోట్ల రూపాయలతో అనేక పార్కులు, స్మశాన వాటికలు, రోడ్లు నిధులు కొరత లేకుండా, అభివృద్ధి చేసుకున్నామని పేర్కొన్నారు. కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అరాచక పాలనను ప్రజలకు వివరిస్తూ.. జరిగిన అభివృద్ధిని బేరీజు వేస్తూ వారికి వివరించాలని సూచించారు. రాబోయే వేసవిలో మంచినీటి ఎద్దడి లేకుండా ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలను పరిష్కరించే దిశగా ముందుకు వెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా దినోత్సవ వేడుకల్లో కోలన్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

131 డివిజన్ కుత్బుల్లాపూర్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవ వేడుకలలో ముఖ్యఅతిథిగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోలన్ హన్మంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి కేక్ కట్టింగ్ చేసి, నియోజకవర్గ మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకలను ఉద్దేశించి మాట్లాడుతూ.. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలు వేడుకలకు మాత్రమే పరిమితం కాదన్నారు. మహిళల హక్కులను గుర్తిస్తూ.. వారి సాధించిన విజయాల ను తెలియజేశారు. మహిళలు ఎంతో మార్పు చెందిన ఈ ఆధునిక ప్రపంచంలో కుటుంబానికి మాత్రమే పరిమితం కాకుండా దేశ అభివృద్ధికి తమ పాత్ర పోషిస్తూ.. కేంద్రబిందువులుగా నిలుస్తున్నార న్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా అధ్యక్షురాలు రాజానోళ్ల లక్ష్మి, రాష్ట్ర సెక్రటరీ రఫియా బేగమ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గడ్డం రాజేందర్ రెడ్డి, డివిజన్ నాయకులు ఎండి జాకీర్, మహిళ అధ్యక్ష రాలు సుజాత, జెస్సి, ఆగమయ్య, రేణుక రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవం





నవతెలంగాణ-మేడ్చల్

గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటి పరిధి మైసమ్మ గూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం కళాశాల వార్షికోత్సవ వేడుకలను ఆక్విలా 2025 పేరుతో కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా బి.భరత్ కుమార్ మైక్రోసాఫ్ట్ సీనియర్ డైరెక్టర్ ఆఫ్ ప్రోడక్ట్ మేనేజ్‌మెంట్ హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగాల కొరకు కాకుండా ఉద్యోగాలు కల్పించే ఎంటర్ ప్రెన్యూర్స్‌గా ఎదగాలని ఆకాంక్షించారు. నేర్చుకోవడం అనేది ఒక నిరంతర ప్రక్రియని, ఒక విద్యార్థిని ఇంటర్వ్యూ చేసేటప్పుడు సబ్జెక్టులో ఫండమెంటల్ మీద ఎంత అవగాహన ఉంది అని పరిశీలిస్తానని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె శ్రీలత మాట్లాడుతూ కాలేజీలో అధ్యాపకులు, ఆర్ఎన్‌డిసెల్ పీహెడి పూర్తి చేసిన వారిని అభినందించారు. జాతీయస్థాయి రాష్ట్రస్థాయిలో పాల్గొన్న విద్యార్థుల కుటెక్నికల్ సదస్సుల గురించి వివరించారు. గూగుల్ క్లౌడ్, ఐసిటి లాంటి ద్వారా ఇంటెన్షిప్ చేశారని, విద్యార్థులు క్రీడల్లో సాధించిన రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి విజయాలను ప్రస్తావించారు. కళాశాల సెక్రటరీ టీవీ రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వార్షికోత్సవం విద్యార్థులకు ప్రత్యేకమని వారి కొక్కరికులర్ ఆక్టివిటీస్ నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి ఒక్క విద్యార్థి అవకాశాన్ని ఒడిసి పట్టుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. రోజమ్మ జీవిత సాఫల్య పురస్కారానికి డాక్టర్ రోహిణి రేగంటి మెడికల్ అంకాలజిస్ట్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సన్మానించారు.

అనంతరం అత్యధిక మార్కుల సాధించిన విద్యార్థులను మొమెంటోలతో సత్కరించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మెన్ టి.బాలా రెడ్డి, కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ టివి.రెడ్డి, డాక్టర్ రోహిణి రేగంటి మెడికల్ అంకాలజిస్ట్, డైరెక్టర్స్ సరోజా రెడ్డి, అనురాగ్ రెడ్డి, ప్రిన్సిపాల్ డా. కె.శ్రీలత, డా.యస్.చంద్రశేఖర్ రెడ్డి, పిఆర్‌ఓ.రవి సుధాకర్, వివిధ విభాగాధిపతులు అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## నర్సింహారెడ్డి కళాశాలలో మహిళా దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-మేడ్చల్

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మైసమ్మగూడలోని నర్సింహా రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో మహిళా దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గిగ్గల్స్ ఫోటోగ్రఫీ వ్యవస్థాపకురాలు, కొండ మానస హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు తాము కన్న కలల్ని సాకారం చేసుకునే వైపు వారి అడుగులు పడాలన్నారు. మహిళలు కేవలం డాక్టరో, ఇంజినీరో కాకుండా, ప్రతి రంగంలో తమదైన ముద్ర వేయాలని సూచించారు. ఇందులో భాగంగానే మానస తమ గాత్రంతో మహిళా ఉపాధ్యాయులను ఉత్తేజ పరిచారు.

అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డా.ఆర్ లోకనాథం మాట్లాడుతూ మానస లాంటి వారిని చూసి నేటి యువత స్ఫూర్తి పొందాలని తెలిపారు. ఆత్మహత్యల వంటి ఆలోచనలు మానుకోవాలని, ధైర్యంతో ప్రతి సమస్యను పరిష్కారించుకోవాలన్నారు. మహిళా సాధికారత గురించి విద్యార్థులకీ వివరించారు. అనంతరం ముఖ్య అతిథికి పుష్పగుచం అందించి.. శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మెన్ జె. నర్సింహా రెడ్డి , కార్యదర్శి జె.త్రిశూల్ రెడ్డి, కోశాధికారి జె.త్రిలోక్ రెడ్డి, సమన్వయకర్తలు ప్రొ.లక్ష్మి, ప్రొ.కిరణ్మయి, మహిళా అధ్యాపకులు విద్యార్థినులు పాల్గొన్నారు.

## ప్రతిభను వెలికి తీస్తే ప్రపంచాన్ని శాసిస్తారు



- ప్రముఖ ఎముకల వైద్య నిపుణురాలు సుధారాణి
- శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాలలో మహిళా దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

మహిళలు వారిలోని ప్రతిభను వెలికి తీస్తే ప్రపంచాన్ని శాసించగలరని ప్రముఖ ఎముకల వైద్య నిపుణురాలు సుధారాణి అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దూంనగర్ భగత్సింగ్ మార్గ్‌లో గల శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాలలో ఆమెతోపాటు, మేడ్చల్ జిల్లా ట్రస్మా ఉపాధ్యక్షులు, పాఠశాల చైర్మెన్, కరస్పాండెంట్ బిర్రు అంజనేయులు, అకాడమిక్ డైరెక్టర్ బిర్రు శోభారాణిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్త్రీ శక్తి ముందు ఏ శక్తి నిలబడలేదని తెలిపారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా బాహ్య ప్రపంచంలోని మంచి చెడులను తెలుసుకోవాలని సూచించారు. సహనానికి మరో పేరు స్త్రీ మూర్తి అని తెలిపారు. పాఠశాల చైర్మెన్, కరస్పాండెంట్ బిర్రు ఆంజనేయులు మాట్లాడుతూ మహిళలు నేడు అన్ని రంగాల్లో రాణిస్తున్నారంటే వారిలో ఉన్న ఆత్మస్థైర్యమని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం తమ పాఠశాలలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తూ రంగాలలో రాణించిన మహిళల విశిష్టత తెలుపుతున్నామన్నారు. పాఠశాలలో విద్యార్థుల తల్లులకు నిర్వహించిన పలు పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి మేమెంటో అందజేస్తూ శాలువాతో సన్మానించి అభినందించారు. అనంతరం విద్యార్థుల తల్లులతోపాటు, పాఠశాల మహిళా అధ్యాపక బృందాన్ని 300 మందిని పాఠశాల యాజమాన్యం మెమెంటో, శాలువాలతో ఘనంగా సన్మానిస్తూ.. మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సాంస్కృతిక ప్రదర్శనలలో మహిళలు స్టేప్పులు వేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అన్నే ఫాతిమా, ప్రశాంతి, కృష్ణవేణి, మహేశ్వరి, సాజిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మహిళా శక్తి ప్రపంచానికి చాటి చెప్పాలి



- మాజీ కౌన్సిలర్ గూడ వరమ్మ

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

మహిళలు తమ శక్తి,యుక్తులను ప్రపంచానికి చాటి చెప్పాలని మాజీ కౌన్సిలర్, మేడ్చల్ జిల్లా మహిళా కాంగ్రెస్ నాయకురాలు, కంటెస్టెడ్ కార్పొరేటర్ గూడ వరమ్మ ఐలయ్య గౌడ్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని శనివారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి జగద్గిరిగుట్ట ప్రాంతంలో మహిళా సమైక్య అధ్యక్షురాలు ఆమె ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా జెండా ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో మహిళా శక్తిని చూపాలని రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి అభినందనలు తెలిపారు. చట్టసభలలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, మహిళలపై జరుగుతున్న దాడులను ప్రభుత్వం తిప్పికొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సమైక్య నాయకులు శాంతి, ఝాన్సీ, సత్యలక్ష్మి, సులోచన, గడ్డ మీది కళావతి, లక్ష్మి, సత్యలక్ష్మి, జయమ్మ పాల్గొన్నారు.



అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా.. ఆల్విన్ కాలనీ డివిజన్ లోని గుడ్ విల్ హెూటల్ చౌరస్తాలో, జీ హెచ్‌ఎంసీ మహిళా కార్మికులతో కలిసి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు కేక్ కట్ చేశారు. అనంతరం స్నేహ మోడల్ స్కూల్‌లో కరస్పాండెంట్ ఎం.రాజు ఆధ్వర్యంలో.. స్కూల్ ఉపాధ్యాయురాలతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం ఎల్లమ్మ బండలోని, యూపీ హెచ్‌సీ హాస్పిటల్‌లో మహిళా స్టాఫ్‌తో కలిసి కేక్ కట్ చేసి బహుమతులను ఎర్రబెల్లి సతీష్ రావు అందజేశారు.

నవతెలంగాణ-కూకట్‌పల్లి

## మహిళా దినోత్సవంలో పాల్గొన్న మిస్ ఇండియా..



**నవతెలంగాణ-కంటోన్మెంట్**

బోయిన్‌పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ముప్పిడి మధుకర్ అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా. మానస టిస్కా మిస్ ఇండియా పాల్గొన్నారు. ఆమెతో పాటు మహిళ నాయకురాలు వందన, చంద్రకళ, వాసంతి, వసుందర, రజిని పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు పలు కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

## పరేడ్ గ్రౌండ్‌కు తరలిన మహిళలు




**నవతెలంగాణ-జూబ్లీహిల్స్**

అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా శనివారం సాయంత్రం ఆరు గంటలకు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి సభకు రహమత్ నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి నేతృత్వంలో డివిజన్ నుంచి సభ విజయవంతం చేయుటకు భారీగా బస్సులో మహిళలు తరలి వెళ్లారు.

## మసీద్ వద్ద నూతన పోల్స్ ఏర్పాటు



**నవతెలంగాణ-కంటోన్మెంట్**

రంజాన్ పర్వదినం సందర్భంగా ఓల్డ్ బోయిన్‌పల్లి సుభాని మసీద్ వద్ద నూతన పోల్స్...... ఏర్పాటు చేశారు. ఎల్లో జాన్ లైట్లు ఏర్పాటు చేసేందుకు కూకట్‌పల్లి నియోజకవర్గం మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ కృషి మేరకు విద్యుత్ అధికారులు నూతన స్తంభాలను ఏర్పాటు చేశారు. సుభానీ మస్జిద్ అపోజిట్ కొత్త పోల్‌కు మస్జిద్ ఉపాధ్యక్షుడు మహమ్మద్, కూకట్‌పల్లి నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షులు అజాజ్ ధన్యవాదాలు తెలిపారు.

## ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో భారత్ ఒకటి



- కలర్‌ఫుల్ ఓవర్సీస్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ క్రిస్ లియూ

**నవతెలంగాణ-బేగంపేట్**

సికింద్రాబాద్‌లోని విశాల్ పెరిఫెరల్స్ స్టోర్‌లో కలర్‌ఫుల్ టెక్నాలజీ కంపెనీ లిమిటెడ్ ఐ గేమ్ జి ఫోర్స్ ఆర్ టి ఎక్స్ 50 సిరీస్ గ్రాఫిక్ కార్డులను శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి కలర్‌ఫుల్ ఓవర్సీస్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ క్రిస్ లియూ ముఖ్యఅతిథిగా హాజరై నూతన ఉత్పత్తిని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధునాతన రూపకల్పన, మెరుగైన కూలింగ్, మన్నిక కలిగిన రాబోయే తరాల వారికి ఉపయోగపడేలా ఈ సిరీస్‌ను రూపొందించి మార్కెట్లోకి ప్రవేశపెట్టినట్టు తెలిపారు. ఈ ఉత్పత్తిని ఈఎంఐ ద్వారా కూడా కొనుగోలు చేయవచ్చని తెలిపారు. భారతదేశం ప్రస్తుతం ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో ఒకటని అన్నారు. కృత్రిమ మేధా తోపాటు గేమింగ్‌కు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో గత ఏడాదితో పోలిస్తే 30శాతంపైగా అభివృద్ధిని ఆశిస్తున్నట్టు తెలిపారు. కంప్యూటర్ స్టోర్‌ను సందర్శించిన తర్వాత విభిన్న ఉత్పత్తుల శ్రేణి కూడా ఆకట్టుకున్నట్టు ఆయన తెలిపారు. కలర్‌ఫుల్ నుంచి మరిన్ని ఉత్పత్తులను తమ జాబితాలో త్వరలోనే చేర్చుతామని ఆశాభావం వ్యక్తం చేశారు.

## విద్య ద్వారానే మహిళల అభ్యున్నతి



- డా.వినోద వెంకట స్వామి

**నవతెలంగాణ-ఓయూ**

విద్యా ద్వారానే మహిళ అభ్యున్నతి అని ఐఎస్‌ఓ విద్యా సంస్థల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డా.టి.వినోద వెంకట స్వామి అభిప్రాయం వ్యక్తం చేశారు. శనివారం తార్నాక ఐఎస్‌ఓ కళాశాలలో ఘనంగా మహిళ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో డా.వినోద వెంకట స్వామి మాట్లాడుతూ.. తమ విద్యా సంస్థల్లో అమ్మాయిల విద్యా ఉన్నతికి, ఉపాధి కల్పన కోసం కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ సమాజంలో ప్రస్తుతం రాణించాలని అనుకుంటే అది కేవలము విద్యా ద్వారానే అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నట్టు చెప్పారు. వారిని స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా మహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎస్‌ఓ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఉమ, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రదీపా, రాజశ్రీ, అనురాధ, ప్రపుల్ల, సునీత, దివ్య, శ్రీలత పాల్గొన్నారు.

## ప్రపంచమంతా.. ఏఐ వైపు




- మోహన్ కుమార్

**నవతెలంగాణ-బంజారాహిల్స్**

అన్ని రంగాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పాత్ర ఘనంగా పెరుగుతుందని, భవిష్యత్తు మొత్తం ఏఐదేనని భారత్ లైట్ హౌస్ సీఈవో మోహన్ కుమార్ అన్నారు. ఏఐపై విద్యార్థులు, యువతకు అవగాహన కల్పించే నిమిత్తం ప్రత్యేక సదస్సులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అందులో భాగంగా హైటెక్ సిటీలోని ట్రిడెంట్ హోటల్లో ఏఐ గవర్నెన్స్ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దానికి సంబంధించిన కరపత్రాన్ని టీసీ దళ్ అధ్యక్షుడు కుమారస్వామి ముఖ్యఅతిథిగా హాజరై జెనసిస్ సీఈఓ వినయ్ కుమార్, దీప్తిలతో కలిసి ఆవిష్కరించారు. ఏఐతో ఉద్యోగాలు పోతాయి అన్న ఆందోళన విడి యువత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై నైపుణ్యాలు సాధించాలని అన్నారు.

## పార్శీ హైస్కూల్‌లో అధికశాతం మహిళా సిబ్బంది



- పాఠశాల కమిటీ ట్రస్టీ నాదిర్ చినాయ్

**నవతెలంగాణ-బేగంపేట్**

బీఆర్జేసీ పార్శీ హైస్కూల్‌లో అధికశాతం మహిళా సిబ్బంది ఉన్నారని పాఠశాల కమిటీ ట్రస్టీ నాదిర్ చినాయ్ అన్నారు. సికింద్రాబాద్ పార్క్ లేన్‌లో గల బీఆర్జేసీ పార్శీ హైస్కూల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పని చేస్తున్న 45 మంది మహిళా ఉపాధ్యాయినిలను, ఐదుగుగు ఆయాలను నాదిర్ చినాయ్ చేనేత చీరలతో సత్కరించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎల్లప్పుడూ తమ పాఠశాలలో అధిక శాతం మహిళలే ఉపాధ్యాయులని, వారి కృషితో పాఠశాల దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధన్ చారి మాట్లాడుతూ.. స్త్రీ జాతి కృషి భావితరాలకు మార్గదర్శకమని చెప్పారు. పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడు ఎంవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ.. ఈ పాఠశాలకు బాయి రతన్, బాయి జే షినోయ్ పార్శీ హై స్కూల్ అని మహిళ పేరిట పెట్టి స్త్రీల గొప్పతనాన్ని చాటాలన్నారు. సీతారాములు, రాధ కృష్ణులు ఇలా ప్రతి యుగ పురుషుల పేర్ల ముందు స్త్రీల పేర్లే పెట్టుకోవడం మన సాంప్రదాయం అన్నారు. స్త్రీ జాతి విజయాలను జ్ఞాపకం చేసుకుంటు, ఎక్కడెక్కడ స్త్రీ మూర్తిని గౌరవిస్తారో అక్కడక్కడ లక్ష్మీ దేవి స్థిరనివాసం ఏర్పరచుకుంటుందన్నారు.

# నిమ్స్‌లో యువకుడికి గుండె మార్పిడి

- ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా చికిత్స.. కోలుకుంటున్న రోగి
- వైద్యులను అభినందించిన మంత్రి దామోదర రాజనర్సింహ
- అవయవదానంపై అవగాహన కల్పించాలని డాక్టర్లకు సూచన






**నవతెలంగాణ-సిటీబ్యూరో**

తీవ్రమైన గుండె జబ్బుతో బాధపడుతున్న 19 ఏండ్ల యువకుడికి, నిమ్స్ డాక్టర్లు పునర్జన్మను ప్రసాదించారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్ డెత్ అయిన మరో యువకుడి గుండెను, ఈ హైదరాబాద్ యువకుడికి విజయవంతంగా ట్రాన్స్‌ప్లాంట్ చేశారు. కార్డియో థొరాసిక్ సర్జరీ విభాగం హెచ్‌వోడీ, డాక్టర్ అమరేశ్ బాబు నేతృత్వంలోని డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ టెక్నీషియన్ల బృందం శుక్రవారం శస్త్ర చికిత్సను పూర్తి చేసింది. నగరంలోని రసూల్‌పురాకు చెందిన పూజారి అనిల్‌కుమార్ కొంత కాలంగా గుండె జబ్బుతో బాధపడుతున్నాడు. నిమ్స్ హాస్పిటల్‌లో హార్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం జీవన్‌దాన్‌లో రిజిస్టర్ చేసుకున్నాడు. కాగా ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన 24 ఏండ్ల యువకుడు నగరంలోని ఓ కార్పొరేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం బ్రెయిన్ డెడ్ అయ్యాడు. అతని కుటుంబ సభ్యులు అవయవదానానికి ముందుకొచ్చారు. ఆ యువకుని బ్లడ్ గ్రూపునకు, అనిల్‌కుమార్ బ్లడ్ గ్రూప్ మ్యాచ్ అయ్యింది. దీంతో హార్ట్‌ను నిమ్స్‌కు తరలించి, డాక్టర్ అమరేశ్ బాబు నేతృత్వంలోని టీమ్ అనిల్‌కుమార్‌కు అమర్చింది. ఆరోగ్యశ్రీ కింద అనిల్‌కుమార్‌కు ఉచితంగా అవయవమార్పిడి చికిత్స చేశామనీ, ప్రస్తుతం అతను కోలుకుంటున్నాడని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ భీరప్ప వివరించారు.

**గతేడాది 62 మందికి కిడ్నీ మార్పిడి..**

నిమ్స్‌లో గతేడాది 62 మందికి కిడ్నీ, నలుగురికి లివర్, ఇద్దరికి హార్ట్, ఒకరికి లంగ్ ట్రాన్స్‌ప్లాంటేషన్లు చేశామని, ఈ ఏడాది 16 మందికి కిడ్నీ, ఒకిరికి లివర్, ఒకరికి హార్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీలు చేశామని తెలిపారు. (2024, 2025లో కలిపి మొత్తం 87 ట్రాన్స్‌ప్లాంటేషన్లు) గతేడాది నిమ్స్‌లో ఒక వ్యక్తికి హార్ట్, లంగ్ రెండూ ఒకేసారి ట్రాన్స్‌ప్లాంట్ చేశామని నిమ్స్ డైరెక్టర్ భీరప్ప తెలిపారు. దేశంలోని ప్రభుత్వ దవాఖాన్లలో, ఒక్క నిమ్స్‌లో మాత్రమే ఇలా ఒకేసారి హార్ట్, లంగ్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేసినట్టు ఆయన వివరించారు.

**నిమ్స్ వైద్యులకు మంత్రి అభినందనలు..**

యువకుడికి విజయవంతంగా గుండె మార్పిడి చేసిన నిమ్స్ వైద్యులు, సిబ్బందికి మంత్రి దామోదర రాజనర్సింహ అభినందనలు తెలిపారు. అవయవమార్పిడి శస్త్రచికిత్స తర్వాత కూడా పేషెంట్ల బాగోగులను పర్యవేక్షించాలనీ, వారికి అవసరమైన వైద్య సేవలను కొనసాగించాలని ఆయన సూచించారు. నిమ్స్‌లో ట్రాన్స్‌ప్లాంటేషన్ సేవలను మరింత విస్తరించాలనీ, ఇందుకు అవసరమైన అన్ని వసతులను కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. గాంధీ హాస్పిటల్‌లో త్వరలోనే అధునాతన ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. యువకుడికి గుండెను దానం చేసిన డోనర్ కుటుంబ సభ్యులను మంత్రి ఈ సందర్భంగా అభినందించారు. బ్రెయిన్ డెత్ కేసుల్లో అవయవదానానికి ముందుకొచ్చి, ప్రాణదాతలుగా నిలవాలని ప్రజలకు మంత్రి పిలుపునిచ్చారు. మరొకరికి ప్రాణం పోసే అవయవాలను మట్టిలో వృథాగా కలిసిపోనియొద్దని కోరారు. అవయవదానం ప్రాముఖ్యతను ప్రజలకు వివరించాలనీ, ఇందు కోసం అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలని జీవన్‌దాన్ ఇన్‌చార్జి డాక్టర్ భూషణ్ రాజుకు మంత్రి సూచించారు. అవయవ మార్పిడిలో అవకతవకలకు పాల్పడే ప్రయివేటు హాస్పిటళ్లపై కఠిన చర్యలు ఉంటాయనీ, ఈ సందర్భంగా మంత్రి హెచ్చరించారు. అవయవదానానికి కొత్త నిబంధనలను అమలు చేయబోతున్న విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. అవయవాల అక్రమ రవాణా, సేకరణ, మార్పిడికి కఠిన శిక్షలు పడేలా కొత్త నిబంధనలు ఉండబోతున్నాయని ఈ సందర్భంగా మంత్రి వెల్లడించారు.

## శ్రీవిద్య చదువుకు అండగా ఉంటా..



- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

**నవతెలంగాణ-జూబ్లీహిల్స్/అమీర్‌పేట్**

శ్రీవిద్య చదువుకి అన్ని విధాలుగా అండగా ఉంటానని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హామీ ఇచ్చారు. సనత్‌నగర్‌లోని దాసారం బస్తీకి చెందిన అశోక్, మమత దంపతుల కూతురు శ్రీ విద్యకు ఆధార్ కార్డ్ లేదని స్కూల్‌లో చేర్చుకోవడం లేదని తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే స్పందించి, ఆధార్ కార్డ్‌కు అవసరమైన సర్టిఫికెట్ ఇప్పించేందుకు కృషి చేస్తానని తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు. ఆ వెంటనే ఎమ్మెల్యే ఆదేశాలతో జీహెచ్‌ఎంసీ అధికారులు దాసారం బస్తీలోని శ్రీ విద్య ఇంటికి వెళ్ళి వివరాలు సేకరించి ఆధార్ కార్డ్ మంజూరుకు అవసరమైన సర్టిఫికెట్ (నాన్ అవైలబులిటీ) జారీ చేశారు. శనివారం శ్రీ విద్య తల్లి మమత వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయానికి సనత్ నగర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులతో కలిసి చేరుకున్నారు.ఎమ్మెల్యే చేతుల మీదుగా శ్రీ విద్యకు సర్టిఫికెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంచిగా చదువుకోవాలని, ఏ అవసరమున్నా తానున్నానని ధైర్యం చెప్పారు. వెంటనే స్పందించి తమ కూతురుకు సర్టిఫికెట్ మంజూరు చేయించడం పట్ల ఎమ్మెల్యేకు మమత కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సనత్‌నగర్ బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కొలన్ బాల్ రెడ్డి, శేఖర్, రాజేష్ ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

## నిరుద్యోగ యువత మెరుగైన భవిష్యత్తే లక్ష్యం




- మాజీ ఎమ్మెల్సీ దిలీప్ కుమార్

**నవతెలంగాణ-బంజారాహిల్స్**

మలిదశ తెలంగాణ ఉద్యమం తర్వాత ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో ముఖ్య ఆకాంక్ష అయిన నియామకాలు అనుకున్న స్థాయిలో జరగలేదని మాజీ ఎమ్మెల్సీ దిలీప్ కుమార్ అన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగ యువత భవిష్యత్తులో వెలుగులు నింపడానికి 'లక్ష్యం' అనే యూట్యూబ్ ఛానల్‌ను మార్చ్ 10వ తేదీన కవాడీ గూడ, అన్నం కాంప్లెక్స్‌లో ప్రారంభించనున్నట్టు తెలిపారు. ఈ లక్ష్యం యూట్యూబ్ ఛానల్ ద్వారా నిపుణులతో యువతను సాధికారత వైపు ఎలా నడిపించాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలనూ ఎలా అందిపుచ్చుకోవాలో సలహాలు, సూచనలు ఇప్పించడంతో పాటు జాబ్ మేళాలు నిర్వహించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలియజేశారు.

## మాదక ద్రవ్యాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలి

- నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్
- షహిద్ భగత్ సింగ్ స్మారక యువజన ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



**నవతెలంగాణ-సిటీబ్యూరో**

విద్యార్థులు, యువత డ్రగ్స్, గంజాయి లాంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్ఐ), భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) సంఘాల ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహిస్తున్న షహిద్ భగత్ సింగ్ స్మారక యువజన ఉత్సవాల పోస్టర్‌ను సీపీ తమ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ సీవీ ఆనంద్ మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి నిర్మూలన కోసం కృషి చేయడం ప్రతి ఒక్క పౌరుడి బాధ్యత అని అన్నారు. నేటి యువతలో కొద్దిమంది చెడు వ్యసనాలకు అలవాటుపడి వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆయన గుర్తుచేశారు. దేశంకోసం ప్రాణర్పణ చేసిన భగత్ సింగ్ స్ఫూర్తితో యువజన ఉత్సవాలను నిర్వహించడం, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ సంఘాలు "సే నో టూ డ్రగ్స్" నినాదంతో క్యాంపెయిన్ నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. ఈ క్యాంపెయిన్ ద్వారా విస్తృతంగా విద్యార్థులను, యువతను చైతన్యవంతం చేయాలని సీపీ సూచించారు. భగత్ సింగ్ స్మారక యువజనోత్సవ కమిటీ ఆహ్వాన సంఘం అధ్యక్షులు జె.కే శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి అశోక్ రెడ్డి, జావీద్‌లు మాట్లాడుతూ యువజన ఉత్సవాల సందర్భంగా హైదరాబాద్ నగరంలో విస్తృతంగా సదస్సులు, క్రికెట్, చెస్, టకే రన్, రక్తదాన శిబిరాలు, వ్యాసరచన పోటీలు, భగత్‌సింగ్ సందేశ్ ర్యాలీ, ముగింపు సభ లాంటి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆహ్వాన సంఘం ఉపాధ్యక్షులు అజయ్ బాబు, మహేందర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు లెనిన్, జిల్లా నాయకులు స్టాలిన్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## అడ్డగుట్టలో ఐద్వా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ సభ



**నవతెలంగాణ-ఓయూ**

అడ్డగుట డివిజన్ పరిధిలో శనివారం ఐద్వా ఆధ్వర్యంలో మహిళ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి సభ్యులు బి.శారద, సికింద్రాబాద్ జోన్ నాయకులు ఆర్.అంజమ్మ మాట్లాడుతూ.. మహిళలకు సమనా హక్కులు ఉండాలని ఇంకా మహిళలకు ఇబ్బందికరమైన పరిస్థితులు ఉన్నాయి. వీటన్నిటిని తొలిగే వరకు పోరాటం చేయాలని ఇంట్లో బయట అందరు సహకారంతోటే వీటిని తొలగించుకోగలమని అన్నారు. భవిష్యత్తులో అందరి పని చేస్తేనే ఇండ్లు గడవడం పిల్లలకు చదువు ఆరోగ్య విషయాలు ఉంటాయి. పెరిగిన ధరలకు మహిళలు తప్పకుండా బయటికి వెళ్లి పనిచేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఈ పరిస్థితుల్లో తల్లి చెల్లి అక్క నీ తానై చేస్తూ ఉన్న మహిళల మీద ఇటువంటి వీక్షత ఇంకా ఏనేండ్లు వెంటనే వివక్షతను రూపుమాపాలని సమర పనికి సమాన వేతనం ఇవ్వాలని రంగాల్లో గౌరవించినప్పుడే సమాజం ముందుకెళుతుందని ఈ సందర్భంగా వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఐద్వా మహిళా సంఘంగా అందరూ గౌరవంగా మనం అనుకున్న పనిలో ముందుకెళ్లాలని ఎటువంటి వివక్షతకు గురైన వెంటనే ప్రతికటించాలని మహిళలకు పిలుపునిచ్చారు. వివక్షత లేని సమాజం కోసం మహనీయులు మహనుభావులు వీరభరితలు ఉద్యమకారులు ఎంతమంది పనిచేసినప్పటికీ ఈ వివక్షత అనేది ఇంకా కొద్ది మంది స్వార్థపరుల్లో నిలిచి ఉంది కాబట్టి వీక్షకుపై నిరంతరం పోరాటం చేస్తూ మనం అన్ని రంగాల్లో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగరనాయకులు బి శారదతో పాటుగా సికింద్రాబాద్ అధ్యక్షులు అంజమ్మ, ఫాతిమా, జ్యోతి ఏ ఫాతిమా ముత్తు అరుణ పుష్ప పాల్గొన్నారు.

## బోరబండ ఇన్‌స్పెక్టర్‌గా సురేందర్ బాధ్యతలు



**నవతెలంగాణ-జూబ్లీహిల్స్**

బోరబండ నూతన ఇన్‌స్పెక్టర్‌గా ఎం. సురేందర్ శనివారం బాధ్యతలు చేపట్టారు. పోలీసు శాఖలో 2004లో డ్యూటీలో చేరిన ఆయన సైబరాబాద్‌లో, రాచకొండలో ఎంతో కాలం పని చేశారు. ఇన్‌స్పెక్టర్‌గా గత 13 ఏండ్ల నుంచి అనేక పోలీస్ స్టేషన్‌లలో పని చేశారు. ఇటీవల చార్మినార్ పోలీస్ స్టేషన్ నుంచి ఇన్‌స్పెక్టర్‌గా బోరబండకు బదిలీపై వచ్చారు. బోరబండ పీఎస్ పరిధిలో ఉన్న 73 మంది రౌడీ షీటర్‌లను త్వరలో పిలిపించి అందరికీ కౌన్సిలింగ్ ఇస్తానని, ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన రౌడీ షీటర్లను ఉక్కు పాదంతో అణిచివేస్తానని, బెల్ట్ షాపులు నిర్వహించిన, గంజాయి అమ్మిన, సేవించిన కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రౌడీ షీటర్లకు, నేరస్తులకు, నాయకులు అండగా ఉండవద్దని నాయకులను కోరారు. మహిళలతో దురుసుగా ప్రవర్తించిన, మద్యం సేవించి మహిళలను హింసించిన అర్ధరాత్రి వరకు రోడ్లపై తిరిగే ఆకతాయిలపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రంజాన్ మాసంలో మసీదుల వద్ద ప్రత్యేక నిఘా ఉంచుతామని, రంజాన్ ప్రశాంతంగా జరుపుకోవాలని, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. బాధితులు ఎవరైనా ఎప్పుడైనా స్వయంగా వచ్చి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు.

## ఆడపిల్లలను చదివించాలి




**నవతెలంగాణ-జూబ్లీహిల్స్**

నల్గొండ జిల్లాలోని సూర్యాపేట గ్రామంలో ఒక సామాన్య కుటుంబంలో జన్మించాను. తండ్రి ఉపాధ్యాయుడు -తల్లి గృహిణి. మా తండ్రి -తల్లి ఇచ్చిన ప్రోత్సాలంతో పల్లెటూరులో జన్మించి, చదువుపై శ్రద్ధ పెట్టి గ్రూప్ 4 పరీక్ష పాసై టైపిస్టుగా రెవెన్యూ శాఖలో మొదట ఉద్యోగంలో చేరాను. పదోన్నతులపై తహసీల్దారుగా ప్రస్తుతం అమీర్‌పేటలో పనిచేస్తున్నాను. మా తమ్ముడు కూడా పట్టుదలతో చదివి తాసిల్దార్ గానే పనిచేస్తున్నారు. నా భర్త కాంట్రాక్టర్ అయినప్పటికీ తాను ఎంతో ప్రోత్సలం చేసి, నన్ను ప్రభుత్వ ఉద్యోగిగా చూడాలని అనేక రకాలుగా అండగా ఉండి ప్రేరేపించినందున, నేను ఈరోజు ఈ స్థాయిలో ఉన్నాను. మాకు ఇద్దరు పిల్లలు అమ్మాయి ఉన్నత చదువులు చదివి వివాహం చేయటం జరిగింది. అబ్బాయి ఎంబీఏ చదువుతున్నాడు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రతి తల్లి- తండ్రి ఆడపిల్లలను అబ్బాయిలతో సమానంగా చదివించాలని, తొందరపడి వివాహాలు చేసి వారి జీవితాలు నాశనం చేయొద్దని తల్లిదండ్రులను కోరుతున్నాను. అమ్మాయిలు కూడా పట్టుదలతో చదివి ,భర్తపై ఆధారపడకుండా స్వయంగా సంపాదించుకుంటూ, భర్తకు- పిల్లలకు అండగా నిలవాలని కోరుతున్నాను. ఎలాంటి సమస్య వచ్చిన తల్లిదండ్రులకు, అన్నదమ్ములకు, తోబుట్టువులకు, స్నేహితులకు తప్పక తెలియపరచాలని, వారి సహాయ సహకారాలు తీసుకొని ఎలాంటి సమస్యలు అయినా ఎదుర్కొని నిలబడాలి. సమస్యలకు భయపడి ఆత్మహత్యలు చేసుకోవద్దని మహిళలకు సూచిస్తున్నాను. మనదేశంలో మహిళల రక్షణకు అనేక చట్టాలు ఉన్నాయని, పోలీసు అధికారులు మహిళల రక్షణ కొరకే పని చేస్తున్నారని, చిన్న- చిన్న సమస్యలకు భయపడి, నాకు ఎవరూ లేరు ,అని అధైర్యపడి ఆత్మహత్యలు చేసుకుని, ఎన్నో ఆశలతో కనిపించిన తల్లిదండ్రులను అనాథలుగా ఉంచి వెళ్ళవద్దని కోరుతున్నాను. పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాలలో పోటీపడి విధులు నిర్వహిస్తున్నారని, యుద్ధ విమానాలు నడుపుతున్నారని, ప్రధాన మంత్రులుగా, ముఖ్యమంత్రులుగా పని చేసిన మహిళలను ఆదర్శంగా తీసుకొని, ఏదైనా సాధించగలము అనే మనోధైర్యంతో ముందుకు సాగాలని మహిళలను మరొకసారి కోరుతున్నాను.

అమీర్‌పేట్ తాహాశీల్దార్ పద్మ సుందరి

## ఎడ్యుకేషన్ ఫెయిర్‌లు సమస్యల నివృత్తికి నిలయాలు



- శ్రీనివాస్ గౌడ్

**నవతెలంగాణ-బంజారాహిల్స్**

ఓరియంట్ స్పెక్ట్రా ఆధ్వర్యంలో అంతర్జతీయ ఎడ్యుకేషన్ ఫెయిర్‌కు అపూర్వ స్పందన లభించిందనీ, అసలు ఎడ్యుకేషన్ ఫెయిర్‌లు సమస్యల నివృత్తికి నిలయాలనీ బంజారాహిల్స్ తాజ్ డెక్కన్ హోటల్ శనివారం జరిగిన ఒక్కరోజు ఎడ్యుకేషన్ ఫెయిర్ గురించి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన స్టాల్ వద్ద తిరిగి ఆయన విద్యార్థులు వారి తల్లిదండ్రులు అడుగుతున్న ప్రశ్నలను నివృత్తి చేశారు. ఏ దేశంలో ఏ సదుపాయాలు ఉన్నాయో విదేశాల్లో చదువుకోవాలి అనే విద్యార్థులకు ఉచితంగా సలహాలు అందజేసి పంపిస్తామని చెప్పారు. యాభైకి పైగా విదేశీ యూనివర్సిటీల నుంచి ప్రతినిధులు వచ్చారనీ దళారులను నమ్మి మోసపోవద్దని విదేశాలకు వెళ్లే విద్యార్థులు ముందే తగిన జాగ్రత్తలు పాటిస్తే సరిపోతుందనీ ఆయన తెలిపారు. సుమారు ఏడు వందల పైగా విద్యార్థులు పాల్గొన్నారనీ పేర్కొన్నారు.

## మహిళలను సత్కరించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-జూబ్లీహిల్స్/అమీర్‌పేట్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మాజీ మంత్రి సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సనత్‌నగర్ బీఆర్ఎస్ మహిళలను శాలువాలతో సత్కరించి, మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## జీవోదయ బాలికల హోమ్‌కు ఆర్థిక సహాయం

- ఎల్ఐసీ అమీర్‌పేట్ బ్రాంచ్

నవతెలంగాణ-జూబ్లీహిల్స్/అమీర్‌పేట్



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అమీర్‌పేట్ ఎల్ఐసీ బ్రాంచ్ అధికారులు, సిబ్బంది ఎర్రగడ్డ మోతినగర్‌లోని జీవోదయ అనాథ బాలికల హోమ్‌కు దుప్పట్లు, నిత్యావసర సరుకులు, నోట్ బుక్స్, ఆర్థిక సహాయంగా అందించారు. ఈ కార్యక్రమంలో ఏడీఎం దీక్షితులు, బ్రాంచ్ మేనేజర్ గిరిధర్ రావు, డీఓ.ఏఎస్ఎన్ ప్రకాష్‌రావు, విజయలక్ష్మి, జ్యోత్స్నవల్లి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రతకు ఎంతో కృషి చేస్తున్న సిటీ పోలీసులు

- మంత్రి సీతక్క
- నగరపోలీస్‌ల ఆధ్వర్యంలో ఐదు వేల మందితో రన్ ఫర్ యాక్షన్-2025

నవతెలంగాణ-సిటీబ్యూరో



మహిళల భద్రత కోసం హైదరాబాద్ సిటీ పోలీసులు ఎంతో కషి చేస్తున్నారని, అందుకు తన అభినందనలని మంత్రి సీతక్క అన్నారు.. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా హైదరాబాదు సిటీ పోలీసుల ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్ పీపుల్స్ ప్లాజా వద్ద (5000) ఐదు వేల మందితో రన్ ఫర్ యాక్షన్-2025ను నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి డా.దనసరి అనసూయా సీతక్క, హైదరాబాద్ సీపీ డీజీ సీవీ ఆనంద్ కలసి ఈ కార్యక్రమాన్ని జెండా ఊపి 5కే, 2కే రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇలాంటి ఆహ్లాదకరమైన, చల్లటి వాతావరణములో రన్ ఫర్ యాక్షన్-2025ను ఏర్పాటు చేయడం ఎంతో సంతోషం కలిగించిందన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు మంచి ఆత్మ స్థైర్యం ఇచ్చేలా ఈ రన్ ఏర్పాటు చేసినందుకు హైదరాబాద్ సిటీ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. సమాజంలో మహిళలంటే ఒకప్పుడు చిన్నచూపు ఉండేదని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనే ప్రతిపాదనతో ఐక్యరాజ్యసమితి ప్రకటించిన తరువాత ప్రపంచంలోని అన్ని దేశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటున్నారని గుర్తు చేశారు. మహిళా దినోత్సవం ముఖ్య ఉద్దేశం మహిళలకు పురుషులకి మధ్య తేడా ఏమీ లేదు అందరూ సమాన మేనని చెప్పడమేనన్నారు. ఉద్యోగ, ఉపాధి, వ్యాపారాల కోసం ఇతర దేశాల నుంచి హైదరాబాద్ కు వస్తున్నవారు ప్రశాంతంగా ఉంటున్నారంటే అందుకు కారణం పోలీసుల కషి అన్నారు. పోలీసులు సమర్థవంతంగా పనిచేయ డంతోనే మహిళలు క్షేమంగా ఇంటికి తిరిగి రాగలుగు తారని తెలిపారు. మత్తు మన జీవితాలను చిత్తు చేస్తుం దని, మన గౌరవాన్ని తగ్గిస్తుం దన్నారు. మాదకద్రవ్యాల నుంచి విముక్తి కోసం ఈ సమాజాన్ని చైతన్య పరచాలన్నారు.

సీపీ ఆనంద్ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా సంస్థ ఇచ్చిన మహిళా భద్రత నినాదం స్పీడ్ ఫర్ యాక్షన్, మహిళా భద్రతపై సత్వర చర్య తీసుకోవడం జరుగుతుందన్నారు. హైదరాబాదు పోలీసు కమిషనరేట్ పరిధిలో 20 మంది డీసీపీల్లో 8 మంది మహిళా డీసీపీలు ఉన్నారని, 18 వేల మంది పోలీసు సిబ్బందిలో 30 శాతం మంది మహిళలే ఉన్నారని తెలిపారు. 'మహిళా దినోత్సవం సందర్భంగా లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లకు నలుగురు మహిళా ఇన్స్పెక్టర్ లను స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా నియమించినట్టు గుర్తుచేశారు. "మహిళలు కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూనే దేశంలోని అన్ని ప్రముఖ సెక్టార్‌లలో గణనీయమైన కషిని అందిస్తున్నారన్నారు. ఈరోజు వారి ప్రాముఖ్యతను గుర్తించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. 5కే, 2కే పరుగులో గెలిచిన వారికి సీపీ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమానికి అదనపు సీపీలు విక్రమ్ సింగ్ మాన్, విశ్వ ప్రసాద్, జాయింట్ సీపీలు జోయల్ డెవిస్, పరిమళ హానా నూతన్, డీసీపీలు స్నేహా మెహరా, రక్షితా కష్ణ మూర్తి, విజయ్ కుమార్, రశ్మి పెరుమల్, శిల్పావళ్ళి, లావణ్య నాయక్, ధార కవిత, బీ. బాలస్వామి, చైతన్య కుమర్, రాహుల్ హెడ్గే, జీ. చంద్ర మోహన్, .వైవిఎస్ సుధీంద్ర, ఎన్.స్వేతా, ఎన్.అశోక్ కుమార్, ఆర్.వెంకటేశ్వర్లుతోపాటు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌తోపాటు హైదరాబాదు సిటీ సెక్యూరిటీ కౌన్సిల్సభ్యులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## డిప్యూటీ మేయర్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



నవతెలంగాణ-ఓయూ

గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, టీటయూసీ రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డి తార్నాక తమ నివాసంలో సికింద్రాబాద్ నియోజకవర్గ ముస్లిం సోదరులకు ఘనంగా ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉపవాస ప్రార్థనల అనంతరం ఈ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా, ముస్లిం సోదరులతో కలిసి వారు మతసామరస్యం, ఆధ్యాత్మికత, శాంతి సందేశాలను పంచుకున్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలోని వివిధ మస్జిద్‌లకు చెందిన ప్రముఖ మౌల్వీలు, మత పెద్దలు ఈ కార్యక్రమంలో హాజరయ్యారు. వారిని సన్మానిస్తూ ప్రత్యేక ప్రసంగాలు నిర్వహించడంతోపాటు, సికింద్రాబాద్ నియోజకవర్గంలోని మస్జిద్‌ల అభివృద్ధి కోసం అవసరమైన సహాయాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నామని వారు హామీ ఇచ్చారు. మతసామరస్యం, సమాజంలోని అన్ని వర్గాల ప్రగతిని లక్ష్యంగా చేసుకుని ప్రతి ఒక్కరూ కలిసి ముందుకు సాగాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరుల కోసం ప్రత్యేకంగా ఆహార పదార్థాలు, ఉపవాసాలకు అనుగుణమైన విందు సరఫరా చేశారు. మహిళలు, పిల్లలు సహా అన్ని వయస్సుల వారు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ ఇఫ్తార్ విందు సికింద్రాబాద్ నియోజకవర్గంలో మతసామరస్యం, సామాజిక ఐక్యతకు ఒక మంచి ఉదాహరణగా నిలిచింది అని డిప్యూటీ మేయర్ పేర్కొన్నారు.

## అన్ని రంగాల్లో మహిళల రాణింపు

- ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

నవతెలంగాణ-ఓయూ



తగిన ప్రోత్సాహం ఉంటే మహిళలు అన్ని రంగాల్లో తమ సత్తాను చాటుకొని రాణిస్తారని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మోండా మార్కెట్‌లోని తన నివాసంలో వివిధ మహిళా సంఘాలతో పద్మారావు గౌడ్ సమావేశమై కేకు కట్ చేశారు. ఈ సందర్భంగా మహిళలకు ఎమ్మెల్యే మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా పద్మారావు గౌడ్ సతీమణి స్వరూప గౌడ్‌ను వివిధ మహిళా సంఘాల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ నేత గీత దయాకర్ మహిళలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆస్తులను నిర్వీర్యం చేసిన వ్యక్తి.. చర్యలు ఎందుకు తీసుకోరు..?

- ప్రభుత్వాన్ని ప్రశ్నించిన గౌడ సంఘాలు

నవతెలంగాణ-బంజారాహిల్స్




గౌడుల ఆత్మగౌరవం పెంపొందించుటకు, ఆర్థికంగా చేయూత నిచ్చుటకు గత ప్రభుత్వం హయంలో నెక్లెస్ రోడ్‌లో నీరా కేఫ్‌ను ఏర్పాటు చేసిందని, నీరా విక్రయాలతో పాటు తెలంగాణ గౌడకులస్తుల సంస్కృతి సాంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా వంటకాలతో స్టాల్స్‌ను నిర్మించిందని గౌడ సంఘాల నాయకులు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. శనివారం నెక్లెస్ రోడ్డులో ఉన్న ఈ భవనంలో గౌడ హక్కుల పోరాట సమితి అధ్యక్షులు ఎలికట్టే విజయ్ కుమార్ గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గోపా స్టేట్ ప్రెసిడెంట్ బండి సాయన్న, మధుసూదన్ చీకటి ప్రభాకర్ గౌడ్ లతో కలిసి ఆయన మాట్లాడారు. ఈ భవనాన్ని టూరిజం శాఖ వారు శంకర్ రెడ్డి అనే ఓ కాంట్రాక్ట్‌కు ఇచ్చినట్టుగా సమాచారం ఉందని అన్నారు. శంకర్‌రెడ్డి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఫుడ్ కోర్ట్, వెక్యూ బంకెట్వాలు అనే పేర్లు పెట్టుకుని నీరా కేఫ్ అనే పేర్లతో పాటు అద్దాలను భవనం ఆవరణలో వున్న చెట్లను, తొలగించడంపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. కేఫ్‌లో అమర్చిన ఖరీదైన ఏసీ గ్లాస్‌ను తొలిగించి తమ గౌడన్నల సంస్కృతికి ప్రతిరూపమైన ప్రతిబింబాలను ధ్వంసం చేయడం గౌడుల ఆత్మగౌరవాన్ని కించపరిచే విధంగా ఉన్నాయన్నారు. ఈ విషయపై తాము ఇటీవలే నిరసన కార్యక్రమాలు చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. సదరు వ్యక్తిపై చట్టపరమైన చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని, ప్రభుత్వం చెప్పాలని ప్రశ్నించారు. తమ నిరసనలకు స్పందించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తూ.. స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ సర్క్యులేషన్ విడుదల చేసిన కూడా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టు ఇంకా నీరా శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో కొనసాగుతుందని చెప్పారు. టూరిజం శాఖ ఎండి ప్రకాష్ రెడ్డి సదరు వ్యక్తికి టెండర్లు లేకుండా కేఫ్ కిచెన్ నూ ఎలా కట్టబెట్టాడో ప్రభుత్వం స్పష్టం చేయాల్సిన అవసరం ఉందని లేనిపక్షంలో తాత్కాలికంగా వాయిదా వేసిన నిరసనలను మరింత ఉధృతం చేస్తామని, ఈ విషయమై తాము చట్టపరంగానే వెళ్తామని నగర సీపీతోపాటు డీజీపీకి లేఖలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేశం మహేష్ కుమార్, జనుకుంట్ల శ్వేత, భవాని, లక్ష్మణ్ గౌడ్‌లు పాల్గొన్నారు.

## ఎల్ఐసీ ఆఫీస్‌లో మహిళా దినోత్సవ వేడుకలు

పాల్గొన్న బ్రాంచ్ చీఫ్ మేనేజర్ భాస్కర్

నవతెలంగాణ-జూబ్లీహిల్స్/అమీర్‌పేట్



అమీర్‌పేట్ ఎల్ఐసీ బ్రాంచ్ ఎక్స్-1 ఆఫీసులో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను, బ్రాంచ్ చీఫ్ మేనేజర్ భాస్కర్ ఆధ్వర్యంలో మహిళలు కేక్ కటింగ్ చేసి ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చీఫ్ మేనేజర్ భాస్కర్ మాట్లాడుతూ.. ఎల్ఐసీలో మహిళా ఉద్యోగులకు సమాన స్థానం ఉందని అన్నారు. ఎల్ఐసీ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో ఉందని అన్నారు. భీమా సఖి విజన్ ప్రత్యేకంగా మహిళల కొరకు ప్రారంభించారు. ఈ స్కీములో చేరిన మహిళ ఏజెంట్లకు, మొదటి ఏడాది 7000, రెండో ఏడాది 6000, మూడో ఏడాది 5000, స్టైఫండ్ ఇస్తున్నారు. దీనిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆఫీసర్‌లు శాంతి, అర్చన, విజయలక్ష్మి, జోస్నవల్లి, పద్మ బ్రాంచ్ మేనేజర్ గిరిధర్ రావు, ఏడీఎం దీక్షితులు, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు ఏఎస్ఎన్ ప్రకా ష్ రావు, రత్నకుమారి, కిషన్ సింగ్, సుధాకర్, సీనియర్ ఏజెంట్‌లు లలిత, సహ ఉద్యోగులు ఏజెంట్‌లు పాల్గొన్నారు.

## 10న మిలియన్ మార్చ్‌డే జయప్రదానికి కదలిరండి

- తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ

నవతెలంగాణ-బంజారాహిల్స్




తెలంగాణ ఉద్యమానికి ఊపిరులూదిన మిలియన్ మార్చ్ స్ఫూర్తిగా ఈ నెల 10న నిర్వహించే 'గ్రేట్ తెలంగాణ మిలియన్ మార్చ్ డే' ను జయప్రదం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల (టీయూ) జేఏసీ చైర్మెన్ సుల్తాన్ యాదగిరి, సెక్రెటరీ తుమ్మల ప్రఫుల్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాజకీయాలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీల నేతలు, ప్రజా సంఘాలు, కవులు, కళాకారులు, రచయితలు, సీనియర్ పాత్రికేయులు 33 జిల్లాల నుంచి ఉద్యమకారులు పాల్గొంటారని తెలిపారు. శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఉద్యమ గీతాలను ఆలపించి ప్రసంగించారు. వారు మాట్లాడుతూ.. మిలియన్ మార్చ్ డే సందర్భంగా సెక్రటేరియట్ ముందున్న అమరవీరుల స్మృతివనం నుంచి గన్పార్క్ అమరవీరుల స్థూపం వరకు ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఉద్యకారులకు ఇచ్చిన 250 గజాల ఇంటి స్థలం, రూ.30వేల చొప్పున గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. సమావేశంలో టీయూ, జేఏసి ప్రధానకార్యదర్శి బత్తుల సోమయ్య, కోశాధికారి ప్రసాద్, మహిళా అధ్యక్షురాలు మాధవి రెడ్డి, టీయూకేవీ అధ్యక్షులు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## సమాన హక్కులకు చేసిన పోరాట ఫలితమే మహిళా దినోత్సవం

- పని చేసే చోట మహిళలపై ఇంకా లైంగిక దాడులు,
- నిమ్స్ కార్మిక విభాగం, ఐద్వా నాయకులు రాధిక

నవతెలంగాణ-బంజారాహిల్స్

మహిళా దినోత్సవం ఏర్పాడటానికి సమాన పనికి సమాన వేతన హక్కులు కావాలని చేసిన పోరాటమే ఫలితమే, పని చేసే చోట ఇంకా మహిళపై లైంగిక దాడులు జరగుతున్నాయంటే కారణాలు లేవని ఐద్వా నాయకులు రాధిక ఆవేదన వ్యక్తపరిచారు. శనివారం నిమ్స్ ఆస్పత్రిలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిమ్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నరసింహ, సెక్రెటరీ వెంకటేష్, శ్రీనివాస్, ఊర్మిళలు పెద్ద సంఖ్యలో మహిళా కార్మికులు పాల్గొన్నారు.



# వికలాంగు విద్యార్థుల, హక్కులు, సంక్షేమానికి కృషి

- ఓయూ రిజిస్ట్రార్ కార్యాలయం

నవతెలంగాణ-ఓయూ

వికలాంగు విద్యార్థుల పట్ల చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్టు రిజిస్ట్రార్ కార్యాలయం శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిబంధనలకు లోబడి దివ్యాంగుల ప్రతి అభ్యర్థనను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేసింది. దివ్యాంగ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం వారి ప్రతినిధులతో ఇప్పటికే పలుమార్లు అధికార యంత్రాంగం చర్చలు జరిపిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వ నియమనిబంధలకు అనుగుణంగానే విశ్వవిద్యాలయం నిర్ణయాలు తీసుకుందని, ఎలాంటి దాపరికం, ప్రతిష్టంభన లేదని వెల్లడించింది. అవకాశమున్న ప్రతి సందర్భంలో విద్యార్థుల శ్రేయస్సు, సంక్షేమం కోసమే పనిచేస్తున్నామని వివరించింది. 2016-2017, 2018-2019 విద్యాసంవత్సరంలో వివిధ సబ్జెక్టుల్లో పీహెచ్డీ అడ్మిషన్ పొందిన దివ్యాంగ విద్యార్థులు దివ్యాంగుల కోటాలో జాతీయ ఫలోషిప్‌తో పాటు, యూజీసీ-జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్, రాజీవ్ గాంధీ జాతీయ ఫెలోషిప్ పొందారు. వివిధ రకాల ఫెలోషిప్‌ల కింద విద్యార్థులు సగటున నెలకు రూ.38 వేలు పొందుతున్నారు. మరికొంత మంది ఎలాంటి ఉపకారవేతనం పొందకుండానే పరిశోధనలు చేస్తున్నారు. యూజీసీ ప్రకటన ప్రకారం.. ఎంఫిల్, పీహెచ్డీ చేస్తున్న కాలంలో జాతీయ స్థాయిలో ఫెలోషిప్ తీసుకుంటున్న వారు ఇతర ఉపకారవేతనాలు సహా రాష్ట్ర ప్రభుత్వం లేదా ఇతర ఏజెన్సీల నుంచి ఎలాంటి ఆర్థికపరమైన లబ్ధి పొందేందుకు అర్హులు కాదు. జాతీయ స్థాయి ఫెలోషిప్‌లు పొందుతున్న విద్యార్థులు యూనివర్శిటీ మెస్ ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. కొంత మంది విద్యార్థుల చాలా కాలంగా మెస్ ఛార్జీలు చెల్లించని కారణంగా వారి పరిశోధన పత్ర సమర్పణ, వైవా-వోస్ పరీక్షల్లో ఆలస్యమవుతోంది. ప్రస్తుతం దివ్యాంగ విద్యార్థులు ఆందోళన చేస్తూ వారి మెస్ బకాయిలను రద్దు చేయాల్సిందిగా కోరుతున్నారు.

విశ్వవిద్యాలయం దివ్యాంగ విద్యార్థుల పట్ల అత్యంత చిత్తశుద్ధి, ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుంటోంది. ఫెలోషిప్ పొందుతున్న విద్యార్థుల మెస్ బకాయిలు రద్దు చేయటం నిబంధలకు విరుద్ధం. ఆర్థిక వివేకం, జవాబుదారీతనాన్ని వర్సిటీ ఎప్పటికీ అనుసరిస్తుందని అధికారులు గుర్తు చేశారు. ఫిలోషిప్ నుంచి కొంత మొత్తాన్ని వెచ్చించి మెస్ బకాయిలు చెల్లించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. అధికారులపై ఒత్తిడి పెంచటం ద్వారా ఉపయోగం లేదన్నారు. నిబంధనలను ఉల్లంఘించటం ద్వారా వ్యవస్థలో అసమానతలు ఎదురవుతాయని గుర్తు చేశారు. విద్యార్థులతో చర్చించేందుకు ఓయూ అధికార యంత్రాంగం ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుందని న్యాయమైన, బాధ్యతాయుతమైన చర్చకు ఎప్పుడైనా అధికారులు సిద్ధమేనని స్పష్టం చేశారు. వ్యక్తిగతమైన అంశాలకన్నా ఓయూ సమగ్రతను కాపాడేలా, నిబంధనలకు అనుగుణంగా ప్రతి ఒక్కరి ప్రయోజనం కోసం విద్యార్థులు అధికారులతో సహకరించాలని విశ్వవిద్యాలయం విజ్ఞప్తి చేశారు.



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ముషీరాబాద్ డివిజన్ కార్పొరేటర్ సుప్రియ నవీన్ గౌడ్ కార్యాలయంలో వేడుకల అత్యంత ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో డివిజన్ అధ్యక్షులు కంచి ముదిరాజ్ ఆధ్వర్యంలో మహిళలను ఘనంగా సన్మానించారు నవతెలంగాణ - ముషీరాబాద్



తెలంగాణ నర్సెస్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.శిరీషా రాణి ఆధ్వర్యం లో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో మహిళా డాక్టర్ లు ,నర్సింగ్ సిబ్బంది మహిళా ఉద్యోగులు కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. నవతెలంగాణ -సుల్తాన్ బజార్

# సమానత్వానికి సమరమే.. ఉమెన్స్ డే

- మతోన్మాద విధానాలతో మహిళలపై పెరిగిన దౌర్జన్యాలు
- కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు

నవతెలంగాణ-అంబర్‌పేట

పనిగంటల తగ్గింపు మహిళల భద్రత, సమాన పనికి సమాన వేతనం ఓటు హక్కు వంటి కీలక డిమాండ్లతో 1910 మార్చి 10న సమానత్వం కోసం ఏర్పడిన ప్రపంచ మహిళ ఐక్యత దినమే అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం అని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు అన్నారు. శనివారం అంబర్‌పేట సీఐటీయూ కార్యాలయంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో 'మనువాదం మహిళల హక్కులు' అనే అంశంపై సెమినార్ కేవీపీఎస్ నగర కార్యదర్శి బి సుబ్బారావు అధ్యక్షత నిర్వహించారు. ఈ సెమినార్‌లో స్కైలాబ్ బాబు మాట్లాడుతూ హిందూ ముస్లిం క్రైస్తవ మత ఆచారాలు ధర్మాల పేరుతో మహిళలను వేల



సంవత్సరాలుగా అణిచివేతకు గురిచేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. సతీసహగమనం, బాల్య వివాహాలు, వితంతువు పునర్వివాహాలు నిషేధించడం వంటి సాంఘిక దురాచారాల్ని మనుస్మృతి మానసిక చట్టాల ద్వారా ఫలించిందన్నారు. మహిళకు పెట్టుబడిదారీ వ్యవస్థలో కామకాంక్షతీర్చే ఒక యంత్రంగా పిల్లలను కనే ఒక మనిషిగా గుర్తించడం తప్ప సమాజంలో ఏమాత్రం గౌరవం లేదన్నారు. సమాజంలో సగభాగం ఉన్న మహిళలకు సముచిత స్థానం లభించడం లేదన్నారు. మనుస్మృతి లో 67శ్లోకాలు ఉండగా 66 శ్లోకాలు మహిళలు అణిచివేయటానికి అవమానించడానికి రాసుకున్నవేనని పేర్కొన్నారు. ముస్లిం మతంలో మహిళకు కేవలం కండ్లు మాత్రమే కనిపించే విధంగా బుర్కా వేసి ఉంచుతారని చెప్పారు మజీదులో నమాజుకు మహిళలను అనర్హులుగా చేశారని చెప్పారు క్రిస్టియనిటీలో అత్యధికులు ఫాదర్లుగా పురుషులే ఉంటారని మహిళలకు గౌరవం లేదన్నారు. బీజేపీ 11 ఏండ్ల పాలనలో మహిళలపై లైంగిక హింస పెరిగిందన్నారు. డబ్బులు ఇంజన్ సర్కార్‌గా పేరుపొందిన బీజేపీ పాలనలో మణిపూర్‌లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగింపు చేస్తే నరేంద్ర మోడీ పల్లెత్తు మాట మాట్లాడకపోవటం మహిళల పట్ల బీజేపీకి ఉన్న చిన్న చూపు అర్థం చేసుకోవచ్చన్నారు. బిల్కిస్ బానో కేసులో నిందితులకు పూలమాలలతో ఘనంగా సత్కరించారని చెప్పారు చట్టసభల్లో 33శాతం బిల్లు తక్షణమే ఆమోదించాలన్నారు స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. ఈ సెమినార్ లో కేవీపీఎస్ నగర అధ్యక్షులు ఎం దశరథ్, జిల్లా నాయకులు ఎం మహేందర్, సీఐటీయూ జిల్లా నాయకులు జి రాములు, మహిళ నాయకురాళ్లు సూర్యకళ, రంగమ్మ సుభద్ర, రేణుక యధలక్ష్మీ లక్ష్మీ తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తాం



- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- తెలంగాణ మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం డైరీ ఆవిష్కరణ

నవతెలంగాణ-ముషీరాబాద్

ఉద్యోగులకు నష్టం కలిగితే ప్రభుత్వానికి నష్టం జరిగినట్టేనని, కనుక వారి సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్ని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణ మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం అధ్యక్షుడు తిప్పర్తి యాదయ్య ఆధ్వర్యంలో నూతనంగా ముద్రించిన డైరీ ఆవిష్కరణ సభ శనివారం జరిగింది. ముఖ్యఅతిథిగా డిప్యూటీ సీఎం హాజరై డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన వివరాలను తిప్పర్తి యాదయ్య బాగిలింగం పల్లిలోని సంఘం కార్యాలయంలో వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసే బాధ్యత తమ ప్రభుత్వాన్ని దేనిని డిప్యూటీ సీఎం అన్నారని తెలిపారు. పదవి విరమణ చేసిన వారికి బకాయిలను చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఏప్రిల్ నెల నుంచి పదవీ విరమణ పొందిన వారికి పూర్తి బెనిఫిట్స్ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. అదేవిధంగా ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్లో ఉన్న రెండు డీఏ లను కూడా విడుదల చేస్తామని తెలిపారు. తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మెన్ మారం జగదీశ్వర్, సెక్రెట రీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు, వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల సంఘం ప్రెసిడెంట్ శ్యామ్, డాక్టర్స్ అసోసి యేషన్ ప్రతినిధి లల్లు ప్రసాద్ యాదవ్, యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగన్ మోహన్, అసోసియేట్ ప్రెసి డెంట్ అశోక్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చెవ్వ కృష్ణ, సంయుక్త కార్యదర్శిబి. రమేష్, మండల రవి పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందులు సోదర భావాన్ని పెంచుతాయి..

- ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ

నవతెలంగాణ - ధూల్ పేట్

ఇఫ్తార్ విందులు సోదర భావాన్ని పెంచుతాయని చాంద్రాయణ గుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ అన్నారు. కంచన్ బాగ్ డివిజన్ లోని హాఫిజ్ బాబా నగర్ బిస్మిల్లా హెూటల్ వద్ద కంచన్ బాగ్ కార్పొరేటర్ అబ్దుల్ రెహమాన్ షా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని మాట్లాడారు. పవిత్రమైన రంజాన్ మాసంలో ధనవంతులు ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేసి నిరుపేదలను ఆహ్వానించాలని కోరారు. కార్పొరేటర్లు, వహబ్, ఫాహద్



బిన్ అబ్దాద్, అజమ్ షరీఫ్, సలీమ్ బేగ్, రెహమాన్, ఇబ్రహీమ్ సర్దార్, నాయకులు పాల్గొన్నారు.

## 'మహిళలను అన్ని రంగాలలో ప్రోత్సహించాలి'



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

మహిళలు అన్ని రంగాలలో ఎదిగేందుకు ప్రోత్సహించాలని హైకోర్టు న్యాయమూర్తి సరేపల్లి నంద అన్నారు. శనివారం కోఠిలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్ లో డెవలప్మెంట్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ ది బ్లైండ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జస్టిస్ సూరేపల్లి నందా విచ్చేసి మహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నల్లగొండ అంధుల పాఠశాలలో విద్యనభ్యసించి ఉన్నత ఉద్యోగాలలో స్థిరపడ్డ అంధ పూర్వ విద్యార్థులను వారికి విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యా యులను, సేవలందించిన సిబ్బందిని, దాతలను శాలువా మేమెంటోతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, సాధికారత సాధిం చాలని సూచించారు. జస్టిస్ సూరేపల్లి నందాను శాలువా మెమెంటోతో సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్య, రాజకీయ, సామాజిక, ఆర్థికంగా మహిళలను బలోపేతం చేసే విధంగా ప్రోత్సహిస్తేనే దేశం అభివద్ధి చెందుతుందని అన్నారు. సీనియర్ న్యాయవాది సోఫియా బేగం మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో మహిళలు రాణిస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. అక్షర యాన్ తెలుగు మహిళా రచయిత్రుల సంఘం హైదరాబాద్ ఐనంపూడి లక్ష్మి, డాక్టర్ వాణి అక్కిపెద్ది , ప్రిన్సిపాల్ కేశవ్ మెమోరియల్ కాలేజ్ ఆఫ్ లా, డాక్టర్ సోఫియా బేగం, సీనియర్ న్యాయవాది, బొంత గో మతి, విద్యా భారతి పూర్వ విద్యార్థి పరిషత్ సంఘటన కార్యదర్శి తెలంగాణ, డ్వాబ్ ప్రధాన కార్యదర్శి, ఏఐసిబి ఉపాధ్యక్షుడు పొనుగోటి చొక్కా రావు , డ్వాబ్ అధ్యక్షుడు అంజయ్య , కోశాధికారి పరమేశ, కార్యదర్శి కె శ్రీనివాస్ పాల్గొన్నారు.



## మహిళలకు ఉచిత బ్యూటీషన్ కోర్సు శిక్షణ శిబిరం ప్రారంభం

నవతెలంగాణ-ముషీరాబాద్

లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ పారడైస్ వారి ఆధ్వర్యంలో నీవి చారిటబుల్ ట్రస్ట్ వారి సౌజన్యంతో ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా గాంధీనగర్ డివిజన్ మహిళలకు ఉచిత బ్యూటీషన్ కోర్సు శిక్షణ శిబిరం ప్రారంభమైంది. వివి.గిరినగర్ కమ్యూనిటీ హాల్లో గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్ లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ప్యారడైజ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మనోహర్ రెడ్డి, కరుణ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ప్యారడైజ్ అధ్యక్షులు సెరిపల్లి గణేష్ పద్మశాలి, సారిక, కార్యదర్శి చంద్రమోహన్,ప్రాజెక్టు చైర్ పర్సన్ లక్ష్మీ ప్రతిమ,జోన్ చైర్ పర్సన్, మరాన్, సుబ్రహ్మణ్యం, సభ్యులు హేమంత్, కమలాకర్,సుమన్,మధు, రామ్మూర్తి, బీజేపీ మహిళా నాయకులు విజయ లక్ష్మీమంగమ్మ, సంధ్యా రాణి, తదితరులు పాల్గొన్నారు



మెహదీపట్నం భోజగుట్ట శివాజీ నగర్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించిన సీఐటీయూ నాయకులు మల్లేష్, భవాని, ప్రగతి, జాహ్నవి, శ్రీనివాస్, కళ్యాణ్, వెంకటస్వామి, మహిళలు. నవతెలంగాణ-మెహిదీపట్నం

## చేతి రాతలే విద్యార్థుల భవిష్యత్తును మారుస్తాయి

- కూల్సుంపురా ఏసీపీ మునావర్

నవతెలంగాణ-ధూల్ పేట్

విద్యలో చేతి రాతలే విద్యార్థుల భవిష్యత్తును మారుస్తాయని కూల్సుంపురా ఏసీపీ మునావర్ అన్నారు. శనివారం రాష్ట్ర స్థాయి చేతి రాత పోటీలలో జీయగూడ విద్యాశ్రీ హై స్కూల్ విద్యార్థులు 180 అవార్డులను పొందిన సందర్భం గా స్కూల్ చైర్మెన్ శ్యామ్ వెరా ఆధ్వర్యంలో స్టేట్ లీవర్ హ్యాండరైటింగ్ అవార్డ్స్ సెర్మని స్కూల్ ఆడిటరియంలో నిర్వహించారు. రాష్ట్ర స్థాయిలో వివిధ స్కూల్స్ లలో సుమారు 12వేల మంది విద్యార్థులు చేతి రాత పోటీలలో పాల్గొనగా 180 మంది విద్యార్థులకు స్కూల్‌లో ఏర్పాటు చేసిన వేడుకలో అక్షర్ హ్యాండరైటింగ్ అకాడమీ ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చక్కటి చేతి రాతతో తల రాతనే మారుతుం దన్నారు. విద్యార్థులు తమ ప్రతిభను చేతి రాతలో



కనబరచడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా స్కూల్ చైర్మెన్ మాట్లాడుతూ.. టాప్ 10 లో మొక్షా (ప్రథమ స్థానం) రాణించగా, మరో 180మంది విద్యార్థులు ప్రతిభను కనబరిచారన్నారు. కాంగ్రెస్ పార్టీగ్రేటర్ యూత్ అధ్యక్షులు కిరణ్ మాట్లాడుతూ.. నిరుపేద ప్రాంతాల్లో నాణ్యమైన విద్యా అందించడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమం లో డైరెక్టర్ సునీత శ్యామ్ వెరా, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అర్బన్ మహిళలకు ఉపాధి హామీ పథకం అమలు చేయాలి



- ఐద్వా నేత శశికళ

నవతెలంగాణ - ధూల్ పేట్

దేశ వ్యాప్తంగా పట్టణ ( అర్బన్ ) ప్రాంతాల్లో శ్రామిక మహిళలకు నిర్మాణ రంగంలో ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని ప్రధాని నరేంద్ర మోడీనీ ఐద్వా హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి పి.శశికళ డిమాండ్ చేశారు. మహిళా దినోత్సవ సందర్భంగా బేగం బజార్ చత్రి నుంచి లేబర్ అడ్డా వరకు ఐద్వా సీఐటీయూ సంయుక్తంగా నిర్వహించిన ప్రదర్శన, సదస్సులలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అసంఘటిత రంగంలోని శ్రామిక మహిళలకు కేంద్ర బీజేపీ ప్రభుత్వం గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని నీరుగార్చే విధంగా ఇటీవల ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఉపాధిహామీ బడ్జెట్ కేటాయింపు తగ్గించేశారని ఆందోళన వ్యక్తం చేశారు. 114 ఏండ్లుగా ప్రపంచ వ్యాప్తంగా మహిళలు ఈ మహిళా దినోత్సవ స్పూర్తితో పోరాటాలకు పదును పెడుతున్నారని పేర్కొన్నారు. మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే శ్రామిక మహిళా లోకం గలమెత్తనున్నదని హెచ్చరించారు. సీఐటీయూ గోషామహల్ జోన్ నాయకులు నెమ్మది గోపాల్ అధ్యక్షత వహించినకార్యక్రమంలో స్థానిక మహిళా ప్రతినిధులు కె.అమత, పి.అంజమ్మ, డి.కిష్టమ్మెస్, అరుణ ,గోషామహల్ సీఐటీయూ నాయకులు కే.జంగయ్య, పి.నాగేశ్వర్ ఎన్. గోపాల్, బీ.శివ, వి.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు..







నవతెలంగాణ - ధూల్ పేట్

బహదూర్‌పురా నియోజకవర్గం దూద్ బౌలి ప్రాంతంలో స్థానిక మహిళలు ఘనంగా మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో కాంగ్రెస్ బహదూర్‌పురా నియోజకవర్గం ఇన్‌చార్జి పులిపాటి రాజేశ్ కుమార్, వర్షిక పులిపాటి దంపతులు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా రాజేశ్ కుమార్ మాట్లాడుతూ.. మహిళ కండ్లు తెరిచిన క్షణం నుంచి తనవారి కోసం అహర్నిశలు కష్టించి, వారి భవిష్యత్తుకు ఆలోచిస్తుందన్నారు. మన బంధం కోసం, బాధ్యత కోసం, కుటుంబం కోసం, అందరినీ కనుపాపలా తలచి, ఆత్మీయత పంచి పెడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు జి.కన్నయ్య లాల్, అలీ షాన్, యూత్ కాంగ్రెస్ నాయకులు జ్యోతి శెట్టి, సబితా, సంగీత, బారి ఖాన్ ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

**పెట్ల బుర్జ్ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రజనీకి సన్మానం**

ఆధునిక ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో మహిళలకు అందిస్తున్న వైద్య సేవలు అభినందనీయమని కాంగ్రెస్ బహదూర్‌పురా నియోజకవర్గం ఇన్‌చార్జి పులిపాటి రాజేష్ కుమార్ అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం పెట్ల బుర్జ్ ప్రసూతి ఆస్పత్రిలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రజిని రెడ్డిని శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె ఆస్పత్రిలో పేద మధ్య తరగతి అన్ని వర్గాల ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు వివరించారు. అనంతరం ఓర్పు, సహనం, స్ఫురదష్టి కలగలసి కనులముందు కదలాడే స్త్రీశక్తి ప్రతిరూపమై, ఆదర్శంగా నిలుస్తున్న అతివలందరికీ, అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు కన్నయ్య లాల్, అలీ షాన్, యూత్ కాంగ్రెస్ నాయకులు జ్యోతి శెట్టి, సబితా, సంగీత, బారి ఖాన్ ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

**ముషీరాబాద్** : ఇండియన్ సొసైటీ ఆఫ్ రేడియో గ్రాఫర్స్ అండ్ టెక్నాలజిస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సీనియర్ మహిళ రేడియో గ్రాఫర్స్, తెలంగాణ పారామెడికల్ బోర్డు మహిళలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి పారామెడికల్ బోర్డు సెక్రటరీ ప్రేమ్ కుమార్, ఇండియన్ సొసైటీ ఆఫ్ రేడియో గ్రాఫర్స్ అండ్ టెక్నాలజిస్ట్ ప్రెసిడెంట్ ఏఎం అన్సారి, వైస్ ప్రెసిడెంట్ రహిమా సుల్తానా, ఎండీ అహ్మద్ మో హిసుదిన్, రాష్ట్ర సెక్రెటరీ జి గంగాధర్, ఫైనాన్స్ సెక్రటరీ బండి లింగరాజు, జాయింట్ సెక్రెటరీ సురేష్, రాజేంద్రప్రసాద్, మానస, గణేష్, విష్ణు, ఆఫీస్ సూపరింటెండెంట్ ఎండీ షబీ అహ్మద్ హాజరయ్యారు. మహిళలు అన్ని రంగాలలో రాణించాలని ఆకాంక్షించారు. మహిళలు అశ్విని, మమతా దేవి, లక్ష్మి ప్రియాంక, గాయత్రి శిరీష ఉదయశ్రీ, మనీసకిత, తదితరులు హాజరయ్యారు

మహిళా అభ్యున్నతితోనే రాష్ట్ర శ్రేయస్సు సాధ్యమవుతుందని అందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు తేజ గౌడ్ అన్నారు. శనివారం ముషీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తేజ గౌడ్ హాజరై ఆశా వర్కర్లకు స్టీల్ వాటర్ బాటిల్స్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ. నేటి సమాజంలో మహిళలు అనేక రంగాలలో రాణిస్తున్నారని ముఖ్యంగా ఆర్థిక రాజకీయ రంగాలలో ప్రముఖ పాత్ర వహిస్తున్నారని తెలిపారు. ఆశా వర్కర్ల సేవలు వెలకట్టలేనివని, అనునిత్యం ప్రజలకు సేవ చేస్తూ తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారని తెలిపారు. జీహెచ్ఎంసీ కార్మికుల సేవలు వెలకట్టలేనిదన్నారు. మహిళలకు పురుషులు అండదండగా ఉంటూ వారి అభివద్ధికి తోడ్పడాలని కోరారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు జీఎన్ చారి, రామకష్ణ, జై కుమార్, మధుసూదన్, జే. మురళి యాదవ్, రవి కిరణ్, గౌతమ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

**జీహెచ్ఎంసీ మహిళా కార్మికులకు సన్మానం**

మహిళా దినోత్సవం సందర్భంగా స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ మహిళా కార్మికులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ డాక్టర్. వై. సంజీవకుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ.పావని, సర్కిల్ ఉపవైద్యాధికారిణి మంజులత, సానిటరీ సుప్రవైజర్ శ్రీనివాస్, సభ్యులు విద్యాసాగర్, అఖిల్, పాల్గొన్నారు.



టోలిచౌకిలో సీఐటీయూ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించిన నాయకులు విట్టల్, జీహెచ్ఎంసీ మహిళా కార్మికులు నవతెలంగాణ-మెహిదీపట్నం



విశ్వజన కళా మండలి మహిళా దినోత్సవ వేడుకల పాల్గొన్న టీడీపీ అంబర్‌పేట కోఆర్డినేటర్ ఎడెల్లి భాను ప్రకాష్, సౌమ్య, మధుప్రియ, సునీత ,కొమరమ్మ, ధనలక్ష్మి తదితరులు. నవతెలంగాణ-అంబర్‌పేట





## దేశంలో పని ప్రదేశాలలో మహిళల పట్ల వివక్ష

- సీఐటీయూ మాజీ కార్యదర్శి విట్టల్..

నవతెలంగాణ - ధూల్ పేట్

దేశంలో పని ప్రదేశాలలో మహిళల పట్ల వివక్షత కొనసాగడం దారుణ మని సీఐటీయూ మాజీ కార్యదర్శి విట్టల్ అన్నారు. జీహెచ్ఎంసీ శానిటేషన్ మహిళల కార్మికులతో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మహిళల పట్ల వివక్ష వేతన అసమానతలు ప్రపంచంలోనే అత్యధికంగా ఉన్నాయన్నారు. దేశంలో దాదాపు 70 శాతం మంది మహిళలు నిరుద్యోగులు ప్రమాదకరమైన పరిస్థితిలోకి నెట్టడమవుతున్నారన్నారు. గృహిణిగా మహిళలు చేస్తున్న పనిని ప్రభుత్వం గుర్తించాలన్నారు. దేశంలో పని ప్రదేశాలలో మహిళల చేత రాత్రి షిఫ్టుల్లో పనిచేయించే క్రమంలో వారికి భద్రత, సురక్షిత ప్రయాణ ఏర్పాటు కల్పించాల్సిన చట్టాలు



నిబంధనలను తుంగలో తొక్కుతున్నారనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు, పిల్లలపై హింస ఆందోళన కలిగించే స్థాయిలో ఉందని మండి పడ్డారు. కేంద్ర ప్రభుత్వం పేరుకే మహిళల పట్ల ప్రేమను కనబరుస్తూ మోసం చేస్తున్నదన్నారు. లేబర్ కోడ్లు అమలైతే కనుక కార్మిక హక్కులు పూర్తిగా హరించబడతాయనీ ఆరోపించారు. మహిళా శ్రామిక నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## మహిళలకు సముచిత స్థానం కల్పించాలి



- పీసీసీ మాజీ అధ్యక్షులు వీ హనుమంతరావు

నవతెలంగాణ-అంబర్‌పేట

బాగ్ అంబర్‌పేట డివిజన్ పరిధిలోని రామకృష్ణ నగర్ కమిటీ హాల్ లో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా పీసీసీ మాజీ అధ్యక్షులు వీ హనుమంతరావు ఏఎమ్‌హెచ్ ఓ డాక్టర్ హేమలత ,ఎస్ ఐ మౌనిక మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి డి శైలజ, ఖైరతాబాద్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ వెంకటమ్మ , అంబర్‌పేట్ ఏ బ్లాక్ ప్రెసిడెంట్ ప్రసన్న, అంబర్‌పేట్ డివిజన్ ప్రెసిడెంట్ కవిత, డ్వాక్రా మహిళా సంఘాలు పారిశుధ్య కార్మికులతో కలిసి కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షు రాలు శంబుల ఉషశ్రీ శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో వివిధ రంగాలలో కృషిచేసిన, ఏ ఎమ్ హెచ్ఓ డాక్టర్ హేమలత, ఎస్సై మౌనికలను జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికులను వీహెచ్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ మహిళలను అన్ని రంగాలలో ప్రోత్సహించాల్సిన వారి అవసరం ఎంతైనా ఉందని, వారికి సముచిత స్థానం కల్పించాల్సిన బాధ్యత పాలకులపై ఉందని అన్నారు. ఈ సందర్భంగా శంభుల ఉషశ్రీ శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ మహిళ సాధికారత తోనే దేశాభివృద్ధి ఉందని, అందుకు తగిన విధంగా మహిళలకి ప్రోత్సాహాన్ని అందించాలని కోరారు. మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాలలో రాణిస్తున్నారు. అందుకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. అలాగే దేశ సంరక్షణలో కూడా మహిళలు భాగస్వామ్యులు అయినందుకు ఒక మహిళగా ఎంతో గర్వంగా ఉందన్నారు.



అఖిల భారత గాండ్ల తెలికల సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ సభ శనివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ముఖ్య అతిథిగా తెలంగాణ బీసీ కమిషన్ సభ్యురాలు వర లక్ష్మీ, సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రామచంద్రరావు, కూతురు లక్ష్మణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఏ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఏ రాజేందర్, విజయ ప్రసాద్ జె.ప్రసాద్, ఐ లవ్ యు భాగం ప్రధాన కార్యదర్శి సాయి సాహితి, కష్ణవేణి తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ - ముషీరాబాద్

నవతెలంగాణ మానవి
హైదరాబాద్
ఆదివారం 9 మార్చి 2025

# ఆమెకు ఆరు చేతులున్నాయా?



**ప్రతి ఏడాది మహిళా దినోత్సవం వచ్చిందంటే కంప్యూటర్ ద్వారా గ్రాఫిక్ చేసిన ఆరు చేతులతో ఉన్న మహిళ ఫొటో సోషల్ మీడియాలో విపరీతంగా వస్తూ ఉంటుంది. తన చేతుల్లో లాప్ టాప్, హెయిర్ డ్రయ్యర్, పసిబిడ్డ, వంట గరిటె, ఫోన్, చీపురుతో కనిపిస్తుంది. ఇది చూసినప్పుడు మనకు రెండు ప్రశ్నలు రావాలి. ఒకటి... ఎవరికి ఆరు చేతులు ఉన్నాయి? రెండోది... ఒక మహిళ నుండి ఆరు చేతులు చేసే పనిని ఎందుకు ఆశిస్తున్నాము?**

ఇలా మహిళలు ఒకేసారి అనేక పాత్రలు పోషిస్తున్నట్లు చూపడం అనేది అసహజమైన, చేయలేని వాటిని కూడా మంచితనంతో కూడిన దౌర్జన్యంతో చేయించుకుంటున్నట్టు అవుతుంది. ఈ పద్ధతి మహిళలను బయటకు అడుగు వేయలేని, వినయంగా, అన్నీ మౌనంగా భరిస్తూ, తనను తాను నిరూపించుకోలేని పరిస్థితికి తీసుకెళు తుంది. గృహ నిర్వహణకు కావలసిన విషయాలను తెలుసుకోవడం, మానసిక ఒత్తిడి, అంతులేని ఆలోచనలు, భావోద్వేగాలకు గురి కావడం వంటివి మహిళకు శిక్షగా మారుతున్నాయి. మహిళలు విద్యలో ఎంతో పురోగతి సాధించి మెరుగ్గా ఉన్నప్పటికీ ఇంకా అనేక సవాళ్ళు, అడ్డంకులు ఎదుర్కొంటున్నారు. వీటిని దాటి ముందుకు వెళ్ళి తమ పూర్తి సామర్థ్యాన్ని నిరూపించుకోవడానికి, తమకు మద్దతునిచ్చే వ్యవస్థలతో నిర్మొహమాటంగా చర్చించాల్సిన సమయం వచ్చింది. ఇది పారదర్శకంగా ఉన్న గాజు పైకప్పు కాదు.. రాక్షస బంధనం.



**రాకాసి మొక్కలా...**

ప్రపంచప్రసిద్ధమైన హారీ పాటర్ కథలో ముగ్గురు అమ్మాయిలు ఒక అతీంద్రియ శక్తి వలన ప్రమాదకరమైన మొక్క తీగలచే బంధింప పడతారు. ఒక అమ్మాయి మాత్రం తప్పించుకుంటుంది. మిగిలిన ఇద్దరూ బయటకు రావడానికి ప్రయత్నించినకొద్దీ ఆ తీగలు బిగుసుకు పోతుంటాయి. ఆ అమ్మాయి.. కదలొద్దు.. నాకు తెలుసు.. అది రాకాసి మొక్క అని అంటుంది. భవిష్యత్తులో హ్యారీ పాటర్ పాఠకులు తమ మాయా జాల ప్రయాణాన్ని మంచిగా ప్రారంభించాలి. ముందుగా ఏం జరుగుతుందో తెలియదు. కానీ కాలం గడుస్తున్నకొద్దీ దాని మహిమ తగ్గుతుంది. రాకాసి మొక్క చిత్రం సరైన ఉపమానాలను సృష్టిస్తుంది. దురదృష్టవశాత్తూ అందులో ఒకటి పితృస్వామ్యం.

**మాయలో పడేస్తుంది**



రాకాసి మొక్క లాగా పితృస్వామ్యం కూడా కృత్రిమం, సంకుచితం, ప్రమాదకరమైనది. పరిమిత పాత్రలు, నియమాలతో ప్రజలను మాయలో పడేస్తుంది. పగిలిన గ్లాస్ సీలింగ్‌లా కాకుండా ఇది మనుషుల్ని విష వలయంలో చుట్టేసి ఊపిరి ఆడకుండా చేసి వ్యక్తి జీవితాన్ని, ఆత్మను సమాధి చేస్తుంది. ఇది అమ్మాయిల పుట్టుక ముందు నుండే అవసరమైనది కాదు అనే భావనతో మొదలై, ఎప్పటికీ రక్షణ లేని అనుభవాలను ఇంటిలోపల, బయటా కూడా ఎదుర్కునేలా చేస్తుంది. అనేక మంది వేధింపులు, దోపిడీ, దుర్వినియోగానికి గురవుతూ, భయం వల్ల ఎప్పటికీ బాధితులుగా మిగులుతారు.

**సురక్షిత పరిసరాలు**

పితృస్వామ్య వ్యవస్థను మహిళలు చదువుకుని, ఉద్యోగం చేయడం ద్వారా, చైతన్యంతో ఎదిరించాలి. స్వతంత్రంగా వృత్తిని నిర్ణయించుకోగలగాలి. తన ఆకాంక్షను నెరవేర్చుకోగలగాలి. దీనికి అనుకూలమైన పని పద్ధతులు, పని గంటల వెసులుబాటు, పసిపిల్లల సంరక్షణ వంటి సదుపాయాలు ఉన్నప్పుడు బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించ గలుగుతారు. మహిళలకు పని చేసే ప్రదేశంలో రక్షణ కావాలి. పర్యవేక్షణ ఉండాలి. నేరాలు జరగకుండా సిసి టీవీ నిఘా ఉండాలి. రక్షణ, న్యాయవ్యవస్థ, ప్రజలు కలిసి పనిచేయడం ద్వారా బాధితులకు న్యాయం అందించగలం.



**ధ్వనులు అవసరం**

పితృ స్వామ్యం మహిళల జీవితాలను ప్రతి దశ లోనూ అనుభవాలను, అవకాశాలను, సంబంధాలను ప్రభావితం చేస్తుంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం స్త్రీ జీవిత వాస్తవాలను, ఊపిరి సలపని అణచివేతను మహిళల ఆలోచనలను ప్రతిబింబించాలి. రాకాసి మొక్క లాగానే పితృస్వామ్యం చాటుగా చీకటిలో పనిచేస్తూ మహిళా హక్కులు, భద్రతల గురించి మనం చేయవలసిన చర్చను దారి మళ్ళిస్తుంది, చెడగొడుతుంది, ఒక్కోసారి దొంగిలిస్తుంది. మనం నిరంతరం అగ్ని వెలుగులో మన బంధాలను వదులుచేసుకునే ప్రయత్నం చేస్తూ ఉండాలి. నేడు మనందరికీ నీలి పువ్వుల జ్వాలలు, అగ్ని సృష్టించే ధ్వనులు అవసరం. మంత్రదండాలు సిద్ధంగా ఉంచండి!!



**ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సౌజన్యంతో**
**ఆంగ్ల మూలం: సింధూ శర్మ**
**ఎస్వీ, కామారెడ్డి**
**తెలుగు అనువాదం:**
**డా.సీహెచ్.శారద.**

## నిజాయితీగా ఉండాలి

వేణు గీతికకు ప్రేమతో..

ఎలా ఉన్నావు.. మొన్న మీ కంపెనీ ఫౌండేషన్ డే వేడుకలు అద్భుతంగా జరిగాయి. మమ్మల్ని కూడా ఆహ్వానించి నందుకు చాలా సంతోషం. మీ పై అధికారులను పరిచయం చేసావు. నీ నిజాయితీ, పని పట్ల నీకున్న చిత్త శుద్ధిని, కష్ట పడి పని చేసే నిన్ను మెచ్చుకుంటుంటే ఎంతో సంతోషం వేసింది. తక్కువ సమయంలో మంచి పేరు తెచుకున్నావు.

చూడా నాన్న... ఒకటి గుర్తు పెట్టుకో, ఉద్యోగం చేసే చోట నిజాయతీ, కష్టపడటం, చెప్పిన పని నిర్ణిత సమయంలో చేయటం, తెలియక పోతే అడిగి తెలుసుకోవడం వంటివి చేయాలి. పై అధికారులు ఉన్నదే మీకు సరైన శిక్షణ ఇవ్వడానికి. మీ నడవడి, ప్రవర్తన ఇవన్నీ కూడా



**అమ్మ లేఖ**

పరిశీలిస్తుంటారు. పై అధికారులతో వినయంగా, మర్యాదగా మాట్లాడాలి. తోటి వారితో స్నేహంగా ఉండాలి. వారికి ఏమైనా తెలియక పోతే చెప్పాలి. భవిష్యత్‌లో నువ్వు ఎక్కడ ఉంటావో, ఎక్కడ ఉద్యోగం చేస్తావో తెలియదు. ఒక వేళ ప్రభుత్వ ఉద్యోగం వస్తే ఎలాంటి ప్రలోభాలకు లొంగ కుండా నిజాయితీగా ఉండాలి. లంచం ఆశ పెట్టి పనులు చేయించుకుంటారు కొందరు. అటువంటి వాటి జోలికి వెళ్లకు. ప్రభుత్వం ఇచ్చే జీతం, ఇతర సౌకర్యాలు మాత్రమే నీవీ. బైట వాళ్ళు ఇచ్చేవి నీవి కావు. నీ ఉద్యోగానికి సంబంధించిన బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించు. కొందరు స్వీట్ డబ్బా పట్టుకొస్తారు. అలాంటప్పుడు తోటి ఉద్యోగుల ముందు అది తెరిచి అందులో ఉన్న స్వీట్స్ అందరూ తీసుకోండి అని ఇచ్చేయాలి.

మరి కొందరు ఇంటికి వచ్చి కలుస్తాం అంటారు. ఆఫీస్‌కి సంబంధించిన పనైతే ఆఫీస్‌లోనే మాట్లాడాలి. ఎవరు ఎలాంటి వారో తెలియదు కనుక ఉద్యోగ పరంగా ఎలాంటి నింద పడకుండా చూసుకోవాలి. మరి కొందరు ఇతర ఉద్యోగుల గురించి వివరాలు అడగటం, ఆఫీస్ విషయాలు తెలుసుకోవాలనే ప్రయత్నాలు చేస్తుంటారు. ఆఫీస్ విషయాలు ఎప్పుడూ బయట వారితో చర్చించ కూడదు. ఇవన్నీ సమయస్ఫూర్తితో వ్యవహరించాల్సిన విషయాలు.

నాన్న జీవితంలో ఒక్కటి గుర్తుపెట్టుకొని వ్యవహరించు. నిజాయతీ, కష్టపడి పని చేయడం, ఉన్న దాంట్లో తృప్తి పడటం. ఏ ఉద్యోగం చేసిన సరే వృత్తికి న్యాయం చెయ్యి. ధర్మంగా బతుకు. నీ కష్టాన్ని మాత్రమే నమ్ముకో అభివృద్ధిలోకి వస్తావు. మన కుటుంబములో ఎక్కడా అవినీతి అనేది లేదు. ఉన్నదాంట్లో బతికారు, కష్టపడ్డారు, సమాజంలో మంచి పేరు సంపాదించుకున్నారు. నువ్వు కూడా అలాగే ఉండాలని ఆకాంక్షిస్తున్నాను.

ఉద్యోగంలో కొత్తగా చేరావు కనుక, ముందు ముందు ఎలాంటి వ్యక్తులు తారసపడతారో తెలియదు. ముందు జాగ్రత్తగా నీకు ఇవన్నీ చెప్తున్న బంగారు తల్లి. జాగ్రత్తగా ఉంటావు కదూ..



**ప్రేమతో మీ అమ్మ**
**- పాలపర్తి సంధ్యారాణి**

## సంపద అందని వర్గాలపై విశ్లేషణ చేయండి

### స్వతంత్ర, మేధావుల కమిటీని కోరిన డిప్యూటీ సీఎం

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాష్ట్రంలో ఇప్పటికీ సంపద, వనరులు అందని వర్గాలపై విశ్లేషణ చేయాలని స్వతంత్ర, మేధావుల కమిటీని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ (ఆర్థిక, రాజకీయ, విద్య, సామాజిక, న్యాయ) సర్వే సమాచారం ఆధారంగా ఈ అంశంపై సంపూర్ణ అధ్యయనం చేయాలని సూచించారు. సర్వే సమాచారం మేరకు ఏయే వర్గాలు రాజకీయంగా, ఆర్థికంగా తరతరాలుగా వెనుకబడి ఉన్నాయో, రాష్ట్ర వనరులు అందు బాటులో లేకుండా ఉన్నాయో అధ్యయనం చేసి నెల రోజుల్లో నివేదిక అందజేయాలని కమిటీని కోరారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి చైర్మెన్‌గా, రిటైర్డ్ ప్రొఫెసర్ కంచ ఐలయ్య వైస్ చైర్మన్‌గా, ప్రవీణ్ చక్రవర్తి కన్వీనర్‌గా, కమిటీ సభ్యులుగా డాక్టర్ సుఖదేవ్, రిటైర్డ్ ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి, ప్రొఫెసర్ శాంత సిన్హా, ప్రొఫెసర్ హిమాన్షు ప్రొఫెసర్ భూక్య భంగ్య, ప్రత్యేక ఆహ్వానితులుగా జీన్ డ్రీజ్‌లతో కూడిన కమిటీని శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సంగతి తెలిసిందే.

## కోతల సీఎం

(మొదటిపేజి తరువాయి)

రూ.5 వేల కోట్ల వడ్డీ రుణాల బకాయి ఉన్న సర్కారు ఐదేండ్లలో రూ.లక్ష కోట్ల రుణాలు ఎలా ఇస్తుంది? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ తీరుతో మహిళలు అప్పులపాలవుతున్నారని చెప్పారు. మహిళలకు ప్రతి నెలా రూ.2,500 గ్యారంటీ నెరవేర్చని సర్కారు వేడుకలు నిర్వహించడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రతి మహిళకు బకాయి పడ్డ రూ.37,500 ఎప్పుడు చెల్లిస్తారు? అని ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యంలో కేసీఆర్ కిట్, కేసీఆర్ న్యూట్రిషన్ కిట్, బతుకమ్మ చీరలు, ఆరోగ్యలక్ష్మి, ఆరోగ్య మహిళ, పెన్షన్ల పెంపు నిలిపేశారని హరీశ్‌రావు విమర్శించారు. కడుపుకోతలు మళ్లీ పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. నేరాలు పెరిగి మహిళలు అభద్రతకు గురవుతున్నారని చెప్పారు. రూ..20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు, 18 ఏండ్లు పైబడిన యువతులకు ఎలక్ట్రిక్ స్కూటీ, కళ్యాణ లక్ష్మికి రూ. లక్షతో పాటు తులం బంగారం, డ్వాక్రా సంఘాలకు పక్కా భవనాల నిర్మాణం, పుట్టిన ప్రతి బిడ్డకు ఆర్థిక సాయంతో కూడిన బంగారు తల్లి పథకం పునరుద్ధరణ, అంగన్‌వాడీ టీచర్లకు రూ.18 వేల వేతనం పెంపు, ఉద్యోగ భద్రత, ఆశావర్కర్లకు వేతనాల పెంపు హామీలను అటకెక్కించారని విమర్శించారు. ఇవేవీ అమలు చేయకుండా నవ్విపోతే నాకేంటి సిగ్గు అన్నట్టు వేడుకలు నిర్వహించారని ఎద్దేవా చేశారు.

## దక్షిణాదిపై కేంద్రం కక్ష

(మొదటిపేజి తరువాయి)

రాజకీయాలకతీతంగా అన్ని పార్టీలు కలిసి రావాలని కోరారు..

**కేంద్రం సమన్యాయం పాటించడం లేదు : అసదుద్దీన్**

"రాష్ట్రాల హక్కులు, నిధుల పంపకాల విషయంలో కేంద్రంలోని మోడీ సర్కార్ సమ న్యాయం పాటించడం లేదు. బీజేపీ పాలిత రాష్ట్రాల పట్ల ఉదారంగా వ్యవహరిస్తూ, తెలంగాణ పట్ల పక్షపాతాన్ని చూపిస్తోంది. ఆర్ఆర్ఆర్ మొదలుకుని హైదరాబాద్ నగరానికి నీళ్లందించే గోదావరి నీటి ప్రాజెక్టుల వరకు అన్నింటా అన్యాయంగా వ్యవహరిస్తోంది. పార్లమెంట్ వెలుపల, బయట రాష్ట్రానికి కేంద్రం చేస్తున్న అన్యాయాలను ఎండగడుతాం" అని ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ తమ పార్టీ వైఖరిని తెలిపారు.

**28 అంశాలివే..**

ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం కింద చెల్లించాల్సిన గ్రాంట్ విడుదల, 2014-15 ఆర్థిక సంవత్సరానికి సీఎస్ఎస్ నిధుల విడుదలలో లోపాన్ని సరిదిద్దమని అభ్యర్థన, ప్రాంతీయ రింగ్ రోడ్డుకు ఆమోదం, ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ వరకూ రేడియల్ రోడ్ల అభివృద్ధి, మెట్రో రెండో దశ, మూసీ రివర్ ఫ్రంట్, బాపు ఘాట్‌ను గాంధీ సరోవర్‌గా అభివృద్ధి చేయడం, గోదావరి-మూసీ నది లింక్ ప్రాజెక్ట్, హైదరాబాద్ కోసం మురుగునీటి పారుదల మాస్టర్ ప్లాన్, వరంగల్ భూగర్భ డ్రయినేజీ ప్రణాళిక, బందర్ పోర్టు నుంచి హైదరాబాద్ సమీపంలోని డ్రై పోర్టు వరకూ గ్రీన్‌ఫీల్డ్ హైవే, ఎస్‌సీసీఎల్ కోసం బొగ్గు బ్లాకుల కేటాయింపు, సెమీకండక్టర్ మిషన్, ఐపీఎస్ కేడర్ కేటాయింపులు, పీఎస్‌డీఎఫ్ కింద పథకాల మంజూరు, పీఎం కుసుమ్-ఏబీసీ కింద కేటాయింపు, తాడిచెర్ల బొగ్గు బ్లాక్-మైనింగ్ లీజు, వివిధ కార్పొరేషన్లు/ఎస్పీవీల రుణ పునర్నిర్మాణం వర్తించే మొత్తాన్ని తిరిగి చెల్లించడం, ఏపీబిల్డింగ్, ఇతర కార్మికుల సంక్షేమ బోర్డు, కార్మిక సంక్షేమ నిధిలో తెలంగాణకు వాటా కోసం నిధుల బదిలీ, ఏపీ పవర్ కార్పొరేషన్ నుంచి రావాల్సిన మొత్తాన్ని ఇప్పించడం, పీఎం మిత్రా పార్క్ పథకం కింద కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు, అన్‌కవర్డ్ జిల్లాల్లో జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటు, ఖమ్మంలో ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్, వెనకబడిన ప్రాంతాల్లో రోడ్డు కనెక్టివిటీని మెరుగు పర్చడం రాష్ట్రంలో విమానాశ్రయాల అభివృద్ధి, రైళ్ల కనెక్టివిటీ పెంచడం.

## అంతర్జాతీయ యూనివర్సిటీలతో పోటీపడాలి

**నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో**

వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం అంతర్జాతీయ యూనివర్సిటీలతో పోటీ పడాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అభిలషించారు. దానికోసం విద్యార్థినులు బాగా చదువుకొని ఇంజినీర్లు, డాక్టర్లుగా రాణించాలని చెప్పారు. వచ్చే ఎన్నికల నాటికి చట్ట సభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్లు అమలవుతాయనీ, ఆ అవకాశాలను అందిపుచ్చుకొనేందుకు నాయకులుగా ఎదగాలని దిశానిర్దేశం చేశారు. శనివారంనాడిక్కడి కోఠిలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం నూతన భవన నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1924లో ఏడుగురు విద్యార్థులతో మొదలై వందేండ్లు పూర్తి చేసుకొని నేడు ఏడు వేల మంది విద్యార్థులతో యూనివర్సిటీగా ఎదిగి, కోఠి ఉమెన్స్ కాలేజ్ అభివృద్ధి వైపు పయనిస్తున్నదని తెలిపారు. ఈ యూనివర్సిటీకి గడీలు, దొరలకు వ్యతిరేకంగా పోరాట స్ఫూర్తిని ప్రదర్శించిన చాకలి ఐలమ్మ పేరును పెట్టుకున్నామనీ, అభివృద్ధి పనుల కోసం రూ.500 కోట్లు మంజూరు చేశామని వివరించారు. ఈ యూనివర్సిటీలో సీటు రావడం అదృష్టంగా భావించి, దాన్ని అవకాశంగా మలచుకోవాలని దిశానిర్దేశం చేశారు. అంతర్జాతీయ యూనివర్సిటీలైన ఆక్స్‌ఫర్డ్, స్టాన్‌ఫోర్డ్ వంటి యూనివర్సిటీలతో పోటీపడాలని చెప్పారు. ఇందిరాగాంధీ, మీరా కుమార్, సోనియాగాంధీ వంటి మహిళలు దేశానికి గొప్ప నాయకత్వాన్ని అందించారనీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా శాంతికుమారి, విద్యాశాఖ కార్యదర్శిగా యోగితారాణా, మంత్రివర్గంలో సీతక్క వంటి వారు ఉన్నారని ఉదహరించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. పాఠశాల విద్యార్థులకు అందించే 1.30 కోట్ల జతల యూనిఫాంలను కుట్టే అవకాశాలను మహిళా స్వయం సహాయక సంఘాలకు ఇచ్చామని తెలిపారు. ఆడబిడ్డల్ని పారిశ్రామికవేత్తలుగా మార్చేం దుకు వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుదుత్పత్తి ప్లాంట్లు కేటాయించామనీ, ఆర్టీసీ బస్సుల నిర్వాహకులుగా మారుస్తున్నామని వివరించారు. రెండున్నరేండ్లలో యూనివర్సిటీలో హాస్టల్స్, ప్లే గ్రౌండ్స్, ఆడిటోరియాలు వంటి భవన నిర్మాణాలన్నీ పూర్తికావాలనీ, ఆ పనుల్ని తానే స్వయంగా పర్యవేక్షిస్తాననీ చెప్పారు. అంతకుముందు ఆయన ఎన్‌సీసీ మహిళా కేడెట్ల గౌరవ వందనం స్వీకరించారు. అక్కడి ఆడిటోరియంను సందర్శించారు. సభలో వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ సూర్యా ధనుంజయ్ నాయక్ స్వాగతోప న్యాసం చేశారు. హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాలకు మండల కేంద్రాల్లో రైస్ మిల్లులు, గోడౌన్లు

(మొదటిపేజి తరువాయి)

గుర్తుచేశారు. బీఆర్ఎస్ హయాంలో ఈ పనిని కార్పొరేట్లకు, మంత్రుల అనుయాయులకు అప్పగించారని విమర్శించారు. మహిళలు సమావేశాలు నిర్వహించుకునేందుకు ఒక్కో జిల్లా కేంద్రంలో రూ.25 కోట్లతో ఇందిరా మహిళా శక్తి భవనాల నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. గతంలో సోలార్ విద్యుత్ అంటే అదానీ, అంబానీ లాంటి పారిశ్రామికవేత్తలే గుర్తుకువచ్చే వారనీ, ఇందిరమ్మ రాజ్యంలో వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేసేలా మహిళా సంఘాలతో ఎంఓయూ చేసినట్టు తెలిపారు. వారు ప్రభుత్వానికి విద్యుత్ సరఫరా చేస్తారన్నారు. రవాణాశాఖలో పెట్టుబడిదారులు బస్సులను అద్దెకిచ్చి యజమానులుగా లాభాలు పొందేవారనీ, తాము తీసుకున్న నిర్ణయంతో వెయ్యి ఆర్టీసీ బస్సులకు మహిళలే యజమానులు కాబోతున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు సముచిత స్థానం కల్పించినట్టు తెలిపారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు తీసుకొస్తే, వారు చట్టసభల్లో వెళ్లేందుకు సోనియాగాంధీ మార్గం సుగమం చేశారని తెలిపారు. ప్రతిభాపాటిల్, మీరాకుమార్ తదితర మహిళా నాయకత్వాన్ని కాంగ్రెస్ ప్రోత్సహించిందన్నారు. రాబోయే రోజుల్లో మహిళా నాయకులు ముందుకు రావాలనీ, వారిని ఎమ్మెల్యేలు, ఎంపీలుగా గెలిపించుకునే బాధ్యత తనదేనని సీఎం భరోసానిచ్చారు. మహిళా సంఘాల ఉత్పత్తుల కోసం హైదరాబాద్ మాదాపూర్‌లో ఏర్పాటు చేసిన బజార్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. అవసరమైతే ఆ వస్తువులకు పన్నుల్ని మినహాయిస్తామనీ, కార్పొరేట్ సంస్థలతో పోటీ పడాలని ప్రోత్సహించారు. రాష్ట్రంలోని మహిళా సంఘాల్లో 65 లక్షల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారనీ, ఆ సంఖ్యను కోటి మందికి పెంచేందుకు సంఘాల్లో చేరేందుకు ఉన్న 18 ఏండ్ల వయస్సును 15 ఏండ్లకు తగ్గించామని వివరించారు. సంఘంలో సభ్యురాలిగా కొనసాగేందుకు ప్రస్తుతమున్న 60 ఏండ్ల పరిమితిని 65 ఏండ్లకు పెంచిన విషయాన్ని గుర్తుచేశారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసేందుకు వీలుగా కోటి మందిని మహిళా సంఘాల్లో చేర్చాలని సూచించారు.

**అభివృద్ధిలో భాగస్వాములు కండి**
**బీఆర్ఎస్ నేతలకు సీఎం సూచన**

రాష్ట్ర, మహిళల అభివృద్ధిలో బీఆర్ఎస్ నాయకులు భాగస్వాములు కావాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఎస్ఎల్బీసీ టన్నెల్ ప్రమాదం, రోడ్డు ప్రమాదం, ఇలా ఎక్కడ ప్రమాదం జరిగినా తనను తిడుతూ బీఆర్ఎస్ నాయకులు పైశాచికానందం పొందుతున్నారని విమర్శించారు. పదేండ్ల పాలనానుభవంతో ప్రభుత్వానికి సూచనలు చేయాలే తప్ప పైశాచికానందం పొందడం సరికాదని హితవు పలికారు. అలా పైశాచికానందం పొందిన వారెవరూ బాగుపడ్డట్టు చరిత్రలో లేదని గుర్తుచేశారు. ఏడ్వడం ఆపి కులగణనలో, అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.

**పదేండ్లలో పదివేల కోట్ల రూపాయల వడ్డీ రుణాలిచ్చారా హరీశ్‌రావు? : డిప్యూటీ సీఎం భట్టి**

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ మహిళా సంఘాలకు ఈ ఏడాది ఇప్పటికే రూ.21 వేల కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో మహిళలను ఆర్థికంగా నిలబెట్టే ఆలోచన చేయలేదని విమర్శించారు. అలాంటి ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా చేసిన హరీశ్‌రావు అవాకులు, చెవాకులు పేలుతున్నారని ఎద్దేవా చేశారు. పదేండ్లలో రూ.10 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చారా? అని ఆయన్ను ప్రశ్నించారు. ప్రజలు ఆర్థికంగా బలపడితే వారికి గులాంగిరీ చేసే వారు ఉండరనే కక్షతోనే దొరలు అవాకులు, చెవాకులు పేలుతున్నారని విమర్శించారు. హరీశ్ రావులాగా తమకు గాలికబుర్లు చెప్పడం రాదన్నారు. మహిళా విశ్వవిద్యాలయానికి రూ.500 కోట్లు, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, ప్రతి నియోజకవర్గంలో మొదటి దశలో 3,500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టినట్టు వివరించారు. రెండో విడతలో మరో 3,500 చొప్పున ఇండ్లు కడుతామని నొక్కి చెప్పారు. అన్ని వర్గాల కోసం పని చేస్తున్న ప్రజా ప్రభుత్వాన్ని కాపాడుకోవాలని మహిళలకు పిలుపునిచ్చారు.

**బీఆర్ఎస్ నేతల మాటలు వింటే వందేండ్లు వెనక్కి : మంత్రి సీతక్క**

మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ ..రాష్ట్రంలో మహిళలు అభద్రతా భావం నుంచి ఆర్థికంగా నిలదొక్కుకునే స్థాయికి ఎదిగారని చెప్పారు. సమానపనికి సమాన వేతనం, ఓటు హక్కు కోసం పోరాడిన రోజు ఇది అని గుర్తుచేశారు. ప్రతి మహిళ దీవెన కూడా రాష్ట్ర ప్రభుత్వానికి అవసరమన్నారు. మహిళా సంఘాల కోసం 20 రకాల వ్యాపారాలు అందుబాటులోకి తెచ్చినట్టు తెలిపారు. 600 ఆర్టీసీ బస్సులకు మహిళా సంఘాల సభ్యులను ఓనర్లుగా చేశామన్నారు. ఇప్పటిదాకా రూ.115 కోట్లను మహిళల ఉచిత బస్సు ప్రయాణం కోసం వెచ్చించామన్నారు. పెట్రోల్ బంకులు, 1,000 సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ఎంఓయూ, 2.25 లక్షల చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, ప్రమాద బీమా రూ.10 లక్షలు, లోన్ బీమా రూ.2 లక్షలు తదితర అనేక కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఎంపీలు మల్లు రవి, అనిల్‌కుమార్ యాదవ్, కడియం కావ్య, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, కేకే, విప్ ఆది శ్రీనివాస్, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి, కార్పొరేషన్ల చైర్మెన్లు శారద, అలేఖ్యపాల్గొన్నారు.

## సొరంగంలో ముగ్గురు కార్మికుల ఆనవాళ్లు

(మొదటిపేజి తరువాయి)

చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సొరంగం లోపల సరిగ్గా ఆక్సిజన్ స్థాయి లేకపోవడం, నీరు అధికంగా ఊరటం, టీబీఎం యంత్రం రాళ్లు, మట్టితో కూరుకుపోయి ఇబ్బందులు ఉన్నప్పటికీ సహాయక చర్యలు కొనసాగించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. త్వరగా కార్మికులను గుర్తించేందుకు ప్రపంచంలోని అత్యుత్తమ సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు. రెస్క్యూ సిబ్బందికి కూడా ప్రమాదం పొంచి ఉన్నందున అన్ని రోబోటిక్ నిపుణులతో సహాయక చర్యలు చేపట్టేందుకు రూ.4 కోట్లు ఖర్చు చేయనున్నట్టు వెల్లడించారు. రోబోలను వెంటనే రంగంలోకి దింపాలని మంత్రి అధికారులను ఆదేశించారు. సహాయక చర్యలో అహర్నిశలూ కష్టపడి పనిచేస్తున్న అధికారులు, నిపుణులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, ఆర్మీ డోగ్రా రెజిమెంట్ కమాండెంట్ పరిక్షిత్ మెహ్రా, మిలటరీ ఇంజినీర్ వికాస్ సింగ్, ఎన్‌డీఆర్ఎఫ్ ప్రసన్న కుమార్, ఎస్‌డీఆర్ఎఫ్ కమాండెంట్ ప్రభాకర్, సింగరేణి, రైల్వే, ఎన్‌జీఆర్ఐ, హైడ్రా తదితర రంగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**పొంచి ఉన్న ప్రమాదం**

సొరంగంలో ప్రమాదం పొంచి ఉంది. అంతర్జాతీయ సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడినా 15 రోజులుగా కార్మికులను గుర్తించలేదు. జీపీఆర్ స్కాన్ ద్వారా కార్మికుల ఆచూకీ తెలుస్తుందని భావించారు. అయితే, జీపీఆర్ గుర్తించిన దగ్గర ఇనుప రాడ్లు ఉన్నట్టు తేలింది. ఆ తర్వాత కేరళ క్యాడవర్ డాగ్స్‌ను సొరంగంలోకి పంపి రెండ్రోజులుగా కార్మికుల ఆచూకీ కోసం గాలించారు. ఊట రాళ్లు పడుతుండటంతో కార్మికులకు ప్రమాదం పొంచి వుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందుకే నేటి నుంచి రాష్ట్ర ప్రభుత్వం రోబోలను రంగంలోకి దింపనుంది.

## ట్రంప్ క్యాబినెట్ మీటింగ్‌లో రభస

(మొదటిపేజి తరువాయి)

డోజ్ బాధ్యతలు నిర్వహిస్తున్న మస్క్, విదేశాంగ మంత్రి రూబియోలు పాల్గొన్నారు. ఆ సమయంలో మస్క్ మాట్లాడుతూ.. రూబియో ఎవరినీ ఉద్యోగాల నుంచి తొలగించలేదనీ, తాను మాత్రం పనిచేయని వారిని తొలగిస్తున్నానని చెప్పారు. దీనిపై రూబియో స్పందించారు. "ఇప్పటికే 1500 మంది ఉద్యోగులు ముందే పదవీ విరమణ చేశారు. నేను తొలగించాలంటే వారిని మళ్లీ విధుల్లోకి తీసుకొని తొలగించాల్సి వస్తుంది" అని వ్యంగ్యంగా సమాధానమిచ్చినట్టు తెలుస్తున్నది.

**అలా జరగలేదు : ట్రంప్**

ఈ కథనాలపై ఓవల్ ఆఫీసులో జరిగిన విలేకరుల సమావేశంలో ట్రంప్ స్పందించారు. ఘర్షణ లాంటిది ఏమీ లేదని ఆయన అన్నారు. తాను అక్కడే ఉన్నాననీ, మస్క్ రూబియోతో కలిసిపోయాడని ట్రంప్ చెప్పారు. అమెరికాలో ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ వ్యయాలను కట్టడి చేయటంపై దృష్టిని పెట్టారు. ఇందుకోసం డోజ్‌ను ఏర్పాటు చేశారు. డోజ్ బాధ్యతలను మస్క్‌కు అప్పగించారు. ఇందులోభాగంగా వేల మంది ఫెడరల్, ఇతర ప్రభుత్వ ఉద్యోగులను తొలగించేందుకు మస్క్ సిఫారసు చేస్తున్నారు. అయితే, మస్క్ నిర్ణయాలపై విమర్శలు వెల్లువెత్తాయి. పలువురు నిపుణులు, డెమోక్రాట్లు మస్క్ చర్యలు సరైనవి కావని విమర్శలు గుప్పిస్తున్నారు. ట్రంప్ మాత్రం వాటిని ఖండిస్తూ వస్తున్నారు. మస్క్ చర్యలను సమర్థిస్తున్నారు.

## ఎస్సారెస్పీ కాలువలో పడ్డ కారు

పడింది. స్థానికుల సాయంతో కృష్ణవేణి బయటపడింది. కుమారుడు మృతిచెందగా.. కారుతో సహా ప్రవీణ్, చైత్ర సాయి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయారు. వారి ఆచూకీ తెలుసుకునేందుకు నీటిని అదుపులోకి తీసుకువచ్చి గాలింపు చర్యలు చేపట్టారు. సీఐ రాజ గోపాల్, ఎస్ఐ బి.ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ప్రయత్నించి చివరకు వారి మృతదేహాలు వెలికితీశారు. మృతుడు ప్రవీణ్ కుమార్ వరంగల్ ఎల్ఐసీ కార్యాలయంలో డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు.

# నవచిత్రం



## మనందరి జీవితమే 'కోర్ట్'

హీరో నాని వాల్ పోస్టర్ సినిమా సమర్పించిన మూవీ 'కోర్ట్' - స్టేట్ వర్సెస్ ఎ నోబడీ'. ప్రియదర్శి ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రాన్ని రామ్ జగదీష్ దర్శకత్వం వహించారు. ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. దీప్తి గంటా సహ నిర్మాతగా వ్యవహరించారు.

ఈ చిత్రం ఈనెల 14న హోలీ పండుగ సందర్భంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ గ్రాండ్ ప్రీరిలీజ్ అండ్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ని నిర్వహించారు. డైరెక్టర్స్ నాగ్ అశ్విన్, ప్రశాంత్ వర్మ శైలేష్ కొలను, శ్రీకాంత్ ఓదెల, శౌర్యువ్, ఇంద్రగంటి మోహన కృష్ణ, దేవకట్టా ఈ వేడుకలో అతిథులుగా పాల్గొన్నారు.

నాని మాట్లాడుతూ, 'ఈ సినిమా గురించి ఒక విషయం బలంగా చెబుతున్నాను. ఈనెల 14న ఈ సినిమాని మీరు మిస్ అవ్వకండి. నా కెరీర్‌లో ఎప్పుడూ కూడా దయచేసి సినిమా చూడండి అని అడగలేదు. కానీ ఈ సినిమాకి అడుగుతున్నాను. ఇలాంటి మంచి సినిమా మీరు మిస్ అవ్వకూడదని చెబుతున్నాను. మాకేదో సక్సెస్ రావాలని కాదు. తెలుగు ప్రేక్షకులు ఇలాంటి మంచి సినిమాని మిస్ కాకూడదని చెబుతున్నాను. మీ అందరిని బతిమాలుతున్నాను. ఫ్యామిలీతో కలిసి సినిమాకి వెళ్ళండి. గొప్ప సినిమా చూశారనే ఫీలింగ్‌తో వస్తారు. ఒకవేళ సినిమా బాగోలేదనే ఫీలింగ్ వస్తే, నా హిట్ 3ని ఎవరూ చూడొద్దు. ఇంతకంటే బలంగా చెప్పలేను' అని అన్నారు.

'ఇది కూడా ఒక సూపర్ హీరో లాంటి కథ' అని ప్రియదర్శి చెప్పారు. నిర్మాత దీప్తి మాట్లాడుతూ,'జగదీష్ విజన్ స్క్రీన్ మీద ఒక పోయెట్రీ క్రియేట్ చేసింది. విజయ్ తన మ్యూజిక్‌తో మ్యాజిక్ చేశాడు. దర్శి చాలా అద్భుతంగా నటించాడు. రోషన్, శ్రీదేవి ఆడియన్స్‌కి గుర్తుండిపోతారు. ఇది చాలా బ్యూటిఫుల్ మూవీ' అని అన్నారు. 'దర్శికి 'బలగం' కంటే ముందు ఈ కథ చెప్పాను. ఇది నాని ప్రోడక్ట్ కావడం చాలా ఆనందంగా ఉంది. ఇదొక గొప్ప లెగసీ. ఆయన నమ్మిన విధానం అద్భుతం. అది చాలా బాధ్యత పెంచింది. 14న ఆ నమ్మకాన్ని తిరిగి ఇచ్చేస్తాను. కోర్టు మన అందరికీ జీవితం' అని డైరెక్టర్ రామ్ జగదీష్ చెప్పారు.

## భిన్న కథతో 'కర్మ స్థలం'



రాయ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై శ్రీనివాస్ సుబ్రహ్మణ్య నిర్మాణంలో రాకీ షెర్మన్ తెరకెక్కించిన చిత్రం 'కర్మ స్థలం'.

ఈ సినిమాలో బిగ్ బాస్ ఫేమ్ అర్చన(వేద), మితాలి చౌహాన్, వినోద్ అల్వా, కలకేయ ప్రభాకర్, బాలగం సంజయ్, నాగ మహేష్, దిల్ రమేష్, చిత్రం శ్రీను ముఖ్య పాత్రలు పోషించారు. పాన్ ఇండియా రేంజ్‌లో ఈ సినిమా రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో ఈ చిత్ర మోషన్ పోస్టర్‌ను హీరో ఆకాష్ పూరి రిలీజ్ చేశారు. మరో హీరో విజయ్ శంకర్ కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు.

ఆకాష్ పూరి మాట్లాడుతూ,'టైటిల్ చాలా బాగుంది. మోషన్ పోస్టర్ కూడా బాగుంది. చెప్పాలంటే నేను కూడా అమ్మవారి భక్తుడిని. ఇలా అమ్మవారి గురించి సినిమా రావడం సూపర్ ఎగ్జైటింగ్. ఈ మధ్య 'హనుమాన్, కార్తికేయ, కాంతారా' ఇలాంటి సినిమాలని ఆడియన్స్ బాగా సపోర్ట్ చేస్తున్నారు. ఆ కోవలోనే ఉన్న ఈ సినిమా కచ్చితంగా మంచి విజయం సాధిస్తుంది' అని తెలిపారు. 'సనాతన ధర్మం గురించి చెప్పే సినిమా ఇది. రాకీ ఈ సినిమాని అద్భుతంగా తెరకెక్కించాడు' అని ప్రొడ్యూసర్ యువరాజ్ చెప్పారు. డైరెక్టర్ రాకీ మాట్లాడుతూ,'మనం ఎలాంటి పండగ వచ్చిన ఎంజాయ్ చేస్తూ ఉంటాం. దాని వెనకాల ఒక హిస్టరీ, వార్ ఇలా చాలా ఉన్నాయి. ఇందులో ఒక మంచి లైన్ చెప్పాను, అదే మహిషాసుర మర్దిని.ఇది తప్పకుండా మిమ్మల్ని మెప్పిస్తుంది' అని అన్నారు.



విజయశాంతి, కళ్యాణ్‌రామ్

## 'అర్జున్ S/O వైజయంతి'

నందమూరి కళ్యాణ్ రామ్ నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్‌లో విజయశాంతి ఐపీఎస్ ఆఫీసర్‌గా పవర్ ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్లపై అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు భారీ స్థాయిలో నిర్మిస్తునారు.

మహిళా దినోత్సవం సందర్భంగా మేకర్స్ ఈ మూవీ నుంచి ఇంపాక్ట్ ఫుల్ టైటిల్ 'అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి'గా రివీల్ చేస్తూ ఫస్ట్‌లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ కళ్యాణ్ రామ్, విజయశాంతి పాత్రలని ఇంటెన్స్ డైనమిక్‌గా ప్రజెంట్ చేస్తోంది. ఇందులో సాయి మంజ్రేకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సోహైల్ ఖాన్ విలన్ పాత్రలో కనిపించనున్నారు. సినిమా ఇప్పటికే టాకీ పార్ట్ పూర్తి చేసుకుంది. త్వరలోనే రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేయడానికి మేకర్స్ సిద్ధంగా ఉన్నారు. శ్రీకాంత్, యానిమల్ పృథ్వీరాజ్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: ప్రదీప్ చిలుకూరి, నిర్మాతలు: అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, డీవోపీ: రామ్ ప్రసాద్, ఎడిటర్: తమ్మిరాజు, సమర్పణ: ముప్పా వెంకయ్య చౌదరి, స్క్రీన్ ప్లే: శ్రీకాంత్ విస్సా, ఆర్ట్ డైరెక్టర్: బ్రహ్మ కడలి, యాక్షన్: రామకృష్ణ, పీటర్ హెయిన్.

## న్యాయం కోసం..



'మల్లేశం, 8 ఏఎమ్, మెట్రో' చిత్రాలతో ప్రశంసలు పొందిన దర్శకుడు రాజ్ ఆర్ నిజమైన సంఘటనల నుండి ప్రేరణ పొందిన మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్ '23'తో వస్తున్నారు.

స్టూడియో 99 నిర్మించిన ఈ చిత్రంలో తేజ, తన్మయి ప్రధాన పాత్రలు పోషించారు. వెంకట్ సిద్దారెడ్డి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్. ఈ సినిమాని రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా డిస్ట్రిబ్యూషన్ చేస్తుంది. తాజాగా మేకర్స్ టీజర్‌ని రిలీజ్ చేశారు.

దర్శకుడు రాజ్ రాచకొండ మాట్లాడుతూ,'మూడు విభిన్న సంఘటనల్లో జరిగిన క్రైమ్‌తో చనిపోయిన వారు 23 మంది. అందుకే ఈ సినిమాకి ఈ టైటిల్ పెట్టాం. ఈ సినిమా హ్యూమన్ రైట్స్ వైపు ఉంటుంది. న్యాయం దొరకని వారి తరపున ఉంటుంది. తప్పుని తప్పని తెలుసుకోవడం ఈ సినిమా ఉద్దేశం. ఈ సినిమా హింసకి వ్యతిరేకంగా తీసిన సినిమా. నేను జరిగినదే చూపించాను. బీనా చెప్పిన చాలా విషయాలు ఇందులో చూపించాను. మూడు ఘటనలు జరిగాయి. చాలా మంది చనిపోయారు. అయితే చంపిన వారందరికీ సమానంగా శిక్ష పడిందా లేదా? అనేది ప్రశ్న. జైలుకి వెళ్ళిన తర్వాత మనిషి పరివర్తనని కూడా సినిమాలో చూపించాం' అని అన్నారు.

'రాజ్ ఫోన్ చేసి జైలు గురించి ఒక కథ రాస్తున్నానని చెప్పాడు. నేను చెప్పిన ఎక్స్‌పీరియన్స్‌ని చాలా సీరియస్‌గా రాసుకున్నాడు. జైలు వేరే లోకం, వేరే ప్రపంచం. మన మాటలతో మార్పు తీసుకొచ్చే అవకాశం. అక్కడ చాలా ధైర్యంగా మాట్లాడాలి. ఇక్కడ చాలామంది మార్పు చెందిన మనుషులు ఉన్నారు. నా మాటలతో చాలామంది జీవితంలో మార్పు తీసుకురావడం చాలా ఆనందంగా ఉంది. రాజ్ విజన్ చాలా ఇంపాక్ట్ ఫుల్‌గా ఉంది' అని బీనా చెప్పారు.

## సరికొత్త ప్రేమ కథను చూస్తారు



విశ్వ కరుణ్

హీరో కిరణ్ అబ్బవరం నటించిన కొత్త సినిమా 'దిల్ రూబా'. ఈ సినిమాలో రుక్సర్ థిల్లాన్ హీరోయిన్. ఈ చిత్రాన్ని శివమ్ సెల్యులాయిడ్స్, ప్రముఖ మ్యూజిక్ లేబుల్ సారెగమ తమ నిర్మాణ సంస్థ అయినటువంటి ఏ యాడ్లీ ఫిలిం సంయుక్తంగా నిర్మించాయి.

రవి, జోజో జోస్, రాకేష్ రెడ్డి, సారెగమ నిర్మాతలు. విశ్వ కరుణ్ దర్శకుడు. ఈ సినిమా ఈనెల 14న హోలీ పండుగ సందర్భంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో దర్శకుడు విశ్వకరుణ్ మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

- తన తప్పు లేనప్పుడు సారీ ఎందుకు చెప్పాలనుకుంటాడు హీరో. ఇలాంటి వ్యక్తిత్వం వల్ల తనతో ఉన్నవారికి ఇబ్బంది ఉండొచ్చు. ఇందులో హీరో కిరణ్ చేసిన సిద్ధు క్యారెక్టర్ కూడా తన వ్యక్తిత్వం విషయంలో కాంప్రమైజ్ కాడు. క్యారెక్టర్‌ను నమ్ముకుంటాడు. దాని వల్ల అతని లైఫ్‌లో ఇబ్బందులు వస్తాయి. అవేంటి అనేది వెండితెరమీద చూడాల్సిందే.
- ప్రేమించిన అమ్మాయితో విడిపోయిన తర్వాత ఆ లవర్‌ను శత్రువులా చూస్తుంటారు. కానీ ప్రేమ కంటే ముందు వారి మధ్య ఉండేది స్నేహమే. అదే స్నేహాన్ని విడిపోయిన తర్వాత కూడా పంచవచ్చు. బాగున్నావా అని ఫోన్ చేసి, మన ఎక్స్ లవర్‌ను అడగటంలో తప్పులేదు. ఈ కథలో ఇలాంటి ఎలిమెంట్స్ ఉంటాయి. సంగీత దర్శకుడు సామ్ సీఎస్ బ్యూటిఫుల్ సాంగ్స్ ఇచ్చారు. బీజీఎం మా మూవీకి ఆకర్షణగా నిలుస్తుంది.

## లైంగిక వేధింపులపై విప్లవాత్మక ప్రయత్నం



లైంగిక వేధింపులపై విప్లవాత్మకమైన, వినూత్నమైన ప్రయత్నమే 'కీప్ ది ఫైర్ అలైవ్' అని, ఇది 1 నిముషం 25 సెకండ్ల షార్ట్ ఫిల్మ్ మాత్రమే కాదు అందరిని ఆలోచింపజేసే అద్భుతమైన దృశ్య కావ్యం అని మేకర్స్ అన్నారు. కె ప్రఫుల్ చంద్ర దర్శకత్వంలో తెరకెక్కిన ఈ షార్ట్ ఫిల్మ్‌ను కథానాయిక సంయుక్త ప్రెజెంట్ చేయడం విశేషం.

ఈ సందర్భంగా రచయిత, దర్శకుడు కే ప్రఫుల్ చంద్ర మాట్లాడుతూ,'మనకి లైంగిక వేధింపులకు సంబంధించిన విషయాలు బాధతో పాటు కోపాన్ని కలిగిస్తాయి. వాటిని అధిగమించాలంటే కఠినమైన చట్టాలు తీసుకొస్తే సరిపోతుందా, అంటే కచ్చితంగా కాదు. వీటి కన్నా స్పృహ అత్యంత ముఖ్యమైనది అని తెలిపే షార్ట్ ఫిల్మ్ ఇది. ఇలాంటి గొప్ప ప్రయత్నానికి సంయుక్త తోడు రావడం అద్భుతం. ఆమె వాయిస్ ఓవర్‌లో ప్రతి పదం ఒక అగ్ని కణంలా ఉంటుంది. ఈ షార్ట్ ఫిల్మ్‌ని మళ్లీ మళ్లీ చూసేలా ఆమె గొంతు మ్యాజిక్ చేసింది. అలాగే సంయుక్త కూడా ఆదిశక్తి అనే ఫౌండేషన్‌ను స్థాపించి మహిళా శక్తిని ప్రపంచానికి తెలియజేయాలని సంకల్పంతో అడుగులు వేస్తోంది. అందుకే మా షార్ట్ ఫిలిం సంయుక్త హృదయానికి అత్యంత చేరువైంది. కచ్చితంగా అందరం కలిసి మార్పు కోసం ఒక అడుగు వేస్తే, సమాజంలో స్త్రీలపై ఎలాంటి దాడులు జరగవు. మా షార్ట్ ఫిలిం కచ్చితంగా ఒక మేలుకొలుపు' అని తెలిపారు.

## ఆటలు

# ఈసారి వదలొద్దు!



- చాంపియన్స్ ట్రోఫీపై భారత్ గురి
- ఫైనల్లో భారత్, న్యూజిలాండ్ ఢీ
- మ॥ 2.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

**ఐసీసీ టోర్నమెంట్లలో నిలకడగా రాణిస్తున్న జట్లలో భారత్, న్యూజిలాండ్ ముందంజలో ఉంటాయి. వైట్‌బాల్ ఫార్మాట్‌లో భారత్, కివీస్ ఆధిపత్యం కోసం పోటీపడుతూనే ఉన్నాయి. పరుగుల వేటలో, స్పిన్ మాయజాలంలో ఈ రెండు జట్లకు వ్యత్యాసం అతి స్వల్పం. నేడు ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో భారత్, న్యూజిలాండ్ అమీతుమీకి సిద్ధపడ్డాయి.**

**ఐసీసీ వైట్‌బాల్ టైటిల్ స్వప్నం సాకారం చేసుకునేందుకు ఇదే సరైన తరుణంగా న్యూజిలాండ్ భావిస్తుండగా.. 2017లో చేజారిన చాంపియన్స్ ట్రోఫీకి ఈసారి వదలొద్దని టీమ్ ఇండియా పట్టుదలతో కనిపిస్తోంది. స్పిన్ మాయ, మిడిల్ ఓవర్ల మెరుపులే కీలక పాత్ర పోషించనున్న టైటిల్ పోరులో భారత్ ఫేవరేట్‌గా బరిలోకి దిగుతోంది.**

నవతెలంగాణ-దుబాయ్

2021 ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్. భారత్, న్యూజిలాండ్ చివరగా ఓ ఐసీసీ ఈవెంట్ ఫైనల్లో పోటీపడ్డాయి. సౌథాంప్టన్‌లో జరిగిన రెడ్‌బాల్ అంతిమ సమరంలో పేస్ బలంతో న్యూజిలాండ్ టైటిల్ సొంతం చేసుకుంది. 2025 ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్. నేడు భారత్, న్యూజిలాండ్ టైటిల్ పోరులో మళ్లీ పోటీపడుతున్నాయి. దుబాయ్‌లో స్పిన్‌కు మొగ్గ ఎక్కువ.. మరి నాణ్యమైన స్పిన్నర్లతో సమరానికి సై అంటోన్న టీమ్ ఇండియా ఈసారి టైటిల్‌ను ఎగరేసుకుపోతుందా? ప్రపంచ క్రికెట్ ప్రియులతో పాటు భారత క్రికెట్ అభిమానులు ఈ ఫలితం కోసం ఎదురుచూస్తున్నారు. కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్, రవీంద్ర జడేజాలతో కూడిన భారత స్పిన్ దళం కివీస్‌ను గిరగిరా తిప్పేసి టైటిల్‌ను సాధించేందుకు మాయ చేయనుండగా.. న్యూజిలాండ్ సైతం కెప్టెన్ మిచెల్ శాంట్నర్ మ్యాజిక్‌పై భారీగా అంచనాలు పెట్టుకుంది. చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ ప్రయాణంలో భారత స్పిన్నర్లు 21 వికెట్లు పడగొట్టగా.. న్యూజిలాండ్ స్పిన్నర్లు 17 వికెట్లు తీసుకున్నారు. చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో భారత్, న్యూజిలాండ్ ఢీ నేడు.



**జోరుమీదున్న భారత్ :**

స్వదేశంలో ఇంగ్లాండ్‌పై (112) శతకం, చాంపియన్స్ ట్రోఫీ తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌పై (101) సెంచరీతో శుభ్‌మన్ గిల్ జోరు చూపించాడు. కానీ గ్రూప్ దశ సాగేకొద్ది గిల్ పరుగుల వేట నెమ్మదించింది. పాకిస్థాన్‌పై 46 పరుగులు చేసిన గిల్.. కివీస్‌పై 2, సెమీస్‌లో ఆసీస్‌పై 8 పరుగులే చేశాడు. నాణ్యమైన పేస్ బౌలింగ్‌పై గిల్ అంచనాలను అందుకోలేదు. గిల్ వైఫల్యం ఇన్నింగ్స్ ఆరంభాలపై ప్రతికూల ప్రభావం చూపిస్తోంది. న్యూజిలాండ్‌పై హైదరాబాద్ వన్డేలో ద్వి శతకం బాదిన శుభ్‌మన్ ఇప్పుడు అదే ప్రత్యర్థిపై టైటిల్ పోరులో పంజా విసురుతాడని జట్టు మేనేజ్‌మెంట్ ఆశిస్తోంది. కెప్టెన్ రోహిత్ శర్మ విరాట్ కోహ్లి మంచి ఫామ్‌లో ఉన్నారు. పవర్‌ప్లేలో రోహిత్ శర్మ ధనాధన్ ప్రదర్శన ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెడుతోంది. ఛేదనలో విరాట్ కోహ్లిని అడ్డుకోవటం ప్రత్యర్థికి కష్టసాధ్యమే. కోహ్లి జోరును గమనంలో ఉంచుకుని న్యూజిలాండ్ భారత్‌ను తొలుత బ్యాటింగ్‌కు ఆహ్వానించినా ఆశ్చర్యం లేదు. మిడిల్ ఆర్డర్‌లో శ్రేయస్ అయ్యర్ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. కెఎల్ రాహుల్, అక్షర్ పటేల్, హార్దిక్ పాండ్య సైతం టచ్‌లోనే ఉన్నారు. లక్ష్యాన్ని ఛేదించినా, లక్ష్యాన్ని నిర్దేశించినా భారత బ్యాటింగ్ లైనప్ బలంగా కనిపిస్తోంది. బౌలర్లు సైతం అదరగొడుతున్నారు. పేసర్ మహ్మద్ షమి వికెట్ల వేటలో ముందుండి నడిపిస్తున్నాడు. హార్దిక్ పాండ్యతో కలిసి షమి కొత్త బంతితో విజృంభిస్తున్నాడు. వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా ఓవర్లను కాచుకోవటం న్యూజిలాండ్‌కు నేడు కత్తి మీద సామే.

**కేన్ కొడతాడా? :**

ఐసీసీ టోర్నమెంట్ల ఫైనల్స్‌లో న్యూజిలాండ్ ఆరోసారి బరిలోకి దిగుతుండగా.. కేన్ విలియమ్సన్ ఐదింటిలో భాగం అయ్యాడు. టెస్టు చాంపియన్‌షిప్ గదతో కివీస్ ఐసీసీ టైటిల్ దాహం తీర్చినయ విలియమ్సన్... వైట్‌బాల్ ఫార్మాట్‌లో మినీ ప్రపంచకప్‌ను అందుకునే అవకాశం ముంగిట నిలిచాడు. 2024 టీ20 ప్రపంచకప్ విజయంతో కోహ్లి పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలికినట్టు.. కేన్ విలియమ్సన్ సైతం చాంపియన్స్ ట్రోఫీతో వన్డే ఫార్మాట్‌ను వీడ్కోలు వీడేందుకు ఎదురుచూస్తున్నాడు!.

దక్షిణాఫ్రికాతో సెమీఫైనల్లో న్యూజిలాండ్ బ్యాటర్లు అదరగొట్టారు. కేన్ విలియమ్సన్‌తో పాటు రచిన్ రవీంద్ర శతక మోత మోగించారు. ఈ ఇద్దరు బ్యాటర్లు స్పిన్ సమర్థవంతంగా ఆడగలరు. భారత్‌పై మంచి రికార్డు సైతం ఉంది. దీంతో నేడు ఫైనల్లో భారత్‌కు గట్టి సవాల్ విసరటం ఖాయమే. విల్ యంగ్, డార్లీ మిచెల్, టామ్ లేథమ్ తమదైన ఇన్నింగ్స్‌లు ఆడేందుకు ఎదురుచూస్తున్నారు. గ్లెన్ ఫిలిప్స్ డెత్ ఓవర్లలో అత్యంత ప్రమాదకర ఆటగాడు. మైకల్ బ్రాస్‌వెల్, రచిన్ రవీంద్ర తోడు మిచెల్ శాంట్నర్ మాయ చేయనున్నాడు. కైల్ జెమీసన్, ఓరౌర్క్‌తో కలిసి పేస్ బాధ్యతలు పంచుకునే మరో పేసర్‌పై నీలినీడలు ఉన్నాయి. భుజం గాయంతో బాధపడుతున్న మాట్ హెన్రీ దూరమైతే ఫైనల్లో కివీస్‌కు గట్టి దెబ్బే. గ్రూప్ దశ మ్యాచ్‌లో భారత్‌పై హెన్రీ ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు.



**పిచ్, వాతావరణం**

చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌కు కొత్త పిచ్‌ను వాడటం లేదు!. భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌కు వినియోగించిన పిచ్‌నే నేడు టైటిల్ పోరుకు సిద్ధం చేశారు. ఈ పిచ్ బ్యాటింగ్‌కు కాస్త అనుకూలిస్తుందా లేదా అనేది చూడాలి. పేసర్లు వేగం తగ్గించి లైన్ అండ్ లెంగ్త్‌తో బంతులు వేస్తేనే పరుగుల పొదుపు, వికెట్ల వేటలో విజయం దక్కనుంది. పిచ్‌పై పగుళ్లు తేలిన తర్వాత టర్న్‌ను ఎదుర్కొంటూ పరుగులు చేయటం గగనం కానుంది. టాస్ నెగ్గిన జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి. రెండో ఇన్నింగ్స్‌లో మంచు ప్రభావం లేకపోవటంతో టాస్ ప్రాధాన్యత కోల్పోయింది.

**తుది జట్లు (అంచనా)**

**భారత్ :** రోహిత్ శర్మ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్, కెఎల్ రాహుల్ (వికెట్ కీపర్), హార్దిక్ పాండ్య, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, మహ్మద్ షమి, వరుణ్ చక్రవర్తి.

**న్యూజిలాండ్ :** విల్ యంగ్, రచిన్ రవీంద్ర, కేన్ విలియమ్సన్, డార్లీ మిచెల్, టామ్ లేథమ్ (వికెట్ కీపర్), గ్లెన్ ఫిలిప్స్, మైకల్ బ్రాస్‌వెల్, మిచెల్ శాంట్నర్ (కెప్టెన్), కైల్ జెమీసన్, మాట్ హెన్రీ/నాథన్ స్మిత్, విలియం ఓరౌర్క్.

దక్షిణాఫ్రికాతో సెమీఫైనల్లో న్యూజిలాండ్ స్పిన్నర్లు 7 వికెట్లు పడగొట్టారు. వన్డే క్రికెట్‌లో కివీస్‌కు ఇది సంయుక్త అత్యుత్తమం. కానీ గ్రూప్ దశలో భారత్‌తో మ్యాచ్‌లో కివీస్ స్పిన్నర్లు తేలిపోయారు. ఓవర్‌కు 5.1 పరుగుల చొప్పున 128 పరుగులకు రెండు వికెట్లే పడగొట్టారు.

**12** ఐసీసీ టోర్నమెంట్లలో భారత్‌కు తిరుగులేని రికార్డుంది. గత 14 ఐసీసీ ఈవెంట్లలో టీమ్ ఇండియా ఏకంగా 12 సార్లు నాకౌట్ దశకు చేరుకుంది. అందులో మూడింట టైటిల్ విజయాలు సాధించింది. ఐదుసార్లు ఫైనల్స్‌లో బోల్తా పడింది.

**8** ఐసీసీ చివరి 14 టోర్నమెంట్లలో న్యూజిలాండ్ ఎనిమిది సార్లు నాకౌట్ దశకు అర్హత సాధించింది. అందులో ఒక్కసారి మాత్రమే టైటిల్ సాధించగా.. ఆ ఫైనల్ ప్రత్యర్థి భారత్ కావటం గమనార్హం.

**45** చాంపియన్స్ ట్రోఫీలో అత్యధిక పరుగుల రికార్డు అందుకునేందుకు విరాట్ కోహ్లికి మరో 45 పరుగులు అవసరం. క్రిస్ గేల్ (791) అగ్రస్థానంలో నిలువగా.. కోహ్లి (746) రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. జయవర్దనె (742), శిఖర్ ధావన్ (701) టాప్-4లో ఉన్నారు.

## సమిష్టి కృషితోనే.. ఒలింపిక్స్‌లో పతకాలు!

### కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ



**నవతెలంగాణ-హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు సమిష్టి కృషితో కలిసి పని చేస్తేనే 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్ పతకాల వేటలో ఆశించిన ఫలితాలు సాధించగలమని, 2036 ఒలింపిక్స్ ఆతిథ్యానికి భారత్ సిద్ధం కాగలదని కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ పేర్కొన్నారు. హైదరాబాద్‌లో రెండు రోజుల పాటు సాగిన చింతన్ శిబిరం ముగింపు సందర్భంగా రాష్ట్రాల క్రీడాశాఖ మంత్రులు, ఉన్నతాధికారులను ఉద్దేశించి మాండవీయ మాట్లాడారు. 'ఒలింపిక్స్‌లో భారత్ రాణించాలంటే.. మనం అందరం కలిసి పని చేయాలి. ప్రతిభావంతులైన క్రీడాకారులను అన్వేషించటం, నాణ్యమైన కోచ్‌లను తయారు చేయటం, అథ్లెట్ల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వటంలో సమిష్టిగా కృషి చేయాలని' మాండవీయ అన్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించేందుకు పాఠశాల స్థాయిలోనే టాలెంట్ హంట్ ఆరంభం కావాలి. దేశవ్యాప్తంగా స్కూల్స్‌లో 8 కోట్ల మంది విద్యార్థులు ఉన్నారు. జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్‌ను క్రమబద్ధీకరించి.. ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించి, శిక్షణ అందించి అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేలా తీర్చిదిద్దాలి. నైపుణ్యం కలిగిన కోచ్‌ల కొరత అధికంగా ఉంది. తొలుత ప్రపంచ స్థాయి శిక్షకులను తయారు చేసుకోవాలి. కోచ్‌లు, క్రీడాకారుల సంక్షేమం కోసం ఓ వ్యవస్థను రూపొందించాలని చింతన్ శిబిరంలో తీర్మానించారు. జాతీయ స్థాయి చింతన శిబిరం కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వం తరపున క్రీడల సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, శాట్ చైర్మెన్ కే. శివసేనా రెడ్డి, క్రీడాశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, శాట్ ఎండీ సోనీబాలదేవి సహా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.